
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం
వెల: ₹ 7.00
సంపుటి: 18
సంచిక: 77
SUNDAY Special
ఆదివారం 8-6-2025
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'



'క్వీన్' కోకో

ఫ్రెంచ్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్ నెగ్గిన అమెరికా స్టార్ కోకో గాఫ్. ఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్ సబలెంకాపై విజయం. రూ. 24 కోట్ల 91 లక్షల ప్రైజ్‌మనీ సొంతం.

- వివరాలు 14లో



తొలి నెలసరి వాయిదా వెయ్యొచ్చా?

ఇటీవలి కాలంలో కూతుళ్లు ఉన్న తల్లులలో ఒక ఆందోళన కనిపిస్తోంది. అదేంటంటే పదేళ్ల వయసుకే కూతుళ్లు రజస్వల కావడం.

- వివరాలు 8లో

న్యూస్‌రీల్

'సాక్షి'కి ఏం సంబంధం!?

ఎవరో చేసిన వ్యాఖ్యలను 'సాక్షి'కి ఆపాదించే కుట్ర

ఆ సంస్థ ప్రతిష్టను దెబ్బతీయాలని టీడీపీ కుతంత్రం

అకారణంగా సంస్థను ఇబ్బంది పెట్టేందుకు ప్రయత్నం

అమరావతిపై విశ్లేషకుడి వ్యాఖ్యలను ఇప్పటికే ఖండించిన 'సాక్షి'

- వివరాలు 7లో

'మహా' మ్యాచ్‌ఫిక్సింగ్



దేశంలో ఎన్నికల నిర్వహణ తీరు పైనే తీవ్ర అనుమానాలు రేకెత్తుతున్నాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ ఆవేదన వెలిబుచ్చారు. 'మహారాష్ట్ర ఎన్నికల్లో పూర్తిగా మ్యాచ్‌ఫిక్సింగ్ జరిగింది. మోదీ సర్కారు వాటి ఫలితాలను టోటల్‌గా రిగ్గింగ్ చేసింది' అని అన్నారు.

- వివరాలు 6లో

ట్రంప్ గద్దె దిగడమా, నాన్సెన్స్!



అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో ఎలాన్ మస్క్ వివాదంపై ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ స్పందించారు. అధ్యక్షునితో తలపడటం ద్వారా ఆయన పెద్ద తప్పిదం చేస్తున్నారన్నారు. ట్రంప్ అద్భుతంగా పని చేస్తున్నారన్నారు. ఆయనపై మస్క్ ఆరోపణలను ఖండించారు.

- వివరాలు 6లో

ముగ్గురా.. నలుగురా?

నేడు రాష్ట్ర కేబినెట్ విస్తరణ.. మధ్యాహ్నం 12:15 గంటలకు ముహూర్తం


వాకిటి శ్రీహరి, గడ్డం వివేక్‌కు మంత్రి పదవులు ఖరారు

అడ్లూరి లక్ష్మణ్, కవ్వంపల్లిలో ఒకరికి అవకాశం.. అడ్లూరివైపే అధిష్టానం మొగ్గు

రెడ్లకు చాన్స్ ఇస్తే సుదర్శన్‌రెడ్డికే పదవి.. విస్తరణపై శనివారమంతా ఉత్కంఠ

ముఖ్యమంత్రిని కలిసిన మాదిగ సామాజికవర్గ ఎమ్మెల్యేలు..

అందుబాటులో ఉండాలని సూచించిన రేవంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఎట్టకేలకు రాష్ట్ర మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఖరారైంది. కేబినెట్‌లో ఖాళీగా ఉన్న ఆరు బెర్తులకు గాను మూడు లేదా నాలుగు బెర్తులను భర్తీ చేసేందుకు కాంగ్రెస్ హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కొత్త మంత్రులు ఆదివారం మధ్యాహ్నం 12:15 గంటలకు రాజ్‌భవన్‌లో ప్రమాణ స్వీకారం చేస్తారని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. కొత్త మంత్రులుగా వాకిటి శ్రీహరి ముదిరాజ్ (మక్తల్), గడ్డం వివేక్ (చెన్నూరు) పేర్లు ఖరారయ్యాయి. మాదిగ సామాజికవర్గం నుంచి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లేదా కవ్వంపల్లి సత్యనారాయణకు అవకాశం లభించవచ్చని సమాచారం. అడ్లూరివైపే పార్టీ పెద్దలు మొగ్గుచూపుతున్నట్లు తెలిసింది. రెడ్డి సామాజికవర్గానికి ఈసారి విస్తరణలో అవకాశం లేదనే చర్చ జరుగుతోంది. ఒకవేళ లభిస్తే మాత్రం నిజామాబాద్ జిల్లాకు చెందిన సీనియర్ నేత పి.సుదర్శన్‌రెడ్డికే ఎక్కువ అవకాశాలున్నాయి. కొత్త మంత్రులతో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రమాణం చేయించనున్నారు.

రోజంతా ఉత్కంఠ

రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ అంశం శనివారం రోజంతా చర్చనీయాంశమైంది. ఆదివారం ఉదయమే విస్తరణ ఉంటుందని, కాదుకాదు మధ్యాహ్నం అంటూ విస్తృతంగా ఊహాగానాలు వెలువడ్డాయి. అయితే, విస్తరణపై ఏఐసీసీ కానీ, టీపీసీసీ కానీ శనివారం అర్ధరాత్రి వరకు ఎలాంటి సంకేతాలు ఇవ్వలేదు. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ శనివారం ఢిల్లీలోనే ఉన్నారు. అర్ధరాత్రి తర్వాత హైదరాబాద్‌కు చేరుకుంటారని రాజ్‌భవన్ వర్గాలు తెలిపాయి. ఆదివారం ఉదయం శిల్పకళావేదికలో జరిగే హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆత్మకథ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. ఆ కార్యక్రమం మినహా మరో కార్యక్రమం గవర్నర్ షెడ్యూల్‌లో లేదని రాజ్‌భవన్ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి కూడా హాజరు కానున్నారు. దీంతో ఈ కార్యక్రమం అనంతరం రాజ్‌భవన్‌లో మధ్యాహ్నం తర్వాత కొత్త మంత్రుల ప్రమాణ స్వీకారం ఉంటుందనే ప్రచారం జరిగింది. కానీ, సాధారణ పరిపాలన విభాగం (జీఏడీ)కి కానీ, రాజ్‌భవన్‌కు కానీ ప్రమాణ స్వీకార కార్యక్రమ ఏర్పాట్ల కోసం ఎలాంటి సమాచారం

మిగతా 3వ పేజీలో ▶

రికార్డుల్లో మూత రికార్డు స్థాయి మేత

మెదక్ జిల్లాలో మైనింగ్ మాఫియా మాయాజాలం..

ప్రభుత్వ రికార్డుల్లో మాత్రం నడవటంలేదని లెక్కలు

క్షేత్రస్థాయిలో మాత్రం యథేచ్ఛగా తవ్వకాలు

సర్కారు ఆదాయానికి భారీగా గండి కొడుతున్న అక్రమార్కులు



- ఈ చిత్రంలో కనిపిస్తున్నది కొల్చారం మండలం రాంపూర్ గ్రామ శివారులోని (మంజీరా) కంకర క్వారీ. ఇది జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలోనే ఉంది. దీనికి కొన్నేళ్లుగా లైసెన్స్‌ను రెన్యువల్ చేయటంలేదు. అధికారుల రికార్డుల్లో ప్రస్తుతం ఈ క్వారీ నడవటంలేదని ఉంది. కానీ, క్షేత్రస్థాయిలో యథేచ్ఛగా తవ్వకాలు నిర్వహిస్తున్నారు. ఇదొక్కటే కాదు.. మూసివేయబడ్డాయని అధికారులు రికార్డుల్లో చూపిస్తున్న క్వారీల్లో 90 శాతం నడుస్తూనే ఉన్నాయి.

- 3లో



కాళేశ్వరంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్న హరీశ్‌రావు

అబద్ధాలను పటాపంచలు చేస్తాం

కాళేశ్వరం ప్రాజెక్టుపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌లో హరీశ్‌రావు

అది ఒక ఇంజనీరింగ్ అద్భుతం.. ప్రతికూల పరిస్థితుల్లో కల్పతరువు

విచారణ కమిషన్ ఎదుట నిజాలు చెప్పి దుష్ప్రచారాన్ని తిప్పికొడతాం

ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతాం.. సీఎం దుర్మార్గ విధానంతో రాజ్యమేలుతున్నాడు: కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ఎత్తిపోతల పథకంతో బీఆర్‌ఎస్‌కు మంచిపేరు రావడంతో పాటు లబ్ధి జరుగుతుందనే దురుద్దేశంతో నాడు ప్రతిపక్షంలో, నేడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ బురద జల్లుతోందని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. 'గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై చేసిన ఆరోపణలను నిజమని నిరూపించేందుకు కాంగ్రెస్ అనేక ప్రయత్నాలు చేస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టు ఒక ఇంజనీరింగ్ అద్భుతం. తెలంగాణ జీవధార. ప్రతికూల పరిస్థితుల్లో తెలంగాణకు కల్పతరువు. అలాంటి ప్రాజెక్టును రీఇంజనీరింగ్‌ను చేయడంపై

మిగతా 2వ పేజీలో ▶

బీఆర్‌ఎస్ కక్కుర్తితో రాష్ట్రానికి శాశ్వత నష్టం

- కాళేశ్వరంపై హరీశ్‌రావు అవాస్తవ ప్రచారం చేస్తున్నారు
- వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పాలి: నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్

2లో

పాలమూరు ఎవరికి వారు



సీఎం రేవంత్ సొంత జిల్లాలో అధికార కాంగ్రెస్ సతమతం

ఎవరికి వారే వివాదాస్పదమవుతున్న ఎమ్మెల్యేలు, ఎంపీలు

గద్వాలలో బండ్ల, సరిత యాదవ్... వనపర్తిలో మేఘారెడ్డి, చిన్నారెడ్డి మధ్య తీవ్రమవుతున్న విభేదాలు

ఎంపీ మల్లు రవిపై అధిష్టానానికి అలంపూర్ నేతల ఫిర్యాదు

గ్రూపు రాజకీయాలు చేస్తున్నారని, బిల్లులకు 10 శాతం కమీషన్ వసూలు చేస్తున్నారని ఆక్షేపణ

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి పాలమూరు కాంగ్రెస్ నేతలు పోట్ల గిత్తల్లా తలపడుతున్నారు. ఇతర పార్టీల నుంచి వచ్చిన వారితో కుదురుకోలేక కొందరు, ఇతర పార్టీల నేతలను ప్రోత్సహిస్తూ మరికొందరు, పార్టీలోని వారితో కలిమి లేక ఇంకొందరు, గొంతెమ్మ కోర్కెలతో ఇంకా కొందరు ఎవరికి వారే వివాదాస్పదమవుతున్నారు. ఈ గ్రూపు గొడవలు, గట్టు పంచాయతీలు తాజాగా రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ నిర్వహించిన లోక్‌సభ నియోజకవర్గాల వారీ సమీక్షల్లో బట్టబయలు కావడం.. ఒకరిపై ఇంకొకరు ఫిర్యాదు చేసుకోవడం.. ఆమె ముందే వాదులాడుకోవడంలాంటి ఘటనలు సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్టీని సతమతం చేస్తున్నాయి. గద్వాల నుంచి అలంపూర్ వరకు, వనపర్తి నుంచి జడ్చర్ల వరకు అటు ఎమ్మెల్యేలు, ఇటు పార్టీ నేతలు వివాదాలకు కారణమవుతూ వీలున్నంత మేర పార్టీని ఇరకాటంలో పెట్టేందుకు పోటీలు పడుతుండటం గమనార్హం.

చాప కింద నీరులా..

చాలా కాలంగా ఉమ్మడి పాలమూరు జిల్లా కాంగ్రెస్ నేతలు బహిరంగ కొట్లాటలకు దిగుతున్నారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఏకంగా రాష్ట్రంలోని ఓ కీలక మంత్రితో పంచాయతీకి దిగారు. అప్పట్లో ఆయన నేతృత్వంలోనే కొందరు ఎమ్మెల్యేలు డిన్నర్ భేటీ అయ్యారన్న వార్త రాష్ట్ర కాంగ్రెస్ వర్గాల్లో సంచలనం సృష్టించింది. అయితే, టీకప్పులో తుపానులా ఆ వివాదం ముగిసినా, గద్వాల రాజకీయం గట్టు దాటింది. ఆ నియోజకవర్గ ఎమ్మెల్యేతో ఓ ఎంపీ ఘర్షణకు దిగారన్న వార్తలు కూడా హల్‌చల్ చేశాయి. అక్కడి ఎమ్మెల్యేకు, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థికి మధ్య సఖ్యత కుదర్చడం రాష్ట్ర పార్టీకి కూడా సాధ్యం కావడం లేదు. ఇద్దరూ పట్టిన పట్టు వీడకుండా పార్టీని ఇరుకున పెడుతూనే ఉన్నారనేది బహిరంగ రహస్యమే. ఇక, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిన్నారెడ్డి మధ్య ఘర్షణ వాతావరణం నిత్యకృత్యమైందనే చర్చ జరుగుతోంది. ప్రొటోకాల్ మొదలు పార్టీ పదవుల వరకు ఇద్దరి మధ్యా పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటూనే ఉంది. మహబూబ్‌నగర్ నియోజకవర్గంలోని పార్టీ నేతల మధ్య విభేదాలు లేకపోయినా డీసీసీ అధ్యక్షుడిగా ఉన్న దేవరకద్ర ఎమ్మెల్యే జీఎమ్మార్, స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మధ్య ఆధిపత్యపోరు జరుగుతోందనే చర్చ

మిగతా 3వ పేజీలో ▶



రెండున్నరేళ్లలో 2 ఎయిర్‌పోర్టులు

వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాల నిర్మాణానికి ఈ ఏడాది చివరలో టెండర్లు

2027 చివరి నాటికి అందుబాటులోకి తెచ్చేలా ప్రణాళికలు

భారీ విమానాలు వచ్చిపోయేలా 3 వేల మీటర్ల రన్‌వేలు

500 మంది ప్రయాణికుల సామర్థ్యంతో నిర్మాణం

80 శాతం నిర్వహణ ఖర్చు భరించనున్న కేంద్రం

సాక్షి, హైదరాబాద్: వచ్చే రెండున్నరేళ్లలో తెలంగాణలో ఒకేసారి రెండు విమానాశ్రయాలు అందుబాటులోకి రాబోతున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో హైదరాబాద్‌లో రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం ఒక్కటే ఉండగా, 2027 చివరికల్లా మూడు విమానాశ్రయాలు అందుబాటులో ఉండనున్నాయి. వరంగల్ శివారులోని మామునూరులో ఉన్న నిజాం కాలంనాటి ఎయిర్‌స్ట్రిప్, ఆదిలాబాద్

మిగతా 3వ పేజీలో ▶

అప్రమత్తతే రక్ష

- వివిధ రాష్ట్రాల్లో పెరుగుతున్న కరోనా కేసులు
- దేశంలో 5,755 యాక్టివ్ కేసులు.. మరో 'వేవ్'రావొచ్చనే భయాలు
- అంతగా భయపడాల్సిన అవసరం లేదంటున్న వైద్యులు

- 16లో



ఎందులో అనేది మనకనవసరం! అమెరికాను అధిగమించి టాప్‌లో ఉన్నాం చాలు!

'కట్టలు' తెగిన కష్టం

గతేడాది వర్షాలు..వరదలతో దెబ్బతిన్న చెరువులు.. కట్టలు తెగి గండ్లు, మరమ్మతులకు గురైన తూములు

వానాకాలం వచ్చినా పూర్తిస్థాయిలో జరగని రిపేర్లు.. నేటి నుంచి మృగశిర కార్తె.. ముమ్మరమవనున్న వ్యవసాయ పనులు



గత ఏడాది కురిసిన వర్షాలకు మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం రావిరాల చెరువు కట్ట తెగిన దృశ్యం



ఊరు కళతప్పింది..

ఊరు పక్కనే నిండుగా చెరువు ఉండేది. అది తెగడంతో చుక్కనీరు లేదు. రెండు పంటలు అయినా, ఇంకా మరమ్మతులు చేయలేదు. పంటలు లేక రైతులు, చేతి పనివారు ఊరు విడిచి వలస వెళుతున్నారు. ఇళ్లకు తాళాలు వేసి ఉండటంతో సందడే లేదు. చెరువు తెగడంతో ఊరు కళ తప్పింది.


– కడారి ఐలయ్య, రావిరాల, మహబూబాబాద్ జిల్లా

సాక్షిప్రతినిధి, ఖమ్మం: వర్షాకాలం వచ్చేసింది. నైరుతి మేఘ ఘర్జన రాష్ట్రమంతా ప్రతిధ్వనిస్తోంది. తెలంగాణలో వర్షాలు దంచికొడితే, వాగులు, వంకల్లోని నీటినంతా ఒడిసిపట్టేది చెరువులు, కుంటలే. కానీ, చాలా చోట్ల ఈ చిన్ననీటి వనరులు ఇప్పుడు నీటిని నింపుకోలేని పరిస్థితిలో ఉన్నాయి. గతేడాది సెప్టెంబర్, అక్టోబర్‌లో కురిసిన వర్షాలు, వరదల కారణంగా వేల సంఖ్యలో చెరువులు దెబ్బతిన్నాయి. గండ్లు పడటంతోపాటు తూములు కొట్టుకుపోయాయి. కొన్నిచోట్ల చెరువుల పునరుద్ధరణకు నిధులు మంజూరు చేసినా పనుల్లో పురోగతి లేదు. మరికొన్ని చెరువులు దీనస్థితిలో ఉన్నాయి. దీంతో ఈ చెరువులకు మరమ్మతులు ఎప్పుడు పూర్తిచేస్తారోనని ఆయకట్టు రైతులు ప్రభుత్వ అధికారులవైపు ఆశగా ఎదురుచూస్తున్నారు.

సీజన్ మొదలైనా..

ఆదివారం మృగశిర కార్తె ప్రారంభమవుతోంది. దీంతో రైతులు వ్యవసాయ పనులు ముమ్మరం చేస్తారు. కానీ, కట్టలు తెగిన, తూములు దెబ్బతిన్న చెరువుల మరమ్మతులకు నిధులు మంజూరైనా పనులు ఇంకా పూర్తి కాలేదు. ఇప్పటికే కట్టలు తెగిన అనేక చెరువుల్లోకి వస్తున్న నీటిని లాక్‌లు ఎత్తి కిందకు వదులుతున్నారు. చెరువుల ఆయకట్టు పరిధిలో సాగు

మిగతా 7వ పేజీలో ▶



సహాయక చర్యలు

ఈత రాకున్నా నదిలోకి వెళ్లి..

గోదావరిలో స్నానానికి వెళ్లి ఆరుగురు విద్యార్థుల గల్లంతు

ఒకరిని కాపాడబోయి ఒకరు నీట మునిగిన సమీప బంధువులు


పెళ్లి వేడుకల కోసం వచ్చి మేడిగడ్డ చూసేందుకు వెళ్లి..

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలం అంబట్‌పల్లిలో ఘటన

15లో

టూరు.. ఒక్కో తీరు

పర్యాటకుల ఆసక్తులు మారాయి. పర్యటనల ధోరణి మారింది. యువత సోలో జర్నీ సో బెటరూ అంటున్నారు. కొందరు సోషల్ మీడియా వీడియోలూ, వెబ్ సిరీస్‌లూ, సినిమాలూ చూసి అందులోని ప్రాంతాలకు ట్రిప్పులకు చెక్కేస్తున్నారు. మరికొందరు సపరివార సమేతంగా విహార యాత్రలు చేస్తున్నారు. ఇంకొందరు క్రికెట్ మ్యాచ్‌లను బట్టి తమ టూర్లు ప్లాన్ చేసుకుంటున్నారు.. యుద్ధభూముల్లో స్ఫూర్తి పొందుతున్నారు.. నిశీధిలో నింగిలోని చుక్కలను లెక్కపెట్టేస్తున్నారు.. ఇది నయా పర్యాటక ముఖచిత్రం.



సోలోగా తిరిగేస్తున్న యువత
- సినిమాలు, సిరీస్‌లు చూసి ప్లానింగ్
- యుద్ధభూములనూ చుట్టేస్తున్నారు
- క్రికెట్ మ్యాచ్ ఉన్న ఊరికి వెళ్తున్నారు
- మారుతున్న పర్యాటక ఆసక్తులు

సాక్షి, స్పెషల్ డెస్క్

''పాతాళ్‌లోక్ సీజన్ 2'.. అమెజాన్ ప్రైమ్ వీడియోలో వచ్చిన వెబ్ సిరీస్. ఈశాన్య భారతంలోని నాగాలాండ్‌లో ఎక్కువ భాగం షూట్ చేశారు. ఒక సినిమా లేదా వెబ్ సిరీస్ ఇంత స్థాయిలో అక్కడ షూట్ జరగడం ఇదే మొదటిసారి. అక్కడి పచ్చని కొండ ప్రాంతాలు, ఇళ్లు, దట్టమైన వెదురు అడవులు.. అన్నీ చూపరులను కట్టిపడేస్తాయి. అది చూశాక నాకు నాగాలాండ్ వెళ్లాలనిపించింది. స్నేహితులతో వెళ్లి వచ్చేశా'' అంటాడు హైదరాబాద్‌కి చెందిన కె.ఉమావెంకట్. ప్రముఖ ప్రైవేటు సంస్థలో పనిచేసే అతడు వారాంతాల్లో కూడా స్నేహితులతో వరంగల్ వంటి చుట్టుపక్కల ప్రాంతాలకు సరదాగా వెళ్లి వచ్చేస్తుంటాడు. 'ఉద్యోగంలో చేరిన తరవాత కొత్త స్నేహితులు వచ్చారు. వీళ్లే నాకు సహచరులు, స్నేహితులు' అంటాడు. ఇలాంటి వాళ్లనే ఇప్పుడు ఫ్రాలీగ్స్ అని పిలుస్తున్నారు. అంటే ఫ్రెండ్స్ అయిన కొలీగ్స్ అన్నమాట. ఇలా సహచర ఉద్యోగ స్నేహితులతో షికార్లకు వెళ్లడం ఇటీవలికాలంలో పెరిగింది.

సినిమాలు, వెబ్‌సిరీస్‌లు చూసి..

సోషల్ మీడియాలో వచ్చే రీల్స్, వీడియోలు సామాన్యులను ఎక్కువగా ఆకట్టుకుంటున్నాయి. ఇందులో అనేక ప్రదేశాల గురించి చెబుతున్నారు. అలాగే నెట్‌ఫ్లిక్స్, ప్రైమ్, జీ5, సోనీ లివ్ వంటి వేదికల్లో వస్తున్న వెబ్ సిరీస్‌లు, సినిమాలు కూడా పర్యటనలు చేయాలను కునేవారిని ప్రభావితం చేస్తున్నాయి. ప్రముఖ ట్రావెల్ ఏజెన్సీ సంస్థలు థామస్ కుక్, ఎస్‌ఓటీసీ విడుదల చేసిన 'ఇండియా హాలిడే రిపోర్ట్ 2025' సర్వేలో.. ఇలాంటి ప్రాంతాలకు పర్యటనలకు వెళ్తున్నామని 60 శాతం మంది చెప్పడం విశేషం. ఇలా వెళ్లేవారిలో యువతే అధికం.

సపరివార సమేతంగా..

యువతరం తమ తల్లిదండ్రులు, తాతయ్య, అమ్మమ్మ / నాన్నమ్మలతో కలిసి విహార యాత్రలకు వెళ్లాలని అనుకుంటున్నారు. మంచి ఉద్యోగం, 5–6 అంకెల జీతం.. వీరిని ఇందుకు ప్రోత్సహిస్తున్నాయి. ముఖ్యంగా కుటుంబంలోని పెద్దలు గతంలో ఎక్కువ పర్యటనలు చేయకపోవడం కూడా యువతను ఈ నిర్ణయానికి ప్రేరేపిస్తోంది. దీంతో సపరివార సమేతంగా విహారయాత్రలు చేస్తున్నారు. 'ఇండియా హాలిడే రిపోర్ట్ 2025' ప్రకారం దాదాపు 65% ఇలా పర్యటనలకు వెళ్తున్నారు.

క్రికెట్ ప్రేమికులూ..

క్రికెట్‌ను ఇష్టపడేవారు క్రికెట్ మ్యాచ్‌ల షెడ్యూల్ ప్రకారం టూర్లు ప్లాన్ చేసుకుంటున్నారు. టీ20, వన్డే వంటి మ్యాచ్‌లు జరిగే చుట్టుపక్కల ప్రాంతాల్లో పర్యటిస్తూ.. రకరకాల స్థానిక రుచులను ఆస్వాదిస్తు న్నారు. ఇటీవల ముగిసిన ఐపీఎల్‌లో మ్యాచ్‌లను ఇలా చాలామంది చూశారట. ప్రముఖ ట్రావెల్ ఏజెన్సీ స్కై స్కానర్ 'పిచ్ పర్‌ఫెక్ట్ జర్నీస్' ప్రకారం.. 48% మంది మ్యాచ్‌కి కనీసం 2 నెలల ముందే ఇలా ట్రిప్స్ ప్లాన్ చేసుకున్నారు. వీరిలో స్నేహితులతో వెళ్లినవారు 74% కాగా, కుటుంబంతో వెళ్లినవారు 59%. భార్య లేదా ప్రియురాలు / సహజీవనం చేస్తున్నవారితో వెళ్లినవారు 46 శాతం.

మిమూనింగ్.. సోలో పర్యటన

హనీమూన్ వినే ఉంటారు. అంటే జీవిత భాగస్వామితో వివాహానంతరం చేసే విహార యాత్ర. మి మూనింగ్ అంటే.. ఒక్కరే వెళ్లడం. ప్రభాస్ నటించిన 'చక్రం' సినిమాలో సిరివెన్నెల సీతారామశాస్త్రి చెప్పినట్టు 'తనలో తామే రమించడం'. ఒక్కరే ఆ అనుభూతిని ఆస్వాదించడం. ట్రెకింగ్, వాటర్ రాఫ్టింగ్ వంటి సాహస యాత్రలు చేయడం. ఎలాంటి బాదరబందీ లేకుండా ఒక్కరే.. 'జగమంత కుటుంబం నాది.. ఏకాకి జీవితం నాది' అనుకుంటూ ఎక్కడికైనా వెళ్లిపోవడం, ఎంజాయ్ చేయడం. ఇలా వెళ్లి స్థానికతను ఆస్వాదిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో స్థానిక పండుగలూ, కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. స్థానిక రుచులను టేస్ట్ చేస్తున్నారు. భారత్ సహా 7 దేశాల్లో నిర్వహించిన 'అమెరికన్ ఎక్స్‌ప్రెస్ 2024 గ్లోబల్ ట్రావెల్ ట్రెండ్స్' రిపోర్ట్ ప్రకారం.. 84 శాతం మంది మిమూనింగ్ ట్రిప్స్ ప్లాన్ చేస్తున్నారు. ప్రపంచ సగటు 66 శాతం కంటే ఇది చాలా ఎక్కువ కావడం గమనార్హం. భారత్ సహా 13 దేశాల్లోని 13 వేల మందిని 2024 జూన్‌లో సర్వే చేసిన రిపోర్టు 'హిల్టన్ 2025 ట్రెండ్స్'. దీని ప్రకారం సోలో పర్యటనలు చేస్తున్నవారు 47 శాతం మంది. వీరిలో మిలీనియల్స్ (1981–96 మధ్య పుట్టినవారు) 51 శాతం కాగా, జనరేషన్ జెడ్ (1997–2012 మధ్య పుట్టినవారు) 55 శాతం కావడం విశేషం.



దేశభక్తి.. ప్రకృతి సౌందర్యం..

యుద్ధభూమి అంటే వీరత్వానికి ప్రతీక. సైనికుల ధైర్యసాహసాలకు వేదిక. అలాంటి రణభూమికి కూడా పర్యటనలకు వెళ్లేందుకు ఇప్పుడు ఇష్టపడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం 'భారత రణభూమి దర్శన్' పేరిట పర్యాటకాన్ని ప్రోత్సహించే కార్యక్రమం చేపట్టింది. జమ్మూ కశ్మీర్, లడఖ్, పశ్చిమ బెంగాల్, పంజాబ్, అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం, ఉత్తరాఖండ్‌లలో 77 ప్రదేశాలు ఈ జాబితాలో ఉన్నాయి. భారత సాయుధ దళాల త్యాగాలను ఇవి గుర్తుచేసి, సందర్శకులను రోమాంఛితం చేస్తాయి. ఇవి దేశభక్తి, ప్రకృతి సౌందర్యాల కలబోతలు.

తారాలోకం చూస్తూ..

రాత్రిపూట ఖగోళ రహస్యాలను, చందమామ, నక్షత్రాల సౌందర్యాన్ని ఆస్వాదించేందుకు కూడా చాలామంది ఇష్టపడుతున్నారు. ఇది మానసిక ప్రశాంతతను ఇస్తోందని వారు చెబుతున్నారు. ప్రముఖ ట్రావెల్ ఏజెన్సీ' స్కైస్కానర్' నిర్వహించిన సర్వేలో.. రాత్రిపూట ఆకాశాన్ని ఫొటోలు తీసేందుకు ఇష్టపడి పర్యటనలకు వెళ్లినవారు 56% మంది. రాత్రిపూట నక్షత్రాలు, చంద్రుడు ఉండగా కొండప్రాంతాల్లో నిద్రించేందుకు వెళ్లినవారు 53% మంది.

అబద్ధాలను పటాపంచలు చేస్తాం

▶ మొదటి పేజీ తరువాయి

జరుగుతున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టి, ప్రజలకు నిజాలు వివరిస్తాం. కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన విచారణ కమిషన్ ముందుకు వెళ్లి నిజాలు చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్న అబద్ధాలను పటాపంచలు చేస్తాం. తాటాకు చప్పుళ్లకు బీఆర్ఎస్ నాయకత్వం బెదరదు. ప్రభుత్వం భేషజాలకు పోకుండా మేడిగడ్డ బరాజ్‌కు మరమ్మతులు చేసి సాగునీటిని అందించాలి. లేనిపక్షంలో ప్రజా ఉద్యమాల ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతాం'అని హరీశ్‌రావు హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై దుష్ప్రచారం–వాస్తవాలు అనే అంశంపై హరీశ్‌రావు సోమవారం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు సహా పార్టీ ముఖ్యనేతలు హాజరైన ఈ సమావేశంలో సుమారు గంటన్నరపాటు కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన పూర్వాపరాలను వివరించారు.

సీఎం, మంత్రులది దుష్ప్రచారం..

'మేడిగడ్డ ప్రాజెక్టుకు మరమ్మతులు చేయకుండా రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలపైనే కాంగ్రెస్ దృష్టి పెట్టింది. కాళేశ్వరం కుప్పకూలిందంటూ దుష్ప్రచారం చేస్తున్న వారు ఈ ప్రాజెక్టు అనేక రిజర్వాయర్లు, బ్యారేజీలు, కాలువలు, పంప్‌హౌస్‌ల సమాహారమని గుర్తించాలి. కానీ ఈ అంశాన్ని విస్మరించి ప్రాజెక్టు వ్యయం పెంపు, ఆయకట్టు మొదలుకొని అనేక విషయాలపట్ల సీఎం, మంత్రులు దుష్ప్రచారం చేస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా 20.33 లక్షల ఎకరాలకు ప్రయోజనం చేకూరుతోంది. రాష్ట్ర అవతరణకు ముందు పదేళ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు పేరు చెప్పినా ఒక్క అనుమతి సాధించలేదు. మొబిలైజేషన్ అడ్వాన్సుల పేరిట రూ. 2,328 కోట్లు కాంట్రాక్టర్లకు ఇచ్చింది. పనులు చేపట్టకుండానే అంచనాలను రూ. 17,875 కోట్ల నుంచి రూ. 40 వేల కోట్లకు పెంచింది. తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తున ఆనకట్ట నిర్మించేందుకు మహారాష్ట్ర అంగీకరించకపోవడం, నీటి లభ్యత కేవలం 44 టీఎంసీలు ఉండటం, పర్యావరణ, అటవీ అనుమతులకు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొనే ప్రాజెక్టు రీడిజైనింగ్‌పై ఆలోచన చేశాం'అని హరీశ్‌రావు వివరించారు.

తుమ్మిడిహెట్టి వద్ద ప్రయత్నాలు విఫలమైనందునే..

'తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మించేందుకు మహారాష్ట్రలోని కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలతో జరిపిన సంప్రదింపులు విఫలమయ్యాయి. తుమ్మిడిహెట్టి వద్ద ప్రతిపాదించిన బ్యారేజీ నిర్మాణం కోసం ప్రభుత్వ పరంగా రాజకీయంగా ఎన్నో ప్రయత్నాలు చేశాం. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వ సంస్థ వ్యాప్కోస్ సూచన మేరకు మేడిగడ్డను ఎంపిక చేశాం. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు ద్వారా కేవలం 11 టీఎంసీల నీటినే నిల్వ చేసే అవకాశం ఉండేది. కానీ కేసీఆర్ ముందు చూపుతో కాళేశ్వరం ద్వారా 141 టీఎంసీల నీరు నిల్వ ఉండేలా 16 రిజర్వాయర్ల నిర్మాణం జరిగింది. ప్రాజెక్టును విస్తరించడం వల్లే అంచనా వ్యయం పెరిగింది. దేశంలో అతితక్కువ అంచనా వ్యయం పెంపుతో, అతితక్కువ సమయంలో నిర్మితమైన ప్రాజెక్టు కాళేశ్వరం మాత్రమే. పోలవరం ప్రాజెక్టు కుప్పకూలినా ఎన్నడూ సందర్శించని ఎన్‌డీఎస్‌ఏ.. ఇప్పుడు ఈడీ, సీబీఐ తరహాలో కేంద్ర ప్రభుత్వ జేబు సంస్థలా వ్యవహరిస్తోంది. ఎన్‌డీఎస్‌ఏ నివేదిక వెనుక రాజకీయ దురుద్దేశాలు ఉన్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టు కుప్పకూలిందని ప్రచారం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి.. రెండు రోజుల క్రితం శంకుస్థాపన చేసిన గంధమల్లకు నీరు ఎక్కడి నుంచి వస్తోందో చెప్పాలి'అని హరీశ్‌రావు ప్రభుత్వాన్ని నిలదీశారు.



శనివారం కాళేశ్వరం ప్రాజెక్టుపై హరీశ్‌రావు ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు హాజరైన కేటీఆర్, లక్ష్మారెడ్డి, మధుసూదనాచారి, కొత్త ప్రభాకరరెడ్డి తదితరులు

నిందలు, దందాలు, చందాల నినాదంతో రేవంత్ పాలన: కేటీఆర్

'తెలంగాణ ఉద్యమ నినాదమైన నీళ్లు, నిధులు, నియామకాలకు పాతరేసిన సీఎం రేవంత్‌రెడ్డి దుర్మార్గపు విధానంతో రాజ్యమేలుతున్నాడు. బీఆర్ఎస్‌పై నిందలు, కాంట్రాక్టర్లతో దందాలు, ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలకు చందాలు అనే నినాదంతో పాలన సాగిస్తున్నాడు. గోదావరి, కృష్ణా నదుల్లోని ప్రతి నీటిబొట్టునూ ఒడిసిపట్టి తెలంగాణను సస్యశ్యామలం చేసేందుకే కేసీఆర్ కాలంతో పోటీపడి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును, సీతారామ ప్రాజెక్టును 90 శాతం పూర్తి చేశారు. అనుమతి లేకుండా ఏపీ ప్రభుత్వం అనేక ప్రాజెక్టులు కడుతున్నా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, బీజేపీ నాయకులు మాట్లాడటం లేదు. దేశంలో, రాష్ట్రంలో ఏ ప్రాజెక్టులు, బ్రిడ్జీలు కూలినా స్పందించని ఎన్‌డీఎస్‌ఏ.. కాళేశ్వరంలోని 100 కాంపోనెంట్లలో కేవలం ఒక్కచోట రెండు పిల్లర్లు కుంగితే ఏడాదిన్నరగా మరమ్మతులు చేయకుండా రాద్ధాంతం చేస్తోంది. ఎన్‌డీఎస్‌ఏ నివేదిక పేరిట బీజేపీ ఆఫీసులో ఎన్‌డీఏ రిపోర్ట్ తయారు చేసి దుష్ప్రచారం చేస్తున్నారు. ఈ నివేదిక చెత్తబుట్టలో వేయడానికి తప్ప దేనికీ పనికి రాదని ఎల్ అండ్ టీ సంస్థ తేల్చి చెప్పింది. పార్లమెంటు నూతన భవనం, కాంగ్రెస్ కేంద్ర కార్యాలయాన్ని నిర్మించింది కూడా ఎల్ అండ్ టీ సంస్థే. కాంగ్రెస్, బీజేపీ కలిసికట్టుగా తెలంగాణ రైతుల గొంతు నొక్కే కుట్ర చేస్తున్న నేపథ్యంలో జిల్లాకు కూడా వెళ్లి వాస్తవాలు చెప్తాం' అని కేటీఆర్ స్పష్టం చేశారు. బనకచర్లతో రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్నా ముఖ్యమంత్రి, మంత్రులు ఒక్క మాట కూడా మాట్లాడటం లేదని కేటీఆర్ విమర్శించారు. దేశంలో ఏ మంత్రి కూడా పనిచేయని విధంగా తక్కువ కాలంలోనే పలు ప్రాజెక్టులను పూర్తి చేసిన ఘనత హరీశ్‌రావుదని కొనియాడారు. తెలంగాణకు ఎన్నడైనా కేసీఆరే శ్రీరామరక్ష అని కేటీఆర్ పేర్కొన్నారు.

క్లుప్తంగా...

దొంగలకు సద్దులు మోసినట్టు ఈటల తీరు

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సాక్షి, హైదరాబాద్: దొంగలకు సద్దులు మోసినట్టుగా బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తీరు ఉందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఎద్దేవా చేశారు. కాళేశ్వరం అవినీతి నుంచి మాజీ సీఎం కేసీఆర్‌ను బయటపడేసేందుకు ఈటల ప్రయత్నించారని విమర్శించారు. కాళేశ్వరం కమీషన్ల చిట్టాను ఘోష్ కమిషన్ ముందు ఈటల విప్పుతారని అందరూ ఆశించారని, తన పాత బాస్ రుణం తీర్చుకునేందుకే రాజేందర్ నిజాలు చెప్పలేదని ఆరోపించారు. ఆయన శనివారం సీఎల్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ కుటుంబానికి ఏటీఎంలా కాళేశ్వరం ప్రాజెక్టు మారిందని నడ్డా, అమిత్‌షా, మోదీలు అనేకసార్లు చెప్పారని గుర్తు చేశారు. బీజేపీ నేతల మాటలకు విరుద్ధంగా రాజేందర్ కమిషన్ ముందు వాంగ్మూలం ఇచ్చారన్నారు. కాళేశ్వరం అవినీతిపై కేసీఆర్ రాజీనామా చేయాలని గతంలో డిమాండ్ చేసిన ఈటల.. ఇప్పుడు చెపుతున్న మాటల వెనుక బీజేపీ డైరెక్షన్ ఉందని ఆరోపించారు.

కాళేశ్వరంలో ఈటల పాత్ర సున్నా..

ప్రాజెక్టు డిజైన్ అంతా కేసీఆర్‌దే: ఎంపీ కొండా



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం విషయంలో ఈటల రాజేందర్ పాత్ర జీరో అని చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు అసాధ్యమైనదని, దీంతో చేవెళ్లకు ఒక్కచుక్క నీరు రాదన్నారు. కాంగ్రెస్ పార్టీ అప్పట్లో మాయమాటలు చెప్పిందని, ఈ ప్రాజెక్టును కేసీఆర్ రద్దు చేస్తారనుకుంటే... అంబేడ్కర్ పేరు తీసి కాళేశ్వరం పేరు పెట్టారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ డిజైన్ బాగానే ఉందని, కానీ కేసీఆర్ చేసిన డిజైన్ సరిగా చేయలేదన్నారు. కాళేశ్వరం డిజైన్ పూర్తిగా కేసీఆర్‌దే అని, ఆ విషయం ఆయన ఎన్నోసార్లు చెప్పారని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు డిజైనింగ్ చర్చలో హరీశ్‌రావు, ఈటల లేరని, ఇంజనీర్లదే తప్పు అని అన్నారు. కేసీఆర్ తానా అంటే ఇంజనీర్లు తందాన అన్నారని, ఈ విషయంలో ఈటల పాత్ర లేదన్నారు. కమిషన్ ముందు ఈటల ఏం చెప్పారో తెలియదని, ఈటలకు సపోర్టు చేసేందుకు తాను రాలేదని కొండా తెలిపారు.

ఈటల త్వరలో బీఆర్ఎస్‌లో చేరతారు

ఉద్యోగులు రాజకీయ పక్షాల ఉచ్చులో పడొద్దు: మేడిపల్లి సత్యం



సాక్షి, హైదరాబాద్: బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ త్వరలోనే బీఆర్ఎస్‌లో చేరే అవకాశాలున్నాయని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చెప్పారు. పాత బాస్ కేసీఆర్ మీద ఈటలకు ప్రేమ పోలేదని, బీజేపీలో అధ్యక్ష పదవి రావడం లేదని బీఆర్ఎస్‌లోకి పోవాలని చూస్తున్నాడని వ్యాఖ్యానించారు. శనివారం సీఎల్పీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కాళేశ్వరం కమిషన్ విచారణలో ఆయన చేసిన వ్యాఖ్యలను బట్టి ప్రజల్లో జరుగుతున్న చర్చను మాత్రమే తాను చెబుతున్నానన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల విషయంలో తమ ప్రభుత్వం పాజిటివ్‌గా స్పందించిందని, మంత్రివర్గ నిర్ణయంపైన ప్రభుత్వ ఉద్యోగులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఉన్నంతలో ఉద్యోగులకు సర్దిచెప్పుకుని ప్రభుత్వాన్ని సీఎం రేవంత్ ముందుకు తీసుకెళుతున్నారని, ఉద్యోగులు కూడా పెద్ద మనసుతో అర్థం చేసుకుని సహకరిస్తున్నారని అన్నారు.

బీఆర్ఎస్ కక్కుర్తితో రాష్ట్రానికి శాశ్వత నష్టం

కాళేశ్వరంపై హరీశ్‌రావు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారు
- వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పాలి: నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్



సాక్షి, హైదరాబాద్: నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణంలో బీఆర్ఎస్ తప్పుడు నిర్ణయాలు, కమీషన్ల కక్కుర్తితో తెలంగాణకు శాశ్వత నష్టం జరిగిందని నీటిపారుదల శాఖ మంత్రి ఎస్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు అవాస్తవిక ప్రచారం చేపడుతున్నారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై బీఆర్ఎస్ ప్రచారానికి అంశాలవారీగా కౌంటర్ ఇచ్చారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఐదేళ్లలో మేడిగడ్డ నుంచి ఎత్తిపోసిన నీళ్లు 162 టీఎంసీలే

'కాళేశ్వరం ప్రాజెక్టుకు మేడిగడ్డ గుండెకాయ అని చెప్పింది మీరే. 2019లో బ్యారేజీ నిర్మాణం పూర్తవగా 2023–24 వరకు మొత్తంగా 162 టీఎంసీలను మేడిగడ్డ నుంచి ఎత్తిపోశారు. ఇందులో మళ్లీ వరదలు రాగానే సముద్రంలోకి వదిలిన నీరు 63 టీఎంసీలు. ఐదేళ్లలో 99 టీఎంసీలతో 22 లక్షల ఎకరాలకు నీళ్లు ఎట్లా ఇచ్చావో చెప్పు?'అని హరీశ్‌రావును మంత్రి ఉత్తమ్ ఆ ప్రకటనలో నిలదీశారు. 2022 జూలైలో వరదలకు సిరిపురం (అన్నారం) పంప్‌హౌస్ నీటమునిగిందని.. అదే ఏడాది కన్నెపల్లి (మేడిగడ్డ) పంప్‌హౌస్ ట్రస్ట్ వాల్ కూలి పంప్‌హౌస్‌లోని మోటార్లన్నీ దెబ్బతిన్నాయని ఆయన గుర్తుచేశారు. 2023 అక్టోబర్ 21న మేడిగడ్డ బ్యారేజీ కుంగిందని పేర్కొన్నారు.

నిధుల మళ్లింపు కోసమే బీఆర్ఎస్ బ్యారేజీలు..

'ఫరక్కా బ్యారేజీ కట్టింది నీటి మళ్లింపు కోసమే. రాతి పునాది వల్లే ఆ బ్యారేజీ మనుగడ సాగిస్తోంది. ఫరక్కా బ్యారేజీని 1975లో కట్టినా ఇప్పటికీ చెక్కు చెదర లేదు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను ప్రతిపాదించింది.. కట్టింది.. బీఆర్ఎస్ హయాంలోనే. మేడిగడ్డ కుంగింది కూడా బీఆర్ఎస్ హయాంలోనే. ఫరక్కా బ్యారేజీని నీటి మళ్లింపు కోసం కడితే కాళేశ్వరం బ్యారేజీలను నిధుల మళ్లింపు కోసం కట్టారు. కేసీఆర్ కుటుంబ అవినీతికి కాళేశ్వరం బ్యారేజీలే ప్రత్యక్ష సాక్ష్యం'అని మంత్రి ఉత్తమ్ విమర్శించారు.

తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీని కడతామని మహారాష్ట్రతో ఒప్పందం చేసుకొని ఏనుగులతో ర్యాలీలు తీయలేదా? ఆ తర్వాత బ్యారేజీ కట్టకుండా ఎందుకు పక్కనపెట్టారు? తుమ్మిడిహెట్టి వద్ద కడితే పేరు కాంగ్రెస్‌కు, పైసలు రావనేది ప్రధాన కారణం. తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లి దాకా నీటిని గ్రావిటీతో తరలించడానికి 100 కి.మీ. ఓపెన్ కెనాల్ నిర్మాణం జరిగింది. తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ కడితే 100 కి.మీ. దాకా గ్రావిటీ ద్వారానే నీళ్లు వచ్చేవి. కానీ మేడిగడ్డ బ్యారేజీ వల్ల 100 కి.మీ. కిందకు వెళ్లి నీటిని ఎత్తిపోయడం, వరదలు రాగానే మళ్లీ నీటిని సముద్రంలోకి వదిలేయడం చేశారు. ఇది కాళేశ్వరం ఎత్తిపోతల పథకం కాదు.. తిప్పిపోతల పథకం'అని ఉత్తమ్ మండిపడ్డారు.

వైఫల్యానికి ప్రధాన కారకులు కేసీఆర్, హరీశ్‌రావే

కాళేశ్వరం బ్యారేజీ వైఫల్యానికి ప్రధాన కారకులు కేసీఆర్, హరీశ్‌రావేనని మంత్రి ఉత్తమ్ ఆరోపించారు. 2018 దాకా నీటిపారుదల శాఖ మంత్రిగా ఉండి నాసిరకం పనులు చేపట్టి, ప్రజాధనం దుర్వినియోగం చేసినందుకు ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదని సీడబ్ల్యూసీ చెప్పలేదని... నాటి కాంగ్రెస్ ప్రభుత్వానికి పేరు రావొద్దనే తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు ప్రాజెక్టును మార్చారని ఆరోపించారు. తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ రూ. 38 వేల కోట్లతో పూర్తై ఇప్పటికే తుమ్మిడిహెట్టి నుంచి చేవెళ్ల దాకా 17 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరు అందేదన్నారు. కానీ బీఆర్ఎస్ తప్పుడు నిర్ణయాలు, కక్కుర్తి వల్ల రాష్ట్రానికి, రైతాంగానికి శాశ్వత నష్టం జరిగిందని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ కమీషన్ల కక్కుర్తి వల్ల తెలంగాణ ప్రజలు నీటిపారుదల ప్రాజెక్టుల అప్పులకు ఏటా రూ. 16 వేల కోట్ల వడ్డీ కట్టాల్సివస్తోందని మండిపడ్డారు. కాళేశ్వరంలో అన్ని మోటార్లు పనిచేసి ఉంటే విద్యుత్ భారమే ఏడాదికి రూ. 10 వేల కోట్లు అయ్యేదన్న మంత్రి ఉత్తమ్.. ఒకవేళ తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు కట్టి ఉంటే విద్యుత్ భారం కేవలం రూ.1000 కోట్లే అయ్యేదన్నారు. బీఆర్ఎస్ తప్పుడు నిర్ణయాల వల్ల తెలంగాణకు ఆర్థిక భారం శాశ్వతంగా నిలిచిపోయిందని విమర్శించారు.

ఈటల చెప్పినవన్నీ అబద్ధాలే!

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- 'కాళేశ్వరం' అప్పట్లో కేబినెట్ ముందుకే రాలేదు
- నాటి మంత్రివర్గ ఉప సంఘానికి కాళేశ్వరానికి సంబంధం లేదు
- నేనే కాళేశ్వరం కమిషన్‌ను కలసి వాస్తవాలు వివరిస్తా




సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం విచారణ కమిషన్ ముందు బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ అసత్యాలతో కూడిన వాంగ్మూలం ఇచ్చారని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. కమిషన్ అడిగిన ప్రశ్నలకు పొంతన లేకుండా సమాధానాలు ఇచ్చారని, ఆయన అనాలోచితంగా ఇచ్చారో లేక వేరే రకంగా ఇవ్వాల్సి వచ్చిందో ఆయనకే తెలియాలని ఎద్దేవా చేశారు. శనివారం ఆయన సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ తొలి టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తనను సభ్యుడిగా నియమిస్తూ వేసిన మంత్రివర్గ ఉపసంఘం కాళేశ్వరం ప్రాజెక్టు కోసం కాదని స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు అనుమతులు ఇచ్చిన తరువాత అప్పటికే రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న దేవాదుల, ప్రాణహిత, కాంతాలపల్లి, తుపాకుల గూడెం ప్రాజెక్టుల కోసం సబ్ కమిటీ వేశారని తెలిపారు. ఆ సబ్ కమిటీ కాళేశ్వరం బరాజ్‌లపై ఎలాంటి నివేదిక ఇవ్వలేదన్నారు. కాళేశ్వరం నిర్మాణానికి సబ్‌కమిటీ ఆమోదం తెలిపిందని ఈటల పేర్కొనడం అబద్ధమని స్పష్టం చేశారు. కాళేశ్వరం.. కేబినెట్ ఆమోదం పొందలేదని, అసలు కాళేశ్వరం ప్రాజెక్టు అంశం ఎప్పుడూ కేబినెట్ ముందుకు రాలేదని వెల్లడించారు. కార్యనిర్వాహక అనుమతులతోనే కాళేశ్వరం ప్రాజెక్టు అమలులోకి వచ్చిందని చెప్పారు. ఈటల రాజేందర్ ప్రజలకు తప్పుడు సమాచారం ఇచ్చారని, తనను కూడా ఇందులో బాధ్యుడిని చేయాలని తన పేరును తీసుకొచ్చారని విమర్శించారు. 43 ఏళ్ల రాజకీయ జీవితంలో తాను నిబద్ధతతో ఉన్నానని, తెలిసి ఎక్కడా పొరపాటు చేయలేదని అన్నారు. కాళేశ్వరం వివాదంలోకి తనను ఎందుకు లాగాల్సి వచ్చిందో ఆయనే చెప్పాలని, కాళేశ్వరానికి, సబ్ కమిటీకి లంకె పెట్టడం హాస్యాస్పదమని అన్నారు.

త్వరలోనే కమిషన్‌ను కలసి వాస్తవాలు చెబుతా..

కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి వాస్తవాలు తెలియజేసేందుకు తానే స్వయంగా కమిషన్‌ను కలుస్తానని మంత్రి తుమ్మల వెల్లడించారు. నాడు సబ్ కమిటీ ఏ అంశాల మీద వేశారు? సబ్ కమిటీ ఏమని నివేదిక ఇచ్చిందనే దానిపై కమిషన్‌కు వివరిస్తానని చెప్పారు. మేడిగడ్డ రీఇంజనీరింగ్‌కు సంబంధించి జీవోలు వచ్చాయే తప్ప కేబినెట్, సబ్ కమిటీల ద్వారా కాదన్నారు. అప్పటి ప్రభుత్వంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టును వ్యతిరేకించానో లేదో ఇప్పుడు బహిర్గతం చేయనని, కమిషన్ ముందు వాస్తవాలన్నీ చెప్పిన తరువాత మాట్లాడుతానని తుమ్మల చెప్పారు.

తప్పుడు ప్రచారం మానుకోవాలి

మంత్రి ఉత్తమ్‌కు హరీశ్‌రావు హితవు
- కాళేశ్వరంపై వాస్తవాలు వివరించినా ఆయన అబద్ధాలు ఆపట్లేదని ఆగ్రహం
- కమీషన్ల కోసం కాంగ్రెస్ తొలుత టెయిల్ వర్క్స్ చేపట్టి హెడ్ వర్క్స్ వదిలేసిందని ధ్వజం



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరంపై వాస్తవాలు వివరించినా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అబద్ధాల ప్రవాహాన్ని ఆపడం లేదని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌పై స్పందిస్తూ మంత్రి ఉత్తమ్ చేసిన విమర్శలను హరీశ్‌రావు ఖండించారు. 'ఐదేళ్లలో మేడిగడ్డలో ఎత్తిపోసిన నీళ్లు 162 టీఎంసీలు మాత్రమేనని చెబుతున్న ఉత్తమ్.. కాళేశ్వరంలో భాగమైన ఎల్లంపల్లి నుంచి మిడ్‌మానేరుకు లిఫ్ట్ చేసిన నీటి వివరాలు చెప్పడం లేదని ఆక్షేపించారు. లక్ష్మి, సరస్వతి, పార్వతి, నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల నుంచి ఎత్తిపోసిన నీళ్ల వివరాలు దాచిపెడుతున్నారని విమర్శించారు. కాళేశ్వరం కట్టిన మూడేళ్లలోనే మేడిగడ్డ నుంచి 162.41 టీఎంసీలు, అన్నారం నుంచి 172.86 టీఎంసీలు, సుందిళ్ల నుంచి 172.12 టీఎంసీలు, నంది మేడారం పంప్‌హౌస్ నుంచి 181.70 టీఎంసీలు, గాయత్రి పంప్‌హౌస్ నుంచి 179.41 టీఎంసీల గోదావరి జలాలను కాళేశ్వరం ప్రాజెక్టులోకి ఎత్తిపోశామన్నారు. మంత్రికి తెలియకుంటే ఇంజనీర్లను అడిగి వివరాలు తెలుసుకోవాలని సూచించారు. ఏ ప్రాజెక్టు నిర్మించినా తొలి దశలోనే పూర్తి ఆయకట్టుకు నీరు అందించడం సాధ్యపడదనే విషయంతోపాటు కాల్వలు తవ్వుతున్నకొద్దీ నీరు అందే ఆయకట్టు పెరుగుతుందనే విషయాన్ని మంత్రి తెలుసుకోవాలన్నారు. ఎస్సారెస్పీ, నాగార్జున సాగర్, కల్వకుర్తి దేవాదుల సహా ఏ ప్రాజెక్టులో అయినా మొదట హెడ్ వర్క్స్ పూర్తి చేసి టెయిల్ వర్క్స్ తర్వాత పూర్తి చేస్తుంటారని.. కానీ కాంగ్రెస్ మాత్రం కమీషన్ల కోసం తోక పనులు ముందు మొదలుపెట్టి, హెడ్ వర్క్స్ వదిలి పెట్టిందని హరీశ్‌రావు విమర్శించారు. తలాతోక లేని మాటలు మానుకొని అబద్ధాల ప్రచారం మానాలని హితవు పలికారు.

క్లుప్తంగా...

సీపీఎస్‌ను తక్షణమే రద్దు చేయాలి

ఎన్‌వోపీఆర్‌యూఎఫ్ డిమాండ్

సాక్షి, హైదరాబాద్: కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్‌ను అమలు చేయాలని నేషనల్ ఓల్డ్ పెన్షన్ రెస్టోరేషన్ యునైటెడ్ ఫ్రంట్(ఎన్‌వోపీఆర్‌యూఎఫ్) సౌత్ ఇండియా బాధ్యుడు మాచన రఘునందన్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీల్లో భాగంగా సీపీఎస్ రద్దు అంశాన్ని ప్రకటించిందని, అధికారంలోకి వచ్చి 18 నెలలు కావస్తున్నా నిర్ణయం తీసుకోలేదని పేర్కొన్నారు. సీపీఎస్ అమలుతో ఉద్యోగులు పడుతున్న ఇబ్బందులు, ఉద్యోగ విరమణ తర్వాత ఆర్థిక ప్రయోజనాల నిలిపివేత తదితర అంశాలను ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించి సీపీఎస్‌ను రద్దు చేస్తూ అసెంబ్లీలో తీర్మానించి.. తదుపరి చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ ప్రతిష్టను దెబ్బ తీస్తున్నారు

సీఎంపై ఎమ్మెల్యే వివేకానంద మండిపాటు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రతిష్టను ముఖ్యమంత్రి రేవంత్ దెబ్బ తీస్తున్నారని, కాంగ్రెస్ కామాంధుల పార్టీలా మారిందని బీఆర్‌ఎస్ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద విమర్శించారు. ఆయన శనివారం తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. పీసీసీ అంటే పిశాచాల కాంగ్రెస్ కమిటీగా మారిందన్నారు. గతంలో ఎంపీ తప్పులు చేస్తే.. పీసీసీ అధ్యక్షులు సరిచేసేవారని, కానీ ప్రస్తుత పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ డమ్మీగా వ్యవహరిస్తూ రేవంత్‌కు వత్తాసు పలుకుతున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పద్ధతిలో అధికారంలోకి వచ్చిన రేవంత్.. పగ, కక్షతో రాష్ట్రాన్ని పాలిస్తున్నారన్నారు. ఆయనకు సీఎంగా కొనసాగే హక్కులేదన్నారు. చంద్రబాబు నాయుడి చెంచాగా మారి తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు గతంలో రేవంత్ రెడ్డి ప్రయత్నించారని ఆరోపించారు. మాజీ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మాట్లాడుతూ.. 2015లోనే యాదగిరి గుట్ట అభివృద్ధికి వైటీడీఏ ఏర్పాటు చేసినా.. రేవంత్ అంతులేని అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వినయభాస్కర్, బీఆర్‌ఎస్ నేతలు వంటేరు ప్రతాప్‌రెడ్డి, దత్తాత్రేయ, విజయ్ ఆర్యా పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ అధికారులు కాంగ్రెస్ కార్యకర్తల్లా మారిపోయారు

బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ అధికారులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల్లా మారిపోయారని బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ విమర్శించారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు ప్రజల సమస్యల పట్ల పట్టింపు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో కేంద్ర ప్రభుత్వ వాటా కూడా ఉందని, ఈ విషయాన్ని మర్చిపోవద్దన్నారు. ఈ పథకం కింద అర్హుల ఎంపికలో ఎమ్మెల్యేలు, ఎంపీలకు కనీసం సమాచారం ఇవ్వకుండా కేవలం ఇందిరమ్మ కమిటీల ఆమోదంతో ఎంపిక చేయడం సరికాదన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం లోపభూయిష్టంగా మారిందని, గ్రామానికి 5 నుంచి 8 ఇళ్లను మాత్రమే ఇచ్చారని, వాటి కోసం గ్రామాల్లో కొట్టుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు.

10 శాతం చికెన్ తెలంగాణదే



- దేశంలో చికెన్ ఉత్పత్తిలో 5వ స్థానంలో రాష్ట్రం
- 2023-24లో 5.10 లక్షల టన్నుల ఉత్పత్తి
- 7.56 లక్షల టన్నులతో మొదటి స్థానంలో మహారాష్ట్ర
- దేశంలో మొత్తం చేపల ఉత్పత్తిలో మూడోవంతు ఏపీలోనే
- 21.93 కోట్ల హెక్టార్లకు పెరిగిన సాగు భూమి
- ఎన్‌వీ స్టాట్స్ ఇండియా-2025 నివేదికలో వెల్లడి

దేశంలో కోడి మాంసం (చికెన్) ఉత్పత్తిలో తెలంగాణ 5వ స్థానంలో నిలిచింది. 2023-24 సంవత్సరంలో దేశవ్యాప్తంగా 50.19 లక్షల టన్నుల చికెన్ ఉత్పత్తి అయ్యింది. అందులో తెలంగాణలో 10 శాతం.. అంటే 5.10 లక్షల టన్నుల ఉత్పత్తి జరిగింది. 7.56 లక్షల టన్నులతో మహారాష్ట్ర మొదటి స్థానంలో నిలిచింది. ఆ తర్వాత పశ్చిమబెంగాల్ 6.75 లక్షల టన్నులు, హరియాణాలో 6.36 లక్షల టన్నులు, తమిళనాడులో 5.58 లక్షల టన్నుల చికెన్ ఉత్పత్తి అయ్యింది. కాగా, రాజస్తాన్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో చికెన్ వినియోగం అతి తక్కువగా ఉంది. ఇటీవల కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ఎన్‌వీ స్టాట్స్ ఇండియా-2025 నివేదికలో ఈ వివరాలు వెల్లడయ్యాయి. - సాక్షి, న్యూఢిల్లీ

ఏడాదిలో కోటి టన్నుల మాంసం



దేశవ్యాప్తంగా 2023-24 సంవత్సరంలో అన్నిరకాల మాంసాలు కలిసి 1.02 కోట్ల టన్నుల ఉత్పత్తి జరిగింది. అందులో అత్యధికంగా చికెన్ ఉత్పత్తి ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో 10.67 లక్షల టన్నులు, తెలంగాణలో 11.12 లక్షల టన్నుల మాంసం ఉత్పత్తి జరిగింది. అదే సమయంలో దేశవ్యాప్తంగా 1.84 కోట్ల టన్నుల చేపల ఉత్పత్తి జరగ్గా, 51.58 లక్షల టన్నులతో ఆంధ్రప్రదేశ్ దేశంలో అగ్రస్థానంలో నిలిచింది. 2015-16లో ఏపీలో చేపల ఉత్పత్తి 23.52 లక్షల టన్నులు మాత్రమే. అదే సమయంలో తెలంగాణలో 4.56 లక్షల టన్నులు చేపలు ఉత్పత్తి అయ్యాయి.

స్వల్పంగా పెరిగిన సాగుభూమి

దేశంలో 2019-20 సంవత్సరంలో మొత్తం 21.13 కోట్ల హెక్టార్లలో పంటలు పండగా, 2022-23 నాటికి స్వల్పంగా పెరిగి 21.93 కోట్ల హెక్టార్లకు పెరిగాయి. దేశంలో 2022-23లో సాగుయోగ్యం కాని భూమి 4.43 కోట్ల హెక్టార్లు ఉంది.



1996-97లో దేశంలో 7.60 కోట్ల హెక్టార్ల స్థూల నీటిపారుదల ప్రాంతం ఉండగా... 2022-23 నాటికి 12.22 కోట్ల హెక్టార్లకు పెరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో సాగుచేసిన మొత్తం భూమిలో 25,876 హెక్టార్లు సేంద్రియ ప్రాంతం ఉండగా, 37,801 హెక్టార్లు కన్వర్టెడ్ ప్రాంతం ఉంది. తెలంగాణలో మొత్తం సాగు చేసిన భూమిలో కేవలం 5,399 హెక్టార్లు సేంద్రియ ప్రాంతం, 79,465 హెక్టార్లు కన్వర్టెడ్ ప్రాంతం ఉందని సర్వేలో తేలింది.

సర్వేలోని మరికొన్ని అంశాలు..

- 1950-51లో దేశంలో 10.11 కోట్ల హెక్టార్లలో ఆహార పంటలు సాగు చేయగా... 2023-24 నాటికి 13.21 కోట్ల హెక్టార్లకు పెరిగింది. ఇందులో అత్యధికంగా 10.43 కోట్ల హెక్టార్లలో తృణధాన్యాలు, చిరుధాన్యాల సాగు ఉంది. ఆ తర్వాత స్థానంలో 4.78 కోట్ల హెక్టార్లలో వరి సాగైంది. 137.8 మిలియన్ టన్నుల ధాన్యం ఉత్పత్తి జరిగింది.
- దేశ భూభాగంలో 21.76% విస్తీర్ణంలో అడవులు వ్యాపించి ఉన్నాయి. 2015లో 7,64,566 చదరపు కిలోమీటర్ల మేర అటవీ ప్రాంతం ఉండగా.. 2023 నాటికి 7,75,377 చ.కి.మీలకు పెరిగింది. అత్యధికంగా మధ్యప్రదేశ్‌లో 94,689 చ.కి.మీ. అటవీ ప్రాంతం ఉంది.
- 2015 నుంచి 2023 వరకు ఆంధ్రప్రదేశ్‌లో 37,258 చ.కి.మీ.మేర మొత్తం అటవీ ప్రాంతం ఉండగా.. దట్టమైన అడవుల విస్తీర్ణం 26,006 చ.కి.మీ. నుంచి 30,084 చ.కి.మీ.లకు పెరిగింది. అదే సమయంలో తెలంగాణలో మొత్తం అటవీ ప్రాంతం 26,904 చ.కి.మీ. నుంచి 27,688 చ.కి.మీ.కు అటవీ ప్రాంతం పెరిగింది. దట్టమైన అటవీ విస్తీర్ణం 19,854 చ.కి.మీ. నుంచి 21,179 చ.కి.మీ.లకు విస్తరించింది.
- దేశవ్యాప్తంగా హైడ్రో, థర్మల్, న్యూక్లియర్, పునరుత్పాదక శక్తి వనరుల ద్వారా 1947లో 4,073 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కాగా, 2023-24 నాటికి 17,34,375 గిగావాట్లకు పెరిగింది. ఇందులో అత్యధికంగా 13,26,549 గిగావాట్లు థర్మల్ విద్యుత్ ఉంది.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తీవ్ర ఆందోళనకరం

- చంద్రబాబు కూటమి ప్రభుత్వ విధానాలను కడిగి పారేసిన వైఎస్ జగన్



సాక్షి, అమరావతి: చంద్రబాబు కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తీవ్ర ఆందోళనకరంగా మారిందని.. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదికలే అందుకు నిదర్శనమని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎత్తిచూపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కూటమి ప్రభుత్వం చెప్పేదానికి పూర్తి విరుద్ధంగా కాగ్ నివేదికలు వాస్తవాలను వెల్లడిస్తున్నాయని చెప్పారు. ఆర్థిక పరిస్థితిపై రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రకటనలు.. కాగ్ నివేదికల్లో వాస్తవాలను ఉటంకిస్తూ శనివారం ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఆ పోస్టులో ఏమన్నారంటే

- కాగ్ 2025 ఏప్రిల్‌కు సంబంధించి కీలక సూచికలను వెల్లడించింది. ఈ గణాంకాలను పరిశీలిస్తే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తీవ్ర ఆందోళనకరంగా ఉందన్నది స్పష్టమవుతోంది. జీఎస్టీ ప్రవేశపెట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు 2025 ఏప్రిల్‌లో నికర జీఎస్టీ వసూళ్లు అత్యధికంగా రూ.3,354 కోట్లు ఉన్నట్లుగా మే 1న ప్రభుత్వం పత్రిక ప్రకటన విడుదల చేసింది.
- కానీ.. కాగ్ నివేదికలో వాస్తవ లెక్కలను పరిశీలిస్తే రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన లెక్క అబద్ధమని తేల్చింది. 2024 ఏప్రిల్‌తో పోల్చితే, 2025 ఏప్రిల్‌లో రాష్ట్ర ప్రభుత్వ జీఎస్టీ ఆదాయం ఏకంగా 24.20 శాతం తగ్గింది. కాగ్ వాస్తవాలను బట్టబయలు చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పూరితంగా వ్యవహరించింది. ఏప్రిల్‌కు సంబంధించిన జీఎస్టీ ఆదాయాలు చెప్పకుండా, మేలో జీఎస్టీ ఆదాయాలు రికార్డు స్థాయిలో పెరుగుతాయంటూ రాష్ట్ర ప్రభుత్వం మరో పత్రికా ప్రకటనను విడుదల చేసింది.
- కేంద్ర ప్రభుత్వం 2025 ఏప్రిల్‌కు సంబంధించి ఐజీఎస్టీ ముందస్తు సర్దుబాట్ల కారణంగా రాష్ట్ర జీఎస్టీ ఆదాయాలు రూ.796 కోట్లు తగ్గాయని ఆ పత్రికా ప్రకటనలో ప్రభుత్వం పేర్కొంది. ఐజీఎస్టీ ముందస్తు సర్దుబాట్లను మైనర్ హెడ్ 110 కింద లెక్కిస్తారు. ప్రభుత్వ ఖాతాల మేజర్ హెడ్ 0006 కింద ఎస్‌జీఎస్టీని లెక్కిస్తారు. ఇది ఒక సాధారణ ప్రక్రియ. ఈ సర్దుబాట్లన్నింటినీ లెక్కించిన తర్వాతే నికర జీఎస్టీ ఆదాయాలను లెక్కకడతారు.
- 2025 ఏప్రిల్‌కు సంబంధించి నికర జీఎస్టీ ఆదాయం రూ.3,354 కోట్లుగా ఉన్నట్లు మే 1న పత్రికా ప్రకటన విడుదల చేసిన ప్రభుత్వం.. ఇపుడు సర్దుబాట్లు కారణంగా రూ.796 కోట్ల ఆదాయం తగ్గిందని చెబుతోంది. కానీ, జీఎస్టీ ఆదాయాల గురించి కాగ్ నిజాలను వెలుగులోకి తేగానే.. దాన్ని కప్పిపుచ్చేందుకు ప్రభుత్వం ఇలాంటి ప్రకటనలు చేస్తోంది.
- టీడీపీ ప్రభుత్వం చెప్పేదానికి పూర్తి విరుద్ధంగా కాగ్ నివేదికలు వాస్తవాలను వెల్లడిస్తున్నాయి. దీన్ని బట్టి చూస్తే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మందగమనంలో ఉంది.



జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన మాదిగ సామాజికవర్గ శాసనసభ్యులు

ముగ్గురా.. నలుగురా?

▶ మొదటి పేజీ తరువాయి

అందలేదు. దీంతో అసలు విస్తరణ ఉంటుందా? ఉండదా? ఉంటే ఎన్ని బెర్తులు భర్తీ చేస్తారన్న దానిపై ఉత్కంఠ వీడలేదు. శనివారం అర్ధరాత్రి ఈ అంశంపై స్పష్టత వచ్చింది. మంత్రివర్గ విస్తరణకు ఏర్పాట్లు చేయాలని జీఏడీ నుంచి గవర్నర్ కార్యాలయానికి సమాచారం అందించారు. దీంతో నేటి మంత్రివర్గ విస్తరణ కార్యక్రమానికి ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి.

అందుబాటులో ఉండండి: కేబినెట్ విస్తరణపై ఊహాగానాలు రేగిన నేపథ్యంలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు శనివారం సాయంత్రం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మందుల సామేలు, కాలె యాదయ్య, వేముల వీరేశంలు సీఎం రేవంత్‌ను కలిసి తమ సామాజిక వర్గానికి కేబినెట్‌లో స్థానం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు స్పందించిన రేవంత్.. కేబినెట్ విస్తరణ ఎప్పుడైనా జరగొచ్చని, ఆదివారం ఐదుగురు హైదరాబాద్‌లోనే అందుబాటులో ఉండాలని సూచించారు. మరోవైపు అధిష్టానానికి తాను ప్రతిపాదనలు మాత్రమే పంపగలనని, తుది నిర్ణయం ఢిల్లీ పెద్దలదేనని ఆ ఎమ్మెల్యేలతో సీఎం చెప్పినట్టు సమాచారం.

పాలమూరు.. ఎవరికి వారు

▶ మొదటి పేజీ తరువాయి

ఉంది. మక్తల్ నియోజకవర్గంలో కూడా పార్టీ నేతలు సామాజిక వర్గాల వారీగా చీలిపోయారని, ఈ నేపథ్యంలోనే స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మంత్రి పదవి ఇవ్వొద్దంటూ పోస్టర్లు కూడా వేశారని తెలుస్తోంది.

అవిగో నష్టాలు... ఇవిగో ఆధారాలు

నాగర్‌కర్నూల్ జిల్లాలో బీఆర్‌ఎస్ సెగ కాంగ్రెస్‌ను గట్టిగానే తాకుతోంది. ఇప్పటికే గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరడం ఆ నియోజకవర్గంలో తీవ్ర విభేదాలకు దారితీస్తోంది. దీనికి తోడు తాజాగా ఆలంపూర్ ఎమ్మెల్యే విజయుడుని ఇటీవల కాంగ్రెస్ ఎంపీ మల్లురవి సత్కరించడం దుమారానికి దారితీసింది. ఈ విషయమై ఆలంపూర్ నియోజకవర్గ మండల కాంగ్రెస్ అధ్యక్షులు, ఇతర నేతలు కలిపి 26 మంది రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌కు ఫిర్యాదు చేశారు. నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి, మాజీ జెడ్పీ చైర్మన్ సరితా తిరుపతయ్య, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి కలిసి అటు ఆలంపూర్‌లోనూ, ఇటు జోగుళాంబ గద్వాల జిల్లాలోనూ పార్టీకి నష్టం చేస్తున్నారని సంతకాలు చేసి మరీ ఫిర్యాదు చేశారు. బీఆర్‌ఎస్ నాయకులకు చెందిన పెండింగ్ బిల్లులను మంజూరు చేయించి 10 శాతం కమీషన్ తీసుకున్నారంటూ మల్లురవిపై ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. ఇక, కాంగ్రెస్ కేడర్ అడుగుతున్న విధంగా ఆలంపూర్ నియోజకవర్గంలో మల్లమ్మకుంట ప్రాజెక్టును కాకుండా బీఆర్‌ఎస్ నేతల మాటలు విని చిన్నోనిపల్లి రిజర్వాయర్‌ను తెరపైకి తెచ్చి కాంగ్రెస్ ప్రతిష్టను దెబ్బతీస్తున్నారని కూడా ఆరోపించారు. ఈ మేరకు ఇటీవలే టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా నియమితులైన మల్లురవి మీదనే కాంగ్రెస్ ఇన్‌చార్జికి లిఖితపూర్వక ఫిర్యాదు ఇవ్వడం గాంధీభవన్ వర్గాల్లో చర్చకు దారితీసింది.

మంత్రులకు... మేం తక్కువా?: పాలమూరు జిల్లా ఎమ్మెల్యేలు ఓ విచిత్ర డిమాండ్‌ను తెరపైకి తెస్తూ మంత్రివర్గాన్నే సవాల్ చేస్తున్నారు. మంత్రులకంటే తామేం తక్కువ కాదని, మంత్రుల నియోజకవర్గాలకు ఎన్ని నిధులిస్తారో అన్ని నిధులు తమ నియోజకవర్గాలకూ ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల రెండు దఫాలుగా వారు మీనాక్షి నటరాజన్‌ను కలిసి ఈమేరకు వినతిపత్రం కూడా ఇచ్చారు. మంత్రులతో సమానంగా నిధులివ్వాలని అడిగినట్టు స్వయంగా వారు మీడియాకు వెల్లడించడం గమనార్హం. గాంధీభవన్‌లో జరిగిన లోక్‌సభ నియోజకవర్గ సమీక్షలోనూ వారు ఇదే అంశాన్ని ప్రస్తావించినట్టు తెలిసింది. అదే విధంగా పాలమూరు లోక్‌సభ పరిధిలోని ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు కూడా తమకు సహకరించడం లేదంటూ వారు కొత్త రాగాన్ని అందుకోవడం గమనార్హం. ఈవిధంగా సొంత పార్టీ నేతలతో, ఇతర పార్టీల నాయకులతో, మంత్రులతో, అధికారులతో పంచాయతీలు పెట్టుకుంటూ ముందుకుసాగుతున్న ఉమ్మడి పాలమూరు కాంగ్రెస్ రాజకీయం ఎటువైపునకు దారితీస్తుందో వేచిచూడాల్సిందే!

రికార్డుల్లో మూత.. రికార్డు స్థాయి మేత

మెదక్ జిల్లాలో మైనింగ్ మాఫియా మాయాజాలం..

మెదక్ జోన్: ప్రభుత్వానికి అత్యధిక ఆదాయం సమకూర్చే విభాగాల్లో గనుల శాఖ కీలకమైంది. విలువైన ప్రకృతి వనరులను అక్రమార్కులు తరలించుకుపోకుండా చూడగలిగితే సర్కారు ఖజానాకు మంచి ఆదాయం సమకూరుతుంది. కానీ, మెదక్ జిల్లాలో కొందరు అధికారుల నిర్లక్ష్యం అటు వనరుల దోపిడీకి బాటలు వేస్తూ, ఇటు సర్కారు ఖజానాకు గండి కొడుతోంది. క్వారీల లైసెన్సులను రెన్యువల్ చేయకుండానే యథేచ్ఛగా విలువైన ఖనిజాలను మాయం చేస్తున్నారు. ప్రభుత్వ రికార్డుల్లో మాత్రం క్వారీల్లో తవ్వకాలే జరపటం లేదని రాసేస్తున్నారు.

గుట్టుగా గుట్టలు మాయం


అధికారిక లెక్కల ప్రకారం మెదక్ జిల్లా వ్యాప్తంగా 40 మైనింగ్ యూనిట్లు కొనసాగుతున్నాయి. వాటిలో 30 వరకు కంకర మెషీన్లు కాగా మరో 10 తెల్లరాయి క్వారీలు. వీటిలో చాలావరకు 20 ఏళ్ల నుంచి కొనసాగుతున్నాయి. నిబంధనల ప్రకారం కంకర మెషీన్లకు అనుమతి కోసం స్థానిక తహసీల్దార్ నుంచి ఏటీసీ సర్టిఫికెట్ తీసుకోవాలి. అలాగే పర్యావరణ సర్టిఫికెట్ (ఈసీ) సైతం తీసుకోవాల్సి ఉంటుంది. అనంతరం హెక్టారుకు ఏడాదికి రూ.లక్ష చొప్పున ప్రభుత్వానికి లైసెన్స్ ఫీజు చెల్లించాలి. అది కాకుండా టన్ను కంకర ఉత్పత్తి చేస్తే వివిధ పన్నుల రూపంలో మైనింగ్‌శాఖకు రూ.65 చొప్పున చెల్లించాలి. తెల్లరాయి తవ్వకాల కోసం సైతం అన్నిరకాల అనుమతులు తీసుకుని ఏడాదికి హెక్టారుకు రూ.40 వేల చొప్పున ప్రభుత్వానికి ఫీజు చెల్లించాలి. టన్ను రాయి తవ్వితే పన్నుల కింద మైనింగ్‌శాఖకు రూ.168 చొప్పున చెల్లించాలి. మైనింగ్ (క్వారీ) కోసం తీసుకున్న లైసెన్సును ఏటా ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు చెల్లించి రెన్యువల్ చేసుకోవాలి. సదరు కాంట్రాక్టర్లు వీటిని సక్రమంగా చెల్లిస్తున్నారా లేదా? అనే అంశాన్ని మైనింగ్ అధికారులు నిరంతరంగా పర్యవేక్షించాలి. అయితే, 16 క్వారీల యజమాన్యాలు ఏళ్లుగా లైసెన్సులు రెన్యువల్ చేసుకోకుండానే గుట్టుగా తవ్వకాలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ క్వారీలను మూసివేసినట్లు అధికారులు రికార్డుల్లో నమోదుచేసి ప్రభుత్వాన్ని తప్పు దోవ పట్టించారు. అధికారుల అండ లభించటంతో కాంట్రాక్టర్లు యథేచ్ఛగా తవ్వకాలు నిర్వహిస్తూ ప్రభుత్వానికి పన్నులు ఎగ్గొట్టి అడ్డదారుల్లో కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారు.

అక్రమ తవ్వకాలపై చర్యలు తప్పవు..

క్వారీలకు ఏటా లైసెన్స్‌లను రెన్యువల్ చేసుకోవాలి. రెన్యువల్ చేయకుండా నడిపితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. - లక్ష్మీనారాయణ, మైనింగ్ విభాగం ఆర్‌ఐ, మెదక్

టామ్‌కామ్ ద్వారా గ్రీస్‌కు వీసాలు

- మధ్యవర్తిత్వం వహిస్తున్న ప్రభుత్వరంగ సంస్థ... అవకాశం సద్వినియోగం చేసుకోవాలని అధికార యంత్రాంగం సూచన



మోర్తాడ్ (బాల్కొండ): రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థ తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) గ్రీస్‌లో ఉపాధి కల్పించడానికి వీసాలు జారీ చేయించే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. గల్ఫ్ తదితర దేశాల్లోని కంపెనీలతో ఒప్పందాలను కుదుర్చుకుని వలస కార్మికులకు వీసాలు ఇప్పించిన టామ్‌కామ్, తాజాగా గ్రీస్‌లోని కొన్ని కంపెనీలతో అంగీకారం కుదుర్చుకుంది. విదేశాల్లో ఉపాధి పొందాలనుకునే యువతనుంచి వీసాల పేరిట భారీ మొత్తంలో దండుకుని కొందరు మోసాలకు పాల్పడుతున్నారు. అలాంటివారికి చెక్ పెట్టాలనే ఉద్దేశంతో టామ్‌కామ్ ద్వారా వీసాల జారీకి రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవడం గమనార్హం. గ్రీస్‌లో ఫోర్క్ లిఫ్ట్ ఆపరేటర్, ఎలక్ట్రికల్ మెయింటెనెన్స్ టెక్నీషియన్, ప్రొడక్షన్ మెకానిక్ ఆపరేటర్, ప్లంబర్, ఎలక్ట్రికల్ ఇంజనీర్, మెకానికల్ ఇంజనీర్ పోస్టులను భర్తీ చేయనున్నారు. పరిశ్రమలలో వెల్డింగ్ రంగంలో ప్రావీణ్యం ఉన్నవారికి ఉపాధి కల్పించనున్నారు. ఆయా రంగాల్లో ఐటీఐ, డిప్లొమా, ఇంజనీరింగ్ చదువుకున్నవారు, ఆంగ్లభాషపై పట్టు ఉన్నవారికి వీసాలు జారీ చేసే అవకాశం ఉందని టామ్‌కామ్ జనరల్ మేనేజర్ భారతి తెలిపారు. ఉద్యోగాన్ని బట్టి వేతనం మన కరెన్సీలో రూ.81 వేల నుంచి రూ.1.25 లక్షల వరకూ ఉంటుందని తెలిపారు. ఉచిత నివాసం, భోజన సదుపాయం కంపెనీలు కల్పిస్తాయని చెప్పారు. 21 నుంచి 45 ఏళ్ల లోపు వయసు ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది. వివరాల కోసం టామ్‌కామ్ కార్యాలయం లేదా మొబైల్‌లో టామ్‌కామ్ యాప్‌లోనూ సంప్రదించవచ్చు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులైన సాంకేతిక నిపుణులు సద్వినియోగం చేసుకోవాలని టామ్‌కామ్ అధికార యంత్రాంగం సూచించింది.

రెండున్నరేళ్లలో 2 ఎయిర్‌పోర్టులు

▶ మొదటి పేజీ తరువాయి

పట్టణ శివారు శాంతినగర్‌లో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ (ఐఏఎఫ్) ఆధ్వర్యంలో ఉన్న హెలిపోర్టుల స్థానంలో ఈ కొత్త విమానాశ్రయాలు నిర్మాణం కాబోతున్నాయి. ఈ సంవత్సరం చివరికల్లా టెండర్లు పిలిచి నిర్మాణ పనులు చేపట్టేందుకు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) చర్యలు ప్రారంభించింది. దాదాపు వేయి ఎకరాల విస్తీర్ణంలో వరంగల్ విమానాశ్రయాన్ని స్వయంగా ఏఏఐ నిర్మించనుండగా, ఆదిలాబాద్ విమానాశ్రయం విషయంలో తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

నైట్ ల్యాండింగ్.. బోయింగ్ 737కు సరిపడా రన్‌వే..

ఈ విమానాశ్రయాలను ఆధునిక ఎయిర్‌పోర్టులుగా నిర్మించనున్నారు. సాధారణంగా విమానాశ్రయాలు నిర్మించేటప్పుడు తొలుత చిన్న విమానాలు దిగేలా రూపొందించి, భవిష్యత్తులో వాటిని విస్తరిస్తారు. కానీ, వీటిని ఒకేసారి పెద్ద విమానాశ్రయాలుగానే నిర్మించాలన్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపాదనకు ఏఏఐ సమ్మతించింది. రాత్రివేళ కూడా విమానాలు వచ్చిపోయే వసతులుండాలని సీఎం కోరగా, దానికీ ఓకే చెప్పింది. బోయింగ్ 737, ఎయిర్‌బస్ 320 లాంటి పెద్ద విమానాలు కూడా వచ్చిపోయేందుకు వీలుగా దాదాపు 3 వేల మీటర్ల పొడవైన రన్‌వేలను నిర్మించనున్నారు. నైట్‌ల్యాండింగ్, టేకాఫ్‌కు వీలుగా ఆధునిక మెకానిజం ఏర్పాటు చేయనున్నారు.

- వరంగల్ ఎయిర్‌పోర్టు వేయి ఎకరాల్లో, ఆదిలాబాద్ విమానాశ్రయం 600 ఎకరాల విస్తీర్ణంలో రూపొందుతాయి. ఒక్కో విమానాశ్రయం నిర్మాణానికి రూ.500 కోట్ల నుంచి రూ.600 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా.
- ఒకేసారి 500 మంది ప్రయాణించేలా వీటిని నిర్మిస్తున్నారు. ఉడాన్ రీజినల్ కనెక్టివిటీ స్కీంతో వీటిని అనుసంధానిస్తారు. మూడేళ్లపాటు వయబిలిటీ గ్యాప్ ఫండ్‌ను కేంద్రం అందిస్తుంది. విమానాశ్రయ నిర్వహణ వ్యయంలో కేంద్రం 80 శాతం, రాష్ట్రం 20 శాతం భరిస్తాయి.

వరంగల్‌లో చకచకా భూ సేకరణ

నిజాం కాలంలో మామునూరులో ఎయిర్‌స్ట్రిప్ నిర్మించారు. ఇక్కడ 1,400, 1,000 మీటర్ల వెడల్పుతో రెండు శిథిల రన్‌వేలున్నాయి. ఇప్పుడు వీటి స్థానంలో 3 వేల మీటర్ల భారీ రన్‌వే రూపొందనుంది. పాత ఎయిర్‌స్ట్రిప్‌నకు సంబంధించి ఏఏఐ అధీనంలో 696.14 ఎకరాల భూమి ఉంది. ప్రతిపాదిత భారీ విమానాశ్రయానికి మరో 280 ఎకరాల భూమి అవసరం. సమీపంలో ఉన్న రెండు ఊళ్లను ఖాళీ చేయించి ఆ భూమిని సేకరించే కసరత్తు ప్రారంభించారు. ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం రూ.200 కోట్లను ఇందుకోసం విడుదల చేసింది. ప్రస్తుతం అధికారులు ఆ రెండు గ్రామాల ప్రజలను ఒప్పించే పనిలో ఉన్నారు. సమీపంలోని ప్రభుత్వ భూమిని పరిహారంగా నిర్వాసితులకు ఇవ్వనున్నారు. దీనికి సంబంధించి రెండు ప్రణాళికలు రూపొందించారు. గ్రామస్తులు ఎంచుకున్న దానికి అమలు చేయనున్నారు. వరంగల్-ఖమ్మం, మరో రోడ్డును దారి మళ్లించనున్నారు.

ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు ఎన్‌ఓసీ

నిజాం హయాంలో ఆదిలాబాద్ పట్టణ శివారులోని శాంతినగర్‌లో చిన్న ఎయిర్‌స్ట్రిప్ సేవలందించింది. ప్రస్తుతం అది ఐఏఎఫ్ అధీనంలో ఉంది. అక్కడ రన్‌వే బదులు హెలిప్యాడ్ మాత్రమే ఉంది. దీన్ని ప్రస్తుతం హెలిపోర్టుగా వినియోగిస్తున్నారు. దీన్ని భవిష్యత్తులో ఎయిర్‌ఫోర్స్ జెట్ల వినియోగానికి వీలుగా అభివృద్ధి చేయాలని చాలాకాలంగా ఐఏఎఫ్ ప్రయత్నిస్తోంది. తాజా నిర్ణయంలో ఆ కల సాకారం కానుంది. ఇందుకు సమ్మతిస్తూ తాజాగా ఐఏఎఫ్ ఎన్‌ఓసీ జారీ చేసింది. ప్రస్తుతం ఎయిర్‌ఫోర్స్ అధీనంలో 369 ఎకరాల భూమి ఉంది. మరో 250 ఎకరాలు సేకరించి విమానాశ్రయం నిర్మించనున్నారు. రెండు విమానాశ్రయాలను 24 నెలల్లో సిద్ధం చేయనున్నట్టు తాజాగా ఏఏఐ పేర్కొంది. అయితే, 18 నెలల్లో పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి లేఖ రాశారు. దీంతో రెండేళ్లలోపు అవి సిద్ధమవటం ఖాయంగా కనిపిస్తోంది.



పక్షి చూడుచుండగా వల వేయుట వ్యర్థము.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ మాసం, **తిథి:** శు.ద్వాదశి ఉ.6.52 వరకు, తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** స్వాతి ప.12.44 వరకు, తదుపరి విశాఖ, **వర్జ్యం:** రా.6.57 నుండి 8.43 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.46 నుండి 5.38 వరకు, **అమృత ఘడియలు:** సా.4.43 నుండి 5.41 వరకు, మృగశిర కార్తె ప్రారంభం.

సూర్యోదయం : 5.28
సూర్యాస్తమయం : 6.29
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

వ్లాదిమిర్ పుతిన్ (రష్యా అధ్యక్షుడు)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

"... ఆమె ఎందుకు వెళ్లాల్సి వచ్చిందో నాకు తెలియదు/నేను చేసిన తప్పేమిటో ఆమె చెప్పదు/ఇప్పుడు నేను నిన్నటి కోసం ఆరాట పడుతున్నాను..."

బీటిల్స్‌లో నాకిష్టమైన 'ఎస్టర్‌డే' సాంగ్!

"... ప్రేమ చాలా సులభంగా తనలో దాచేసుకుంటుంది/ఇప్పుడు నా ప్రేమను దాచటానికి ఒక స్థలం కావాలి/నాకు నిన్నటి రోజే బాగుంది..."

ఓహ్... పాల్ మెక్కార్ట్నీ!! ప్రాణం తీస్తున్నాడు. అతడింకా ఎందుకు బతికే ఉన్నట్లు? ఇంత గొప్ప పాటను రాశాక కూడా అతడికి ఇక్కడేం పని, ఈ భూమ్మీద?!

"మిస్టర్ ప్రెసిడెంట్... మిస్టర్ ప్రెసిడెంట్... మీ కాల్‌తో కనెక్ట్ అవటం కోసం మిస్టర్ ట్రంప్ వేచి ఉన్నారు..." – నికోలాయ్ పాత్రుషేవ్! నేషనల్ సెక్యూరిటీ అడ్వైజర్.

"మే బీ, లిటిల్ లేటర్... కనీసం ఈ పాట అయ్యేంతవరకు..." అన్నట్లు సైగ చేశాను.

"... అకస్మాత్తుగా నేను గతంలో ఉన్న మనిషిలో సగం అయ్యాను/నా పైన ఒక నీడ వేలాడుతోంది/నాకు నిన్నటి రోజే బాగుంది."

ఏం రాశావురా నాయనా మెక్కార్ట్నీ?!



మళ్లీ ట్రంప్ ఫోన్!

కొద్దిసేపైనా ఆగలేరా ఈయన?! 'ఎస్టర్‌డే'ని పాజ్‌లో పెట్టి ఫోన్ అందుకున్నాను.

"హో హో... ట్రయింగ్ సిన్స్ ఎస్టర్ డే మిస్టర్ పుతిన్" అన్నారు ట్రంప్.

పెద్దగా నవ్వాను. "నేను కూడా నిన్నట్నుంచీ 'ఎస్టర్‌డే' లోనే ఉన్నాను మిస్టర్ ట్రంప్" అన్నాను.

"గాట్ ఇట్. బీటిల్సే కదా? పాల్ మెక్కార్ట్నీ సాంగ్! అంత బుద్ధిహీనుడిని నేను ఇంత వరకూ చూళ్లేదు. 'విడిపోయిన తర్వాత ఏమిటి? ఎలా?' అని పెళ్లికి ముందే కాబోయే భార్యతో అగ్రిమెంట్ రాసుకోవాలన్న కనీస జ్ఞానం కూడా లేదు అతడికి" అన్నారు ట్రంప్.

"ప్రేమ రాహిత్యపు పరితపనను సృష్టించ టానికి కావలసింది బుద్ధిహీనతే అయితే అలాంటి బుద్ధిహీనతకు నా మనసును పదే పదే పారేసుకుంటాను మిస్టర్ ట్రంప్" అన్నాను నవ్వుతూ.

"బీటిల్స్ నాకు బోరింగ్. మళ్లీ 'రోలింగ్ స్టోన్స్' బ్యాండ్ నచ్చుతుంది. వాళ్లదొక సాంగ్ ఉంది. ఏమిటదీ... ఆ – యూ కాంట్ ఆల్వేస్... 'నువ్వు కోరుకుంటున్న దానిని నువ్వు ఎల్లవేళలా పొందలేవు'..." అన్నారు ట్రంప్.

"లోతుల నుంచి 'ఎస్టర్‌డే', 'యూ కాంట్ ఆల్వేస్...' రెండూ ఒకటే మిస్టర్ ట్రంప్! పోగొట్టుకున్నది తిరిగి పొందలేం, కోరుకున్న ప్రతిసారీ దక్కించుకోలేం..." అన్నాన్నేను.

హఠాత్తుగా క్రెమ్లిన్ ప్యాలెస్ కదిలి పోయేంత టెరిఫిక్‌గా నవ్వారు ట్రంప్!

"ఏమైంది మిస్టర్ ట్రంప్?" అని అడిగాను.

"ఏం లేదు మిస్టర్ పుతిన్! మీరు ఉక్రెయిన్‌ను పక్కన పెట్టేసి... బీటిల్స్ అంటున్నారు. నేను ఎలాన్ మస్క్‌ను తప్పించు కుని వచ్చి... రోలింగ్ స్టోన్స్ అంటున్నాను" అన్నారు ట్రంప్, నవ్వు ఆపకుండానే!

"అవును కదా!!" అని నేనూ నవ్వాను.

"సరే, ఇది చెప్పండి. 'నిన్నటి కోసం' మీరెందుకు అంతగా ఆరాటపడుతున్నారు? ఎవరా స్వీట్‌హార్ట్?" అని అడిగారు ట్రంప్!

ట్రంప్ అలా అడగటం నాకు నచ్చింది. నిజానికి కూడా, ఎవరైనా అలా తమ పరిధిని దాటి లోపలికి చొరబడినప్పుడే మన మనసుకు దగ్గరగా అనిపిస్తారు.

"ఎవరా స్వీట్‌హార్ట్ మిస్టర్ పుతిన్?" – మళ్లీ అడిగారు ట్రంప్.

"ఎవరూ లేరు. ఆ పాట ఇష్టం. అంతే..." అన్నాను నవ్వుతూ.

ట్రంప్ ఫోన్ పెట్టేశాక, 'ఎస్టర్‌డే' పాజ్ తీసి, తిరిగి ప్లే చేశాను.

మరియా ఇవనోవ్నా నా స్వీట్‌హార్ట్! నా ఆకలి తీర్చే కొన్ని రొట్టె ముక్కల కోసం సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో చెమటోడ్చి వీధులు ఊడ్చిన ఇవనోవ్నా! నేను చేసిన తప్పేమిటో చెప్పకుండా చిన్న ముద్దును నాకు శిక్షగా విధించి నన్ను చేతుల్లోకి ఎత్తుకున్న మా అమ్మ ఇవనోవ్నా!

ఈ పతనం ఏ లోతుల్లోకి?

జనతంత్రం



వర్ధెల్లి మురళి

కమ్మ కులంలో పుట్టిన వ్యక్తి వైసీపీలో ఎలా ఉంటాడు? ఇది చట్ట విరుద్ధమైన చర్యగా కనిపించింది ఒక డీఎస్పీకి. ఇటువంటి సంఘ విద్రోహ చర్యలను అస్సలు క్షమించలేని సదరు డీఎస్పీ అటువంటి ఒక వ్యక్తికి తనదైన ట్రీట్‌మెంట్ ఇప్పించారు. పల్నాడు జిల్లాకు చెందిన లక్ష్మీనారాయణ అనే ఆ వ్యక్తి పోలీసు వేధింపులను తట్టుకోలేక ఆత్మహత్యా ప్రయత్నం చేశాడు. గుంటూరులో పని చేసే ఒక పోలీసు ఇన్‌స్పెక్టర్‌కు ప్రతిపక్ష రాజకీయ నేతల ముఖాల్లో శత్రుదేశం సైనికులు కనిపిస్తారట! ఆ నేత ఏ స్థాయి వాడైనా సరే! మొన్న ఏదో నిరసన కార్యక్రమంలో వైసీపీ నేత అంబటి రాంబాబు ఆ ఇన్‌స్పెక్టర్‌కు ఎదురుపడ్డారు. శత్రు సైనికుడిని చూసిన ఆగ్రహం ఆ పోలీసును ఆవహిం చింది. తక్షణమే పళ్ళు పటపట కొరుకుతూ, గుడ్లను గుర్రున ఉరుముతూ రాంబాబుపై ఆ పోలీసాయన లంఘిస్తున్న విజు వల్స్ టీవీల్లో కనిపించాయి.

తెనాలి ఘటన తెలిసిందే! ఓ మఫ్టీ కానిస్టేబుల్‌కూ, ముగ్గురు యువకులకూ ఏదో ఒక చిన్న వివాదం జరిగింది. ఈ మఫ్టీ కానిస్టేబుల్ మీద ఆ ప్రాంతంలోని పోలీస్ స్టేషన్ జవాన్లం దరికీ ప్రత్యేకమైన అభిమానం ఉంటుందట! ఈ మఫ్టీ బ్యాచ్ సివిల్ డ్రెస్‌లో ఉంటూనే, లా అండ్ ఆర్డర్‌ను చక్కబెరుస్తూ, పోలీసు సహచరులకు అవసరమైన ఏర్పాట్లు చేస్తుంటారట! అటువంటి మఫ్టీ కానిస్టేబుల్‌ను అనామక యువకులు ప్రశ్నించ డమేమిటి? అందులో దళితులు! ఆ యువకులు కట్టు తప్పారని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. వాళ్లకు బుద్ధి చెప్పాలని నిర్ణయానికి వచ్చారు. భారత న్యాయ సంహితలోని తమకు తోచిన సెక్షన్లన్నింటితో కేసులు పెట్టారు. నడిరోడ్డు మీద వారిని పడుకోబెట్టి అరికాళ్ళపై బెత్తాలతో చావబాది ఆటవిక న్యాయాన్ని అమలు చేసిన తీరు నాగరిక సమాజాన్ని నివ్వెర పరిచింది.

కూటమి ప్రభుత్వం పోలీసు యంత్రాంగాన్ని ప్రైవేటు సైన్యంగా మార్చేసిన ఫలితం ఇది. స్వామికార్యంతో పాటు స్వకార్యం చక్కబెట్టుకోవచ్చు అనుకునే కొందరు పోలీసులకు ఈ విధానం బాగా నచ్చినట్టుంది. పొలిటికల్ బాసులను సంతృప్తి పరుస్తూనే సొంత పనులు చేసుకుంటున్నారు. పొలిటికల్ బాసులు ఏం చేసినా, ఏం చెప్పినా చిత్తం అనే స్థాయికి కొందరు దిగజారిపోయారు. అనంతపురం జిల్లాలో ఒక దళిత బాలికను బెదిరిస్తూ 14 మంది పాలక పార్టీ అనుయాయులు ఆరు మాసా లుగా అత్యాచారం చేస్తున్న పైశాచిక ఉదంతం ఇప్పుడు వెలుగులోకి వచ్చింది. సాక్షి మీడియా ద్వారా ఈ దారుణం వెలుగు చూసేంత వరకు పోలీసులు కళ్ళు మూసుకుని కూర్చో వడం క్షమించరాని నేరం. ఇప్పుడు కూడా కేసును పలుచన చేసేటందుకు పొలిటికల్ బాసులు ప్రయత్నిస్తున్నారని వార్తలు వస్తున్నాయి. అదే నిజమైతే ఈ కేసు పోలీసు యంత్రాంగానికి ఒక శీలపరీక్ష లాంటిదే! వైఎస్సార్ జిల్లాకు చెందిన ఓ మంత్రి సతీమణి పోలీసులను అడిగి మరి సెల్యూట్ కొట్టించుకుం టున్నదనే వార్తలు కూడా విన్నాము. పోలీసు యంత్రాంగం పట్ల కూటమి నేతల ప్రవర్తన అది.

ఏడాది కూటమి పాలనలోని అవినీతి గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదేమో! గల్లీగల్లీలో గంజాయి, చీప్ లిక్కర్ల కంపుతో అవినీతి పోటీపడుతున్నది. కడప జిల్లా టీడీపీ నాయకుడు ఒకరు బహిరంగ సమావేశంలో మాట్లాడిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరలయ్యింది. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సహా ఛోటామోటా అధికార పదవుల్లో ఉన్నవాళ్లు



తమ ఖాళీ లెటర్ హెడ్‌పై సంతకం చేసి ఇచ్చినందుకు పాతిక, ముప్పై వేల నుంచి ఐదు లక్షల వరకు వసూలు చేస్తున్నారని ఆ నాయకుడు ఆరోపించారు. చిన్నచిన్న రికమండేషన్లకు కూడా వెలకట్టి వసూలు చేస్తున్న సంస్కృతిని రాష్ట్రమంతటా ప్రవేశ పెట్టారట! ఆ మధ్య ఓ యెల్లో పత్రికలోనే ఇటువంటి వార్త ఒకటి వచ్చింది. గోదావరి జిల్లాలోని ఒక ఎమ్మెల్యే స్థానిక ఎమ్మార్వోకు తన లెటర్ హెడ్ పుస్తకాన్ని ఇచ్చి, దీని ద్వారా తిరుపతి దర్శనం రికమండేషన్లు అమ్మి తనకు నెలకో లక్ష రూపాయలు జమ కట్టాలని ఆర్డర్ వేశారని ఆ పత్రిక రాసింది. ప్రజా ప్రతినిధులు తమ ప్రాంతంలోని రెవెన్యూ, పోలీసు అధికారులకు టార్గెట్లు పెట్టి మరీ నెల మామూళ్లు వసూలు చేసి ఇవ్వాలని వేధిస్తున్న ఒక విచిత్ర పరిణామం ఈ ఏడాదిలో ఏపీ అంతటా వ్యాపిం చింది. ప్రజలకు సేవకులుగా ఉండాల్సిన ప్రతినిధులు ప్రతి చిన్న పనికీ, ప్రతి చిన్న రికమండేషన్‌కూ కూడా వెలకట్టి వసూలు చేస్తున్న ప్రజాస్వామ్యం రాష్ట్రంలో అమలవుతున్నది.

నాయకుని స్థాయిని బట్టి అవినీతిస్థాయి కూడా పెరుగు తుంది. ఇసుక దోపిడీ, మట్టి దోపిడీ ఎక్కడ చూసినా కనిపిస్తున్నది. మద్యం మామూళ్లు ప్రజాప్రతినిధులకు హక్కు భుక్తంగా మారాయి. ఇవి చాలదన్నట్టు దర్జాగా భూకబ్జాలు అడ్డూ అదుపూ లేకుండా కొనసాగుతున్నాయి. విజయవాడ నగరం నడిబొడ్డున అర్ధ శతాబ్దానికి పైగా చరిత్ర కలిగిన శాతవాహన కాలేజీ స్థలం ఆక్రమణ కోసం జరుగుతున్న రౌడీయిజం తాజా ఉదాహరణ. సాక్షాత్తూ పాలక పార్టీ ఎమ్మెల్సీ ఆలపాటి రాజా తనను కిడ్నాప్ చేశారని కళాశాల ప్రిన్సిపాల్ ఆరోపించారు. అయినా చట్టం స్పందించలేదు. అర్ధరాత్రి పూట బందిపోటు దొంగల మాదిరిగా కళాశాల షెడ్లను కూల్చివేశారు. లాఠీలు కదల్లేదు. ప్రతిపక్ష కార్యకర్తల మీద, సామాన్య ప్రజల మీద జులుం చూపిస్తున్న పోలీసు యంత్రాంగం, అధికార పార్టీ పెద్దలు బడిని మింగినా, గుడిని మింగినా చోద్యం చూడటానికే పరిమితమైపోతున్నారు. పోలీసు యంత్రాంగాన్ని ప్రైవేట్ సైన్యంగా దిగజార్చిన పర్యవసానం కనిపిస్తున్నది.

ఇక అత్యున్నత స్థాయి ప్రభుత్వ పెద్దల అవినీతి వేలు లక్షల ఎకరాలు, వందల వేల కోట్ల టెండర్ల కొలమానంలో వెలిగి పోతున్నదని నిపుణులు అంచనా వేస్తున్నారు. అమరావతి పేరుతో చేస్తున్న ఆర్భాటపు ప్రణాళికల వెనుక అంతులేని అవినీతి వ్యూహం తప్ప, వాస్తవికత ఇసుమంత కూడా లేదని వారు బల్లగుద్ది చెబుతున్నారు. రాజధాని కోసం ఇప్పటికే అందుబాటులో ఉన్న 55 వేల ఎకరాలకు తోడు మరో 45 వేల ఎకరాలను సేకరించాలన్న ప్రతిపాదనపై తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అందులో ఐదు వేల ఎకరాలు సరికొత్తగా నిర్మించబోయే అంతర్జాతీయ విమానాశ్రయానికి కావాలట! ఇప్పుడు అందుబాటులో ఉన్న గన్నవరం విమానా శ్రయం సంగతి ఏమిటి? గన్నవరంలో 2024–25 సంవత్స రంలో 9,279 విమానాలు ల్యాండ్ అయ్యాయని రికార్డులు చెబుతున్నాయి. దాని వైశాల్యం 1,265 ఎకరాలు, కోల్‌కతా విమానాశ్రయం వైశాల్యం సుమారు 1,600 ఎకరాలు. ఇదే కాలంలో అక్కడ ల్యాండ్ అయిన విమానాల సంఖ్య ఒక లక్షా నలభై ఆరు వేల పైచిలుకు. గన్నవరం విమానాశ్రయం కోసం తలపెట్టిన అదనపు భూసేకరణను కూడా దృష్టిలో పెట్టుకుంటే ఎయిర్ ట్రాఫిక్ ఇరవై రెట్లు పెరిగినా గన్నవరం ఎయిర్‌పోర్ట్ నిక్షేపంగా సరిపోతుంది. అమరావతిలో ఇప్పటికే టెండర్లు పిలిచిన పరిపాలనా భవనాల ఆర్భాటపు అంచనాలు కూడా ఈ కోవలోనివే!

ఎన్ని పాలనా భవనాలను నిర్మించినా, ఎన్ని సంస్థలను రప్పించినా అక్కడ నివసించవలసిన జనాభా ఏ విధంగా పెరుగుతుంది? ఎన్ని లక్షల మందికి ఉపాధిని, వసతిని అందు బాటులోకి తేగలరన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కొన్ని భవనాలను నిర్మించగానే జనం బిలబిలమంటూ వచ్చి నిండి పోరు కదా! ఇటువంటి ఆర్భాటాలతోనే అంచనా లేకుండా నిర్మించిన కొన్ని చైనా నగరాలు ఘోస్ట్ సిటీలుగా మిగిలిపోయిన ఉదంతాలను పరిశీలకులు గుర్తు చేస్తున్నారు. వేలకోట్ల రూపా యల అప్పు తెచ్చి ఖర్చు చేస్తున్న అమరావతి మరో ఘోస్ట్ సిటీగా మిగిలిపోతే పెద్దలకు గిట్టుబాటు కావచ్చునేమో గాని కొన్ని తరాల వరకు ఆంధ్ర ప్రజలు దానికి మూల్యం చెల్లించ వలసి ఉంటుంది. వడ్డే శోభనాద్రీశ్వర రావు వంటి తొలితరం తెలుగుదేశం నాయకులు కూడా అమరావతి ఊహల పందిరిపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తుతున్నారు.

నాయకుని స్థాయిని బట్టి అవినీతిస్థాయి కూడా పెరుగుతుంది. ఇసుక దోపిడీ, మట్టి దోపిడీ ఎక్కడ చూసినా కనిపిస్తున్నది. మద్యం మామూళ్లు ప్రజాప్రతినిధులకు హక్కుభుక్తంగా మారాయి. ఇవి చాలదన్నట్టు దర్జాగా భూకబ్జాలు అడ్డూ అదుపూ లేకుండా కొనసాగుతున్నాయి. విజయవాడ నగరం నడిబొడ్డున అర్ధ శతాబ్దానికి పైగా చరిత్ర కలిగిన శాతవాహన కాలేజీ స్థలం ఆక్రమణ కోసం జరుగుతున్న రౌడీయిజం తాజా ఉదాహరణ. సాక్షాత్తూ పాలక పార్టీ ఎమ్మెల్సీ ఆలపాటి రాజా తనను కిడ్నాప్ చేశారని కళాశాల ప్రిన్సిపాల్ ఆరోపించారు. అయినా చట్టం స్పందించలేదు. అర్ధరాత్రి పూట బందిపోటు దొంగల మాదిరిగా కళాశాల షెడ్లను కూల్చివేశారు. లాఠీలు కదల్లేదు. ప్రతిపక్ష కార్యకర్తల మీద, సామాన్య ప్రజల మీద జులుం చూపిస్తున్న పోలీసు యంత్రాంగం, అధికార పార్టీ పెద్దలు బడిని మింగినా, గుడిని మింగినా చోద్యం చూడటానికే పరిమితమైపోతున్నారు. పోలీసు యంత్రాంగాన్ని ప్రైవేట్ సైన్యంగా దిగజార్చిన పర్యవసానం కనిపిస్తున్నది.

విచ్చలవిడి అవినీతి, వ్యవస్థల విధ్వంసం, అమరావతి పేరుతో జరుగుతున్న ప్రమాదకర క్రీడలు ఒకపక్క సామాన్య ప్రజలను గడ్డిపోచల కింద జమ కట్టే పెత్తం దారీ పోకడ మరోపక్క... ఈ పాలనా రథానికి మోహరించి దౌడు తీస్తున్నాయి. భారత రాజ్యాంగం ఈ దేశంలో పుట్టి పెరిగే పౌరులందరినీ జాతి సంపదకు సమాన వాటాదారులుగా పరిగ ణిస్తున్నది. కానీ ఆంధ్రప్రదేశ్ పాలకులు మాత్రం సామాన్య ప్రజలను బిచ్చగాళ్ళుగా భావిస్తున్నారు. విద్యా, వైద్య రంగాల్లో గత ప్రభుత్వం వారికి నాణ్యమైన అవకాశాలను ఉచితంగా కలుగజేస్తే, ప్రస్తుత ప్రభుత్వం వాటిని తొలగించింది. 'ఫ్యామిలీ డాక్టర్' వంటి వ్యవస్థలను ఎత్తేసింది. ప్రభుత్వ రంగంలో నిర్మించిన వైద్య కళాశాలలు, అనుబంధ ఆసుపత్రు లను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నది. పేద కుటుంబాల విద్యార్థులకు జగన్ ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన ఆధు నిక బోధన పద్ధతులను రద్దు చేసింది.


ఇప్పుడు తాజాగా కార్మికులు, కర్షకులు పనిచేయవలసిన సమయాన్ని ఎనిమిది గంటల నుంచి పన్నెండు గంటలకు పెంచుతూ రాష్ట్ర క్యాబినెట్ తీర్మానం చేసింది. 8 గంటల పని కోసం జరిగిన దశాబ్దాల పోరాటాలనూ, షికాగో వీధుల్లో చిందిన కార్మిక రుధిరాన్నీ అవహేళన చేసింది.

ఇంత తక్కువ కాలంలో, ఇన్ని రకాలుగా పతనమవుతున్న ప్రభుత్వానికి ప్రజాదరణ తగ్గిపోవడంలో ఆశ్చర్యమేమున్నది! కూటమి సర్కార్ ఏర్పడి ఏడాది పూర్తవుతున్న వేళ కొందరు వ్యక్తులు, కొన్ని సంస్థలు సర్వేలు చేస్తున్నాయట! ఈ సర్వేల న్నింటి సారాంశం ఈ ప్రభుత్వానికి ప్రజాదరణ తగ్గిందనే! ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే 11 మంది మంత్రులు సహా 78 మంది కూటమి ఎమ్మెల్యేలు ఓడిపోతారని సగటు అంచనా వేశారు. వాస్తవ పరిస్థితి మాత్రం ఇంకా తీవ్రంగా ఉన్నది. ఇప్పటికే ప్రభుత్వ ప్రతిష్ఠ పాతాళానికి పడిపోయింది. దిగజార డానికి ఇంతకంటే లోతుల్లేకపోవచ్చు. కంటి తుడుపు కోసం ప్రభుత్వం కూడా ఐ.వి.ఆర్.ఎస్. ద్వారా ప్రజాభిప్రాయాన్ని తెలుసుకుంటున్నదట! నూటికి నూరు శాతం మంది ప్రభు త్వాన్ని భేష్ అంటున్నారని ఆ సర్వే వివరాలను ప్రభుత్వం కూడా ప్రకటించుకోవచ్చు.

vardhelli1959@gmail.com

'అంద'లం ఎక్కాలన్నా... అదే భాష!

అభిప్రాయం



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

మునుపెన్నడూ జరగని విధంగా ఒక చిన్న, కొత్త రాష్ట్రమైన తెలంగాణలో మిస్ వరల్డ్ పోటీలు జరిగాయి. నాకు గుర్తున్నం తవరకు ఇంతకు ముందు బెంగళూరులో ఇటువంటి పోటీ ప్రయత్నాలు ప్రారంభిం చగానే రైట్ వింగ్ వ్యతిరేకులు పెద్ద రాద్ధాం తం చేశారు. చివరికి అవి ఆగిపోయాయి. అది 1996 నాటి చరిత్ర. తెలంగాణలో కూడా కమ్యూనిస్టుల మహిళా సంఘాలు వ్యతిరేకత చూపాయి. కానీ కొద్దిపాటి వ్యతిరేకతతో ఆగి పోయాయి. బీజేపీ/ఆరెస్సెస్ మహిళా సంఘాలు గానీ, ముస్లిం స్త్రీలు గానీ బెంగళూరులో చేసిన వ్యతిరేక హడావిడి చెయ్యలేదు. మిస్ వరల్డ్, మిస్ యూనివర్స్ పోటీలు అవసరమా, లేదా? అవి స్త్రీ శరీర ఎక్స్‌పోజర్ తంతులా, లేక వారి శరీర అందాన్నీ, శక్తి యుక్తుల్నీ, తెలివితేటలనూ పెంచేవా అనే అంశంపై నేను ఇక్కడ చర్చించదలచుకోలేదు.

ఒక్కటి మాత్రం నిజం. ఈ రెండు స్త్రీల పోటీలలో చాలా దేశాలు పాల్గొంటాయి. కొన్ని పాల్గొనవు. మొత్తం ముస్లిం దేశాలు పాల్గొనవు. తెలంగాణలో ఈ పోటీ జరిగే వరకు నేను ఈ పోటీలను అంతగా పరిశీలించలేదు. ఈ పోటీ ఇంత చిన్న, కొత్త రాష్ట్రంలో జరిగినందువల్ల, ఈ వివిధ దేశాల యువతులు జిల్లా పర్యాటక ప్రాంతాలు, హైదరాబాదులోని వివిధ ప్రాంతాలు తిరిగి చూడటం, రకరకాల తిండి తినడం, కల్లు తాగడం (నీరా), వీళ్ళల్లో మాంసాహార, శాకాహార తిండి విభజన లేకపోవడం, తెలంగాణ మంత్రులు, అధికారులు పక్కా తెలుగు మీడియాను (ముఖ్యంగా ఇంగ్లిష్ వ్యతిరేక 'ఈనాడు' గ్రూపు మీడియా ప్రతినిధులను) కూర్చుండబెట్టి ఉపన్యాసాలివ్వడం నాకు నచ్చింది. నాగార్జున సాగర్‌లో నల్లగొండ కలెక్టర్ ఉపన్యాసం నేను విన్నాను.

వందకు పైగా దేశాల నుండి యవ్వనంలో ఉన్న అమ్మా యిలూ, వారికి మద్దతుగా వచ్చిన అధికారులూ, జడ్జీలూ, కార్య క్రమ నిర్వాహకులూ ఇంకా ఇంగ్లిష్ వచ్చినవారై ఉండాలనేది ఇం దులో స్పష్టంగా కనిపించింది. ఈ పోటీలో అతి చిన్న చిన్న వెనుకబడిన దేశాలకు చెందిన ఆఫ్రికా, ఆసియా, యూరప్ వంటి ఖండాలకు చెందిన అమ్మాయిలు పాల్గొన్నారు. వారందరూ పరస్పరం ఇంగ్లిష్‌లో మాట్లాడుకుంటే తప్ప తమలో తమకు కమ్యూనికేషన్ ఉండదు. ఆ యా దేశాల్లో ఈ అమ్మాయిలంతా ఏ ఆర్థిక వర్గానికి చెందినవారై ఉంటారు? ఆ యా దేశాల్లోని శ్రమ జీవుల్లోని ఆడపిల్లలంతా వీరి లాగా శరీర పోషణలో ఉంటూ ఇంగ్లిష్‌లో చదువుకోగలిగినవారై ఉంటారా? మన దేశంలో ఇప్పటి వరకు మిస్ వరల్డ్, మిస్ యూనివర్స్ పోటీల్లో విజేతలుగా గెలిచి వచ్చిన స్త్రీలను చూస్తే వీరంతా బాగా ధనిక కుటుంబాల్లో పుట్టి మంచి డబ్బుల సంచుల ప్రైవేట్ స్కూళ్ళలో చదివిన వారే. ఐశ్వర్యారాయ్ కానీ, ప్రియాంకా చోప్రా కానీ, సుస్మితా సేన్ కానీ, ప్రస్తుత పోటీల్లో పాల్గొంటున్న నందినీ గుప్తా కానీ అగ్ర కులాల వాళ్ళు, ధనవంతులు, మంచి ఇంగ్లిష్ మీడియం స్కూళ్ళలో చదువు కున్నవాళ్ళు.

స్త్రీదైనా, పురుషునిదైనా శరీర అందం వర్గం, కులాలపై ఆధారపడి ఉంటుందా? భారతదేశంలోని శూద్ర– బీసీ, దళిత, ఆదివాసీ స్త్రీలు ఈ అందాల పోటీల్లో పాల్గొనగలిగే అందం వారికి లేదా? ఇప్పుడున్న ప్రపంచ పరిస్థితిలో అందాల పోటీలు ఆహారం, శరీర ఆకృతి, వేసుకునే బట్టల వైనం, ఇంగ్లిష్‌లో ప్రశ్న లకు సమాధానం చెప్పే జ్ఞానంతో ముడివడి ఉన్నాయి. రంగు



◆ ఆంధ్రప్రదేశ్‌లో జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం విద్యను పూర్తిగా ఇంగ్లిష్ మీడియంలోకి మార్చాక ఆదివాసీ, దళిత, బీసీ అమ్మాయిలు సైతం మిస్ వరల్డ్ పోటీ గురించి ఆలోచించే అవకాశం వచ్చింది. తెలంగాణ ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియంలో చదివే అమ్మా యిలూ అటువంటి కల కనొచ్చు.

సమస్య ఒకప్పుడు తీవ్రంగా ఉండేది. ప్రస్తుత ప్రపంచ సుందరి పోటీలో 'మిస్ వరల్డ్'గా నిలిచిన ఓపల్ సుచాతా చిన్న దేశమైన థాయ్‌లాండ్‌కు చెందిన అమ్మాయి. ఆమె తరువాతి స్థానంలో నిలి చిన హసెత్ డెరెజె అడ్మస్సు ఇథియోపియాకూ, మూడవ స్థానంలో నిలిచిన మాజా క్లాజ్డా పోలాండ్‌కు, నాల్గవ (థర్డ్ రన్నర్ అప్) స్థానంలో నిలిచిన ఆవురెలీ జోచిమ్ మార్టినిక్‌కూ చెందిన యువ తులు. ఇథియోపియా నల్లజాతి అమ్మాయి రెండో స్థానంలో ఉందంటే రంగు, అందం నిర్వచనాలు మారుతున్నాయని అర్థం.

చివరి దశలో జరిగిన ఇంటెలిజెన్స్ టెస్ట్ ప్రశ్నలను, వాటికి వారు ఇచ్చిన సమాధానాలను నేను జాగ్రత్తగా విన్నాను. ఈ 108 దేశాల అమ్మాయిలు తమలో తాము ఇంగ్లిష్‌లో మాట్లాడుకోవడమే కాదు, వారి మేధా శక్తిని పరీక్షించే ప్రశ్నలన్నీ ఇంగ్లిష్‌లోనే అడుగు తారు. వారు ఇంగ్లిష్‌లోనే సమాధానం చెప్పాలి.

థాయ్‌లాండ్, ఇథియోపియా, పోలాండ్ వంటి అమ్మాయిలు తమ తమ భిన్నమైన యాసలలో సమాధానాలు చెప్పారు. భాష స్టైల్‌కూ, యాక్సెంట్‌కూ కాక... ఆ సమాధానం కంటెంట్‌కు మార్కులిచ్చినట్లు భావిస్తున్నాను. నలుగురు ఫైనలిస్టుల సమా ధానాలూ నన్ను ఆశ్చర్యపర్చాయి. ఒక అమ్మాయిని తెలంగాణలో తన అనుభవం గురించి అడిగారు. ఒకామెను ప్రపంచంలోని బీదలకు, దిక్కులేని వారికి నీవేమి చేస్తావని అడిగారు. ఇథియో పియా అమ్మాయికి ప్రశ్న ముందు అర్థం కాలేదు. మళ్లీ అడగమని కోరి ఆమె చెప్పిన సమాధానం బ్రిలియంట్. ఆమెది ఆఫ్రికన్ యాస. ఆమె నలుపు, అందం, ఆఫ్రికన్ జాతివి. కానీ ఆమె ఇంగ్లిష్ ప్రశ్నకిచ్చిన రిప్లై యూనివర్సల్. ఆమెలో గొప్ప మేధా శక్తి ఉంది. ఆ శక్తి ఆమెను ప్రపంచ రెండో అందగత్తెను చేసింది.

భారతదేశంలోని ఆదివాసులు, దళితులు, శూద్ర బీసీలు ఆమెలాగే ఉంటారు. కానీ వీరి ఆడపిల్లలకు ఆమెలాంటి ఇంగ్లిష్ విద్య లేదు. ప్రపంచ స్త్రీలతో పోటీపడే అవకాశం లేదు. ఆంధ్ర ప్రదేశ్‌లో జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం విద్యను పూర్తిగా ఇంగ్లిష్ మీడియంలోకి మార్చాక ఆదివాసీ, దళిత, బీసీ అమ్మాయిలు సైతం మిస్ వరల్డ్ పోటీ గురించి ఆలోచించే అవకాశం వచ్చింది. తెలం గాణలో గురుకులాల్లో ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియంలో చదివే అమ్మాయిలు అటువంటి కల కనొచ్చు. మిస్ వరల్డ్, మిస్ యూనివర్స్ పోటీల్లాగా ఐక్యూస్, మానవత్వ విలువలతో కూడిన సమాధానాలు రాబట్టడానికి 108 దేశాల నుండి వచ్చిన అమ్మా యిలను పరీక్షకు పెట్టే మరో వేదిక లేదు. ఇంటర్నేషనల్ గేమ్స్ ఎన్ని ఉన్నా అవి ఐక్యూస్‌నీ, అందులో పాల్గొనే ఆటగాళ్లందరి జ్ఞానాన్ని పరీక్షించే ఆట లేదు. మిస్ వరల్డ్ లాంటి పోటీ ఇన్ని దేశాల్లో ఇంగ్లిష్ భాష మనుగడలో లేకపోతే సాధ్యం కాదు.

వలసవాదానంతర ప్రపంచంలో వచ్చిన ఒక గొప్ప అను కూల మార్పు ప్రపంచంలోని అన్ని దేశాల్లో ఇంగ్లిష్ భాష మాట్లాడే ఒక వర్గం ఎదగడం. ఈ భాష ఆడపిల్లలకు అందుబాటులోకి రావడం వల్ల ఈ పోటీలు సాధ్యమయ్యాయి.

ఈ పోటీ వ్యతిరేకత ఈ దేశంలో 2014లో బీజేపీ అధికారం లోకి వచ్చి, క్రమంగా మారాల్సిన స్థితిలోకి నెట్టబడ్డాక హిందూత్వ శక్తులు ఈ పోటీని వ్యతిరేకించడం తగ్గించుకున్నాయి. కమ్యూనిస్టు శక్తులు వలసవాద వ్యతిరేకతలో భాగంగా మిస్‌వరల్డ్ పోటీలను వ్యతిరేకిస్తున్నాయి. తెలంగాణలో కూడా వ్యతిరేకించాయి.

అదే ధోరణి ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియంపై కూడా వ్యక్తపరుస్తున్నాయి. కానీ ఈ దేశంలోనే అగ్ర కుల ధనికులు తమ ఆడపిల్లల్ని పెద్ద ఖర్చుతో ఇంగ్లిష్ మీడియంలో చదివించి వాళ్ళు మిస్ వరల్డ్, మిస్ యూనివర్స్ అవుతూ ప్రపంచ దేశాలలో పర్య టిస్తూ, డబ్బు సంపాదిస్తుంటే; సినిమా యాక్టర్లు అయ్యి కోట్లు గడిస్తుంటే ఏమీ చెయ్యలేని స్థితిలో చూస్తూ ఉంటున్నారు. నందినీ గుప్తా లాంటి ఒక ధనవంతమైన అమ్మాయి కాక, ఒక ఆదివాసీ లేదా దళిత లేదా బీసీ అమ్మాయి ఆ స్థానంలో ఉండాలంటే మంచి ఇంగ్లిష్ విద్య కావాల్సిందే కదా! మారుతున్న ప్రపంచంతోపాటు భారతదేశపు బీద ప్రజల జీవితం, ఆశలు మారాలని కోరుకోవాలి గానీ ఇక్కడే ఆగాలని కోరుకోకూడదు.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక విశ్లేషకుడు

మహానిర్వాణ తంత్రం

తంత్రాలు అన్నా, తంత్ర పూజలు అన్నా అవేవో చాలా చెడ్డవి అనే అభిప్రాయం చాలామందిలో ఉంది. వామాచార తంత్రం లాంటి వాటిని రామ కృష్ణ పరమహంస లాంటివారు తిరస్కరించటం నిజమే. కానీ తంత్ర గ్రంథాల్లో ఉన్నవి అన్నీ చెడ్డవి కావు. 'విజ్ఞాన భైరవ తంత్ర'లోని అద్భుత విషయా లను ఓషో లోకానికి తెలియ చెప్పాడు. వివేకానంద స్వామి 'మహా నిర్వాణ తంత్ర' లోని విషయాలను ఎత్తి చూపాడు. అందులోని కొన్ని:

జ్యోతిర్మయం

గృహస్థుడు భగవంతుని భక్తుడై ఉండాలి; భగవంతుని జ్ఞానమే అతని పరమావధి. తల్లి తండ్రులను సాక్షాత్తూ భగవత్ స్వరూపులుగా ఎరిగి గృహస్థుడు సదా సర్వవిధాల వారిని సంతుష్టు లను చేయాలి. తల్లి తండ్రులతో పరుషంగా మాట్లా డని కుమారుడు నిజమైన సుపుత్రుడు. తల్లికి, తండ్రికి, బిడ్డ లకు, భార్యకు, పేదలకు పెట్టకుండా గృహస్థుడు భుజిస్తే అది పాపం అవుతుంది. ఈ శరీరానికి తల్లితండ్రులే కారకులు. కాబట్టి వారికి మేలు చేయడానికి మానవుడు లక్ష కష్టాలైనా అనుభవించటం కర్తవ్యం. తన భార్య పట్లా అత డికి విహితమైన ధర్మం ఇలాంటిదే! భార్యను దూషించకూడదు. కేవలం తల్లిగా భావించి ఆమెను పోషించాలి.

స్త్రీల ముందు అసభ్యంగా మాట్లాడకూడదు. తన శక్తి సామర్థ్యాలను గురించి ప్రగల్భాలు పలుక కూడదు. అన్నదమ్ముల పట్ల, అక్కచెల్లెళ్ళ పట్ల, బంధువర్గం పట్ల, మిత్రుల పట్ల, సేవకుల పట్ల, పేదల పట్ల నిర్వర్తించవలసిన ధర్మాలు గృహ స్థుడికి ఉన్నాయి. సమాజానికంతటికీ గృహస్థుడే ఆధారం. గృహస్థుడు సత్యాన్ని పలకాలి. మృదు వుగా, ప్రియంగా, హితకరంగా పలకాలి. (పుటలు: 15 నుంచి 18. 'లేవండి మేల్కొనండి– 02' రామ కృష్ణ మఠం). చూశారా! తంత్ర గ్రంథంలో ఎన్ని మంచి విషయాలు ఉన్నాయో! వాటిని ఆచరిస్తే ప్రతి ఇల్లూ, ప్రతి ఊరూ స్వర్గమే అవుతుంది.


– రాచమడుగు శ్రీనివాసులు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

చాట్ జీపీటీ వాడకంలో.. భారత్ నంబర్ 1

వాడకం అంటే మనవాళ్లదే. రెండేళ్ల క్రితం అందుబాటులోకి వచ్చిన 'చాట్‌జీపీటీ' భారతీయులకు అత్యంత ఇష్టమైన యాప్‌గా అవతరించింది. చాట్‌జీపీటీ వినియోగంలో ప్రపంచంలో 13.5% మంది యూజర్లతో భారత్ అగ్రస్థానంలో నిలిచింది. అమెరికాను కూడా వెనక్కి నెట్టి ఔరా అనిపించింది. చాట్‌జీపీటీ వినియోగదారుల సంఖ్య భారత్‌లో 10.8 కోట్లకు చేరుకుంది. దీన్ని బట్టి భారతీయుల జీవితాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఎలా మమేకం అయిపోయిందో అర్థం చేసుకోవచ్చు.

- సాక్షి, స్పెషల్ డెస్క్



టెక్నాలజీ వాడకంలో మనవాళ్లను కొట్టేవారే లేరని మరోసారి నిరూపితమైంది. చాట్‌జీపీటీ యూజర్లలో భారతీయులు నంబర్ వన్‌గా నిలిచారు. అమెరికా కూడా మన తరవాతే ఉంది. యూఎస్ వాటా 8.9% మాత్రమే. ఇండోనేసియా 5.7, బ్రెజిల్ 5.4, ఈజిప్ట్ 3.9, మెక్సికో 3.5, పాకిస్తాన్ 3, జర్మనీ 3, ఫ్రాన్స్ 2.9, వియత్నాం 2.6% వాటాతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఏఐ ఆధారిత ఈ చాట్‌బాట్ సాంకేతిక నిపుణులకు మాత్రమే పరిమితం కాలేదు. విద్యార్థులు, కంటెంట్ క్రియేటర్స్‌కు తోడు సామాన్యులూ మన దేశంలో తెగ వాడేస్తున్నారు. హోంవర్క్‌లో సహాయం, మనసుకి నచ్చిన వారికి సందేశం, కావాల్సిన సమాచారాన్ని సేకరించడం, కంటెంట్ క్రియేషన్.. అవసరం ఏదైనా అమెరికన్ కంపెనీ రూపొందించిన ఈ చాట్‌బాట్ వేగంగా భారత్‌లో విస్తరిస్తోందని క్వీన్ ఆఫ్ ది ఇంటర్నెట్‌గా ప్రసిద్ధి చెందిన విశ్లేషకురాలు, వెంచర్ క్యాపిటలిస్ట్ మేరీ మీకర్ తన '2025 ఏఐ ట్రెండ్స్' నివేదికలో తెలిపారు. అంతేగాక చైనా తయారీ ఏఐ చాట్‌బాట్ 'డీప్‌సీక్' వినియోగంలోనూ భారతీయులు మూడో స్థానంలో నిలిచారు. ప్రపంచ వినియోగదారుల్లో 6.9 శాతం మంది మనదేశం నుంచే ఉన్నారు. 33.9% వాటాతో చైనా, 9.2%తో రష్యా టాప్-2లో ఉన్నాయి. డీప్‌సీక్ మొత్తం వినియోగదార్ల సంఖ్య 5.4 కోట్లు.

తెలుగులోనూ వినియోగం..

ఇంటర్నెట్ వినియోగదారుల సంఖ్య భారీగా పెరగడం, బలమైన, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిశ్రమ, డిజిటల్ పరివర్తనకు ప్రభుత్వ మద్దతు, ప్రాంతీయ భాషలపై దృష్టి పెట్టడం వంటి వివిధ అంశాలు ఏఐ వినియోగంలో ఈ పెరుగుదలకు కారణమని నివేదిక వెల్లడించింది. చాట్‌జీపీటీ తెలుగు, హిందీ, మలయాళం, తమిళం వంటి అనేక భారతీయ భాషలను సపోర్ట్ చేస్తుంది. అంటే మనకు కావాల్సిన సమాచారాన్ని తెలుగులోనూ అందిస్తుందన్న మాట. స్మార్ట్‌ఫోన్లు అందుబాటు ధరల్లో లభించడం, ఇంటర్నెట్ వేగం దూసుకెళ్లడం కూడా చాట్‌జీపీటీ వాడకం అధికం కావడానికి ముఖ్యమైన కారణంగా చెప్పవచ్చు.

రోజుకు 100 కోట్లకుపైగా..

చాట్‌జీపీటీ వేదికగా రోజుకు 100 కోట్లకుపైగా సర్చెస్ నమోదవుతున్నాయంటే నోరెళ్లబెట్టాల్సిందే. వార్షిక సర్చెస్ 36,500 కోట్లకు చేరుకోవడానికి గూగుల్‌కు 11 ఏళ్ల సమయం పడితే.. చాట్ జీపీటీ ఈ మైలురాయిని 5.5 రెట్లు వేగంగా రెండేళ్లలోనే అందుకుంది. 2022 నవంబర్ 30న రంగ ప్రవేశం చేసిన చాట్‌జీపీటీ ప్రపంచాన్ని నివ్వెరపరిచింది. ప్రపంచవ్యాప్తంగా ఎక్కువ మంది వినోదం, ఆటల కోసం కాకుండా నేర్చుకోవడానికి, రాయడానికి, కోడింగ్ కోసం, కంటెంట్ క్రియేట్ చేయడానికి దీనిని ఉపయోగిస్తున్నందున ప్రజాదరణ విపరీతంగా పెరిగింది. చాట్‌జీపీటీకి అంతర్జాతీయంగా 80 కోట్ల మంది నెలవారీ యాక్టివ్ యూజర్లున్నారు. 21 నెలల క్రితంతో పోలిస్తే చాట్‌జీపీటీ యాప్‌లో మూడు రెట్లు ఎక్కువ సమయాన్ని యూజర్లు వెచ్చిస్తున్నారు.



చెల్లించేందుకూ సిద్ధం..

ఇంకా ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. చాట్‌జీపీటీ పెయిడ్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య గణనీయంగా పెరిగి 2 కోట్లు దాటింది. ఈ సంఖ్య సంవత్సరానికి 153 శాతం చొప్పున దూసుకెళుతోంది. ఈ ప్లాట్‌ఫామ్ మాతృ సంస్థ అయిన ఓపెన్ ఏఐకి పెద్ద మొత్తంలో ఆదాయ వనరుగా అవతరించింది. ఏడాదిలోనే ఈ మొత్తం పది రెట్లు పెరిగింది. చాట్‌బాట్ ఒక్కటే కంపెనీకి ఏటా రూ.31,709 కోట్ల ఆదాయాన్ని అందిస్తోంది. ఎక్కువ మంది యూజర్లు మెరుగైన ఫీచర్ల కోసం చెల్లించేందుకు వెనుకాడడం లేదు.

డెస్క్‌టైమ్ అధ్యయనం ప్రకారం..

ఏఐ జోరులో భారత్ అగ్రగామిగా కొనసాగుతుందనడంలో సందేహం లేదు. ఈ ధోరణి కారణంగా దేశం నుంచి మరిన్ని ఏఐ స్టార్టప్‌లు ఉద్భవించడానికి దారితీసే అవకాశం ఉంది. డెస్క్‌టైమ్ అధ్యయనం ప్రకారం 92.2% భారతీయ కార్యాలయాలు తమ రోజువారీ కార్యకలాపాలలో చాట్‌జీపీటీ వినియోగాన్ని అనుమతించాయి. చాట్‌జీపీటీని స్వీకరించడంలో అమెరికా కంటే భారత్ చాలా ముందుంది. యూఎస్ కార్యాలయాలలో 72.2% మాత్రమే చాట్‌జీపీటీని ఉపయోగిస్తున్నాయి.

క్లుప్తంగా...

విషమంగానే గోపీనాథ్ ఆరోగ్యం

- మాగంటిని పరామర్శించిన కేటీఆర్



గచ్చిబౌలి (హైదరాబాద్): తీవ్ర అస్వస్థతకు గురై ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. అమెరికా పర్యటన నుంచి తిరిగి వచ్చిన కేటీఆర్ శనివారం ఉదయం గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రికి చేరుకున్నారు. మాగంటి ఆరోగ్యం, చికిత్స తదితర అంశాలపై వైద్యుల్ని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. త్వరలోనే గోపీనాథ్ కోలుకొని ఆరోగ్యంగా తిరిగి వస్తారని ఆకాంక్షించారు. కేటీఆర్ వెంట ఎమ్మెల్సీలు దాసోజు శ్రవణ్, రవీందర్ రావు, నేతలు మాలోతు కవిత, రాగిడి లక్ష్మారెడ్డి తదితరులున్నారు. గోపీనాథ్ ఆరోగ్యం విషమంగానే ఉన్నట్లు తెలుస్తోంది. వెంటిలేటర్‌పై ఉన్న ఆయన ఆరోగ్యం మెరుగుపడలేదని సమాచారం. సీనియర్ వైద్యుల పర్యవేక్షణలోనే వెంటిలేటర్‌పై చికిత్స కొనసాగిస్తున్నారు.


డాక్టర్ రఘురామ్‌కు అరుదైన గౌరవం

- కేఎంసీ విశిష్ట పూర్వ విద్యార్థుల అవార్డు ప్రదానం



సాక్షి, హైదరాబాద్: కిమ్స్-ఉషలక్ష్మి సెంటర్ ఫర్ బ్రెస్ట్ డిసీజెస్ వ్యవస్థాపక డైరెక్టర్ డాక్టర్ పి.రఘురామ్‌కు అరుదైన గౌరవం దక్కింది. కర్ణాటక రాష్ట్రం మంగళూరులోని కస్తూర్బా మెడికల్ కాలేజీ (కేఎంసీ) 70 ఏళ్ల చరిత్రలో తొలిసారి విశిష్ట పూర్వ విద్యార్థుల అవార్డుకు రఘురామ్ ఎంపికయ్యారు. ఈ అవార్డు పొందిన మొదటి వైద్యునిగా ఆయన ఘనత సాధించారు. మంగళూరులో శనివారం జరిగిన ప్లాటినం జూబ్లీ కళాశాల దినోత్సవాల్లో ఈ అవార్డును డాక్టర్ రఘురామ్‌కు అందజేశారు. డాక్టర్ రఘురామ్ భారతదేశంలో రొమ్ము కేన్సర్ సంరక్షణకు, దత్తత గ్రామంలో చేసిన విశేష సేవలకు ఈ అవార్డు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ రఘురామ్ మాట్లాడుతూ.. అవార్డును తన తల్లిదండ్రులకు అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు.

రిలయన్స్ డిజిటల్ షాపింగ్ చేస్తే బహుమతులు



సాక్షి, హైదరాబాద్: భారతదేశంలో అగ్రగామి ఎలక్ట్రానిక్స్ రిటైలర్ రిలయన్స్ డిజిటల్ సంస్థ 'అద్భుతమైన షాపింగ్ చేయండి గెలవండి' పేరిట ప్రచారం ప్రారంభించింది. ఈ సందర్భంగా ప్రతి కొనుగోలుపై భారీ బహుమతులను సొంతం చేసుకొనే అవకాశం కల్పిస్తోంది. ఆగస్టు 31 వరకు రిలయన్స్ డిజిటల్ స్టోర్స్, మై జియో స్టోర్స్, reliancedigital.inలో ఆన్‌లైన్‌లో షాపింగ్ చేసేవారు.. రూ.30 కోట్ల విలువైన బహుమతులు గెలిచే అవకాశం పొందుతారు.

కంటిపాపలకు కనురెప్పలు దూరం!

- విదేశాల్లో అదృశ్యమవుతున్న భారతీయులు
- వారిలో బతుకుదెరువుకు గల్ఫ్‌కి వెళ్లినవారే అధికం
- ఆచూకీ తెలియక కుటుంబ సభ్యుల ఆవేదన
- ఉన్నారో లేరో.. వస్తారో రారోనని నరకయాతన
- కుటుంబ పెద్ద లేక, ఆర్థిక సమస్యలతో సతమతం
- ఏనాటికైనా తిరిగి వస్తారన్న నమ్మకంతో ఎదురుచూపులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కంటికి రెప్పలే భద్రత. ఆ కనురెప్పలే మాయమైతే కళ్ల పరిస్థితేంటి? అలాగే కంటికి రెప్పలాంటి ఇంటిపెద్ద దేశంకాని దేశంలో ఉన్నట్టుండి కనిపించకుండా పోతే.. ఇక్కడి ఆ కుటుంబం పరిస్థితేంటి? కట్టుకున్నవాడి కోసం ఆ ఇల్లాలు పడే ఆవేదన మాటలకు అందదు.. అమ్మా.. నాన్న ఎక్కడ అని పిల్లలు అడిగినప్పుడల్లా ఆ తల్లి గుండె ముక్కలయ్యే శబ్దం ఆమెకు మాత్రమే వినిపిస్తుంది. బతుకుదెరువు కోసం అప్పులు చేసి, సముద్రాలు దాటి విదేశాలకు వెళ్తున్నవారిలో కొందరు కనిపించకుండా పోతుండటంతో వారి కుటుంబాలు తీరని శోకంలో మునిగిపోతున్నాయి. ఆర్థిక ఆసరా ఆగిపోయి జీవితాలు తలకిందులవుతున్నాయి. విదేశాల్లో ఆచూకీ లేకుండా పోయిన కొందరు కార్మికుల కుటుంబ సభ్యులను 'సాక్షి' కదిలించే ప్రయత్నం చేసింది.

నాలుగేళ్లుగా నరకయాతన


భార్య లక్ష్మి, కొడుకులు సిద్ధార్థ, మల్లికార్జున్

ఈమె పేరు సింగం లక్ష్మి. ఈమె భర్త సింగం రాజేశ్వర్ గౌడ్ సౌదీఅరేబియాలో నాలుగేళ్ల క్రితం అదృశ్యమయ్యాడు. అప్పటి నుంచి తన భర్త ఆచూకీ తెలపాలని నాయకులు, ప్రభుత్వ అధికారుల చుట్టూ లక్ష్మి అలుపెరుగక తిరుగుతూనే ఉంది. ఖానాపూర్‌కు చెందిన సింగం రాజేశ్వర్ గౌడ్ 2018లో సౌదీ వెళ్లి.. రియాద్ సిటీ ఆమ్రియాలో ఖర్జూర తోట పని చేసేవాడు. తరచూ భార్య, పిల్లలతో ఫోన్‌లో మాట్లాడేవాడు.


రాజేశ్వర్‌గౌడ్

2021 సెప్టెంబర్ 12 నుంచి అతని నుంచి ఫోన్లు రావడం నిలిచిపోయింది. అప్పటి నుంచి రాజేశ్వర్ ఆచూకీ లేకుండా పోయాడు. అతడితో కలిసి రూమ్‌లో ఉండేవారిని ఆరా తీయగా నాలుగు నెలల జీతంతో ఇంటికి డబ్బులు వేస్తానని వెళ్లి, తిరిగి రాలేదని తెలిపారు. దీంతో అక్కడి భారత ఎంబసీ, గల్ఫ్ కార్మిక సంఘాలతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజాప్రతినిధులను కలసి రాజేశ్వర్ గౌడ్ ఆచూకీ కనుక్కోవాలని లక్ష్మి వినతులు ఇస్తూనే ఉంది. కట్టుకున్న భర్త కనిపించకపోవటం, కుటుంబ భారం మొత్తం ఆమెపైనే పడటం, పైగా రూ.7 లక్షల వరకు అప్పు కూడా ఉండటంతో ప్రస్తుతం కూలిపని చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. ఆమెకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు. పెద్ద కొడుకు సిద్దార్థ డిగ్రీ పూర్తిచేసి మూడు నెలలక్రితం ఉపాధి కోసం దుబాయ్ వెళ్లాడు. కూతురు మౌనిక డిగ్రీ పూర్తిచేసింది. చిన్న కొడుకు మల్లిఖార్జున్ పదో తరగతి చదువుతున్నాడు. ఎప్పటికైనా రాజేశ్వర్ ఆచూకీ దొరుకుతుందేమోనని ఆ కుటుంబం ఆశగా ఎదురుచూస్తోంది.

నాన్న ఏదని అడుగుతున్నారు?


నాగార్జున్

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామానికి చెందినలాస్యకు ఇద్దరు కూతుళ్లు. ప్రస్తుతం గర్భవతి కూడా. ఈమె భర్త బట్టు నాగార్జున్ జగిత్యాలలోని సీఎమ్మార్ ట్రావెల్ ఏజెన్సీ ద్వారా గత మే 5న దుబాయ్‌కి వెళ్లి కనిపించకుండా పోయాడు. దీంతో లాస్య తీవ్ర ఆందోళనలో మునిగిపోయింది. తండ్రి నుంచి నెల రోజులుగా ఫోన్ రాకపోవడంతో పిల్లలు.. నాన్న ఏడి? అని అడుగుతన్న ప్రతిసారీ లాస్య గుండె తరుక్కుపోతోంది. భర్త ఎక్కడున్నాడో.. ఎలా ఉన్నాడో అని తలచుకుని రోజూ విలపిస్తోంది. నాగార్జున్ ఆచూకీ తెలపాలని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డికి మెయిల్ ద్వారా విన్నవించింది. ట్రావెల్స్ వాళ్లు పట్టించుకోవడం లేదని.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి తన భర్తను క్షేమంగా ఇంటికి తీసుకురావాలని కోరుతోంది.

సింగపూర్‌లో మతి స్థిమితం కోల్పోయి..!


భూమేశ్వర్

నిజామాబాద్ జిల్లా నందిపేట మండలానికి చెందిన గుండ్ల భూమేశ్వర్ మే 13న సింగపూర్ వెళ్లాడు. 19న అందరితో పాటే బయటకు వెళ్లి కనిపించకుండా పోయాడు. అతడిని పనిలో పెట్టుకున్నవారు భూమేశ్వర్‌ను వెతికి పట్టుకొని మెట్రో ట్రైన్‌లో రూమ్‌కు తిరిగి తీసుకొస్తుండగా మధ్యలో ఒక స్టేషన్ వద్ద దిగిపోయాడు. తర్వాత ఎంత వెతికినా దొరకలేదు. అతడి ఫోన్ కూడా పనిచేయడం లేదు. భూమేశ్వర్ మతి స్థిమితం కోల్పోయినట్టుందని అనుమానిస్తున్నారు. ఎలాగైనా ఆయనను ఇంటికి రప్పించేలా సింగపూర్ అధికారులు, అక్కడి భారత ఎంబసీతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ అధికారులను ఆయన కుటుంబ సభ్యులు కోరుతున్నారు. ఇటీవల 'ప్రవాసీ ప్రజావాణి'లోనూ భూమేశ్వర్ కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు.

31 ఏళ్లుగా కానరాని ఆచూకీ..


భోగ లక్ష్మి

జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం సంగెం గ్రామానికి చెందిన ఈమె పేరు భోగ లక్ష్మి. ఈమె భర్త సదానందం 1994లో టూరిస్ట్ వీసాపై దుబాయ్ వెళ్లాడు. అప్పటి నుంచి అతడి ఆచూకీ లభించలేదు. సదానందం దుబాయ్ వెళ్లిన సమయంలో లక్ష్మికి ఐదేళ్లలోపు బాబు, పాప ఉన్నారు. సదానందం ఆచూకీ కోసం అధికారులు, నాయకులను ఎంత వేడుకున్నా ఫలితం లేకుండా పోయింది. దీంతో ఆమే సంసార బాధ్యతలు భుజానికెత్తుకుని బీడీ కార్మికురాలిగా మారి పిల్లలను చదివించి పెళ్లిళ్లు చేసింది. 31 ఏళ్లుగా భర్త ఆచూకీ కోసం వెదుకుతూనే ఉంది. ఏనాటికైనా సదానందం తిరిగి వస్తాడన్న ఆశతో లక్ష్మి బతుకుతోంది.

ప్రవాసీ ప్రజావాణిని ఆశ్రయించవచ్చు


మందా భీంరెడ్డి

విదేశాలలో తప్పిపోయిన వారి ఆచూకీ కనుగొనడానికి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఎన్నారై విభాగం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ప్రతి మంగళ, శుక్రవారాల్లో నిర్వహించే 'ప్రవాసీ ప్రజావాణి'లో దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రవాసీల కుటుంబ సభ్యులకు, భారత విదేశాంగ శాఖకు, విదేశాలలోని భారత రాయబార కార్యాలయాలకు 'ప్రవాసీ ప్రజావాణి' ఒక వారధిలాగా ఉపయోగపడుతుంది. బాధితులు నేరుగా భారత రాయబార కార్యాలయాలకు మెయిల్ ద్వారా సమాచారం ఇవ్వవచ్చు. 'మదద్ పోర్టల్'లో మిస్సింగ్ ఫిర్యాదు కూడా నమోదు చేయవచ్చు. – మందా భీంరెడ్డి, వైస్ చైర్మన్, స్టేట్ ఎన్నారై అడ్వయిజరీ కమిటీ, తెలంగాణ ప్రభుత్వం

ఆసుపత్రులకు డాక్టర్లు, నర్సులు కావలెను!

- వైద్య విధాన పరిషత్ పరిధిలోని 156 ఆసుపత్రులకు వైద్య సిబ్బంది కొరత
- 2,988 మంది డాక్టర్లు, 1,205 నర్సు పోస్టులు ఖాళీ
- 1,348 పారామెడికల్, సుమారు 1,500 ఇతర సిబ్బంది పోస్టులు కూడా..
- అరకొరగా ఉన్న వైద్యులతోనే నడుస్తున్న జిల్లా, ఏరియా ఆసుపత్రులు, సీహెచ్‌సీలు
- జిల్లా కేంద్రాల్లోని ప్రైవేటు ఆసుపత్రులను పేదలు ఆశ్రయించాల్సిన పరిస్థితి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా దవాఖానాల్లో వైద్యులు, నర్సుల కొరత వేధిస్తోంది. దీంతో ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో రోగులకు మెరుగైన చికిత్స అందించడం కష్టంగా మారింది. వైద్యుల కొరత వల్ల పేదలు సాధారణ జ్వరం మొదలు దీర్ఘకాలిక అనారోగ్యాలకు చికిత్స కోసం జిల్లా కేంద్రాల్లోని ప్రైవేటు ఆసుపత్రులనే ఆశ్రయించే పరిస్థితి నెలకొంది. కొన్ని ఆసుపత్రుల్లో కనీసం ఒక రెగ్యులర్ డాక్టర్ కూడా ఉండటం లేదు. తాత్కాలిక సర్దుబాటు ద్వారా కొంత మేర భారం తట్టుకొనే ప్రయత్నం చేస్తున్నా పేదలకు సేవలు పూర్తిగా అందడం లేదు.

వేలల్లో ఖాళీలు..

వైద్య విధాన పరిషత్ పరిధిలో ఉన్న 178 ఆసుపత్రుల్లో 12,270 పడకలు ఉన్నాయి. జిల్లా ఆసుపత్రుల్లో 350 పడకల సామర్థ్యం ఉండగా 99 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో 30, 50, 80 పడకల సామర్థ్యం ఉంది. 71 ఏరియా ఆసుపత్రుల సామర్థ్యం 100 నుంచి 250 వరకు ఉంది. ఈ ఆసుపత్రులకు ప్రభుత్వం మంజూరు చేసిన డాక్టర్లు 4,357 కాగా ప్రస్తుతం ఉన్నది 1,369 మంది మాత్రమే. అంటే 2,988 మంది డాక్టర్లు ఆయా ఆసుపత్రుల్లో లేరు. అలాగే ఈ ఆసుపత్రుల్లో 4,200 మంది నర్సులు విధులు నిర్వర్తించాల్సి ఉండగా 2,995 మందే పనిచేస్తున్నారు. అంటే 1,205 మంది నర్సులకు కొరత ఏర్పడింది. ఇక పారామెడికల్ పోస్టులు 1,880కిగాను 532 మాత్రమే భర్తీ అవగా ఇంజనీరింగ్ విభాగంలో 48కిగాను 6 పోస్టులే భర్తీ అయ్యాయి. 743 మినిస్టీరియల్ పోస్టుల్లో 137 ఖాళీలు ఉన్నాయి. మొత్తంగా టీవీవీపీ పరిధిలోని ఆసుపత్రులలో 12,588 మంజూరు పోస్టులకుగాను 6,586 పోస్టులు ఖాళీగానే ఉన్నాయి.

కేడర్ పోస్టులను కేటాయించకపోవడంతో..

రాష్ట్రంలోని 33 జిల్లాలలో తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) పరిధిలోని ఆసుపత్రులే ప్రధానంగా పేదలకు, గ్రామీణ వర్గాలకు సేవలు అందిస్తున్నాయి. టీవీవీపీ పరిధిలో ప్రస్తుతం 178 ఆసుపత్రులు ఉండగా అందులో రోగులకు సేవలు అందిస్తున్నవి 156 మాత్రమే. మిగతా ఆసుపత్రులు నిర్మాణ దశలో కొన్ని, కాగితాలపై మరికొన్ని ఉన్నాయి. మరో ఐదు ఆసుపత్రులను కూడా టీవీవీపీ పరిధిలోకి తెచ్చినప్పటికీ వాటి సేవలు మొదలు కాలేదు. డైరెక్టర్ ఆఫ్ హెల్త్ (డీహెచ్) పరిధిలో గతేడాది వరకు కొనసాగిన దాదాపు 90కిపైగా ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల (సీహెచ్‌సీ)లను తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) పరిధిలోకి మార్చగా ఆ ఆసుపత్రులకు కేడర్ పోస్టులను కేటాయించకపోవడంతో వైద్యులు, సిబ్బంది కొరత ఎక్కువైంది. అదే సమయంలో టీవీవీపీ పరిధిలో ఉన్న 31 జిల్లా ఆసుపత్రులను వైద్య బోధనా ఆసుపత్రులుగా మార్చి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కిందకు ప్రభుత్వం తీసుకొచ్చింది.

డీఎంఈ పరిధిలోకి 31 ఆసుపత్రులు

కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటు నేపథ్యంలో రాష్ట్రంలోని 33 జిల్లా ఆసుపత్రులలో 31 ఆసుపత్రులను ప్రభుత్వం బోధన ఆసుపత్రులుగా మార్చింది. దీంతో హైదరాబాద్‌లోని కింగ్ కోఠి, వికారాబాద్ జిల్లాలోని తాండూరు ఆసుపత్రులు మాత్రమే టీవీవీపీ కింద మిగిలాయి. అయితే కొడంగల్‌లో మంజూరైన మెడికల్ కళాశాల కోసం తాండూరు ఆసుపత్రిని కూడా డీఎంఈ పరిధిలోకి మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో టీవీవీపీ కింద మిగిలిన జిల్లా ఆసుపత్రి కింగ్ కోఠి హాస్పిటల్ ఒక్కటే. ఈ తరలింపుతో టీవీవీపీకి సంబంధించిన ఆసుపత్రుల సంఖ్య తగ్గినా, డీహెచ్ నుంచి టీవీవీపికి అటాచ్ చేసిన సీహెచ్‌సీ, ఏరియా ఆసుపత్రుల్లో సిబ్బంది కొరత తీవ్ర సమస్యగా మారింది. ఈ సిబ్బంది నియామకం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినప్పటికీ, నియామకాలు జరపడం లేదు.

టీవీవీపీని సెకండరీ డైరెక్టరేట్‌గా మారిస్తేనే..

వైద్య విధాన పరిషత్‌కు స్వతంత్ర హక్కులను ప్రభుత్వం కేటాయించకపోవడంతో అదో ప్రత్యేక కేటగిరీగానే మిగిలిపోయింది. ఈ నేపథ్యంలో టీవీవీపీని ప్రత్యేకంగా సెకండరీ హెల్త్ డైరెక్టరేట్‌గా గుర్తించి ప్రత్యేక నియామకాల ద్వారా సిబ్బంది కొరత తీర్చాలన్న డిమాండ్ ఉంది. అసెంబ్లీ సమావేశాల్లో తీర్మానం ద్వారా టీవీవీపీని రద్దు చేసి సెకండరీ హెల్త్ డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఏడాది క్రితమే నిర్ణయించినా ఇప్పటివరకు ముందడుగు పడలేదు.

ఒకేరోజు లక్ష మంది..

- యాదగిరి గుట్టలో తొలిసారిగా భారీగా దర్శనాలు


శనివారం రాత్రి 10.30 గంటల తరువాత కూడా దర్శనానికి వేచి ఉన్న భక్తులు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామిని శనివారం లక్ష మంది భక్తులు దర్శించుకున్నారు. వేసవి సెలవులు ముగుస్తుండటంతో జంట నగరాలతో పాటు రాష్ట్రం, దేశం నలుదిశల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఉదయం నుంచి రాత్రి 10.30 గంటల వరకు ధర్మదర్శనం, వీఐపీ దర్శనం క్యూలైన్లలో భక్తుల రద్దీ కొనసాగింది. ఒక్క రోజులో లక్ష మంది భక్తులు శ్రీస్వామిని దర్శించుకోవడం ఇదే మొదటి సారని ఆలయాధికారులు చెబుతున్నారు. గత వారం 90 వేల మంది భక్తులు దర్శించుకోగా.. శనివారం రాత్రి 10.30 గంటల తరువాత భక్తులు అధికంగా క్యూలైన్లలో శ్రీస్వామి దర్శనం కోసం వేచి ఉన్నారు. ఆదివారం స్వాతి నక్షత్రంతో పాటు సెలవు రోజు కావడంతో.. భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉందని ఆలయాధికారులు చెబుతున్నారు.

పార్టీపై వ్యతిరేక ప్రచారాన్ని తిప్పికొట్టండి

- బీజేపీ సోషల్ మీడియా వర్క్‌షాప్‌లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: సామాజిక మాధ్యమాల్లో బీజేపీపై జరుగుతున్న వ్యతిరేక ప్రచారాన్ని తిప్పికొట్టాలని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన సోషల్ మీడియా వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సోషల్ మీడియాలో కొన్ని బీజేపీ వ్యతిరేక శక్తులు చేస్తున్న ప్రచారానికి దీటుగా జవాబు ఇవ్వాలన్నారు. సన్న బియ్యం పథకంలో 80 శాతం నిధులు కేంద్ర ప్రభుత్వం నుంచి వస్తున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా గుంతలు కూడా పూడ్చే పరిస్థితి లేదని అన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశాయని మండిపడ్డారు. పదేళ్లు సీఎంగా ఉండాలని రేవంత్, మళ్లీ అధికారంలోకి రావాలని కేసీఆర్ కలలు కంటున్నారన్నారు. తెలంగాణ కష్టకాలంలో ఉందని, ఉద్యోగస్తులకు రిటైర్మెంట్ ప్రయోజనాలు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వలేని దుస్థితి నెలకొందని అన్నారు. రాష్ట్రాన్ని కాపాడాలంటే బీజేపీ అధికారంలోకి రావాలనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

తండ్రి కళ్లముందే కూతురి ఆత్మహత్య

- రక్షించబోయిన తండ్రికి తీవ్ర గాయాలు

సికింద్రాబాద్: అత్తింటి గొడవలతో జీవితంపై విరక్తి చెందిన ఓ మహిళ రైలుకింద పడి ఆత్మహత్య చేసుకునేందుకు రైల్వే ట్రాక్ ఎక్కింది. ఇది గమనించిన తండ్రి వద్దని వారించేందుకు తను కూడా ట్రాక్ మీదకు ఎక్కాడు. ఈ క్రమంలోనే లైట్‌ఇంజిన్ రైలు ట్రాక్ పైన ఉన్న ఇద్దరి మీదుగా దూసుకు వెళ్లింది. ఈ ప్రమాదంలో కన్నతండ్రి కళ్లముందే కూతురు దుర్మరణం పాలైంది. ఆమెను రక్షించే ప్రయత్నం చేసిన తండ్రి తీవ్ర గాయాలపాయ్యాడు. ఘటనకు సంబంధించి జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ డేవిడ్‌రాజు వివరాల ప్రకారం.. బేగంపేట డివిజన్ పాటిగడ్డలో నివాసం ఉంటున్న మహ్మద్‌అలీ డ్రైవర్. ఇతని ఏకైక కుమార్తె ఆలియాబేగం (26)ను బాలానగర్ ప్రాంతం ఫతేనగర్‌కు చెందిన ఆసిఫ్‌కు ఇచ్చి 11 ఏళ్ల క్రితం వివాహం చేశారు. వారికి ఇద్దరు పిల్లలు. భర్త తరచూ గొడవ పడుతుండటం, మానసికంగా శారీరకంగా వేధిస్తుండటంతో విరక్తి చెందిన ఆలియా బేగం మూడు రోజుల క్రితం పిల్లలను తీసుకుని పాటిగడ్డలోని పుట్టింటికి వచ్చింది. శనివారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయటకు వెళ్లింది. అనుమానం వచ్చిన తండ్రి సమీపంలోని సంజీవయ్యపార్కు రైల్వేస్టేషన్ రైల్వేట్రాక్‌ను అనుసరిస్తూ వెళ్లగా కూతురు ట్రాక్‌పై కనిపించింది. పరుగున ట్రాక్ వద్దకు వెళ్లి కుమార్తెను ఆత్మహత్య వద్దని వారిస్తున్న సమయంలోనే సికింద్రాబాద్ నుంచి నాంపల్లి వెళుతున్న రైలు ఢీ కొట్టింది. ఆలియా బేగం మృతిచెందగా, అలీ తీవ్రంగా గాయపడ్డాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆలియాబేగం మృతదేహాన్ని గాంధీ మార్చురీకి, మహ్మద్‌అలీని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

ఈ నగరాలు... సముద్రం పాలు!


ముంబై

తీరప్రాంతాలను శరవేగంగా కబళిస్తున్న కడలి

- ప్రపంచమంతటా పెరుగుతున్న సముద్రమట్టాలు
- సమస్యకు చెక్ పెట్టేందుకు దేశాల ప్రయత్నాలు

నదీజలాలు. నాగరికతకు పుట్టినిళ్లు. అత్యంత భారీ వర్షాలు వచ్చినప్పుడు ఉగ్రరూపంలో ఉప్పొంగినా తర్వాత సాధారణ స్థితికి వచ్చి మానవులకు ఎన్నో రకాలుగా ఉపయోగపడతాయి. కానీ సముద్రజలాలు అలాకాదు. ప్రపంచవ్యాప్తంగా సముద్ర తీరమున్న ఎన్నో పట్టణాలను ఇప్పుడు సముద్ర జలాల పెరిగే నీటిమట్టాలు అక్కడి ప్రజల్లో ఆందోళన మట్టాలను అమాంతం పెంచేస్తున్నాయి. తరతరాలుగా తీరప్రాంతాల్లోనే స్థిరనివాసం ఏర్పాటుచేసుకుని ఉంటున్న స్థానికులను సాగరజలాలు ఇప్పుడు బద్ధశత్రువుగా మారాయి. తీవ్రమైన వ్యాధి శరీరాన్ని కబళించినట్లు ఈ సముద్రజలాలు నెమ్మదిగా ఆయా తీరప్రాంతాల సమతల భూభాగాలను శాశ్వతంగా తనలో కలిపేసుకుంటున్నాయి. శరవేగంగా పెరుగుతున్న సముద్ర నీటిమట్టాలు ఇప్పుడు కోట్లాది మంది ప్రజలకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా డజనుకుపైగా తీరప్రాంతాల్లో సముద్ర నీటిమట్టాలు ఇటీవలికాలంలో చాలా అత్యధిక వేగంతో పెరుగుతున్నాయని సింగపూర్‌లోని నాంయాంగ్ టెక్నాలజికల్ యూనివర్సిటీ(ఎన్‌టీయూ) శాస్త్రవేత్తలు కుండబద్దలు కొట్టారు. 2014 నుంచి చూస్తే గత ఆరేళ్లలోనే ఏటా ఒక సెంటీమీటర్ ఎత్తు సముద్రజలాల నీటిమట్టం పెరుగుతూ తీరప్రాంతాలను శాశ్వతంగా ముంచేసినట్లు తాజా అధ్యయనంలో తేలింది. ఆసియా, ఆఫ్రికా, యూరప్, ఉత్తర అమెరికా, ద.అమెరికా ఖండాల్లో 48 తీరనగరాలకు తీరనిశోకంగా సాగరజలాలు మారాయని అధ్యయనం పేర్కొంది. వాతావరణ మార్పులకుతోడు కుంగిపోతున్న భూమి కారణంగా ఈ సమస్య తీవ్రమవుతోందని తేలింది. రెండేళ్ల క్రితం ఈశాన్యచైనాలోని తియాంజిన్ నగరంలో తీరప్రాంత వీధులన్నీ కుంగడంతో వేలాది మందిని అపార్ట్‌మెంట్ల నుంచి హుటాహుటిన ఖాళీ చేయించారు. 2014 నుంచి 2020 ఏడాది వరకు చూస్తే తియాంజిన్ నగర భూభాగం ఏటా 18.7 సెంటీమీటర్లమేర కుంగింది. సముద్రజలాలు పెరిగి భూగర్భజలాలు పెరగడంతో నేల కుంగింది.

ముంపు బారిన ముంబై

దేశ వాణిజ్య రాజధాని ముంబై మహానగరాన్నీ ముంపు సమస్య పట్టిపీడిస్తోంది. 2014 నుంచి చూస్తే సంవత్సరానికి 0.01 సెం.మీ.ల నుంచి 5.9 సెంటీమీటర్ల స్థాయిలో ముంబైలోని చాలా ప్రాంతాలను సముద్రనీరు ముంచేసింది. ఏటా 1 సెం.మీ.చొప్పున నేల సముద్రజలాల్లో కలిసిపోతున్న చోట్ల 62 లక్షల మంది జీవిస్తున్నట్లు ఎన్‌టీయూ అధ్యయనకారులు ప్రకటించారు. మాతుంగా ఈస్ట్‌లోని కింగ్ సర్కిల్ స్టేషన్ ప్రాంతం వేగంగా ముంపునకు గురవుతోంది. ఇక్కడ ఏటా 2.8 సె.మీ.ల మేర సముద్రజలాలు పెరుగుతున్నాయి. విశ్వవ్యాప్తంగా సాగరజలాలు గత ఏడాది 0.59 సెంటీమీటర్లమేర ఎగిశాయని నాసా అధ్యయనంలో స్పష్టమైంది. భూగర్భజలాలను విచ్చలవిడిగా తోడేయడం, ఊహించనంత బరువుతో ఆకాశహర్మ్యాలను నిర్మించడం, నిరాటంకంగా కొనసాగుతున్న మెట్రో ప్రాజెక్ట్ పనులు, చిత్తడి నేలలను ప్రభుత్వాలు పునరుద్ధరించడం తదితర కారణాలు సైతం మహానగరంలోకి సాగరజలాలు చొచ్చుకొచ్చేలా చేస్తున్నాయి. కనీసం 50 లక్షల జనాభా ఉన్న సముద్రతీర నగరాల వెంట సముద్ర నీటిమట్టాలు పెరుగుతున్న అంశాన్ని ఉపగ్రహాల సాయంతో విశ్లేషించి ఈ అధ్యయనం చేశారు.

అగ్రరాజ్యంలోనూ..

అమెరికాలోని మయామీ సిటీని సాగరజలాలు ముంచెత్తుతున్నాయి. 2014 నుంచి 2020 వరకు చూస్తే మయామీ సిటీలో కోకోనట్ గ్రోవ్‌సహా చాలా ప్రాంతాలు గరిష్ఠంగా 2.2 సెంటీమీటర్లమేర సముద్రజలాల మట్టాలు పెరిగాయి. ఏటా 1 సెం.మీ. సముద్రనీరు పెరుగుతున్న ప్రాంతాలు 43,000 మందికిపైగా అమెరికన్లు నివసిస్తున్నారు. న్యూయార్క్ నగరంలోని క్వీన్స్ పరిధిలోని బ్రీజీ పాయింట్ వద్ద నీరు ఏటా 3 సె.మీ.ల మేర పెరుగుతోంది. ఇక్కడ ఏటా 1 సెం.మీ. సముద్రనీరు పెరుగుతున్న చోట 1,03,000 మందికిపైగా అమెరికన్లు నివసిస్తున్నారు. లాస్ ఏంజెలిస్ సిటీలోని శాన్ పెడ్రో సహా పలు తీర ప్రాంతాల్లో నీరు ఏటా 2.5 సె.మీ.ల మేర పెరుగుతోంది. హ్యూస్టన్ సిటీ పరిధిలో గరిష్ఠంగా ఏకంగా 11 సెం.మీ. మేర సముద్రమట్టాలు పెరుగుతున్నాయి. హ్యూస్టన్‌లోని సెంట్రల్ సౌత్‌వెస్ట్ ప్రాంతంలో ఏటా 8 సెం.మీ.ల మేర సముద్రనీరు పైకొస్తోంది.

తాత్కాలిక ప్రత్యామ్నాయాలు

జకార్తా, ఈజిప్ట్‌లోని అలెగ్జాండ్రియా, వియత్నాంలోని హో చీ మిన్ సిటీల్లోకి పెరిగిన సముద్రమట్టాలు చొచ్చుకురాకుండా గోడలు, అవరోధాలు నిర్మించారు. వచ్చిన నీరు అక్కడే తిష్టవేయకుండా కందకాల వంటి తవ్వి నీటిని మరో చోటుకు మళ్లించారు. అయితే ''గోడలు ఒకరకంగా మంచి చేస్తే మరోరకంగా చేటుచేస్తున్నాయి. ఎగువ నుంచి వరద వస్తే మళ్లీ ముంపు సమస్య అలాగే ఉండిపోతుంది'' అని ఇటలీలోని పడోవా యూనివర్సిటీలో ప్రొఫెసర్ పెట్రో తియాటినీ చెప్పారు.

కొత్త పరిష్కారం చూపుతున్న జపాన్

భూకంపాలను తట్టుకునేలా నిర్మాణాలు చేస్తున్న జపాన్ ఇప్పుడు సముద్రమట్టాల పెరుగుదల ముప్పుకూ మరో పరిష్కారం వెతికింది. విచ్చలవిడిగా భూగర్భజలాలను వాడడంతో నేల కుంగి పరోక్షంగా సముద్రనీరు చొచ్చుకొస్తున్న నేపథ్యంలో గ్రౌండ్‌వాటర్ అతి తోడివేతకు చెక్ పెట్టింది. ఈ విషయంలో కఠిన నిబంధనలను అమలుచేస్తోంది. పటిష్టవంతమైన నీటి పారుదల వ్యవస్థను ఏర్పాటుచేసింది. 2014 ఏడాది నుంచి చూస్తే 0.01–2.3 సె.మీ.ల స్థాయిలో నేల కుంగినా ఇప్పుడు మాత్రం ఆ దురవస్థ నుంచి కాస్తంత బయటపడింది. ఎగువ ప్రాంతాలు, అడువులు, నదుల నుంచి సిటీ వైపుగా వచ్చే నీటిని నగరానికి దూరంగా ఉన్న రెండు రిజర్వాయర్లలో నింపుతోంది. అక్కడి నుంచి అవసరమైన మేరకే నీటి నగరంలో జనావాసాలకు, పరిశ్రమలకు సరఫరాచేస్తోంది. అయితే జపాన్ మోడల్ అన్ని దేశాలకు పనికొస్తుందో లేదో తెలీదు. పైగా ఇది అత్యంత ఖర్చుతో కూడిన వ్యవహారమని జపాన్‌లోని వసేడా యూనివర్సిటీలో ప్రొఫెసర్ మిగూయెల్ ఎస్టిబాన్ అభిప్రాయపడ్డారు. భూగర్భజలాల అతి తోడివేతను తగ్గించుకుని తైపే నగరం ఈ సమస్య నుంచి కాస్తంత బయటపడింది. దీనికితోడు బ్యాంకాక్, అమెరికాలోని హ్యూస్టన్, బ్రిటన్‌లోని లండన్ నగరాలు సైతం భూగర్భజాలాల అతివాడకానికి చరమగీతం పాడాయి.

భూగర్భజలాలు పైకి రావడానికి కారణాలెన్నో..

తీర ప్రాంతాల వెంట భవనాల నిర్మాణం, గనుల తవ్వకం, భూఫలకాల కదలికలు, భూకంపాలు, సహజంగా భూమిపొరలు ఒత్తుకునిపోవడం తదితర కారణాలతో భూమి కాస్తంత కుంగుతుంది. వీటికితోడు కింది పొరలో భూగర్భజలాలు ఉన్న చోటు నుంచి మనం నీటిని తోడేసి ఖాళీచేస్తున్నాం. దీంతో అప్పటిదాకా భూగర్భజలాలపై ఉన్న శిలలు, నేల పొరలు కిందకు పడిపోతున్నాయి. ఇలా భూమి కుంగుతోంది. '' అత్యధికంగా భూమి కుంగుతున్న 48 తీరప్రాంతాల్లో సగం ప్రాంతాలు ఈ సమస్యకు అతిగా భూగర్భజలాలను తోడేయడమే కారణం'' అని ఎన్‌టీయూ పరిశోధనలో కీలక పరిశోధకురాలు చెరిక్ టే చెప్పారు. జకార్తా వంటి నగరాల్లో భూగర్భజలాలను వెలికితీయడం మరీ ఎక్కువైందని ఆయన వెల్లడించారు. '' అత్యధిక అభివృద్ధి ప్రాజెక్టులు, జనాభా ఉన్న దేశాల్లో అధిక భూగర్భజలాల వినియోగం కనిపిస్తోంది. ముఖ్యంగా, ఆసియా, తూర్పు ఆసియా ప్రాంతాల్లో ఈ సమస్య తీవ్రమవుతోంది. తక్కువ ఎత్తున్న డెల్టా ప్రాంతాల్లో వెలిసిన నగరాలకు ఈ సమస్య మరీ ఎక్కువ. సముద్రంలో కలవడానికి ముందే ఎక్కువ పాయలుగా విడిపోయి ప్రవహించే నదుల వెంట ఉన్న ప్రాంతాల్లోనూ ఇదే సమస్య కనిపిస్తోంది. జకార్తా, బ్యాంకాక్, హో చి మిన్ సిటీ, షాంఘైలకు ఈ ముంపు ముప్పు ఎక్కువ. జకార్తా సిటీలో సగం ప్రాంతాలు సముద్ర నీటిమట్టం కంటే తక్కువ ఎత్తులో ఉండటం గమనార్హం. 1970 ఏడాదితో పోలిస్తే జకార్తాలో ప్రస్తుతం పలు ప్రాంతాలు 4 సెం.మీ. కుంగిపోయాయి. ఈ కారణంగానే తీరానికి కాస్తంత దూరంగా నుసంతారా పేరిట కొత్త రాజధానిని ప్రభుత్వం నిర్మిస్తోంది. '' తీరం వెంట మా ఇల్లు ఉంది. ఇంటి కిటికీలు నా చిన్నప్పుడు మెడ ఎత్తులో ఉండేవి. ఇప్పుడు మోకాలు ఎత్తుకు వచ్చేశాయి. నేలపై సముద్రనీరు చొచ్చుకొచ్చినప్పుడల్లా మా ఇంటి అడుగును పూడుస్తూ వచ్చాం. దీంతో గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఇంటి ఎత్తు తగ్గుతూ వస్తోంది. చివరకు గ్రౌండ్‌ఫ్లోర్ మొత్తం మునిగిపోతుందో, ఇల్లే కూలిపోతుందో మాకే అర్థంకావట్లేదు'' అని నార్త్ జకార్తాలోని ఎర్నా, ఆమె తల్లి సోనీ వాపోయారు.

షాంఘై వినూత్న పంథా

షాంఘై నగరం వాటర్ ఇంజెక్షన్ అనే కొత్త విధానాన్ని అవలంబిస్తోంది. యాంగ్జే నది నుంచి సేకరించిన నీటిని శుద్ధిచేసి ఆ నీటిని బావులు, ఇతర మార్గాల ద్వారా నేలలోకి పంపిస్తోంది. నీటిని తోడేందుకు వేసిన బోరుబావుల రంధ్రాల నుంచి నీటిని నేలలోకి పంపుతోంది. అలా భూగర్భజలాల మట్టాలను పెంచుతోంది. తద్వారా భూగర్భజలాల సమతుల్యతను కాపాడుతోంది. చైనాలోని చోంగ్‌క్వింగ్, ఎల్‌సాల్విడార్‌లోని శాన్ సాల్విడార్ సిటీలో 'స్పాంజ్ సిటీ' పంథాలో వెళ్తున్నాయి. అత్యధిక నీటిని పీల్చుకునే మట్టిరకం, చెట్లు, గడ్డిని పెంచుతున్నాయి. అదనంగా వచ్చిన నీరు పార్కుల్లోకి, చిత్తడినేలల్లోకి వెళ్లేలే ఏర్పాట్లుచేశారు. ''అదనపు నీటిని నిల్వచేసేందుకు పెద్ద రిజర్వాయర్ కట్టాలంటే చాలా ఖర్చు అవుతుంది. దీనితో పోలిస్తే పదో వంతు వ్యయంతోనే సమస్యకు పరిష్కారం వెతకొచ్చు'' అని వర్జీనియా టెక్ వర్సిటీలో ప్రొఫెసర్ మనోషెహర్ షెర్జాయీ చెప్పారు. - సాక్షి, నేషనల్ డెస్క్

'తీవ్రమైన పేదరికం' తగ్గుముఖం

భారత్‌లో పదేళ్లలో 16.2 నుంచి 2.3 శాతానికి తగ్గుదల

ప్రపంచ బ్యాంకు నివేదిక

న్యూఢిల్లీ: భారతదేశంలో 'తీవ్రమైన పేదరికం'రేటు క్రమంగా తగ్గిపోతోందని ప్రపంచ బ్యాంకు ఒక నివేదికలో వెల్లడించింది. 2011–12లో పేదరికం రేటు 16.2 శాతం ఉండగా, పదేళ్ల తర్వాత 2022–23 నాటికి 2.3 శాతానికి తగ్గిపోయినట్లు పేర్కొంది. రోజుకు 3 డాలర్లు (రూ.257) సంపాదిస్తే పేదలు కానట్లేనని ప్రపంచ బ్యాంకు గతంలో స్పష్టంచేసిన సంగతి తెలిసిందే. రోజుకు 2.15 డాలర్లు సంపాదిస్తే పేదలు కాదనే సూత్రీకరణ 2017 దాకా ఉండేది. దాన్ని 2021లో 3 డాలర్లకు పెంచారు. ఇండియాలో 2011–12లో దారిద్ర్య రేఖకు దిగువన (బీపీఎల్) 34 కోట్ల మంది ఉండగా, 2022–23 నాటికి వారి సంఖ్య 7.5 కోట్లకు పడిపోయినట్లు ప్రపంచ బ్యాంకు నివేదిక స్పష్టం చేసింది. పేదరిక నియంత్రణలో ఇండియా చక్కటి పురోగతి సాధిస్తున్నట్లు తెలియజేసింది.

- 2024లో ఇండియాలో 5.46 కోట్ల మంది రోజువారీ సంపాదన 3 డాలర్ల కంటే తక్కువే ఉంది. ఈ లెక్కన తీవ్రమైన పేదరికం రేటు 5.44 శాతంగా ఉన్నట్లు ప్రపంచ బ్యాంకు లెక్కగట్టింది.
- ఉచితం లేదా రాయితీతో కూడిన ఆహారాన్ని ప్రభుత్వాలు పంపిణీ చేస్తుండడం, కొత్తగా ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తుండడంతో పేదరికం తగ్గుముఖం పడుతోంది.
- అలాగే పేదరికం విషయంలో పల్లెలు-పట్టణాల మధ్య అంతరం తగ్గిపోతుండడం మరో కీలక పరిణామం.
- అత్యంత పేదల్లో 54 శాతం మంది ఐదు అధిక జనాభా కలిగిన రాష్ట్రాల్లోనే ఉన్నారు.
- 2011–12 నుంచి 2022–23 మధ్య దేశంలో 17.1 కోట్ల మంది తీవ్రమైన పేదరికం నుంచి బయటపడ్డారు.
- ఇదే సమయంలో గ్రామీణ ప్రాంతాల్లో తీవ్రమైన పేదరికం 18.4 శాతం నుంచి 2.8 శాతానికి, పట్టణాల్లో 10.7 శాతం నుంచి 1.1 శాతానికి పడిపోయింది. పల్లెలు-పట్టణాల మధ్య అంతరం 7.7 శాతం నుంచి 1.7 శాతానికి తగ్గిపోయింది.

గురుదక్షిణగా ఐసీటీకి రూ.151 కోట్ల విరాళం

రిలయన్స్ సంస్థ చైర్మన్ ముకేశ్ అంబానీ ప్రకటన

న్యూఢిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ చైర్మన్, ఎండీ ముకేశ్ అంబానీ మరోసారి తన పెద్దమనసు చాటుకున్నారు. ముంబైలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ(ఐసీటీ)కి రూ.151 కోట్ల విరాళం ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఆయన 1970వ దశకంలో ఇక్కడే గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. అప్పట్లో ఈ విద్యాసంస్థను యూనివర్సిటీ డిపార్టుమెంట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ(యూడీసీటీ)గా పిలిచేవారు. ముకేశ్ అంబానీ శుక్రవారం ఐసీటీలో ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. అప్పటి తమ ప్రొఫెసర్ శర్మ బోధించిన పాఠాలు, అందించిన స్ఫూర్తిని గుర్తుచేసుకున్నారు. భారత ఆర్థిక సంస్కరణల రూపకల్పనలో ప్రొఫెసర్ శర్మ కీలక పాత్ర పోషించారని చెప్పారు. మన దేశం అన్ని రకాల సవాళ్లను అధిగమించి గ్లోబల్ లీడర్‌గా ఎదగాలని తన తండ్రి ధీరూబాయ్ అంబానీ తరహాలోనే ప్రొఫెసర్ శర్మ కూడా ఎంతగానో తపనపడ్డారని తెలిపారు. ప్రైవేట్ పారిశ్రామికవేత్తలకు సైన్స్ అండ్ టెక్నాలజీ కూడా తోడైతే ఆర్థిక రంగంలో ఇండియా పరుగులు తీస్తుందని వారు విశ్వసించారని పేర్కొన్నారు. వారిద్దరూ గొప్ప దార్శనికులు అని కొనియాడారు. ప్రొఫెసర్ శర్మ కృషి వల్లే ఐసీటీ అత్యున్నత విద్యాసంస్థగా మారిందని చెప్పారు. ప్రొఫెసర్ శర్మను 'భారత్ గురు'గా అభివర్ణించారు. ఆయనకు గురుదక్షిణగా ఐసీటీకి రూ.151 కోట్లు ఎలాంటి షరతులు లేకుండా ఇస్తున్నట్లు ముకేశ్ అంబానీ ప్రకటించారు. తన గురువు ప్రొఫెసర్ శర్మ సూచనతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. విద్య నేర్పిన ఐసీటీకి పెద్ద మేలు చేయాలని చెప్పడంతో ఆయన ఆదేశాలను శిరసావహించినట్లు పేర్కొన్నారు.

సోనియా గాంధీకి అస్వస్థత

సిమ్లా: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, రాజ్యసభ సభ్యురాలు సోనియా గాంధీ(78) అస్వస్థతకు గురయ్యారు. కుమార్తె ప్రియాంక గాంధీతో కలిసి గత సోమవారం హిమాచల్ ప్రదేశ్‌లోని సిమ్లాకు వ్యక్తిగత పర్యటన కోసం వచ్చిన సోనియా శనివారం ఒక్కసారిగా అధిక రక్తపోటుకు గురయ్యారు. దాంతో ఆమెను చికిత్స కోసం సిమ్లాలోని ఇందిరా గాంధీ మెడికల్ కాలేజీ హాస్పిటల్‌కు తీసుకెళ్లినట్లు హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి మీడియా సలహాదారు నరేశ్ చౌహాన్ చెప్పారు. కొన్ని పరీక్షల అనంతరం సోనియా గాంధీ డిశ్చార్జి అయినట్లు వెల్లడించారు. ప్రియాంక గాంధీకి సిమ్లా శివారులోని చరబ్రలో సొంత ఇల్లు ఉంది. తల్లికుమార్తెలు ప్రస్తుతం అక్కడే ఉంటున్నారు.



హెలికాప్టర్ అత్యవసర ల్యాండింగ్

భక్తులతో కేదార్‌నాథ్ వెళ్తూ నడిరోడ్డుపై దిగిన హెలికాప్టర్

రుద్రప్రయాగ్: చార్ ధామ్ యాత్రామార్గంలో మరో హెలికాప్టర్ ప్రమాదం జరిగింది. అయితే ఈసారి ఎలాంటి ప్రాణనష్టంలేకుండానే హెలికాప్టర్‌లోని భక్తులంతా ప్రాణాలతో బయటపడ్డారు. ఉత్తరాఖండ్‌లోని రుద్రప్రయాగ్ జిల్లాలో ఈ ఘటన జరిగింది. క్రేస్ట్రాల్ ఏవియేషన్ సంస్థకు చెందిన అగస్టావెస్ట్‌ల్యాండ్ 119 రకం హెలికాప్టర్ శనివారం మధ్యాహ్నం కేదార్‌నాథ్‌కు ఐదుగురు భక్తులతో సిర్సీలోని బదాసూ బేస్ నుంచి బయల్దేరింది. కొంత సేపు ప్రయాణం తర్వాత అది అదుపు తప్పింది. అప్పుడు అది కొండ కొన వెంట ఉన్న జాతీయరహదారి పక్కనే ఎగురుతోంది. వెంటనే ప్రమాద తీవ్రతను తగ్గించేందుకు పైలట్ హెలికాప్టర్‌ను హైవే మీదకు తీసుకొచ్చి నడిరోడ్డుపై ల్యాండ్‌చేశాడు. ఎమర్జెన్సీ ల్యాండింగ్ అయ్యే క్రమంలో అది రహదారి పక్కనే ఉన్న ఒక భవనానికి తగిలింది. హెలికాప్టర్ రెక్క రోటార్ రహదారి పక్కన నిలిపి ఉంచిన కారుపై పడింది. ఎలాంటి మంటలు చెలరేగకపోవడంతో హెలికాప్టర్‌లోని ఐదుగురు భక్తులు, పైలట్ ప్రాణాలతో బయటపడ్డారు. హెలికాప్టర్ హఠాత్తుగా రోడ్డు మీదకు దూసుకురావడంతో రహదారిపై వెళ్తున్న జనం ప్రాణభయంతో పరుగులు తీశారు. గత 30 రోజుల్లో చార్ ధామ్ యాత్రా పరిధిలో హెలికాప్టర్లు ఇలా ప్రమాదాలకు గురికావడం ఇది నాలుగోసారి. మే 8వ తేదీన ఉత్తరకాశీ జిల్లాలో గంగోత్రి ఆలయానికి బయల్దేరిన ఒక ప్రైవేట్ హెలికాప్టర్ కూలిన ఘటనలో ఆరుగురు చనిపోవడం తెల్సిందే. మే 12న బద్రీనాథ్ నుంచి సెర్సీకి ప్రయాణిస్తూ మరో హెలికాప్టర్ హఠాత్తుగా ఉఖీమఠ్‌లో పాఠశాల ప్రాంగణంలో అత్యవసరంగా ల్యాండవడం తెల్సిందే.

ట్రంప్ గద్దె దిగడమా, నాన్సెన్స్!

మస్క్ జోస్యాన్ని ఖండించిన వాన్స్ ● డెమొక్రాట్లకు మద్దతిస్తే ఖబడ్దార్: ట్రంప్


వాన్స్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ వివాదంపై ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ స్పందించారు. అధ్యక్షునితో తలపడటం ద్వారా ఆయన పెద్ద తప్పిదం చేస్తున్నారన్నారు. ఎప్‌స్టీన్ లైంగిక కుంభకోణంతో ట్రంప్‌కు సంబంధముందని, ఆయన గద్దె దిగి వాన్స్ అధ్యక్షుడు కావడం ఖాయమని మస్క్ పేర్కొనడం తెలిసిందే. ఆ వ్యాఖ్యలను 'నాన్సెన్స్'అంటూ వాన్స్ శుక్రవారం కొట్టిపారేశారు. అధ్యక్షునిగా ట్రంప్ అద్భుతంగా పని చేస్తున్నారన్నారు. అయనపై మస్క్ ఆరోపణలను ఖండించారు. ''ఇలాంటి గొడవలు అందరి విషయంలోనూ జరుగుతుంటాయి. అందులోనూ మస్క్ చాలా ఎమోషనల్. కాస్త నెమ్మదించారంటే అంతా సర్దుకుంటుంది. కొంతకాలానికి ఆయనే మా వద్దకు తిరిగొస్తారు'' అని అభిప్రాయపడ్డారు. ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో ట్రంప్ పేరుందంటూ చేసిన ఎక్స్ పోస్టులను మస్క్ తాజాగా తొలగించారు. అయితే, 'ఆ పోస్టులను ఫ్యూచర్ రిఫరెన్స్ కోసం దాచిపెట్టుకోండి'అంటూ భావగర్భితంగా పోస్ట్ చేశారు. మరోవైపు, మస్క్‌తో తాను మాట్లాడబోతున్నానంటూ వచ్చిన వార్తలను ట్రంప్ ఖండించారు. ''ఆ మతి చెడిన మనిషితోనా? అలాంటి ఉద్దేశమేదీ నాకు లేదు. నిజానికి మస్కే నాతో మాట్లాడేందుకు ప్రయత్నించారు. నేనే పట్టించుకోలేదు''అని స్పష్టం చేశారు. అంతేగాక ఆయన కంపెనీలకు ప్రభుత్వం కట్టబెట్టిన కాంట్రాక్టులన్నింటినీ పూర్తిగా సమీక్షిస్తానని ప్రకటించారు. ''అంతా నిబంధనల మేరకే ఉంటే ఓకే. లేదంటే ఏం చేయాలో ఆలోచిస్తాం''అని స్పష్టం చేశారు. మస్క్ కంపెనీలపై గతంలో జరిగిన విచారణలను తిరగదోడతారా అని ప్రశ్నించగా, ''అలాంటివి జరిగాయా? నాకు తెలియదు. అదే నిజమైతే ఏం జరగాలో అదే జరుగుతుంది''అంటూ స్పందించారు. ''చైనా, రష్యా, ఇరాన్ వంటి అంతర్జాతీయ అంశాలతో నేనిప్పుడు యమా బిజీగా ఉన్నా. మస్క్ గురించి ఆలోచించే తీరిక కూడా లేదు. మస్కే కాదు, ఒక్క నేను తప్ప ఎవరున్నా లేకున్నా అమెరికాకు వచ్చిన లోటేమీ లేదు''అంటూ తనదైన శైలిలో వ్యాఖ్యలు చేశారు. మిడ్ టర్మ్ ఎన్నికల్లో ట్రంప్ డెమొక్రాట్లకు మద్దతిస్తే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

మస్క్ కొత్త పార్టీ!

ట్రంప్‌తో రగడ నేపథ్యంలో మస్క్ కొత్త పార్టీ దిశగా అడుగులు వేస్తున్నట్టు కన్పిస్తోంది. 80 శాతం మంది అమెరికన్లకు ప్రాతినిధ్యం వహించేలా కొత్త పార్టీ పెడితే ఎలా ఉంటుందంటూ ఎక్స్‌లో ఆయన ఒపీనియన్ పోల్ పెట్టడం తెలిసిందే. దాన్ని 80 శాతం మంది సమర్థించినట్టు శుక్రవారం మస్క్ ప్రకటించారు. ''80 శాతం మందికి ప్రాతినిధ్యం వహించే పార్టీకి 80 శాతం మద్దతు. విధి అంటే ఇదేనేమో!''అని ఒక పోస్టులో ఆయన హర్షం వెలిబుచ్చారు. ఆ వెంటనే 'ద అమెరికా పార్టీ'అంటూ మరో పోస్ట్ పెట్టారు. అది ఆయన పెట్టబోయే కొత్త పార్టీ పేరు కావచ్చని భావిస్తున్నారు. మస్క్ రష్యాలో స్థిరపడాలనుకుంటే రెడ్‌కార్పెట్ పరుస్తామని ఆ దేశ చట్టసభ డ్యూమా సభ్యుడు ద్మిత్రీ నొవికోవ్ ప్రకటించారు. ఆయన కోరితే రాజకీయ ఆశ్రయం కల్పిస్తామన్నారు. అయితే ట్రంప్–మస్క్ రగడపై స్పందించేందుకు రష్యా అధ్యక్షుడు పుతిన్ అధికార ప్రతినిధి ద్మిత్రీ పెస్కోవ్ నిరాకరించారు.

'మహా' మ్యాచ్‌ఫిక్సింగ్

అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ టోటల్ రిగ్గింగ్

- వ్యవస్థలనూ వాడుకుంది: రాహుల్
- బిహార్‌లోనూ అమలు చేస్తుందని జోస్యం



న్యూఢిల్లీ/నాగపూర్: మన దేశంలో ఎన్నికల నిర్వహణ తీరుతెన్నులపైనే తీవ్ర అనుమానాలు రేకెత్తుతున్నాయని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఆవేదన వెలిబుచ్చారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని మోదీ సర్కారు భారీ స్థాయిలో ఎన్నికల అక్రమాలకు పాల్పడుతూ వస్తోందని మండిపడ్డారు. అందుకోసం కీలకమైన జాతీయ స్థాయి సంస్థలను సైతం చెరబడుతోందని కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఉద్దేశించి తీవ్ర ఆరోపణలు చేశారు. ''నేను మాట్లాడుతున్నది చిన్నా చితకా ఎన్నికల అక్రమాల గురించి కాదు. ఒక పరిశ్రమ స్థాయిలో మొత్తం ఎన్నికల ప్రక్రియనే రిగ్గింగ్ చేసేస్తున్నారు. ప్రతిసారీ కాకున్నా ఇది తరచూ జరుగుతోంది. గతంలో పలు ఎన్నికల ఫలితాలు ఆశ్చర్యం కలిగించాయి. ఇటీవలి మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలైతే అందరినీ విస్మయపరిచాయి. ఆ ఎన్నికల్లో పూర్తిగా 'మ్యాచ్‌ఫిక్సింగ్' జరిగింది. మోదీ సర్కారు వాటి ఫలితాలను టోటల్‌గా రిగ్గింగ్ చేసింది. ప్రజాస్వామ్యాన్ని ఎలా చెరబట్టడమెలాగో చెప్పేందుకు ఆ ఎన్నికలు బ్లూప్రింట్‌గా నిలిచిపోయాయి''అంటూ రాహుల్ తూర్పారబట్టారు. ఈ మేరకు శనివారం ఎక్స్‌లో పలు పోస్టులు చేశారు. 'మ్యాచ్‌ఫిక్సింగ్–మహారాష్ట్ర'అంటూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ వార్తా పత్రికలో తాను రాసిన ఎడిట్ పేజీ వ్యాసాన్ని షేర్ చేశారు. మ్యాచ్‌ఫిక్సింగ్ ప్రక్రియను ఐదు పాయింట్లలో వివరించారు. ''మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో గెలవకపోతే పరువు పోతుందనే భయంతో బీజేపీ అన్ని అక్రమాలకూ పాల్పడింది. ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న బిహార్‌లో కూడా మహారాష్ట్ర తరహా మ్యాచ్‌ఫిక్సింగ్‌కు పథకరచన చేస్తోంది''అంటూ జోస్యం చెప్పారు. హోరాహోరీ పోరు ఖాయమని అంతా భావించిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో 288 స్థానాలకుగాను బీజేపీ, దాని ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు కనీవినీ ఎరగని రీతిలో ఏకంగా 235 సీట్లలో నెగ్గడం తెలిసిందే. అంతకు ఐదు నెలల క్రితమే జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం రాష్ట్రంలోని 48 స్థానాల్లో విపక్ష ఎంవీఏ కూటమికి 31 రాగా ఎన్డీఏ కూటమి 17 సీట్లతో సరిపెట్టుకుంది.

వయోజనుల కంటే ఓటర్లే ఎక్కువ!

''2019 అసెంబ్లీ ఎన్నికల నాటికి మహారాష్ట్ర ఓటర్ల సంఖ్య 8.98 కోట్లు. 2024 మేలో లోక్‌సభ ఎన్నికల నాటికి 9.29 కోట్లకు పెరిగింది. అంటే ఐదేళ్ల వ్యవధిలో కేవలం 31 లక్షలు పెరిగింది. కానీ 2024 నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల నాటికి ఏకంగా 9.7 కోట్లకు పెరిగింది! కేవలం ఐదు నెలల్లోనే ఓటర్లు ఏకంగా 41 లక్షల మేరకు పెరిగారు! ఇదెలా సాధ్యం? పైగా ప్రభుత్వ అధికారిక గణాంకాల ప్రకారమే మహారాష్ట్రలో మొత్తం వయోజనుల సంఖ్య 9.54 కోట్లు. ఓటర్ల సంఖ్య అంతకుమించి ఉండటాన్ని ఎలా అర్థం చేసుకోవాలి?''అని రాహుల్ ప్రశ్నించారు. ''ఇదొక్కటే కాదు. పోలింగ్‌లోనూ తీవ్ర అక్రమాలు జరిగాయి. సాయంత్రం ఐదింటికి 58.22 శాతం పోలింగ్ నమోదైంది. మర్నాడు ఉదయం మాత్రం మొత్తం పోలింగ్ శాతం 66.05 అని ప్రకటించారు. ఏకంగా 7.83 శాతం పెరుగుదల ఎలా సాధ్యం?''అని ప్రశ్నించారు.

మళ్లీ అవే ఆరోపణలు: ఈసీ

మహారాష్ట్ర ఎన్నికల్లో అక్రమాలు జరిగాయన్న రాహుల్ ఆరోపణలను కేంద్ర ఎన్నికల సంఘం తీవ్రంగా ఖండించింది. ''పోలింగ్ ప్రక్రియ మొత్తం ఆయా పార్టీల పోలింగ్ ఏజెంట్ల సమక్షంలోనే పారదర్శకంగా జరిగింది. రాహుల్ ఆరోపిస్తున్నట్టు అసాధారణ ఓటింగ్ జరిగిందంటూ కాంగ్రెస్, ఆ పార్టీ పోలింగ్ ఏజెంట్లెవరూ ఫిర్యాదు చేయలేదు'' అని ఈసీ వర్గాలు గుర్తు చేశాయి. ఈసీ వర్గాల వాదనపై రాహుల్ స్పందించారు. అనధికారిక స్పందనలతో తప్పించుకోవడం ఈసీ వంటి రాజ్యాంగబద్ధ సంస్థల విశ్వసనీయతను కాపాడబోదన్నారు. ''లోక్‌సభతో పాటు ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలన్నింటికీ సంబంధించిన సమగ్రమైన డిజిటల్ ఓటర్ల జాబితాను ప్రచురించాలి. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో సాయంత్రం ఐదింటి తర్వాత అన్ని బూత్‌ల్లో జరిగిన పోలింగ్‌కు సంబంధించి సీసీటీవీ ఫుటేజీ విడుదల చేయాలి''అని డిమాండ్ చేశారు.

రిగ్గింగ్‌కు ఐదు సూత్రాలు

ఎన్నికలల్లో మోదీ సర్కారు అక్రమాలకు పాల్పడుతోందని ఆరోపించిన రాహుల్‌గాంధీ, వాటిని పాయింట్లవారీగా వివరించారు...

- కేంద్ర ఎన్నికల కమిషనర్ల నియామక ప్యానల్‌ను రిగ్గింగ్ చేయడం
- ఎలక్టోరల్ రోల్స్‌లో భారీగా నకిలీ ఓటర్లను పొందుపరచడం
- పోలైన ఓట్ల శాతాన్ని అక్రమంగా పెంచేయడం
- బీజేపీ గెలిచి తీరాలనుకున్న చోట్ల బోగస్ ఓటింగ్‌కు పాల్పడటం
- సాక్ష్యాలను ఎవరికీ చిక్కకుండా దాచేయడం

విపత్తులను ఎదుర్కోవాలంటే కలిసి పని చేయాలి

ప్రపంచ దేశాలకు ప్రధాని మోదీ పిలుపు

న్యూఢిల్లీ: విపత్తులను ఎదుర్కొనేందుకు సమర్థవంతమైన మౌలిక సదుపాయాల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. విపత్తులను ఎదుర్కొనే విషయంలో ప్రపంచ దేశాలు పరస్పరం సహకరించుకోవాలని చెప్పారు. అన్ని దేశాలు కలిసి పనిచేస్తేనే నష్టాన్ని కనిష్ట స్థాయికి తగ్గించవచ్చని స్పష్టం చేశారు. 'డిజాస్టర్ రీసైలియెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్–2025'అంతర్జాతీయ సదస్సులో ప్రధాని మోదీ శనివారం వీడియో సందేశం ఇచ్చారు. విపత్తుల నివారణ విషయంలో నైపుణ్యం కలిగిన మానవ వనరులు, అత్యుత్తమ విధానాలు పరస్పరం పంచుకోవడానికి గ్లోబల్ డిజిటల్ వేదిక, నిధుల సేకరణ అత్యంత కీలకమని ఉద్ఘాటించారు. విపత్తులను ముందుగానే గుర్తించి హెచ్చరించే వ్యవస్థతోపాటు దేశాల మధ్య సహకారం కచ్చితంగా అవసరమని అన్నారు. ఇండియా ఏర్పాటు చేసిన సునామీ వార్నింగ్ సిస్టమ్‌తో 29 దేశాలు ప్రయోజనం పొందుతున్నాయని గుర్తుచేశారు. కాలుష్యం, వాతావరణ మార్పులతోపాటు ప్రకృతి విపత్తుల సముద్ర తీర ప్రాంతాలు, దీవులకు పెద్ద ముప్పు పొంచి ఉందని ప్రధానమంత్రి ఆందోళన వ్యక్తంచేశారు. ఈ అంశంపై ప్రపంచ దేశాలు తక్షణమే దృష్టి పెట్టాలని కోరారు.

‘సాక్షి’కి ఏం సంబంధం!?

ఎవరో చేసిన వ్యాఖ్యలను ‘సాక్షి’కి ఆపాదించే కుట్ర

- ఆ సంస్థ ప్రతిష్టను దెబ్బతీయాలని టీడీపీ కుతంత్రం
- అకారణంగా సంస్థను ఇబ్బంది పెట్టేందుకు ప్రయత్నం
- అమరావతిపై విశ్లేషకుడి వ్యాఖ్యలను ఇప్పటికే ఖండించిన ‘సాక్షి’

సాక్షి, అమరావతి: టీడీపీ, దాని అనుబంధ ఎల్లో మీడియా రాష్ట్ర ప్రజలకు చూపిస్తున్న అబద్ధాల వెనుక అసలు నిజాలను నిర్భయంగా, నిష్పక్షపాతంగా వెలుగులోకి తెస్తున్న ‘సాక్షి’, తెలుగువారి మనస్సాక్షిగా మారింది. అనతికాలంలోనే రాష్ట్ర ప్రజల మన్ననలూ పొందింది. సామాన్యుల గొంతుకై నిలుస్తోంది. అభాగ్యులకు అండగా నిలబడుతోంది. అవినీతిని, అక్రమాలను బయటపెడుతోంది. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా, ప్రజల పక్షాన ప్రతిపక్ష పాత్ర పోషిస్తోంది. ముఖ్యంగా.. మహిళల పట్ల అత్యంత గౌరవంగా వ్యవహరిస్తోంది. మహిళల వికాసానికి, వారి అభ్యున్నతికి అనేక ప్రత్యేక కథనాలను ప్రచురిస్తూ ప్రసారం చేస్తోంది. పాత్రికేయ విలువలకు కట్టుబడి ‘సాక్షి’ఏనాడు గీత దాటకుండా.. పాత్రికేయ చట్టాలు, నిబంధనల పరిధిలోనే ఉంటూ ప్రజలకు వాస్తవాలను వెల్లడిస్తోంది. దీంతో.. ‘సాక్షి’ని నేరుగా ఏమీచేయలేకపోతున్నామనే బాధలో ఉన్న టీడీపీ, దాని అనుబంధ ఎల్లో మీడియా, ‘సాక్షి’కి ఏమాత్రం సంబంధంలేని వ్యాఖ్యలను చూపించి కుట్రలకు తెర తీస్తోంది.

‘సాక్షి’ సమర్థించలేదు..

ఇక సాక్షి టీవీలో శుక్రవారం కేఎస్ఆర్ లైవ్ షోలో విశ్లేషకుడు కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలు పూర్తిగా ఆయన వ్యక్తిగతమని ‘సాక్షి’టీవీ స్పష్టంచేసినప్పటికీ ఇంకా ఏదో రాద్ధాంతం చేయాలని టీడీపీ ప్రయత్నిస్తోంది. నిజానికి.. సీనియర్ జర్నలిస్టు కృష్ణంరాజు నుంచి వెలువడిన ఆ వ్యాఖ్యలను సాక్షి టీవీ ఎంతమాత్రం సమర్థించలేదు.. సమర్థించదు అని ‘సాక్షి’ఇప్పటికే వెల్లడించినా కూడా వేరొకరు చేసిన వ్యాఖలను ‘సాక్షి’కి ఆపాదిస్తూ, సంస్థ ప్రతిష్టను దిగజార్చాలని కుతంత్రాలు చేస్తోంది. అకారణంగా సంస్థను ఇబ్బంది పెట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ శ్రేణులను రెచ్చగొడుతోంది. నిజానికి.. అమరావతి రాజధాని ప్రాంతంపై కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలకు ‘సాక్షి’కి ఎలాంటి సంబంధంలేదు. అది పూర్తిగా ఆయన వ్యక్తిగత అభిప్రాయం. కృష్ణంరాజు సైతం తన వ్యాఖ్యల్లో ఎవరినీ కించపరిచే ఉద్దేశ్యంలేదని, ఎవరి మనోభావాలైనా దెబ్బతింటే క్షమాపణ కోరడానికి తాను సిద్ధమని కూడా ప్రకటించారు. అయినప్పటికీ టీడీపీ సంతృప్తి చెందడంలేదు.

దురుద్దేశంతో ‘సాక్షి’పై టీడీపీ కుట్రలు..

‘సాక్షి’కార్యాలయాలపైకి టీడీపీ మూకలను ఉసిగొల్పి సంస్థను ఇబ్బంది పెట్టాలని చూస్తోంది. తమ పరిపాలనలో ఇప్పటివరకూ ఎలాంటి హామీలనూ నెరవేర్చకపోగా, ప్రతీసారీ ఏదో ఒక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ ఏడాది కాలాన్ని గడిపేసింది. ఇప్పుడు కూడా అదే పంథాను కొనసాగిస్తూ ‘సాక్షి’కి సంబంధం లేకపోయినా ఉందనేలా సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తూ, ఆదివారం రాష్ట్రంలోని అన్ని ‘సాక్షి’కార్యాలయాల వద్ద విధ్వంసానికి సన్నాహాలను చేస్తున్నట్లు తెలుస్తోంది. కేవలం టీవీ లైవ్‌షోలో మాట్లాడే విశ్లేషకుల అభిప్రాయాలు పూర్తిగా వారి వ్యక్తిగతమని, వాటితో సంస్థకు ఎలాంటి సంబంధం ఉండదని తెలిసి కూడా కక్షపూరితంగా రాజకీయం చేయాలని ప్రయత్నించడం తగదని పాత్రికేయ, ప్రజాసంఘాలు అభిప్రాయపడుతున్నాయి.

‘సాక్షి’కి ఆపాదించడం సరికాదు

కూటమి నేతల ప్రకటనలను ఖండించిన సాక్షి టీవీ

ఎవరినీ కించపరిచే ఉద్దేశం లేదన్న కృష్ణంరాజు


సాక్షి, అమరావతి: సాక్షి టీవీలో శుక్రవారం కేఎస్ఆర్ లైవ్ షోలో విశ్లేషకుడు కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతమని సాక్షి టీవీ స్పష్టం చేసింది. ఆయన చేసిన వ్యాఖ్యలను తనకు ఆపాదిస్తూ కూటమి నేతలు చేస్తున్న ప్రకటనలను సాక్షి టీవీ తీవ్రంగా ఖండించింది. తాము ఎల్లప్పుడూ మహిళల పట్ల అత్యంత గౌరవాభిమానాలను చూపుతామని తెలిపింది. సీనియర్ జర్నలిస్ట్ కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలను సాక్షి టీవీ ఎంత మాత్రం సమర్థించలేదని.. సమర్థించబోమని వెల్లడించింది.

కించపరచడం నా ఉద్దేశం కాదు..

మరోవైపు తన వ్యాఖ్యలపై కృష్ణంరాజు కూడా వివరణ ఇస్తూ ఓ వీడియో విడుదల చేశారు. ఎవరి మనోభావాలను కించపరిచే ఉద్దేశం ఇసుమంతైనా తనకు లేదన్నారు. మహిళల మనోభావాలను కించపరిచే ఉద్దేశం అసలు ఏమాత్రం లేదని స్పష్టం చేశారు. తన వ్యాఖ్యలను అమరావతి రాజధానికి వ్యతిరేకంగా భావించవద్దని కృష్ణంరాజు విజ్ఞప్తి చేశారు. అమరావతి అనేది అన్ని విషయాల్లో అగ్రస్థానంలో ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

డ్రోన్.. స్టార్టప్‌లు పెరిగెన్

డ్రోన్స్.. ఇటీవలి కాలంలో ఈ మానవ రహిత విమానాలు బాగా ప్రాచుర్యంలోకి వచ్చాయి. ఆపరేషన్ సిందూర్, రష్యా-ఉక్రెయిన్ యుద్ధంతో వీటిపట్ల జనంలో ఆసక్తి పెరిగింది. రక్షణ రంగం, ఈ-కామర్స్, వ్యవసాయం, ఆరోగ్యం వంటి విభిన్న రంగాల్లో కొత్త అవకాశాలను డ్రోన్స్ స్టార్టప్స్ అందిపుచ్చుకుంటున్నాయి. మరోపక్క ఐఐటీ గ్రాడ్యుయేట్లు ఈ స్టార్టప్‌ల ఏర్పాటులో ముందుంటున్నారు. ఈ కంపెనీలకు ఉన్న అపార అవకాశాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఇబ్బడిముబ్బడిగా పెట్టుబడుల వరద పారిస్తున్నారు. డ్రోన్ కంపెనీలు గత ఏడాది స్వీకరించిన నిధులు రెండింతలు అయ్యాయంటే భవిష్యత్ అవకాశాలను అంచనా వేయొచ్చు.



దేశంలో డ్రోన్ టెక్నాలజీ స్టార్టప్‌లు వేగంగా వృద్ధి చెందుతున్నాయి. ఈ కంపెనీల ఆదాయాలు పెరుగుతున్నాయి. మార్కెట్‌లో విస్తరించడంతోపాటు సాంకేతిక సామర్థ్యాలూ పెంచుకుంటున్నాయి. ప్రస్తుతం భారత డ్రోన్ తయారీ రంగంలో 506 కంపెనీలు నిమగ్నమయ్యాయి. ఈ రంగంలోని టాప్–100 స్టార్టప్స్‌లో సంఖ్య పరంగా బెంగళూరు ముందంజలో ఉంటే.. ఈ కంపెనీలను స్థాపించిన వ్యవస్థాపకుల్లో అత్యధికులు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీల్లో (ఐఐటీ) చదివిన విద్యార్థులు కావడం విశేషం. ప్రపంచంలో అత్యధిక డ్రోన్ స్టార్టప్‌లు అమెరికాలో ఉంటే తరవాత మనదేశంలోనే ఉన్నాయి. అలాగే ఈ పదేళ్లలో ఈ రంగంలో అత్యధిక ఫండింగ్ అందుకున్న దేశాల్లో మనది నాలుగో స్థానం.

- సాక్షి, స్పెషల్ డెస్క్

వెన్నుతడుతున్న ప్రభుత్వం..

ప్రభుత్వ అనుకూల విధానాలు, వివిధ రంగాలలో డ్రోన్స్‌కు డిమాండ్ పెరగడం, ఆవిష్కరణలు.. ఈ రంగానికి కలిసి వచ్చే అంశాలు. వ్యవసాయం, మౌలిక సదుపాయాల రంగం మొదలు దేశ రక్షణ అవసరాలు, విపత్తుల సమయంలో వాడకం వరకు డ్రోన్ వినియోగ పరిధి విస్తరిస్తుండడం జోష్‌నిస్తోంది. 2021లో భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన డ్రోన్ నియమాలు ముఖ్యంగా.. అనుమతుల సంఖ్య, పత్రాలు, రుసుముల తగ్గింపు మొదలు ఆన్‌లైన్ సింగిల్ విండో సిస్టమ్ ఏర్పాటు వంటివి ఈ రంగం పురోభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నాయి.

వ్యవస్థాపకులు చదివిన కళాశాల	స్థాపించిన కంపెనీలు
ఐఐటీ బాంబే	18
ఐఐటీ కాన్పూర్	14
బిట్స్ పిలానీ	12
ఐఐటీ ఢిల్లీ	5
ఐఐటీ గువాహటి	4
ఐఐటీ మద్రాస్	3
కార్నెగీ మెలన్ యూనివర్సిటీ	2
ఐఐఎం కలకత్తా	2
ఐఐటీ ఖరగ్‌పూర్	2
ఐఎస్‌బీ	2

బెంగళూరు టాప్..

డ్రోన్స్ రంగంలో దేశంలో 2018లో అత్యధికంగా 61 కంపెనీలు ఎంట్రీ ఇచ్చాయి. ఆ తర్వాతి సంవత్సరం ఈ సంఖ్య 54గా నమోదైంది. 2020లో 59 కంపెనీలు రంగ ప్రవేశం చేశాయి. టాప్–100 కంపెనీల్లో బెంగళూరు నుంచి 24, హైదరాబాద్ 11, ముంబై 11, ఢిల్లీ 10, చెన్నై 8, నోయిడా నుంచి 8 కొలువుదీరాయి. ఇక డ్రోన్ కంపెనీల స్థాపకుల్లో ఐఐటీ బాంబే 18 మంది, ఐఐటీ కాన్పూర్ నుంచి 14 మంది, బిట్స్ పిలానీ విద్యార్థులు 12 మంది ఉన్నారు. ప్రపంచంలో డ్రోన్ స్టార్టప్స్‌ను అందించిన టాప్ – 10 విద్యాసంస్థల్లో మనదేశానివి 3 ఉండటం విశేషం.

నిధులు వెల్లువెత్తాయి..

దశాబ్ద కాలంలో భారతీయ డ్రోన్ కంపెనీల్లోకి రూ.4,882 కోట్ల నిధులు వెల్లువెత్తాయి. 2016లో రూ.38.6 కోట్ల నుంచి 2024 నాటికి రూ.2,119 కోట్లకు ఎగిశాయి. అంటే ఏకంగా 5,389% వృద్ధి నమోదైందన్న మాట. 2020 నుంచి ఫండింగ్ ఊపు మీద ఉంది. 2023తో పోలిస్తే గతేడాది ఈ పెట్టుబడుల రాక రెండింతలకుపైగా పెరిగింది. 2025లో జూన్ 4 నాటికి సుమారు రూ.335 కోట్ల నిధులను డ్రోన్ కంపెనీలు అందుకున్నాయి. ఐఐటీ ఢిల్లీ విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టార్టప్స్‌లో అత్యధికంగా దశాబ్ద కాలంలో రూ.927 కోట్ల పెట్టుబడులు వచ్చి చేరాయి. ఆ తర్వాతి స్థానాల్లో ఐఐటీ బాంబే, ఐఐఎం కలకత్తా, హార్వర్డ్ బిజినెస్ స్కూల్, ఐఐటీ కాన్పూర్ విద్యార్థుల స్టార్టప్స్ ఉన్నాయి. కొన్ని కంపెనీలు బాగా రాణిస్తుండటం, మరికొన్ని సాంకేతికత పరంగా మెరుగ్గా ఉండటం తదితర కారణాలతో.. ఈ రంగంలోని 12 కంపెనీలు చేతులు మారాయి. నాలుగు కంపెనీలు ఐపీఓల ద్వారా నిధులు సమీకరించాయి.

వ్యవస్థాపకులు చదివిన కళాశాల	అందుకున్న నిధులు రూ. కోట్లలో
ఐఐటీ ఢిల్లీ	926
ఐఐటీ బాంబే	798
ఐఐఎం కలకత్తా	789
హార్వర్డ్ బిజినెస్ స్కూల్	446
ఐఐటీ కాన్పూర్	265

కంపెనీలు ఏర్పాటైన తీరు..

సంవత్సరం	సంఖ్య
2019	54
2020	59
2021	56
2022	51
2023	35
2024	12

‘కట్టలు’ తెగిన కష్టం..

▶ మొదటి పేజీ తరువాయి

ప్రారంభమై.. వర్షాలు కురిసిన సమయంలో లాక్‌లు ఎత్తితే రైతులు తీవ్రంగా నష్టపోతారు. లాకులు ఎత్తకపోయినా నీరు బయటకు వచ్చే ప్రమాదం ఉంది. దీంతో చెరువుల కింద వేలాది ఎకరాల భూమి బీడుగా మారే ప్రమాదం కనిపిస్తోంది.


యాదాద్రి భువనగిరి జిల్లా కుర్రారం ఊరచెరువు మత్తడి కుంగిపోయిన దృశ్యం

వివిధ జిల్లాల్లోని చెరువుల పరిస్థితి ఇదీ..

- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 146 చెరువులకు కట్టలు తెగడంతోపాటు తూములు దెబ్బతిన్నాయి. ఖమ్మం జిల్లాలో 11 చెరువులకు రూ.9.55 లక్షలతో తాత్కాలిక మరమ్మతులు పూర్తి చేశారు. రూ.48.61 కోట్లతో 45 చెరువులకు మరమ్మతులు చేశారు. 42 చోట్ల పనులు జరుగుతున్నాయి. 17 చోట్ల పనులకు ఉన్నతాధికారుల నుంచి అనుమతులు రావాల్సి ఉంది.
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 28 చెరువులకు గండ్లు పడగా.. 25 చెరువులకు గండ్లు పూడ్చారు. అశ్వారావుపేట మండలంలో 16 వేల ఎకరాల ఆయకట్టు ఉన్న పెద్దవాగు ప్రాజెక్టుకు భారీ గండి పడగా రూ.3 కోట్లతో తాత్కాలికంగా మరమ్మతులు చేశారు. కోతకు గురైన కట్టను మాత్రం వదిలేశారు. ఈ పెద్దవాగు తెలంగాణ, ఏపీ మధ్య ఉండటంతో వివాదం నెలకొంది. రీ డిజైన్ కోసం రూ.19 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. అయితే ఏపీ ప్రభుత్వం ప్రతిపాదనలను ఇంకా ఆమోదించలేదు. దీంతో రీడిజైన్‌కు మోక్షం లభించలేదు.
- ఖమ్మం జిల్లా చింతకాని మండలం తిమ్మినేనిపాలెంలోని గచ్చుబంధం చెరువు కట్ట గత సెప్టెంబర్ వరదలకు తెగింది. దీంతో మూడు గ్రామాల్లోని 228 ఎకరాల ఆయకట్టుకు కొంత నష్టం వాటిల్లింది. మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.9 లక్షలు విడుదల చేయగా, ఇరిగేషన్ అధికారులు నేటికీ పనులు చేపట్టలేదు. చెరువులో నీటిని నిల్వ ఉంచే పరిస్థితి లేకపోవడంతో లాకులు ఎత్తి బయటకు పంపుతున్నారు. చెరువు కట్టకు మరమ్మతులు చేయకపోతే ఆయకట్టు పరిధిలోని తమ భూములను బీళ్లుగా వదిలేయాల్సిందేనని రైతులు వాపోతున్నారు.
- నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లో ఎంపిక చేసిన 25 చెరువుల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదన పంపారు. ఇప్పటివరకు నయా పైసా నిధులు మంజూరు కాలేదు. మోర్తాడు మండల కేంద్రంలోని ముసలమ్మ చెరువు, కమ్మర్‌పల్లిలోని పల్లె చెరువు తూముల మరమ్మతు అత్యవసరంగా చేపట్టాల్సి ఉంది. అందుకోసం రూ.50 లక్షల వరకు అవసరమని అంచనా.
- యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలంలోని కుర్రారం ఊర చెరువు మత్తడి వర్షాలకు పూర్తిగా కొట్టుకుపోయింది. ఇప్పటివరకు తాత్కాలిక మరమ్మతులే చేపట్టారు. 80 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువు నిండితే ఆయకట్టు ప్రాంతంలోని 10 గ్రామాల్లో 5 వేల ఎకరాల్లో పంటలు సాగవుతాయి.
- మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం రావిరాల గ్రామం చెరువు 152 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఈ చెరువు కింద 650 ఎకరాలు నేరుగా, మరో 500 ఎకరాలు బోర్లు, బావుల ద్వారా సాగవుతుంది. గత ఏడాది వచ్చిన వరదలకు చెరువు తెగిపోయింది. ఇప్పుడు సాగు చేద్దామంటే నీళ్లు లేవు. దీంతో రైతులు, కూలీలతోపాటు చేతి వృత్తుల వారు వందకుపైగా కుటుంబాలు వలస వెళ్లాయి. నీళ్లు వస్తే కానీ ఊరికి రాలేమని చెబుతున్నారు. ఈ చెరువు మరమ్మతుల కోసం రూ.1.43 కోట్లు అవసరమని అంచనా వేయగా, ఇప్పుడు రూ.53 లక్షల మాత్రమే మంజూరు చేస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది.

కుటుంబాలకు కుటుంబాలే వలస వెళ్లారు



మా ఊళ్లో 121 ముదిరాజు, 40 గంగపుత్రుల కుటుంబాలు చెరువునే నమ్ముకొని జీవిస్తున్నాయి. పోయిన వానాకాలం చెరువు తెగడంతో పనులు లేక, ఇక్కడ ఉండి పస్తులు పడలేక హైదరాబాద్ వెళ్లి అడ్డా పనులు చేస్తున్నారు. చెరువు గండ్లు తొందరగా పూడిస్తేనే మా కష్టాలు పోతాయి.

– దేగల యాకయ్య, మత్స్యకారుడు, రాజుల కొత్తపల్లి, మహబూబాబాద్ జిల్లా

తగ్గనున్న భూగర్భ జలాలు..

చెరువుల్లో నీరు పుష్కలంగా ఉంటే భూగర్భ జలాలు కూడా పెరుగుతాయి. ప్రస్తుతం చెరువులు దెబ్బతినడంతో వాటిలో నీరు నిల్వలేదు. దీంతో భూగర్భ జలాలు కూడా పడిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. చెరువులకు సకాలంలో మరమ్మతులు పూర్తి చేయకపోవడంతో తమ భూములు సాగు చేసుకోలేకపోతున్నామని చెబుతున్నారు. చెరువుల్లో నీరు లేకపోవటంతో మత్స్యకారులు కూడా ఉపాధి కోల్పోయారు.


కట్ట తెగి మరమ్మతుకు నోచుకోని మహబూబాబాద్ జిల్లాలోని రాజుల కొత్తపల్లి చెరువు


ఖమ్మం జిల్లా తిమ్మినేనిపాలెంలోని గచ్చుబంధం చెరువు కట్ట తెగిన దృశ్యం

బనకచర్లపై కేంద్రం నిర్ణయం తీసుకోలేదు



- కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి
- గోదావరి జలాల్లో తెలంగాణకు అన్యాయం జరగనివ్వం
- రాష్ట్రానికి జరిగే నష్టంపై సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రానికి లేఖ రాయాలి
- త్వరలోనే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుని ఎన్నిక

సాక్షి, హైదరాబాద్: ఏపీ ప్రభుత్వం తలపెట్టిన బనకచర్ల ప్రాజెక్టు విషయంలో కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ, గోదావరి జలాల పంపిణీలో తెలంగాణకు అన్యాయం జరగనీయమన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రానికి జరిగే నష్టంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని కోరారు. బనకచర్లను ఎందుకు నిలిపివేయాలి, దానివల్ల తెలంగాణకు ఏవిధంగా నష్టం జరుగుతుందనే పూర్తి వివరాలతో కేంద్ర జలవనరుల శాఖకు నివేదిక ఇవ్వాలని సూచించారు. ఏపీ ప్రభుత్వం గతవారం బనకచర్లపై డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు ఇచ్చిందని, కేంద్ర ప్రభుత్వం ఇంకా ఆ రిపోర్ట్‌ను పరిశీలించలేదని తెలిపారు. కేంద్రం నిష్పక్షపాతంగా వ్యవహరిస్తుందన్నారు. కాగా, ఎంపీ ఈటల రాజేందర్ కాళేశ్వరం విచారణ కమిషన్‌ను కలసి తనకు తెలిసిన వివరాలు చెప్పారన్నారు. అప్పులు తేవడానికి కార్పొరేషన్ పెట్టారని, కేసీఆర్‌పై చర్య తీసుకోవాలని ఈటల చెప్పారని తెలిపారు. ఈటల.. కేసీఆర్ కుటుంబ పాలన చూసి ఇమడలేకనే పార్టీ నుంచి బయటకు వచ్చారన్నారు. చిత్తశుద్ధి ఉంటే కేసీఆర్ బయటకు వచ్చి కాళేశ్వరం ప్రాజెక్ట్ ఎంత వరకు ఉపయోగకరంగా ఉందో చెప్పాలన్నారు. మేడిగడ్డ బరాజ్ పిల్లర్లకు పగుళ్లు వచ్చింది నిజమా? కాదా? అని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో సీబీఐతో విచారణ చేయించాలని తాను మొదటినుంచీ డిమాండ్ చేస్తున్నానని కిషన్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రతి నియోజకవర్గంలో అక్కడి ఎమ్మెల్యే అవినీతి మీద మాట్లాడిన రేవంత్‌రెడ్డి.. ఇప్పటి వరకు ఒక్కరిపైనా చర్యలు తీసుకోలేదన్నారు. అతి త్వరలోనే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక ఉంటుందని ఆయన చెప్పారు. 8 నెలలుగా హైదరాబాద్‌లో 80 శాతం వీధిదీపాలు వెలగడం లేదని ఆయన మండిపడ్డారు. ఈ నెల 20న ఎల్బీ స్టేడియంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు. సింగరేణికి తెలంగాణ ప్రభుత్వం రూ.42 వేల కోట్ల బకాయి పడిందని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా సింగరేణికి రూ.1,200 కోట్ల మేర బకాయిలు చెల్లించాల్సి ఉందని చెప్పారు.

రాష్ట్రంలో రాజ్యహింసపై రాష్ట్రపతి, ఎన్‌హెచ్ఆర్‌సీకి ఫిర్యాదు చేస్తాం

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి


మాట్లాడుతున్న సజ్జల రామకృష్ణారెడ్డి. చిత్రంలో అంబటి

పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): రాష్ట్రంలో పక్కా పథకం ప్రకారం జరుగుతున్న రాజ్యహింసపై రాష్ట్రపతి, కేంద్ర మానవహక్కుల సంఘం (ఎన్‌హెచ్ఆర్‌సీ)కి ఫిర్యాదు చేస్తామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లో పోలీసు వ్యవస్థ ఒక ఆర్గనైజ్డ్ క్రైమ్ గ్యాంగ్‌గా మారిందని ఇటీవలే ఎన్‌హెచ్ఆర్‌సీ ఆగ్రహం వ్యక్తం చేసిందని, అలహాబాద్ హైకోర్టు 50 ఏళ్ల కిందట చేసిన వ్యాఖ్యలను గుర్తుచేస్తూ ఎన్‌హెచ్ఆర్‌సీ ఈ వ్యాఖ్యలు చేసిందని చెప్పారు. ‘చట్టాల ప్రకారం పని చేయాల్సిన వ్యవస్థ రాజకీయ నేతల అవసరాల కోసం వారు చెప్పినట్లు చేసేందుకు చట్టాలను తమ చేతుల్లోకి తీసుకుంటే ఒక క్రిమినల్ గ్యాంగ్‌కు యూనిఫాం వేసినట్లు ఉంటుందని అలహాబాద్ కోర్టు వ్యాఖ్యానించిందని, అదే పరిస్థితి ఇప్పుడు యూపీలో కనిపిస్తోందని ఎన్‌హెచ్ఆర్‌సీ ఆగ్రహం వ్యక్తంచేసింది’ అని తెలిపారు. మన రాష్ట్రంలో పోలీసుల తీరు చూస్తుంటే.. యూపీ కంటే 200 శాతం ఎక్కువగా అరాచకం కనిపిస్తోందన్నారు. పోలీసులకు చట్టాన్ని కాపాడేందుకు ఇచ్చిన ఒక శక్తివంతమైన ఆయుధాన్ని వారు తమ చేతుల్లోకి తీసుకుని ఇష్టారాజ్యంగా దానిని వినియోగిస్తే ఎటువంటి అరాచకం జరుగుతుందో ఊహించవచ్చన్నారు. పోలీసుల వేధింపులు తాళలేక పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం పెద్దనెమలిపురి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు గుత్తా లక్ష్మీనారాయణ ఆత్మహత్యాయత్నం చేసిన విషయం తెలిసిందే. గుంటూరులోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మీనారాయణను శనివారం పార్టీ నేతలతో కలిసి సజ్జల రామకృష్ణారెడ్డి, పరామర్శించారు. వైద్యులను అడిగి ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. అనంతరం సజ్జల రామకృష్ణారెడ్డి మీడియాతో మాట్లాడుతూ ‘50 ఏళ్ల కిందట యూపీలో ఆర్గనైజ్డ్ క్రైం జరిగేదని వినేవాళ్లం. ప్రస్తుతం ఏపీలో అలాంటి పరిస్థితులు చూస్తున్నాం. కూటమి ఏడాది పాలనలో రాష్ట్రం 50 సంవత్సరాలు వెనక్కివెళ్లింది. వ్యవస్థలన్నింటిని భ్రష్టు పట్టించారు. పొలిటికల్ బాస్‌లు చెప్పినట్లుగా పోలీసులు వ్యవహరిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులపై రోజుకు కనీసం 10 కేసులు పెడుతున్నారు. లక్ష్మీనారాయణను కులం పేరు చెప్పి వైఎస్సార్‌సీపీలో ఎలా ఉంటున్నావని ఒక డీఎస్పీ స్థాయి అధికారి ప్రశ్నించడం దారుణం. లక్ష్మీనారాయణ ఆత్మహత్యాయత్నానికి ముందు ఇచ్చిన వాంగ్మూలం కంటే పెద్ద సాక్ష్యం ఉంటుందా? ఆ స్టేట్‌మెంట్‌ను పరిగణనలోకి తీసుకుని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. కడపలో ఒక వ్యక్తిపై అక్రమంగా గంజాయి కేసు పెట్టడంతో అతను ఆత్మహత్య చేసుకున్నాడు. అన్ని అక్రమ కేసులపై బాధితుల పక్షాన న్యాయపోరాటం చేస్తాం. తెనాలి, పెద్దనెమలిపురం ఘటనలపై జ్యుడీషియల్ విచారణకు ఆదేశించాలి. విజయవాడలో శాతవాహన కళాశాల ప్రిన్సిపాల్‌ను ఇటీవల టీడీపీకి చెందిన ఒక ఎమ్మెల్సీ ఆధ్వర్యంలో కిడ్నాప్ చేశారని ఆరోపించారు. ఆ తర్వాత శాతవాహన కళాశాల భవనాలను రాత్రికిరాత్రే కూల్చేశారు. తమకు ఎదురులేదని హెచ్చరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడానికే ఇవన్నీ చేస్తున్నారు’ అని సజ్జల ఆగ్రహం వ్యక్తంచేశారు.



ఇటీవలి కాలంలో కూతుళ్లు ఉన్న తల్లులలో ఒక ఆందోళన కనిపిస్తోంది. అదేంటంటే పదేళ్ల వయసుకే కూతుళ్ళు రజస్వల కావడం. ఇది వారి భవిష్యత్తు, ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది.. అనే భయాన్ని దూరం చేయాలనుకుంటున్నారు. తమ గురించి తమకు ఏ మాత్రం తెలియని అమ్మాయిల్లో తొలి నెలసరి ఆలస్యంగా రావాలని తల్లులు ప్రయత్నిస్తున్నారు, ఇది మంచి పరిణామం అంటున్నారు నిపుణులు.

తొలి నెలసరి వాయిదా వెయ్యొచ్చా?

కూతుళ్ళ తొలి నెలసరి ఆలస్యంగా రావడాన్ని తల్లులు ప్రయత్నించవచ్చా...

ఈ విషయం గురించి ఇటీవల రిబెక్కా కిండెర్మన్ అనే ఆస్ట్రేలియాలోని గోల్డ్ కోస్ట్ ప్రాంతానికి చెందిన తల్లి తన 10, 12 ఏళ్ళ కుమార్తెలకు నెలసరి ఆలస్యం కావాలన్న లక్ష్యంతో కుటుంబ ఆహారం నుండి స్క్రీన్ టైం చూసే వరకు అన్నీ మార్చేసింది. ఆమె ఈ విషయంపై చేసిన ఇన్‌స్టాగామ్ రీల్ (@bec&kinderman) 1.6 మిలియన్ల వీక్షణలు, 57,000కు పైగా లైకులు పొందింది.

'పిల్లల మెదడు ఇంకా పూర్తిగా అభివృద్ధి చెందకముందే, వారిపై ఇంటర్నెట్‌లో కనిపించే విషయాలు ఒత్తిడి తెచ్చే అవకాశం ఉంది. అందుకే ఈ వయస్సులోనే పెద్దవాళ్లలా మారకుండా, చిన్న పిల్లలుగా ఉండేలా చేయాలనుకుంటున్నాను,' అంటారు ఆమె. ఈ తల్లి చేస్తున్న ప్రయత్నం గురించి మనమూ ఆలోచించాలి. మన కూతుళ్ళ భవిష్యత్తు ఆరోగ్యం గురించి జాగ్రత్త పడాల్సిన అవసరం ఉంది.

అమెరికాలో బాలికలు మొదటిసారి నెలసరి అయ్యే సగటు వయస్సు 11.9 సంవత్సరాలు. 11 ఏళ్లకు ముందే నెలసరి ప్రారంభమయ్యే బాలికల శాతం16 గా ఉంది. ఇండియాలోనూ ఈ శాతం ఇదే విధంగా ఉంది.

నెలసరి.. బ్రెస్ట్ క్యాన్సర్ ముప్పు..

12 ఏళ్ల వయస్సు ముందు నెలసరి వచ్చే బాలికలకు బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చే అవకాశం 23 శాతం ఎక్కువగా ఉంటుంది. అంతేకాకుండా, ఎండోమెట్రియల్, ఓవరియన్ క్యాన్సర్లకు కూడా ఇది కారణంగా ఉండే ప్రమాదం ఉంది.

గతంలో ఇలా ఉండేది కాదు. రచయిత ఎలెనా బ్రిడ్జర్స్ తెలిపిన ప్రకారం, గిరిజన సమాజాలలో బాలికలు సుమారు 17 ఏళ్ల వయస్సులో తొలి నెలసరి పొందేవారు, తగిన అండాశయాల విడుదల 19 ఏళ్ల వయస్సులో మొదలయ్యేది.

'ప్రాచీన కాలంలో మానవ మేధస్సు, శరీరం ముందు నుంచీ వయోజన భావోద్వేగాలను ఎదుర్కొనేవి. కానీ నేటి బాలికలు ఇప్పుడే పీరియడ్లు, బాల్య గర్భధారణను ఎదుర్కొంటున్నారు,' అని ఆమె చెప్పారు. ఈ పరిస్థితిని 'ఎవల్యూషనరీ మిస్ మ్యాచ్'గా అభివర్ణిస్తూ, బ్రిడ్జర్స్ ఇలా అన్నారు: 'ఇప్పుడు రిప్రొడక్టివ్ ప్యూబర్టీ చైతన్యం అతి త్వరగా వస్తోంది, కానీ మానసికంగా, శారీరకంగా పరిపక్వత రావడం లేదు.'

రసాయనాలు కీలకం

ప్యూబర్టీ ముందే మొదలవడం వల్ల గర్భస్రావం, నెలసరి సమస్యలు, ఆందోళన, డిప్రెషన్, పీసీఓఎస్ వంటి సమస్యల ప్రమాదం పెరుగుతుందని పరిశోధనలు సూచిస్తున్నాయి.

ఆహారం, ఒత్తిడి, రసాయనాలు వంటి పర్యావరణ అంశాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. దీన్ని దష్టిలో ఉంచుకుని కిండెర్మన్ తన పిల్లలను సంపూర్ణ సహజ జీవనశైలిలో పెంచుతున్నారు.

ఆమె కుటుంబం ఎక్కువగా ఆర్గానిక్ ఆహారాన్ని తీసుకుంటుంది, పంటలపై ఉండే పెస్టిసైడ్ మిగులు తొలగిస్తారు, ఇంట్లో రసాయనాల్లేని పరిసరాలను కల్పిస్తారు. 'సువాసన కోసం పిల్లలు ఉపయోగించే పరిమళ ద్రవ్యాలు హార్మోన్‌లను ప్రభావితం చేస్తాయి, అందుకే మేం ఇంట్లోనే ఎసెన్షియల్ ఆయిల్స్‌తో పరిమళాలు తయారు చేస్తాం,' అని చెబుతున్నారు.

న్యూజిలాండ్‌కు చెందిన నికీ స్కిన్నర్ (@nourished&and&vibrant) కూడా తన 7, 4 సంవత్సరాల కుమార్తెల కోసం ఇదే దిశగా చర్యలు తీసుకుంటున్నారు.

'ఇది సహజ అభివృద్ధిని కృత్రిమంగా నియంత్రించడమేం కాదు,'వాతావరణ అంశాలు నెలసరి ముందే రావడానికి కారణమవుతున్నాయని తెలుసుకొని, వాటిని నియంత్రించగలిగినంతవరకు నేను తల్లిగా జాగ్రత్త పడుతున్నాను..' అంటారు ఆమె.

జీవనశైలి మార్పులే కారణం

మా వద్దకు 8, 10 ఏళ్ల వయసున్న అమ్మాయిల్ని రజస్వల అయ్యింది అని తల్లులు తీసుకొస్తుంటారు. ఆందోళన పడుతుంటారు. ఆ పిల్లలకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలియని వయసు. పౌల్ట్రీ ఉత్పత్తులు, జంక్ ఫుడ్, ప్యాకేజ్డ్ ఫుడ్ వాతావరణం, క్రీడల వంటి శారీరక వ్యాయామం లేకపోవడం.. వంటి వాటి వల్ల చిన్నవయసులోనే రజస్వల కావడం ఇటీవల జరుగుతోంది. కొన్ని సార్లు వారి జీన్స్, ఎండోక్రైమ్స్ పనితీరులో లోపాల వల్ల కూడా ఇలాంటి సమస్యలు వస్తున్నాయి. జీవనశైలి సరిగా ఉండేలా చూసుకోవడంతో పాటు, రెగ్యులర్ చెకప్స్, నిపుణుల సూచనలు పాటిస్తూ, అవగాహన పెంచుకుంటే సమస్య తగ్గుతుంది.



– డాక్టర్ శిరీష, గైనకాలజిస్ట్, హైదరాబాద్

నిపుణుల మాటలలో...

నాచురోపతి వైద్యురాలు లారా బ్రిడెన్ చెప్పిన ప్రకారం, 8 సంవత్సరాల వయస్సుకు నెలసరి రావడం అసాధారణమైన విషయం. 11 ఏళ్ల లోపల నెలసరి రావడం ఆరోగ్యానికి అంత మంచిది కాదు. ఇన్సులిన్ రెసిస్టెన్స్, బ్రెస్ట్ క్యాన్సర్ వంటి అనేక సమస్యలతో నెలసరికి సంబంధం ఉంది. మెటబాలిక్ డిస్‌ఫంక్షన్ వల్ల ఇలా జరిగే అవకాశాలు ఎక్కువ. ఆహారం, పర్యావరణ మార్పులు, వ్యాయామం లేకపోవడం, ఎపిగెనెటిక్ ప్రభావాలు ... ఇవన్నీ నెలసరి ముందుగా రావడానికి కారణాలు. బ్రిడ్జర్స్ హెచ్చరిస్తూ 'నెలసరి ఆలస్యం చేయాలనే లక్ష్యం తల్లిదండ్రులకు, పిల్లలకు ఒత్తిడిని కలిగించవచ్చు. అది ఆరోగ్యానికి హానికరమైన చర్యలకూ దారితీయవచ్చు' అని కూడా అంటున్నారు.

మాట్లాడటానికి భయపడవద్దు..

కిండెర్మర్ అండ్ స్కిన్నర్ తమ కుమార్తెలతో జరిపిన సంభాషణలు కూతుళ్లు ఉన్న తల్లులకు తప్పక ఉపయోగపడతాయి.

'మీ పిల్లలు నెలసరి వస్తే భయపడకూడదు. అది ఒక ప్రకృతి సహజమైన చర్యగా సానుకూలంగా తీసుకోవాలి. పిల్లలకు పూర్తి అవగాహన ఇవ్వాలని ప్రయత్నిస్తున్నాం' అంటున్నారు. పిల్లల చిన్నప్పటి నుంచే వారి శారీరక, మానసిక ఆరోగ్య విధానాలలో జాగ్రత్తలు తీసుకుంటే తల్లుల్లోనూ ఆందోళన తగ్గుతుంది.

– నిర్మలారెడ్డి

నాట్యం నేర్చుకోవడానికి ఇంట్లో అనుమతి మొదలు ప్రతి ఒక్క దశలోనూ పరీక్షలు ఎదురయ్యాయి ఆమెకు. ఆఖరుకు నాట్యం చేస్తుండగానే వేదిక మీద ఒక్కసారిగా కుప్పకూలిపోవడం వరకు. కాలికి గాయమైందని గజ్జెలను పక్కన పెట్టి కుంగిపోలేదామె. సర్జరీ చేయించుకున్నారు. నడక వరకు ఓకే కానీ క్లాసికల్ డాన్స్ చేయడం కష్టం అని తెలిసిపోయింది. రెండో సర్జరీతో మోకాలి కదలికలు మెరుగయ్యాయి. ఇనుమడించిన ఉత్సాహంతో తిరిగి నాట్యం చేస్తున్నారామె. ఇది మయూరి సినిమా కాదు. ఆమె సుధాచంద్రన్ కాదు. తెలంగాణ, కొత్తగూడెంలో పుట్టి పెరిగిన క్రాంతి నారాయణ జీవితం.

నాట్యమయూరి



క్రాంతి నారాయణ

"నడవడం వచ్చినప్పటి నుంచి పిచ్చి గంతులేస్తూ ఉండేదాన్ని. నా ఆసక్తిని గమనించిన మా అమ్మ... నాన్నను ఒప్పించి నన్ను డాన్స్ క్లాసులకు పంపించింది. నాట్యప్రదర్శనల కోసం ఇతర ఊర్లకు ఆడపిల్లను పంపించడం ఏమిటంటూ ఏడాదిలోపే అంతరాయం. నాన్నకు హైదరాబాద్‌కు బదలీ కావడంతో నాలోని నాట్యమయూరికి రెక్కలొచ్చాయి. దాదాపుగా అదే సమయంలో ఒక టీవీ షోలో శోభానాయుడి గారి ఇంటర్వ్యూ చూశాను. వృత్తి- ప్రవృత్తిని సమన్వయం చేసుకోగలిగిన నైపుణ్యం గురించి చక్కగా చెప్పారామె. నేను వెళ్లగానే ఆమె 'ఇన్నేళ్ల విరామం తర్వాత ఇక నాట్య సాధన అసాధ్యం' అనడంతో కళ్లనీళ్లపర్యంతం అయ్యాను. అప్పుడు ఒక వారం రోజులు టెస్ట్ పీరియడ్‌గా వచ్చి ప్రాక్టీస్ చేయమన్నారు. ఆ పరీక్షలో నెగ్గి ఆమె శిష్యురాలినయ్యాను.

ఇంజినీరింగ్- కూచిపూడి

ఉస్మానియాలో ఇంజినీరింగ్ చేస్తూ కాలేజ్ నుంచి నేరుగా డాన్స్ క్లాసులకు వెళ్లేదాన్ని. ఎంబీఏ కూడా అలాగే చేశాను. మహీంద్రా అండ్ మహీంద్రాలో ఉద్యోగం చేస్తూ కూడా డాన్స్ ప్రాక్టీస్ కంటిన్యూ చేశాను. ఆ సమయంలో మరో పరీక్ష ముంబయికి ట్రాన్స్‌ఫర్. నాన్న హైదరాబాద్ బదలీ నాకు డాన్స్ ప్రాక్టీస్‌కి అవకాశం ఇచ్చింది. నా ముంబయి బదలీ డాన్స్ కోసం ఉద్యోగం వదులుకునేటట్లు చేసింది. నాట్యానికే అంకితం కావాలనుకుని ఆంధ్రప్రదేశ్‌లోని కూచిపూడి గ్రామానికి వెళ్లి మాస్టర్ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ చేశాను.

డాన్స్‌ను గౌరవించే వ్యక్తినే...

నా జీవితంలో నాట్యానికి ఉన్న ప్రముఖ స్థానానికి అద్దం పట్టేది నా పెళ్లి చూపులే. పెళ్లి తర్వాత నాట్యసాధన మానేయాలన్న వాళ్లను వద్దని, డాన్స్‌ను గౌరవించే వ్యక్తినే నా జీవితంలోకి స్వాగతించాను. ఇప్పుడు చెప్పండి... కాలికి గాయమైందని నాట్యసాధన మానేయగలనా? నాట్యం ఆగిపోతే నాకు శ్వాస ఆగిపోయినట్లే. కరోనా విరామ సమయాన్ని మా గురువుగారి నాట్యరీతుల మీద ఎం.ఫిల్ చేయడానికి ఉపయోగించుకున్నా''నని చెప్పారు క్రాంతి నారాయణ. ఐదు వందలకు పైగా ప్రదర్శనలిచ్చాను. ఆ మధురానుభూతులివన్నీ అంటూ గది నిండుగా ఉన్న జ్ఞాపికలను చూపించారు.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

హెల్త్



ఎవరైనా ఎప్పుడూ కడుపు నొప్పి, తరచూ విరేచనాలు, అలసట వంటి సమస్యలతో బాధపడుతుంటే అదంతా పూర్తిగా జీర్ణ సంబంధ సమస్యల వల్ల కాకపోవచ్చు. అవి ఇన్‌ఫ్లమేటరీ బవెల్ డిసీజ్ (ఐబిడీ -పేగుపూత) లక్షణాలై కూడా ఉండవచ్చు. ఈ వ్యాధి ఉన్నప్పటికీ వారు బయటకు పూర్తి ఆరోగ్యంగా కనిపించవచ్చు కానీ కొన్ని లక్షణాలు ఎడతెరిపి లేకుండా కనిపిస్తుంటాయి. ఉదాహరణకు కడుపు నొప్పి, రక్తపు విరేచనాలు, బరువు తగ్గడం, పూర్తిగా నిస్సత్తువ, ఎప్పుడూ ఏదో అలసట... ఇలాంటి లక్షణాలు కనిపిస్తూనే ఉంటాయి. చిత్రమేమిటంటే... ఇవన్నీ ప్రతి ఒక్కరిలోనూ జీవితంలోని ఏదో ఒక దశలో కనిపించేవే కావడంతో నిర్దిష్టంగా ఓ వ్యాధి లక్షణంగా అనుకోడానికి వీలుండదు. అందుకే చాలామందికి ఇది పైకి కనిపించని వ్యాధిగా ఉంటుంది. ఇలాంటి ఈ పేగుపూత (ఐబీడీ) గురించి అవగాహన కోసమే ఈ కథనం.

• ఐబీడీ

పేగు - బాగు

నిజానికి ఐబీడీ అనేది నిర్దిష్టంగా ఒక వ్యాధి కాదు. ఇది ప్రధానంగా రెండు రకాల దీర్ఘకాలిక రుగ్మతలను సూచిస్తుంది. ఇందులో మొదటిది... క్రోన్స్ వ్యాధి. ఇది నోరు మొదలుకొని మలద్వారం వరకూ జీర్ణ వ్యవస్థలోని ఏ భాగాన్నైనా ప్రభావితం చేస్తుంది. రెండోది అల్సరేటివ్ కొలైటిస్ ఇది ప్రధానంగా పెద్దపేగు (కొలన్)ను లక్ష్యంగా చేసుకుంటుంది.

ఐబీడీతో బాధపడుతున్న బాధితుల్లో కడుపులో నొప్పి, నిరంతరం విరేచనాలవుతూ ఉండటం, తీవ్రమైన అలసట, బరువు తగ్గడం వంటి లక్షణాలతో బాధపడుతూ ఉండవచ్చు. కొంతమంది రోగులకి మల ద్వారం ప్రాంతంలో ఫిస్టులా వల్ల నిరంతరమూ చీము స్రవిస్తూ ఉండవచ్చు. ఈ వ్యాధులు నిత్యం ఒకేలా ఉండవు. కొన్నిసార్లు తీవ్రంగా కనిపిస్తుండటం లేదా మరికొన్ని రోజులు తీవ్రత అంతగా లేకుండా మామూలుగా కూడా ఉండవచ్చు.

ఇదీ మన దేశంలో ఐబీడీ విస్తృతి...

అత్యంత ఆశ్చర్యం కలిగించే విషయం ఏమిటంటే... ప్రపంచంలో ఐబీడీ బాధితుల్లో మన దేశానికి రెండో స్థానం. ఒకప్పుడు పాశ్చాత్య దేశాల వ్యాధిగా పరిగణించిన ఈ వ్యాధి ఇప్పుడు భారత్‌లో చాలా ఎక్కువ మందిలో కనిపిస్తోంది. దేశంలో నిత్యం కొనసాగుతున్న నగరీకరణ, ఆహార అలవాట్లలో మార్పులు, అత్యాధునిక వ్యాధి నిర్ధారణ ప్రక్రియల వల్ల ఇప్పుడు భారత్‌లో కేసులు ఎక్కువగా వెలుగుచూస్తున్నాయి. అయితే భారతదేశంలోని ఉత్తర ప్రాంతంలో అల్సరేటివ్ కొలిటిస్ ఎక్కువగా కనిపిస్తుండగా... దక్షిణాదిన క్రోన్స్ డిసీజ్ వేగంగా పెరుగుతోంది.

నిర్ధారణ ఇలా...

పైన పేర్కొన్న లక్షణాలు కనిపిస్తుంటే ఆందోళన చెందకుండా ముందుగా గ్యాస్ట్రో ఎంటరాలజిస్టును సంప్రదించాలి. నిర్ధారణ కోసం వారు కొన్ని రకాల రక్త పరీక్షలు, పేగు పరీక్ష (కోలనోస్కోపీ), సీటీ/ఎంఆర్ఐ వంటి పరీక్షలు చేయించడం ద్వారా దీన్ని నిర్ధారణ చేస్తారు. ఎంత త్వరగా గుర్తిస్తే ముున్ముందు రాబోయే తీవ్రమైన సమస్యలను వీలైనంతగా నివారించడం సాధ్యమవుతుంది.



ఐబీడీకి చికిత్స ఇలా...

ఈ సమస్యకు పూర్తిస్థాయి చికిత్స చేయడానికి నిర్దిష్టమైన మందులేమీ అందుబాటులో లేవు. అయితే కొన్ని రకాల చికిత్స ప్రక్రియలతో దీనికి చికిత్స అందించవచ్చు. అంటే మొదటల్లో నోటి ద్వారా తీసుకునే మాత్రలు (ఓరల్ మెడికేషన్), ఇంజెక్షన్స్‌తో చికిత్స అందిస్తారు. కొందరిలో శస్త్రచికిత్స అవసరం పడవచ్చు. అయితే ఒకసారి మందులు మొదలుపెట్టిన తర్వాత వైద్యుని సలహా లేకుండా ఆపకుండా కొనసాగించడం చాలా ముఖ్యం. దీనికి పూర్తిగా డాక్టర్ల పర్యవేక్షణలో ఉండి, నిరంతరమూ చికిత్స అందిస్తున్నప్పుడే పూర్తిస్థాయి అదుపులో ఉంటుంది.

ఆహారపరమైన నియంత్రణలతో...

నిర్దిష్టంగా కొన్ని రకాల ఆహార నియమాలతో (ఉదాహరణకు లో-ఫాడ్ మ్యాప్ ఆహారాలతో) దీన్ని అదుపులో పెట్టవచ్చు. తద్వారా కడుపులో గ్యాస్ కూడా తగ్గుతుంది. నిర్దిష్టమైన పిండిపదార్థాలతో (కార్బోహైడ్రేట్)లతో కూడిన ఆహారంతో జీర్ణవ్యవస్థకు మేలు చేసే బ్యాక్టీరియా (ప్రో-బయోటిక్ బ్యాక్టీరియా) ద్వారా జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుకోవడం కూడా చికిత్సలో ప్రధానమైన అంశం. నిజానికి మన జీర్ణవ్యవస్థలోని ప్రతి చదరపు అంగుళమూ కోటాను కోట్ల బ్యాక్టీరియాను కలిగి ఉంటుంది. ఈ బ్యాక్టీరియా మన వ్యాధి నిరోధక వ్యవస్థ మొదలుకొని, మూడ్స్, ఆరోగ్యం వరకు అనేక అంశాలను ప్రభావితం చేస్తుంది. ఈ మేలు చేసే బ్యాక్టీరియాను సమతౌల్యంలో ఉంచుకోవడం వల్లనే మన శారీరక, మానసిక ఆరోగ్యాలు బాగుంటాయి. మన జీర్ణవ్యవస్థలోని ఆ బ్యాక్టీరియా సమతౌల్యతను ఎప్పుడూ కొనసాగేలా చేసుకోవడం అవసరం. అందుకే ఆ సమతౌల్యత దెబ్బతినకూడదంటే... విచక్షణ రహితంగా యాంటీబయాటిక్ మందులూ, నొప్పినివారణ మందులూ వాడకూడదు. అలాగే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉండే మంచి ఆహారాన్ని (మెడిటెరేనియన్ డైట్) వంటివి తీసుకోవడం కూడా ఐబీడీని అదుపులో ఉంచుతుందని అనేక పరిశోధనల్లో వెల్లడైంది.



డా॥ కె. బాల మురళీకృష్ణ,
సీనియర్ కన్సల్టెంట్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ అండ్ హెపటాలజిస్ట్

ఈసారి సీజన్ కాస్త విచిత్రంగా ఉంది. మొదట్లో అర్లీ మాన్‌సూన్స్ అంటూ వర్షాలు చాలా త్వరగా పడ్డాయి. దాంతో సమ్మర్ ముగిసిందనీ, ఇక వర్షాలు పడుతుండటంతో వాతావరణం చల్లబడుతుందని అందరూ అనుకున్నారు. కాని వర్షాలు పడ్డట్టే పడ్డా... ఆ తర్వాత వాతావరణంలో మాత్రం నడి వేసవి రోజుల నాటి వేడిమి ఉంటోంది. ఓ పక్క వర్షాలు కురుస్తున్నా... మళ్లీ ఉక్కపోతలాంటి వేడి వాతావరణం కనిపిస్తోంది. దాంతో ముఖ్యంగా ఆరుబయట ఔట్‌డోర్స్‌లో పని చేసేవారు ఒంట్లో నీటి మోతాదులు తగ్గి డీ-హైడ్రేషన్‌కు గురయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. కేవలం పండ్లు, ఆకుకూరలు వంటి ఆహారపరమైన జాగ్రత్తలతో రీ-హైడ్రేషన్‌కు ప్రయత్నించడంతో పాటు మంచి ఆరోగ్యం పొందడమెలాగో చూద్దాం.

• రీ-హైడ్రేషన్

నీరు - మీరు



ఓ పక్క వర్షాలు కురుస్తూనే మరో పక్క ఉక్కపోత ఉండటంతో చెమట రూపంలో ఒంట్లోంచి నీరు బాగానే వెళ్లిపోతోంది. దాంతో ఆ నీటిని మళ్లీ భర్తీ చేయడంతో ఇతరత్రా మంచి మినరల్స్, లవణాలను కాపాడుకోవడం అన్నది రుచికరంగా చేయడమెలాగో తెలుసుకుందాం.



• **పుచ్చకాయ:** ఇందులో నీటి మోతాదు 80 శాతం కంటే ఎక్కువగానే ఉంటుంది. అందువల్ల డీహైడ్రేషన్‌ను నివారించడంతో పాటు మంచి ఆరోగ్యాన్ని ఇస్తుంది. ముఖ్యంగా డయాబెటిస్ బాధితులకు చాలా అనువైన ఫ్రూట్ ఇది.



• **కూరగాయల్లో:** క్యారట్, బీన్స్, వెల్లుల్లి వంటి కూరలను తీసుకోవడం మంచిది. వీటిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు చర్మవ్యాధుల నుంచి రక్షిస్తాయి. సొరకాయ, బీరకాయ, పొట్లకాయ వీటన్నింటిలోనూ నీటి పాళ్లు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి ఇప్పుడున్న ఉక్కపోత వల్ల కోల్పోయే నీటిని భర్తీ చేస్తాయి. ఉల్లిపాయ వ్యాధి నిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తుంది. ఆరుబయట నుంచి ఇంట్లోకి రాగానే పుదీనా ఆకుల్ని కాస్త నలిపి, ఆ రసాన్ని తాజా నీటిలో కలుపుకుని, అందులో ఒక నిమ్మకాయ పిండుకుని తాగడం అన్నది ఓ తాజా అనుభూతిని కలిగిస్తుంది.

• **వెజిటబుల్ చిల్డ్ సూప్స్:** అన్ని రకాల ఖనిజ లవణాలు ఉన్న వెజిటబుల్స్‌లో దోసకాయ కూడా ఒకటి. ఇది శరీరంలో నీటి మోతాదులను పెంచి డీహైడ్రేట్ అవ్వకుండా కాపాడుతాయి.

• **హోల్ గ్రెయిన్ సలాడ్స్:** మొక్కజొన్నలు, మొలకెత్తిన పెసలు, శనగలు (స్ప్రౌట్స్), కూరముక్కలు... వంటివాటిని కలిపి తినడం మంచిది. వీటిని చాలా త్వరగా తయారుచేసుకోవచ్చు. ఎంత ఎక్కువ పచ్చికూరలను తీసుకుంటే అంత మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చు.

• **స్ప్రౌట్ సలాడ్:** మొలకెత్తిన గింజలను (స్ప్రౌట్స్‌ను) సన్నగా తరిగిన కూరముక్కలు, పండ్ల ముక్కలతో పాటు కలిపి తీసుకుంటే క్యాల్షియం, ప్రొటీన్లు సమకూరడంతో మంచి ఆరోగ్యం సమకూరుతుంది.

• **బెర్రీఫ్రూట్స్:** ఏదీ మిగల్చకుండా, పారేయాల్సిన అవసరం లేకుండా ఓ మొత్తం పండునంతా తినగలిగే టొమాటో, బెర్రీల వంటి వాటిని బెర్రీ ఫ్రూట్స్ అంటారు. నీటి మోతాదులు ఎక్కువగా ఉండే బెర్రీ ఫ్రూట్స్ దేహంలో నీటిని తిరిగి భర్తీ చేయడంతో పాటు ఆరోగ్యానికీ చాలా మేలు చేస్తాయి. ఆకుకూరల విషయానికి వస్తే ముదురాకుపచ్చ రంగులో ఉండే అన్ని ఆకుకూరలూ వ్యాధి నిరోధక వ్యవస్థకు పూర్తిగా మేలు చేసేవే.

• **పండ్లతో చేసే డెజర్ట్స్:** వేసవిలో ఆరోగ్యాన్నిచ్చే పండ్లతో తయారుచేసిన డెజర్ట్స్‌ని తీసుకోవటానికి ప్రాధాన్యత ఇవ్వాలి. తక్కువ కొవ్వు ఉన్న తాజా పండ్లతో కూడిన పెరుగు, ఫ్రూట్ కస్టర్డ్ వంటివి తీసుకోవటం మంచిది. ఇవి శరీరానికి కావలసిన ప్రొటీన్లు, క్యాల్షియంలను అందిస్తాయి.



• **నట్స్ అండ్ డ్రైఫ్రూట్స్‌లో:** వేసవిలో కొద్దిగా అక్రోట్లు (వాల్‌నట్) తీసుకోవడం మంచిది. జీడిపప్పు కంటే బాదంపప్పు మేలు.

• **చేపలు:** వీలైతే ఆహారంలో భాగంగా వారానికి మూడు రోజులూ చేపలు తినడం మంచిదే. వీటిలో ఉండే ఒమేగా – 3 ఫ్యాటీయాసిడ్లు గుండె ఆరోగ్యంగా ఉండటానికి సహాయపడతాయి. అయితే వేయించిన చేపల కంటే ఉడకబెట్టిన లేదా గ్రిల్డ్ చేపలు తినడం మరీ మంచిది.

దేహం కోల్పోతున్న నీటిని భర్తీ చేయడానికి సోడాలూ, కోలా డ్రింక్స్ కంటే మజ్జిగ, కొబ్బరి నీళ్ల వంటివి మేలు. సోడాలూ, కూల్ డ్రింక్స్, కోలా డ్రింక్స్ అనేవి తాత్కాలికంగా దాహం తీరుస్తున్నట్టు అనిపించినప్పటికీ ఆ తర్వాత దాహం పెంచేస్తాయి. అందుకే ఈ తరహా పానీయాల కంటే మజ్జిగ, కొవ్వులేని పాలు తోడుబెట్టి చేసే పెరుగు చిలికి చేసే లస్సీల వంటి స్వాభావిక పానీయాలు తీసుకోవడమే మేలు.



దేహం కోల్పోతున్న నీటిని భర్తీ చేయడానికి సోడాలూ, కోలా డ్రింక్స్ కంటే మజ్జిగ, కొబ్బరినీళ్ల వంటివి మేలు. మజ్జిగ, కొవ్వులేని పాలు తోడుబెట్టి చేసే పెరుగు చిలికి చేసే లస్సీల వంటి స్వాభావిక పానీయాలు తీసుకోవడమే మేలు.





సాక్షి
హైదరాబాద్
ఆదివారం । 8 । జూన్ । 2025



వీకెండ్ కోసం వచ్చి..
ఘట్‌కేసర్ పరిధిలోని ఏదులాబాద్‌లో రోడ్డు పక్కనున్న విద్యుత్ స్తంభాన్ని కారు ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు.
-10లో



నీట్.. ఫిట్..
రోజువారీ పనుల ద్వారానే శరీరాన్ని ఫిట్‌గా ఉంచుకునే విధానం ఇప్పుడు ట్రెండ్‌లో ఉంది. దానికి 'నీట్' దోహదం చేస్తోంది.
- సిటీప్లస్‌లో


గరిష్టం/కనిష్టం
37.0/26.0

వాతావరణం
నగరంలో ఆదివారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 37, కనిష్టంగా 26 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.

కోహెడ మార్కెట్‌కు త్వరలో శంకుస్థాపన!

సాక్షి, రంగారెడ్డిజిల్లా: కోహెడలో కొత్తగా నిర్మించతలపెట్టిన సమీకృత మార్కెట్ల నిర్మాణానికి త్వరలోనే శంకుస్థాపన చేయనున్నట్లు సమాచారం. మొత్తం 250 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో పండ్లు, పూలు, కూరగాయలు, చేపలు, మాంసం ఉత్పత్తులకు సంబంధించిన మార్కెట్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఇప్పటికే 241 ఎకరాలను సేకరించిన ప్రభుత్వం..తాజాగా మరో తొమ్మిది ఎకరాలకు నోటిఫికేషన్ జారీ చేసింది. సేకరించిన భూమిలో సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక (డీపీఆర్)ను కూడా సిద్ధం చేసింది. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో అభివృద్ధి చేయనున్న ఈ మార్కెట్ నిర్మాణానికి రూ.2,890 కోట్లు ఖర్చు కానుందని అంచనా. త్వరలో టెండర్లు ఆహ్వానించి భూమిపూజ చేయనున్నట్లు తెలిసింది.

ఈద్గాలకు ఆధ్యాత్మిక శోభ


చార్మినార్ మక్కామసీదులో ప్రత్యేక ప్రార్థనలు

నగరంలోని మసీదులు, ఈద్గాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. శనివారం ముస్లింలు బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ప్రత్యేక ప్రార్థనలు, నమాజ్‌లు చేశారు. అల్లాహ్‌ను స్మరించుకుని.. ఖుర్బానీ ఇచ్చిపుచ్చుకున్నారు.


అంబర్‌పేట్ మున్సిపల్ గ్రౌండ్‌లో..


చంచల్‌గూడలో..

ఏలిక లేరు.. ఎన్నిక లేదు!

ఆ వార్డులు.. అంతే సంగతులు

'స్థానిక' ప్రజాప్రతినిధులు లేకుండానే ముగియనున్న పాలకమండలి?

- బల్దియాలో 5 వార్డులు ఖాళీ
- స్థానిక సమస్యలు పరిష్కరించే వారెవరు?



ఇంకా జాప్యం జరిగితే..

జీహెచ్‌ఎంసీ పాలకమండలి గడువు ఐదేళ్లు కాగా, ప్రస్తుత పాలకమండలి 2021 ఫిబ్రవరి 12న ప్రమాణ స్వీకారం చేసింది. వచ్చే ఫిబ్రవరి 10వ తేదీతో ఐదేళ్ల గడువు ముగిసిపోనుంది. అంతకు ఆర్నెల్ల ముందు అంటే దాదాపుగా ఈ సంవత్సరరం ఆగస్ట్ మొదటివారం లోగా ఉప ఎన్నిక జరగని పక్షంలో వాటికి ఇక ఉప ఎన్నిక జరిగే అవకాశం ఉండదు. ఇప్పటికైనా ఖాళీ అయిన వార్డులకు ఉప ఎన్నికలు జరుగుతాయో.. లేదో?!

ఖాళీ ఇలా..

డివిజన్	కార్పొరేటర్	ఖాళీకి కారణం	ఎప్పుడు
శాస్త్రిపురం	మహ్మద్ ముబీన్	ఎమ్మెల్యేగా ఎన్నిక	డిసెంబర్ 2023
మెహిదీపట్నం	మహ్మద్ మాజిద్ హుస్సేన్	ఎమ్మెల్యేగా ఎన్నిక	డిసెంబర్ 2023
గుడి మల్కాపూర్	దేవర కరుణాకర్	మృతి	జనవరి 2023
ఎర్రగడ్డ	షాహీన్‌బేగం	మృతి	జనవరి 2024
సంతోష్‌నగర్	ముజాఫర్ హుస్సేన్	మృతి	జూన్ 2025

సాక్షి, సిటీబ్యూరో:

జీహెచ్‌ఎంసీ చట్టం, నిబంధనల మేరకు ఏదైనా కార్పొరేటర్ స్థానం (వార్డు/డివిజన్) ఖాళీ అయితే.. నాలుగు నెలల్లోగా తిరిగి భర్తీ చేయాలి. అందుకు ఉప ఎన్నిక నిర్వహించాలి. కానీ.. జీహెచ్‌ఎంసీ ప్రస్తుత పాలక మండలిలోని ఐదు వార్డులు ఖాళీ కాగా ఇప్పటి వరకు ఒక్కదానికి కూడా తిరిగి ఉప ఎన్నిక నిర్వహించలేదు. దాంతో అవి ఖాళీగానే ఉన్నాయి. కార్పొరేటర్లుగా ఉంటూనే అసెంబ్లీకి పోటీచేసి ఇద్దరు ఎమ్మెల్యేలు కావడంతో రెండు స్థానాలు ఖాళీ అయ్యాయి. ఇటీవలే మరణించిన సంతోష్‌నగర్ కార్పొరేటర్‌తో సహా ముగ్గురు కార్పొరేటర్లు మృతి చెందడంతో మూడు స్థానాలు ఖాళీ అయ్యాయి. వెరసి మొత్తం 5 వార్డులకు స్థానిక ప్రజాప్రతినిధులు లేరు. వీరిలో ఈ నెల 4న మరణించిన సంతోష్‌నగర్ కార్పొరేటర్ మహమ్మద్ ముజాఫర్ హుస్సేన్‌నుంచి రెండున్నరేళ్ల క్రితం మరణించిన గుడిమల్కాపూర్ కార్పొరేటర్ దేవర కరుణాకర్ వరకు ఉన్నారు. ఇద్దరు కార్పొరేటర్లు 2023 సంవత్సరం నవంబర్30న జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. ఫలితాలు డిసెంబర్ నెలలో వెలువడ్డాయి.

ఎన్నికల సంఘానికి రాసినా..

జీహెచ్‌ఎంసీలో ఖాళీ అయిన వార్డుల గురించి అధికారులు ఎప్పటికప్పుడు ఎన్నికల సంఘానికి రాసినప్పటికీ, ఇప్పటి వరకు ఏ ఒక్క వార్డుకూ ఎన్నికలు జరపలేదు. ప్రభుత్వ ఆదేశాల కనుగుణంగానే ఎన్నికల సంఘం వ్యవహరిస్తుందని పరిశీలకులు పేర్కొన్నారు.

ఎమ్మెల్యే స్థానం భర్తీ అయినా..

2023 అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత మృతితో ఖాళీ అయిన ఆ స్థానానికి 2024 మే నెలలోనే ఉప ఎన్నిక జరగడం, ఆ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా శ్రీగణేశ్ నారాయణ్ ఎన్నికవడం జరిగింది. కానీ, అదే ఎన్నికల్లో ఇద్దరు కార్పొరేటర్లు ఎమ్మెల్యేలుగా ఎన్నికైనందున ఖాళీ అయిన మెహిదీపట్నం, శాస్త్రిపురం డివిజన్ల కార్పొరేటర్ల ఎన్నికలు మాత్రం ఇంకా జరగలేదు. అంతకు ముందే కార్పొరేటర్ దేవర కరుణాకర్ మృతితో ఖాళీ అయిన గుడిమల్కాపూర్ వార్డు ఎన్నిక సైతం జరగలేదు. ఎమ్మెల్యే స్థానానికి ఎన్నిక జరిగినప్పటికీ, స్థానిక ప్రజలకు అందుబాటులో ఉండే కార్పొరేటర్ ఎన్నికలు మాత్రం జరగలేదు. స్థానిక సమస్యల పరిష్కారంలో కీలకపాత్ర నిర్వహించే కార్పొరేటర్ల స్థానాలను నిర్ణీత వ్యవధిలో భర్తీ చేయడంపై ప్రభుత్వం అశ్రద్ధ వహించింది. అందుకే అవి ఇప్పటికీ భర్తీ కాలేదు.

నిబంధనల మేరకు..

ఏకారణం చేతనైనా ఒక కార్పొరేటర్ స్థానం ఖాళీ అయితే, పాలకమండలి ఎన్నికలకు ఆర్నెల్ల కన్నా తక్కువ గడువు ఉంటే ఆ స్థానానికి ఉప ఎన్నిక నిర్వహించరు. లేని పక్షంలో జీహెచ్‌ఎంసీ చట్టంలోని సెక్షన్- 7 మేరకు ఉప ఎన్నిక నిర్వహించాలని మున్సిపల్ వ్యవహారాల నిపుణులు తెలిపారు. అందుకనుగుణంగా ఏదైనా వార్డు ఖాళీ అయితే 15 రోజుల్లోగా జీహెచ్‌ఎంసీ కమిషనర్ రాష్ట్ర ఎన్నికల సంఘానికి లేఖ రాసి సమాచారమిస్తారు. నాలుగు నెలల్లోగా ఎన్నికల సంఘం ఉప ఎన్నిక నిర్వహించాలి. గతంలో నాలుగు వార్డులు ఖాళీ అయిన సందర్భాల్లో ఎప్పటికప్పుడు జీహెచ్‌ఎంసీ కమిషనర్ రాష్ట్ర ఎన్నికల సంఘానికి లేఖలు రాసినా, ఇప్పటి వరకు వాటికి ఎన్నికలు నిర్వహించకపోవడంతో అవి ఖాళీగానే మిగిలాయి. ఇటీవలే సంతోష్‌నగర్ డివిజన్‌కూడా ఖాళీ కావడంతో ఐదుకు పెరిగాయి.

జాతీయ స్ఫూర్తి.. దేశీయ కీర్తి!

కాచిగూడ రైల్వే స్టేషన్‌కు నయా థీమ్ లైటింగ్

- ప్రవేశ ద్వారం వద్ద ప్రత్యేక విద్యుద్దీపాలతో అలంకరణ
- త్రివర్ణ కాంతుల్లో శ్వేత సౌధం ధగధగ
- రేపు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిచే ప్రారంభోత్సవం

సాక్షి, సిటీబ్యూరో/కాచిగూడ: అందమైన శ్వేతసౌధమైన నిజాం కాలం నాటి చారిత్రక కాచిగూడ రైల్వేస్టేషన్ మరింత కళాత్మకతను సంతరించుకోనుంది. స్టేషన్ ముఖద్వారం రకరకాల థీమ్ లైటింగ్‌తో వెలుగొందనుంది. దేశభక్తిని, జాతీయతా స్ఫూర్తిని కలిగించే అద్భుతమైన థీమ్‌లను విద్యుత్ కాంతులతో ప్రదర్శిస్తారు. ఆపరేషన్ సిందూర్ విజయోత్సవాన్ని ప్రతిబింబించే త్రివర్ణకాంతులు, మహిళా దినోత్సవానికి పింక్ లైటింగ్ వంటి థీమ్‌లను ఆయా ప్రత్యేక సందర్భాల్లో ఆవిష్కరించేలా అధునాతన లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. సోమవారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఈ లైటింగ్ వ్యవస్థను ప్రారంభించనున్నారు.

అబ్బురపరిచే నిర్మాణ శైలి..

1916లో నిజాం నవాబ్ మీర్ ఉస్మాన్ అలీఖాన్ కాచిగూడ రైల్వేస్టేషన్‌ను నిర్మించారు. నగరంలోని నిజాం నవాబులు, ప్రముఖుల కుటుంబాల రాకపోకలకు ఈ రైల్వే స్టేషన్‌ను వినియోగించేవారు. హైదరాబాద్ నుంచి ముంబై, ఔరంగాబాద్, వాడీ తదితర ప్రాంతాలకు ఇక్కడి నుంచి రైళ్లు నడిచేవి. ఇండో-సార్సెనిక్, ఇండో -గోథిక్ నిర్మాణ శైలిలో నిర్మించిన ఈ భవనం గొప్ప వారసత్వ కట్టడంగా గుర్తింపును పొందింది. ప్రస్తుతం సుమారు 50 వేల మంది కాచిగూడ స్టేషన్ నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. ప్రతిరోజు 103 రైళ్లు వివిధ ప్రాంతాలకు బయలుదేరి వెళ్తాయి. థీమ్‌లైటింగ్ ప్రారంభోత్సవంలో పలువురు ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు, దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్, సీనియర్ అధికారులు పాల్గొననున్నారు.

రూ.2.23 కోట్లతో..

పర్యాటకులను ఆకట్టుకొనేవిధంగా కూడా ఈ థీమ్‌లైటింగ్‌ను రూపొందించారు. ఇందుకోసం రూ.2.23 కోట్ల అంచనా వ్యయంతో విద్యుత్ దీపాలంకరణ పూర్తిచేశారు. ఈ భవనం నిర్మాణ కౌశలాన్ని, వారసత్వాన్ని చాటేలా సరైన విద్యుత్ దీపకాంతులు వెలుగులు విరజిమ్ముతాయి. ప్రయాణికులకు, నగర వాసులకు, పర్యాటకులకు రాత్రివేళల్లో గొప్ప అనుభూతినివ్వనున్నాయి.

అత్యాధునిక సాంకేతికత...

ఈ అలంకరణలో విద్యుత్ పరికరాలు అవుట్‌డోర్ టైప్ ఆర్‌జీబీ, ఎల్‌ఈడీ, ఐపీ 66 వంటి ఆధునిక పరికరాలతో రూపొందించారు. దీంతో ఇవి వివిధ రకాల లైటింగ్ థీమ్‌లకు అనుగుణంగా ఉంటాయి. లైటింగ్ పర్యావరణ హితంగా, సురక్షితంగా ఉంటుందని దక్షిణమధ్య రైల్వే అధికారులు తెలిపారు. ఈ లైట్ల నుంచి వెలువడే కాంతి పూర్తిగా కాలుష్య రహితమైనదని పేర్కొన్నారు. భవనం నిర్మాణ వైభవాన్ని సమున్నతంగా ఆవిష్కరించడమే ఈ లైటింగ్ లక్ష్యమని పేర్కొన్నారు.


త్రివర్ణ విద్యుద్దీప కాంతుల్లో కాచిగూడ రైల్వే స్టేషన్ ముఖ ద్వారం

మూడు చక్రాలు గిరగిరా!

- 20 వేల ఎల్పీజీ, సీఎన్జీ వాహనాలకు అనుమతి
- ఇప్పటికే సిటీ రోడ్లపై 1.25 లక్షల ఆటోలు

గ్రేటర్‌లో కొత్తగా 65 వేల ఆటో పర్మిట్లు

సాక్షి, సిటీబ్యూరో: వాహన కాలుష్య నియంత్రణ పేరిట ప్రభుత్వం ఆటో పర్మిట్ల జాతరకు తెర తీసింది. ఎలక్ట్రిక్ ఆటోలు, సీఎన్జీ, ఎల్పీజీ, రిట్రోఫిట్‌మెంట్ విభాగాల్లో మొత్తం 65 వేల ఆటోలు కొత్తగా రోడ్డెక్కనున్నాయి. ఇప్పటికే గ్రేటర్ పరిధిలో సుమారు 1.25 లక్షల ఆటోలు తిరుగుతున్నాయి. వివిధ జిల్లాలకు చెందిన మరో 30 వేలకుపైగా ఆటోలు ఇక్కడ నడుస్తున్నాయి. విస్తరిస్తున్న నగర అవసరాల దృష్ట్యా, పర్యావరణ పరిరక్షణకు అనుగుణంగా పెట్రోల్, డీజిల్ లేని 65 వేల ఆటోలకు అనుమతి లభించింది.



రోడ్డెక్కనున్న 20 వేల ఎలక్ట్రిక్ ఆటోలు..

ప్రస్తుతం తిరుగుతున్న డీజిల్, పెట్రోల్ వాహనాలతో తీవ్రమైన కాలుష్య కారకాలు వెలువడుతున్నాయి. ఎల్పీజీ, సీఎన్జీతో నడిచే వాహనాల్లోనూ కల్తీ ఇంజినాయిల్ వినియోగిస్తున్నారు. దీంతో ఆటో కాలుష్యం ఆందోళన కలిగిస్తోంది. ఈ క్రమంలోనే ప్రభుత్వం కొత్తగా అనుమతినిస్తున్న వాటిలో 20 వేల ఎలక్ట్రిక్ ఆటోలు ఉన్నాయి. మరో 10 వేల ఎల్పీజీ ఆటోలు, 10 వేల సీఎన్జీ ఆటోలకు కూడా ప్రభుత్వం కొత్తగా అనుమతులను ఇవ్వనుంది. ఇవి కాకుండా డీజిల్, పెట్రోల్‌తో నడిచే 25 వేల ఆటోలను సీఎన్జీ, ఎల్పీజీకి మార్చుకొనేందుకు రిట్రోఫిట్‌మెంట్ అనుమతులను కూడా ఇచ్చారు. దీంతో 65 వేల ఆటో రిక్షాలు కొత్తగా అందుబాటులోకి రానున్నాయి. ఈ ఆటోలను ఔటర్ వరకు అనుమతిస్తారు.

భూరేలాల్ సిఫార్సులకు బురిడీ..

గ్రేటర్‌లో వాహన కాలుష్యాన్ని అరికట్టేందుకు చేపట్టాల్సిన చర్యలపై అప్పటి ప్రభుత్వం భూరేలాల్ కమిటీని ఏర్పాటు చేసింది. ఆటో రిక్షాల నుంచి వెలువడే కాలుష్యాన్ని నియంత్రించేందుకు కొత్తగా ఎలాంటి పర్మిట్లను ఇవ్వరాదని ఈ కమిటీ 2002లోనే సిఫార్సు చేసింది. అప్పటి నుంచి కొంతకాలం నిలిపివేశారు. ఆ తర్వాత క్రమంగా నిషేధాన్ని సడలిస్తూ తెలంగాణ ఏర్పాటుకు ముందే 25 వేలకు పైగా పర్మిట్లు ఇచ్చారు. కాలం చెల్లిన వాహనాల పర్మిట్లపై కొత్తవి కొనుగోలు చేసేందుకు అవకాశం కల్పించారు. ఇదంతా నగరంలోని బడా ఫైనాన్షియర్‌లు, ఆటోమొబైల్ డీలర్లు, దళారుల అక్రమార్జనకు ఊతమిచ్చింది.

ఫైనాన్షియర్ల అక్రమాలకు ఊతం..

అప్పట్లో సుమారు రూ.100 కోట్లకు పైగా అక్రమ వ్యాపారం జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ప్రస్తుతం సుమారు లక్ష పర్మిట్లు ఫైనాన్షియర్‌ల గుప్పెట్లోనే ఉన్నాయి. ప్రభుత్వం కొత్తగా పర్మిట్లు ఇచ్చిన ప్రతిసారి ఆటో రిక్షా ధరలను పెంచేస్తారు. పేద ఆటోడ్రైవర్‌ల నుంచి ఇష్టారాజ్యంగా అక్రమ వడ్డీలు, చక్రవడ్డీలు వసూలు చేస్తారు. దీంతో అప్పులు చెల్లించలేని నిస్సహాయ స్థితిలో ఆటోకార్మికులు తమ వాహనాలను తిరిగి ఫైనాన్షియర్‌లకే అప్పగిస్తున్నారు. హైదరాబాద్‌లో ఆటోపర్మిట్లు మొదటి నుంచి ఫైనాన్షియర్‌ల అక్రమార్జనకు అవకాశంగా మారాయి. ప్రభుత్వం మరోసారి సామాన్య, పేద డ్రైవర్లపై ఫైనాన్షియర్లు నిలువుదోపిడీకి పాల్పడే పర్మిట్ల బేరానికి తెరతీసింది.

బడి బస్సుల బాధ్యత విద్యాసంస్థలదే

- ఫిట్‌నెస్ లేనివాటిపై కఠిన చర్యలు
- విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ జేటీసీ చంద్రశేఖర్



సాక్షి, సిటీబ్యూరో: బడిబస్సుల బాధ్యత విద్యాసంస్థల యాజమాన్యాలదేనని రవాణాశాఖ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్ తెలిపారు. ఫిట్‌లెస్ లేని బస్సులు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ నెల 12 నుంచి విద్యాసంస్థలు తెరుచుకోనున్న దృష్ట్యా పిల్లలను చేరవేసే వాహనాల నిర్వహణపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతీ బస్సుకు తప్పనిసరిగా ఫిట్‌నెస్ ఉండాలని పేర్కొన్నారు. బస్సులకు సంబంధిత రవాణా కార్యాలయాల్లో వెంటనే సామర్థ్య పరీక్షలు నిర్వహించి ధ్రువీకరణ పత్రాలను తీసుకోవాలని సూచించారు. 15 సంవత్సరాల కాలపరిమితి ముగిసిన బస్సులను స్వచ్ఛందంగా ఉపసంహరించుకోవాలని, అలాంటి బస్సులు రోడ్డెక్కితే జప్తు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. సామర్థ్యం లేని బస్సుల్లో పిల్లలను తరలించినా సీజ్ చేయనున్నట్లు పేర్కొన్నారు. స్కూల్ బస్సులు మంచి కండిషన్‌లో ఉండాలని, అనుభవజ్ఞులైన డ్రైవర్ల సేవలను మాత్రమే వినియోగించుకోవాలని జేటీసీ సూచించారు. పరిమితికి మించిన సంఖ్యలో విద్యార్థులను తీసుకెళ్లినా చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ఈ మేరకు ఇప్పటికే అన్ని చోట్ల ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. రవాణాశాఖ అధికారులు,ఎంవీఐలు, సిబ్బంది స్కూల్ యాజమాన్యాలతో సమావేశమై బస్సుల సామర్థ్యంపై అవగాహన కల్పిస్తారని చెప్పారు.

బాలారిష్టాల్లో 'ఫ్యూచర్'

నాలుగో నగరి భవిష్యత్.. మూడో నగరిలో

- ఫ్యూచర్‌సిటీ ఆఫీసు నానక్‌రాంగూడలో..
- ఇప్పటికీ అడుగు పడని ప్రాజెక్టులు
- కేవలం స్కిల్ వర్సిటీకే పరిమితం..
- గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు కోర్టు బ్రేక్
- ఫోర్త్ సిటీని వేధిస్తున్న సిబ్బంది కొరత
- మాస్టర్ ప్లాన్ దిశగా పడని అడుగులు
- ఎఫ్‌సీడీఏ మాస్టర్ ప్లాన్ బాధ్యత హెచ్‌ఎండీఏ చేతికి..


సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న 'ఫ్యూచర్ సిటీ' భవిష్యత్ మూడడుగులు ముందుకు.. ఆరడుగులు వెనక్కి అన్నట్లు మారింది. 330 అడుగుల గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు, మెట్రో రైలు, ఏఐ సిటీ, జపాన్, తైవాన్ కంపెనీలు అంటూ రోజుకో ప్రకటనతో సర్కారు ఊదరగొడుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. ఇప్పటివరకు కేవలం స్కిల్ యూనివర్సిటీ మినహా మరే ప్రాజెక్టుకు ప్రతిపాదిత నాలుగో నగరిలో పునాది రాయి కూడా పడకపోవడం.. ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేస్తూ రెండు నెలల క్రితం ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ సిబ్బందిని కూడా సమకూర్చుకోకపోవడం చూస్తే.. ఈ ప్రాజెక్టు ఎప్పుడు పట్టాలెక్కుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. కడ్తాల్, కందుకూరు, యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం, ఆమన్‌గల్, మహేశ్వరం మండలాల్లోని 56 గ్రామాలను ఎఫ్‌సీడీఏ పరిధిలోకి తెచ్చారు. అయితే.. ఈ గ్రామాల అభివృద్ధిని క్షేత్రస్థాయి నుంచి పర్యవేక్షించాల్సిన ఎఫ్‌సీడీఏ ఆఫీసు మాత్రం మూడో నగరమైన (సైబరాబాద్) నానక్‌రాంగూడలో ఏర్పాటు చేయడం గమనార్హం.

సీఎం కలల ప్రాజెక్టు..

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలల ప్రాజెక్టు బాలారిష్టాలను ఎదుర్కొంటోంది. అధికారంలోకి రాగానే హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ తరహాలో ఫోర్త్ సిటీ అవసరమని రేవంత్ ప్రకటించారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ జాతీయ రహదారుల మధ్యలో ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించి ఏడాది గడుస్తున్నా ఆశించిన స్థాయిలో ఆ దిశగా అడుగులు ముందుకు పడటం లేదు. పూర్తి స్థాయి సిబ్బంది లేకపోవడంతో అభివృద్ధి పనుల్లో పురోగతి కనిపించడం లేదు. రావిర్యాల ఓఆర్ఆర్ ఎగ్జిట్ నుంచి ఆకుతోట పల్లి వరకు 330 అడుగుల రతన్‌టాటా గ్రీన్‌ఫీల్డ్ రహదారికి భూ సేకరణ పనులు చురుగ్గా సాగగా.. పరిహారం ఇవ్వకుండానే నిర్మాణ పనులకు టెండర్లు పిలవడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ నిర్వాసితులు హైకోర్టును ఆశ్రయించడంతో బ్రేక్ పడింది. దీంతో ఇప్పటివరకు ఈ ప్రాంతంలో కేవలం స్కిల్ వర్సిటీ పనులు మాత్రమే కాస్తో కూస్తో సాగుతున్నాయని చెప్పవచ్చు.

సిబ్బంది కొరత..

765.28 చదరపు కి.మీల విస్తీర్ణంలో ఫోర్త్ సిటీని అభివృద్ధి చేయాలన్నది రేవంత్ సర్కార్ లక్ష్యం. ఎఫ్‌సీడీఏ ప్రధాన కార్యాలయం నానక్‌రాంగూడలోని ఉంది. వివిధ విభాగాల నుంచి డిప్యుటేషన్‌పై 90 పోస్టులకు గత మార్చిలో మంత్రివర్గం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. వీటిలో 34 రెగ్యులర్ పోస్టులు కాగా.. మిగిలిన 56 పోస్టులను ఔట్ సోర్సింగ్/కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేస్తారు. కానీ.. ఇప్పటివరకు ఎఫ్‌సీడీఏ కమిషనర్ శశాంక మినహా పూర్తిస్థాయి సిబ్బంది నియామకం జరగలేదు. సిబ్బంది కొరతతో ఫ్యూచర్ సిటీ అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ ఇతర విభాగాల నుంచి డెప్యుటేషన్‌పై ఎఫ్‌సీడీఏ ప్లానింగ్ విభాగంలో పనిచేసేందుకు అధికారులు నిరాసక్తి చూపిస్తున్నారు. దీంతో ఎఫ్‌సీడీఏ మాస్టర్ ప్లాన్ రూపకల్పనలో ఎలాంటి పురోగతి లేదు.



మాస్టర్ ప్లాన్ హెచ్‌ఎండీఏదే..

ఫోర్త్‌సిటీలో ఐటీ, పారిశ్రామిక, ఆతిథ్య, పర్యాటక, క్రీడారంగాలకు పెద్దపీట వేయాలని నిర్ణయించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు దేశ, విదేశీ సంస్థలు, పెట్టుబడులు తీసుకురావాలని భావిస్తోంది. ఈ క్రమంలోనే ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి ప్రతిబంధకాలు రాకుండా, అభివృద్ధి పనులు ప్రణాళికబద్ధంగా చకచకా సాగేలా ప్రత్యేక మాస్టర్ ప్లాన్ రూపొందిచాలని నిర్ణయించారు. ఈ బాధ్యతలను హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) అప్పగించినట్లు ఓ అధికారి తెలిపారు. గతంలో సైబరాబాద్ డెవలప్‌మెంట్ అథారిటీ (సీడీఏ), ఎయిర్‌పోర్ట్ అథారిటీ ప్లాన్ (ఏఏపీ) మాస్టర్ ప్లాన్లను హెచ్‌ఎండీఏనే అభివృద్ధి చేసిందని ఆయన గుర్తుచేశారు. అలాగే ఎఫ్‌సీడీఏ పరిధిలోని గ్రామాలు గతంలో హెచ్‌ఎండీఏ పరిధిలోనే ఉన్నాయని, అందుకే ఎఫ్‌సీడీఏ మాస్టర్ ప్లాన్‌ను హెచ్‌ఎండీఏ అభివృద్ధి చేస్తోందని ఆయన వివరించారు.

పోలీసుల ఎదుట హాజరైన మన్నె క్రిశాంక్

రాజేంద్రనగర్: బీఆర్‌ఎస్ పార్టీ సోషల్ మీడియా రాజేంద్రనగర్ కన్వీనర్ మన్నె క్రిశాంక్ శనివారం సాయంత్రం రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎదుట హాజరయ్యారు. రాష్ట్ర మైనార్టీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ ఫయీం ఖురేషి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ నెల 5వ తేదీన మన్నె క్రిశాంక్‌కు రాజేంద్రనగర్ పోలీసులు నోటీసులు అందించారు. శనివారం హాజరు కావాలని పేర్కొనడంతో ఆయన తన న్యాయవాదులతో కలిసి స్టేషన్‌కు వచ్చి ఇన్‌స్పెక్టర్ ముందు హాజరయ్యారు. మరోసారి హాజరు కావాలని పోలీసులు తెలపడంతో ఆయన న్యాయవాదులతో వెనుతిరిగారు. ఈ సందర్భంగా స్టేషన్ ఆవరణలో విలేకరులతో క్రిశాంక్ మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం మిస్ వరల్డ్ పోటీలను నిర్వహించిన సమయంలో మిస్ ఇంగ్లండ్ చేసిన ఆరోపణలపై విచారించే బదులు తమకు నోటీసులు అందించడం కక్ష పూరితమన్నారు. మిస్ ఇంగ్లండ్ చేసిన ఆరోపణలను అన్ని పత్రికలు ప్రచురించాయని.. దానిని తాము సోషల్ మీడియా ద్వారా ప్రచురించామన్నారు. దానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రధాన అనుచరుడు ఫయీం ఖురేషి రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడం ఏమిటని ప్రశ్నించారు. తాము న్యాయపరంగా పోరాడుతామని, పోలీసులు ఎప్పుడు పిలిచినా హాజరవుతామన్నారు.

మేయర్‌కు బెదిరింపులు!

బంజారాహిల్స్: గ్రేటర్ హైదరాబాద్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మికి గత మూడు రోజుల నుంచి గుర్తు తెలియని వ్యక్తుల నుంచి బెదిరింపు కాల్స్ వస్తున్నాయని, నిందితున్ని పట్టుకుని చర్యలు తీసుకోవాలని ఆమె పీఆర్‌ఓ అఖిల్ బంజారాహిల్స్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఫోన్ నంబర్ ఆధారంగా నిందితుని కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మేయర్‌కు మూడు రోజులుగా ఒకే వ్యక్తి ఫోన్లు చేస్తూ బెదిరింపులకు పాల్పడటమే కాకుండా ఆమెను ఇబ్బంది పెట్టసాగాడు. దీంతో మేయర్ పీఆర్‌ఓ ఫిర్యాదు చేయగా, ఈ నంబర్ కోసం ఆరా తీస్తున్నారు. అడ్రస్ ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నట్లు గుర్తించారు. నిదింతుని జాడ కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా, మేయర్ ఇంటికి గతంలోనూ ఓ వ్యక్తి వచ్చి బెదిరింపులకు పాల్పడగా, అప్పుడు నిదింతునిపై చర్యలు తీసుకున్నారు.

హెచ్‌ఎండీఏ నర్సరీని సందర్శించిన తమిళనాడు అధికారుల బృందం



సాక్షి, సిటీబ్యూరో: హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో ఘట్‌కేసర్ నుంచి చిన్న పెండ్యాల వరకు రోడ్డు మధ్యలో నాటిన మొక్కలతో పాటు నర్సరీలను తమిళనాడు అధికారుల బృందం శనివారం సందర్శించింది. నేషనల్ హైవే డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ టి.శివకుమార్, డివిజనల్ ఇంజనీరు ధనబాలన్, ఏడీ ఆర్‌హెచ్ సెంథిల్ కుమార్‌లు సందర్శించిన వారిలో ఉన్నారు.

‘వీకెండ్’ కోసం వచ్చి అనంతలోకాలకు...

- విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు
- ఇద్దరు యువ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ల దుర్మరణం



ప్రమాదానికి గురైన కారు



భార్గవ్ (ఫైల్)



వర్షిత్ (ఫైల్)

ఘట్‌కేసర్: ఓ ఐటీ కంపెనీలో కొత్తగా ఉద్యోగంలో చేరారు ఆ యువకులు. వరుసగా రెండు రోజులు సెలవులు రావడంతో స్నేహితులతో ఉత్సాహంగా పార్టీ చేసుకునేందుకు శుక్రవారం సాయంత్రం ఘట్‌కేసర్ పరిధి ఏదులాబాద్‌లోని విహారి నెస్ట్ ఫాంహౌస్‌కు వచ్చారు. అర్ధరాత్రి దాటిన తర్వాత బయటకు వచ్చి మిగతా స్నేహితులతో కలిసి రెండు కార్లలో ఏదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువును చూసేందుకు వెళ్లారు. తిరిగి ఫాంహౌస్‌కు చేరుకునే క్రమంలో ఓ కారు రోడ్డు పక్కనున్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతిచెందారు. మరో యువకుడి పరిస్థితి విషమంగా ఉంది. ఇన్‌స్పెక్టర్ పరశురాం తెలిపిన మేరకు గచ్చిబౌలిలోని అసెన్షన్ ఐటీ కంపెనీలో పనిచేసే మిత్రులు కుంట్లూరుకు చెందిన భార్గవ్‌యాదవ్ (23), సైనిక్‌పురికి చెందిన వర్షిత్ (22), పటాన్‌చెరుకు చెందిన దినేశ్ (22), అల్వాల్‌కు చెందిన ప్రవీణ్ (30) నలుగురు ఒక కారులో, మరొక కారులో మరో నలుగురు కలిసి మొత్తం ఎనిమిది మంది శుక్రవారం సాయంత్రం 3 గంటల ప్రాంతంలో ఫాంహౌస్‌కు చేరుకున్నారు. రాత్రి వరకు విందు చేసుకొని అర్ధరాత్రి దాటిన తర్వాత కారులో బయటకు వచ్చి లక్ష్మీనారాయణ చెరువు తిలకించారు. తిరిగి ఫాంహౌస్‌కు చేరుకునే క్రమంలో కిలోమీటర్‌కు ముందే రోడ్డు పక్కనున్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టారు. ఈ సంఘటనలో రెండు స్తంభాలు విరిగిపోయాయి. వెనక కూర్చున్న భార్గవ్, వర్షిత్ బెల్ట్ పెట్టుకోకపోవడంతో కారు డోర్లు తెరుచుకొని రోడ్డుపై పడి అక్కడికక్కడే మృంతిచెందారు. కారులో ముందు భాగంలో ఎయిర్ బ్యాగులు తెరుచుకోవడంతో డ్రైవర్ సీటు పక్కన కూర్చున్న దినేశ్‌కు స్వల్పగాయాలయ్యాయి. డ్రైవర్ వైపు నుంచి స్తంభాన్ని ఢీకొట్టడంతో కారు నడుపుతున్న ప్రవీణ్‌కు తీవ్రగాయాలయ్యాయి. వీరు ప్రయాణిస్తున్న కారు వెనకాల మరో కారులో ఉన్న స్నేహితులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ జరిపి పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాలను గాంధీ ఆస్పత్రికి తరలించారు. గాయాలైన ప్రవీణ్‌ను ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.



ప్రమాద స్థలిలో రోడ్డుపై మృతదేహాలు

అనుమతి లేకుండా మద్యం?

కాగా ఫాంహౌస్‌లో యువకులు మద్యం సేవించారా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇటీవల ఫాంహౌస్‌లలో అనుమతి లేకుండానే మందు పార్టీలు జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. రోడ్డు ప్రమాదాలు జరిగి మరణాలు సంభవిస్తున్నా ఎక్సైజ్ అధికారుల్లో చలనం రావడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జోడీ యాప్‌లో పరిచయమై.. అందినకాడికి దోచేసి...

యువకుడిని మోసం చేసిన యువతి

బంజారాహిల్స్: జోడీ యాప్ ద్వారా పరిచయమైన ఓ యువతి అందినకాడికి దోచుకుని ఓ యువకుడిని మోసగించిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-32లో నివాసం ఉండే కోలా శ్రీకాంత్ ఓ డేటా సెంటర్‌లో మెయింటెనెన్స్ వర్క్ చేస్తుంటాడు. గత నెల 25న తన నివాసంలో ఉన్నప్పుడు జోడి యాప్‌ను చూస్తుండగా సోనీ, జోడి ఐడి-13768896 పేరిట ఉన్న ప్రొఫైల్‌ను క్లిక్ చేశాడు. ఆ తర్వాత వాట్సప్ చాట్‌బాక్స్‌కి ఆమె మళ్లించింది. అక్కడ అతని బయోడేటా ఆటోమేటిక్‌గా షేర్ అయింది. ఇరువురి మధ్య ఫోన్ ద్వారా సంభాషణ జరిగింది. ఆ తర్వాత ఒక ఫోన్ నెంబర్‌ను పంపించి అది తన తల్లికి చెందినదిగా చెప్పి ఆమెను సంప్రదించాల్సిందిగా సదరు యువతి కోరింది. దీంతో శ్రీకాంత్ ఆ నెంబర్‌లో సంప్రదించగా తాము ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, తన కుమార్తె కళాశాల ఫీజు కోసం రూ.10 వేలు పంపించాల్సిందిగా కోరడంతో అతను నిజమేనని భావించి ఆ మొత్తాన్ని గూగుల్‌పే ద్వారా పంపించాడు. ఆ తర్వాత చిన్న చిన్న ఖర్చుల నిమిత్తం రూ.200, రూ.105, రూ.1500, రూ.50లు చొప్పున గట్టు సోనీకి పలుమార్లు డబ్బులు వేశాడు. తర్వాత మనిద్దరి గురించి తమ బంధువులకు తెలపగా వారు అంగీకరించారని, స్వయంగా కలవాలనుకుంటున్నారని, గత నెల 30న పెద్దమ్మ గుడికి రావాల్సిందిగా సోని తెలిపింది. దీంతో శ్రీకాంత్ పెద్దమ్మ గుడికి వెళ్లేందుకు సిద్ధమవుతున్న సమయంలో సోని ఫోన్ చేసి తన బంధువులకు, స్నేహితులకు తాను అత్యధిక జీతం పొందుతున్నానని చెప్పానని, ఆ మాటను నిజం చేసేలా తన అకౌంట్‌లో డబ్బులు ఉండాలని, అందుకు రూ.44,500 అత్యవసరంగా పంపించాల్సిందిగా అభ్యర్థించింది. ఈ మొత్తాన్ని త్వరలోనే తిరిగి చెల్లిస్తానని చెప్పింది. దీంతో ఆమె మాటలను నమ్మిన శ్రీకాంత్ రూ.44,500 ఒకసారి, రూ.24,000 మరోసారి అదే నెంబర్‌కు బదిలీ చేశాడు. ఆ తర్వాత నుంచి అతని సందేశాలకు, కాల్స్‌కు స్పందించడం మానేసింది. మరుసటి రోజు తాను ఆస్పత్రిలో చేరినట్లు పేర్కొంది. ఇదొక పెద్ద స్కామ్‌గా శ్రీకాంత్ గ్రహించి వెంటనే 1930 సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేశాడు. అనంతరం జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో యువకుడి సజీవ దహనం



సాయి (ఫైల్)

జగద్గిరిగుట్ట: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు అంటుకుని యువకుడు మృతి చెందిన సంఘటన శనివారం జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏసీపీ నరేష్ రెడ్డి, సీఐ నర్సింహ తెల్పిన వివరాల ప్రకారం..రింగ్ బస్తీకి చెందిన గజ్జి ఉపేందర్, ధనలక్ష్మి దంపతుల కుమారుడు సాయి(27) సాఫ్ట్‌వేర్ ఉద్యోగం మానేసి నెల రోజులుగా ఇంట్లోనే ఉంటున్నారు. శనివారం ఉదయం 9 గంటల ప్రాంతంలో సాయి పడుకొని ఉండడంతో ఇంటి తలుపులు వేయకుండా గేట్‌కి తాళం వేసి తల్లిదండ్రులు గుడికి వెళ్లారు. ఆ తర్వాత 15 నిమిషాలకు ఇంటినుండి మంటలు రావడంతో ఇరుగు పొరుగువారు గమనించి ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. దీంతో ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. వారు వచ్చి మంటలు ఆర్పేశారు. అయితే అప్పటికి ఇంట్లో నిద్రిస్తున్న సాయి మంటల్లో కాలిపోయి మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ హాస్పిటల్‌కి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు అగ్ని ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు. కాగా మొబైల్ ఫోన్ చార్జర్ పాయింట్ సాయి పడుకున్న ఇనుప మంచానికి ఆనుకొని ఉండడం వల్ల విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయా..లేక ముందు అతను పడుకున్న పరుపుకు మంటలు అంటుకొని, నిద్రలో ఉన్న సాయి ఆ పొగ పీల్చుకోవడంతో అపస్మారక స్థితికి చేరి ఉండొచ్చా అనే కోణంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రేతల పట్టివేత

- మహారాష్ట్ర నుంచి సిటీకి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు
- 1.250 కిలోల గంజాయి స్వాధీనం

సనత్‌నగర్: మహారాష్ట్ర నుంచి గంజాయి తరలిస్తున్న ఇద్దరిని సనత్‌నగర్ పోలీసులు మాటువేసి పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..శనివారం ఉదయం 6 నుంచి 7 గంటల మధ్య ఇద్దరు వ్యక్తులు మహారాష్ట్ర నుంచి మూసాపేట ప్రధాన రహదారిలోని విక్టోరియా హోటల్‌కు గంజాయితో వస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో సనత్‌నగర్ ఎస్‌ఐ హరీష్ పోలీసు సిబ్బందితో కలిసి మఫ్టీలో హోటల్ వద్ద మాటువేశారు. ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కన్పించడంతో వారిని సోదా చేయగా 1.250 కిలోల గంజాయి కలిగిన బ్యాగ్ లభించింది. వీరిని మూసాపేట హెచ్‌పీరోడ్డులో నివాసం ఉండే అరవింద్‌సింగ్, జింకలవాడ కమ్యూనిటీ హాల్ సమీపంలో ఉండే శివగాంగా సింగ్‌లుగా గుర్తించారు. అరవింద్‌సింగ్ బీహార్ రాష్ట్రానికి చెందిన సమస్థిపూర్ ఖోపా ప్రాంతంలోని అమోజా గ్రామం కాగా బతుకుదెరువు కోసం నగరానికి వలస వచ్చి డ్రైవింగ్‌తో పాటు ఇంటీరియర్ వర్క్ చేస్తుండగా, మరో నిందితుడు శివగంగాసింగ్ డ్రైవింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మూసాపేట వెంకటేశ్వర్‌నగర్‌కు చెందిన రాంగులై బన్సీ విజయ్‌యాదవ్, మూసాపేటకు చెందిన వెంకట్‌లు వీరిద్దరికి రూ.15 వేలు ఇచ్చి గంజాయి కొనుగోలు చేసుకురావాల్సిందిగా సూచించారు. దీంతో మహారాష్ట్రలోని భరక్తనగర్ పల్లికి చెందిన అమ్జాద్‌ఖాన్ నుంచి గంజాయి కొనుగోలు చేసి తీసుకువచ్చినట్లుగా పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ మేరకు పోలీసులు వారి నుంచి గంజాయితో పాటు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పాపం జుబేదా!

- పక్కింట్లో భార్యా భర్తల మధ్య గొడవ...
- వివరాలు తెలుసుకునేందుకు వెళ్తే కత్తిపోట్లు



నిందితుడు సలీమ్



ఉస్మానియాలో చికిత్స పొందుతున్న జుబేదా

మైలార్‌దేవ్‌పల్లి: సమీపంలోని నివాసంలో భార్యాభర్తల మధ్య జరుగుతున్న గొడవ గురించి తెలుసుకునేందుకు వారింటికి వెళ్లిన మహిళపై కత్తితో దాడి చేసిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు..మహారాష్ట్రలోని నాందేడ్ ప్రాంతానికి చెందిన సలీమ్, రేష్మ దంపతులు. బక్రీద్ పండగను పురస్కరించుకొని ఇక్కడ ఉంటున్న కూతురి దగ్గరికి వచ్చారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో సలీమ్ మద్యం తాగి భార్యతో గొడవకు దిగాడు. పెద్దగా అరుపులు వినిపిస్తుండటంతో పక్కనే ఉంటున్న జుబేదా (26) అనే మహిళ అక్కడికి వెళ్లింది. అప్పటికే సలీం కొట్టడానికి రావడంతో భార్య రేష్మ ఇంటి నుంచి బయటకు పరుగులు తీసింది. సలీం కూరగాయలు కోసే కత్తిని చేతపట్టుకొని ఆమె కోసం గాలిస్తున్నాడు. అదే సమయంలో ఇంట్లోకి వచ్చిన జుబేదాను తన భార్య అనుకొని కత్తితో పొడిచాడు. ఆమెకు తీవ్ర రక్తస్రావం కావడంతో సలీం అక్కడి నుంచి పారిపోయాడు. స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఘటనా స్థలికి చేరుకుని నిందితుడిని గాలించి పట్టుకున్నారు. తీవ్రంగా గాయపడిన జుబేదాను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిర్బంధంలో ఉన్న మావోయిస్టులను కోర్టులో హాజరుపరచాలి

సుల్తాన్‌బజార్: చతీస్‌ఘడ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా పర్సఘడ్ గ్రామంలో ఈ నెల 5న 10 మంది మావోయిస్టులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లుగా గ్రామస్తుల ద్వారా విశ్వసనీయంగా తెలిసిందని, వారిని వెంటనే కోర్టులో హాజరు పరచాలని పౌరహక్కుల సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. శనివారం హైదర్‌గూడలోని ఎన్‌ఎస్‌ఎస్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఆపరేషన్ కగార్ పేరిట జరుగుతున్న హత్యాకాండపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జిచే న్యాయవిచారణ జరిపించి బాధితులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు సుధాకర్, తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు మైలారం ఆడేలు అలియాస్ భాస్కర్, ప్రకాష్, దిలీప్, ఏరియా కార్యదర్శి సీటు రామన్న, మున్నా, సునిత, మహేష్‌తో పాటు 10 మంది మావోయిస్టులను ప్రాణాలతో అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. అయితే వారి అరెస్టును చూపకుండా అదే రోజునే సుధాకర్‌ను కాల్చి చంపారని, ఈ నెల 6న మైలారం ఆడేలును కాల్చి చంపారని మిగతా వారిని ప్రాణాలతో సజీవంగా తక్షణమే కోర్టులోహాజరు పరచాలని డిమాండ్ చేశారు. హత్యలను ప్రజలు, ప్రజాస్వామిక వాదులు ప్రశ్నించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి నారాయణరావు, రాజారామ్, పీఎం.రాజు, పి.సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా

పెన్నానదిలో దిగి తండ్రీ తనయుల దుర్మరణం

జమ్మలమడుగు: సరదాగా ఈత కొట్టేందుకు పెన్నా నదిలోని నీటిలోకి దిగిన తండ్రీ కొడుకులు దుర్మరణం చెందిన సంఘటన శనివారం వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు మండలంలో జరిగింది. వివరాలు ఇలా..హైదరాబాద్‌కు చెందిన మనోహర్ (38), అతని కుమారుడు డియోల్ (17) పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన సోదరి ప్రమీలా రాణి ఇంటికి వచ్చారు. శనివారం పర్యాటక కేంద్రమైన గండికోటను సందర్శించి తిరిగి వచ్చే సమయంలో ముద్దనూరు- జమ్మలమడుగు రహదారిలోని పెన్నానదిలో నీటిని చూసి ఈత కొట్టేందుకు దిగారు. బ్రిడ్జి సమీపంలో గుంత ఉండటంతో అందులో ఇద్దరు కూరుకుపోయి గల్లంతయ్యారు. విషయం తెలుసుకున్న స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు ఫైర్ సిబ్బంది, గజ ఈతగాళ్లను పిలిపించి గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం నాలుగున్నర గంటల సమయంలో తండ్రి, కుమారుడి మృతదేహాలను బయటికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం జమ్మలమడుగు ఆసుపత్రికి తరలించారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ లింగప్ప తెలిపారు.

అంబులెన్స్ దగ్ధం



గచ్చిబౌలి: అంబులెన్స్‌లో ఆక్సిజన్ సిలిండర్ మార్చుతుండగా మంటలు చెలరేగడంతో పూర్తిగా దగ్ధమైంది. పోలీసులు తెల్పిన వివరాల మేరకు..గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రిలో ఉన్న ఓ రోగి ఆక్సిజన్‌తో తెనాలికి వెళ్లాల్సి ఉండగా సీఎంఎస్ అంబులెన్స్‌ను బుక్ చేశారు. శనివారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో హాస్పిటల్ ఎమర్జెన్సీ ద్వారం వద్ద డ్రైవర్ అంబులెన్స్‌లో ఆక్సిజన్ సిలిండర్ మార్చుతుండగా ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. నిమిషాల వ్యవధిలోనే ఎగసిపడటంతో ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. అంబులెన్స్ పూర్తిగా దగ్ధమైంది. పరికరాలు, సీట్లు కాలిబూడిదయ్యాయి. హాస్పిటల్ సీలింగ్‌కు మంటలు అంటుకున్నాయి. అగ్నిమాపక సిబ్బంది పూర్తిగా మంటలు ఆర్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఎవరికి ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని రాయదుర్గం పోలీసులు తెలిపారు.

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ రైతుబజార్ వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 17, నల్లవంకాయ 23, పొడుగువంకాయ 23, బెండకాయ 40, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 28, క్యాప్సికం 57, పచ్చి కాకరకాయ 42, పందిరిబీర 40, క్యాబేజీ 13, క్యారెట్ 35, దొండకాయ 23, గుండు బీన్స్ 85, గింజచిక్కుడు 75, గోకరకాయ 37, కీర 23, దోసకాయ 18, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 18, ఆలుగడ్డ 24, చామగడ్డ 33, మొరంగడ్డ 15, కందగడ్డ 45, క్యాలీఫ్లవర్ 23, సొరకాయ 9, పొట్లకాయ 23, అరటికాయ 10, మునగకాయ 4, మామిడికాయ 30, ముల్లంగి 4-5, ఉల్లిపొరక రూ. 75 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

పూడికతీత పనుల పరిశీలన



డీసిల్టింగ్ పనులు పరిశీలిస్తున్న ఖైరతాబాద్ డీసీ రజనీకాంత్‌రెడ్డి

బంజారాహిల్స్: వర్షాకాలం నేపథ్యంలో నాలాల్లో పూడికతీత పనులు ముమ్మరం కొనసాగుతున్నాయి. జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్-17 పరిధిలో నాలాల్లో డీ-సిల్టింగ్ పనులను నాలుగు రోజులుగా డీసీ రజనీకాంత్‌రెడ్డి పరిశీలిస్తున్నారు. త్వరితగతిన పూడిక, వ్యర్థాలు తొలగించాలని ఆదేశాలు జారీ చేస్తున్నారు. వానాకాలం ఇప్పటికే సమీపించిన నేపథ్యంలో ఇంకా కొన్ని చోట్ల డీసిల్టింగ్ చేయాల్సి రావడంతో ఆ మేరకు పనులు ముమ్మరం చేస్తుండగా వాటిని అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

సీఎం తీరుపై మన్నె గోవర్ధన్‌రెడ్డి ధ్వజం

బంజారాహిల్స్: రేవంత్ రెడ్డి సీఎం కుర్చీలో కూర్చున్నా.. బజారు భాష పోవడం లేదని బీఆర్‌ఎస్ పార్టీ ఖైరతాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... యాదగిరీశుడి సాక్షిగా ఆలేరు సభలో పాపాలు, శిక్ష అంటూ రేవంత్ నిస్సిగ్గుగా తప్పుడు మాటలు మాట్లాడారని ధ్వజమెత్తారు. దెయ్యాలు అంటూ సీఎం స్థాయి మరిచి వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. అధికారం చేపట్టి 18 నెలలైనా మాజీ సీఎం కేసీఆర్‌పై ఇంకా ఏడుపెందుకు?, 70 ఏళ్ల వయస్సులో ఉన్న పెద్ద మనిషి కాలుజారి గాయపడితే దూషించడం, దేవుడు శిక్షించాడనడం దుర్మార్గమని అన్నారు. ఇదే నా తమ సంస్కారం అంటూ ఫైర్ అయ్యారు. కేసీఆర్ కుటుంబం మీద ఏడవడం తప్ప ఏడాదిన్నరలో చేసిందేమీ లేదన్నారు.

రాజ్యాధికార సాధన దిశగా ముందుకు సాగాలి

కాచిగూడ: బీసీ జనాభాలో అత్యధిక జనాభా కలిగిన మున్నూరు కాపులు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను కలుపుకొని రాజ్యాధికార సాధన దిశగా ముందుకు సాగాలని పీసీసీ మాజీ అధ్యక్షుడు వి.హనుమంతరావు పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ కార్యాలయాన్ని వీహెచ్ సందర్శించిన సందర్భంగా మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్ రావు ఆధ్వర్యంలో ప్రతినిధులు ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా మణికొండ వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ త్వరలో జరగనున్న మంత్రివర్గ విస్తరణలో మున్నూరుకాపులకు రెండు మంత్రి పదవులు ఇవ్వాలని, ప్రభుత్వ నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యత కల్పించాలని కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

బడులు ప్రారంభం రోజే పాఠ్య పుస్తకాలు

- పాఠ్య పుస్తకాల పంపిణీకి సిద్ధమవుతున్న టీచర్లు
- ఇప్పటికే పాఠశాలలకు చేరుకున్న పుస్తకాలు
- సంబంధిత ఏర్పాట్లను పూర్తిచేసిన ఉపాధ్యాయులు



ఫిలింనగర్‌లోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన పాఠ్య పుస్తకాలు

ఫిలింనగర్: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు విద్యా సంవత్సరం ప్రారంభం రోజే ఉచిత పాఠ్య, రాత పుస్తకాలు, స్కూల్ యూనిఫాంలు అందించేందుకు విద్యా శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. గతేడాది పుస్తకాల పంపిణీలో ఆలస్యం కావడంతో ఈ ఏడాది ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగానే రాష్ట్ర విద్యా శాఖ నుంచి ఇప్పటికే స్కూల్‌కు పాఠ్య పుస్తకాలు, రాత పుస్తకాలు, యూనిఫాంలు అన్ని పాఠశాలలకు చేరుకున్నాయి.

- షేక్‌పేట, ఖైరతాబాద్-1, ఖైరతాబాద్-2 మండలాల పరిధిలోని మండల రిసోర్స్ పర్సన్లు వారం రోజులుగా అన్ని పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు చేరవేస్తున్నారు.
- విద్యాశాఖ ఖైరతాబాద్ జోన్ పరిధిలో 17 ప్రభుత్వ ఉన్నత, 43 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ఇందులో మొత్తం 14,670 మంది చదువుతున్నారు. గత ఏడాది వరకు 6-10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు రాత పుస్తకాలు అందించారు. ఈ ఏడాది 1-5వ తరగతి విద్యార్థులకు సైతం పంపిణీ చేయాలని ప్రభుత్వం తలపెట్టడంతో పాటు ఆ మేరకు పాఠశాలలకు పంపిణీ చేసింది.

సిద్ధంగా స్కూల్ యూనిఫాంలు...

ప్రభుత్వం బాలబాలికలకు ఉచితంగా స్కూల్ యూనిఫాంలు అందజేస్తున్నది. ఒక జత దుస్తులను ఈ నెల 12వ తేదీన పంపిణీ చేయనున్నారు. రెండో జత సైతం త్వరితగతిన అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

- మహిళా సమాఖ్య సంఘాల ద్వారా 100 శాతం దుస్తులు కుట్టించారు. ఎంఆర్‌సీలు ఇప్పటికే వాటిని పాఠశాలలకు సరఫరా చేశారు.

పారదర్శకంగా రేషన్ బియ్యం పంపిణీ



రేషన్ దుకాణాన్ని పరిశీలిస్తున్న సివిల్ సప్‌లై ఖైరతాబాద్ ఏఎస్‌ఓ జ్యోతి

బంజారాహిల్స్: ఆహార భద్రతా కార్డు లబ్ధిదారులకు నిత్యావసర సరుకుల పంపిణీ తీరును పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించే లక్ష్యంగా ఖైరతాబాద్ సర్కిల్ అసిస్టెంట్ సివిల్ సప్‌లై ఆఫీసర్ జ్యోతి శనివారం పలు చౌక ధరల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, బోరబండ, సనత్‌నగర్ డివిజన్ల పరిధిలోని రేషన్ షాపులను సందర్శించి జూన్, జులై, ఆగస్టు నెలలకు సంబంధించిన మూడు నెలల నిత్యావసర సరుకులను ఒకేసారి పంపిణీ చేస్తున్న తీరును పరిశీలించారు. ఆమెతో పాటు సీనియర్ చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు కూడా ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. ఈ పర్యటనలో భాగంగా అసిస్టెంట్ సివిల్ సప్‌లై ఆఫీసర్ జ్యోతి చౌక దుకాణాల నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆహార భద్రతా కార్డు లబ్ధిదారులతో నేరుగా సంభాషించి, వారికి అందాల్సిన నిత్యావసర సరుకులు సక్రమంగా అందుతున్నాయో లేదో స్వయంగా ఆరా తీశారు. వారు పొందే సరుకులకు సంబంధించిన బిల్లులను చౌక ధరల దుకాణాల డీలర్ల నుంచి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. కార్డుదారులకు వారి ఆహార భద్రతా కార్డుల ద్వారా లభించే బియ్యం, గోధుమలు, చక్కెర వంటి నిత్యావసర సరుకులు సక్రమంగా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఎక్కడైనా లోపాలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రతి కార్డుదారునికి లభించే నిత్యావసర సరుకుల పరిమాణం గురించి పూర్తి అవగాహన కలిగించారు. చౌక ధరల దుకాణాల నుంచి సరుకులు తీసుకున్న ప్రతిసారీ తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని లబ్ధిదారులకు స్పష్టం చేశారు. ఇది పారదర్శకతకు దోహదపడుతుందని, ఏమైనా ఫిర్యాదులు ఉంటే సాక్ష్యంగా ఉంటుందని వివరించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యావసర సరుకులు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఎటువంటి అవాంతరాలు లేకుండా సక్రమంగా అందేలా చూడడమేనని జ్యోతి పునరుద్ఘాటించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి తనిఖీలు కొనసాగుతాయని తెలియజేశారు.

విద్యాభవనాల నిర్మాణానికి కృషి



ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌ను కలిసిన డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బంగ్ల భారతి

సికింద్రాబాద్: సీతాఫల్‌మండిలో గత ప్రభుత్వ హయాంలో మంజూరైన అధునాతన విద్యాసంస్థల భవన నిర్మాణాల కోసం కృషి చేస్తున్నామని సికింద్రాబాద్ ఎమ్మెల్యే టీ.పద్మారావుగౌడ్ చెప్పారు. సీతాఫల్‌మండి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమితులైన డాక్టర్ జి.బంగ్ల భారతి శనివారం ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్‌తోపాటు అధ్యాపకులు ఎమ్మెల్యేతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... సీతాఫల్ మండి గవర్నమెంట్ స్కూల్ ప్రాంగణంలో జూనియర్ , డిగ్రీ కాలేజీలు గత ప్రభుత్వ హయాంలోనే ఏర్పాటు చేయించామన్నారు. కొత్త భవనాల నిర్మాణానికి రూ. 29.75 కోట్లు అప్పుడే మంజూరు చేయించామని తెలిపారు. ఇటీవలే ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. త్వరలో పనులు ప్రారంభించే అవకాశం ఉందన్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్



ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు, పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకొంటున్న నేతలు





బంజారాహిల్స్ రోడ్ నెం.10 జహీరానగర్ మైదానం వద్ద ముస్లింల ప్రార్థనలు

- వాడవాడలా బక్రీద్ వేడుకలు
- మసీదులు, ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు

బంజారాహిల్స్: త్యాగం, విశ్వాసం, దానానికి ప్రతిరూపం బక్రీద్. రంజాన్ తర్వాత ముస్లింలు అమితంగా ఇష్ట పడే పండుగ ఇది. శనివారం ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల్లో బక్రీద్ పండుగను ముస్లింలు ఘనంగా నిర్వహించుకున్నారు. తెల్లవారుజాము నుంచే మసీదులు, ప్రత్యేక ఈద్గాల వద్ద నమాజ్ చదివారు. అనంతరం ఒకొరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొని తమ ఆనందాన్ని పంచుకున్నారు. పలువురు దానాలకు ప్రాధాన్యతనిచ్చారు. బంజారాహిల్స్ రోడ్ నెం 10లోని జహీరానగర్ మైదానంతో పాటు ఫిలింనగర్ దర్గా వద్ద ముస్లింలు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఫిలింనగర్ ఇన్‌స్పెక్టర్ సంతోషం ఆధ్వర్యంలో ఫిలింనగర్ దర్గా వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఫిలింనగర్ దర్గా వద్ద బందోబస్తు విధుల్లో ఫిలింనగర్ ఇన్‌స్పెక్టర్ సంతోషం



ఎస్పీఆర్‌హిల్స్ క్వారీ మైదానంలో రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

హామీల అమలుకు రాష్ట్ర వ్యాప్త ఉద్యమం



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరామ్‌నాయక్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: గిరిజనుల హామీల అమలు కోసం రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని తెలంగాణ గిరిజన సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీరామ్‌నాయక్ అన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గిరిజన సంఘం రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం జరిగింది . ఈ సందర్భంగా శ్రీరామ్ నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కావస్తున్నా చేవెళ్ల డిక్లరేషన్ పేరుతో గిరిజనులకు ఇచ్చిన 16 హామీలలో ఏ ఒక్కటి కూడా అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు ఎం.ధర్మనాయక్, రైతుసంఘం ఉపాధ్యక్షులు జూలకంటి రంగారెడ్డి, భూక్యా వీరభద్రం,బీమా సాహెబ్, బాలు నాయక్, చందునాయక్, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య



బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థినులు

మూసాపేట: మూసాపేటలోని ప్రభుత్వ బాలికల పాఠశాల ఆధ్వర్యంలో శనివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కృష్ణకుమారి పాల్గొని వీధుల్లో తిరుగుతూ బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని కోరారు. 2వ రోజు ఉపాధ్యాయ బృందం ఇంటింటికీ వెళ్లి పాఠశాలలో విద్యార్థులు సాధిస్తున్న ప్రతిభ గురించి, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం, మధ్యాహ్న భోజనం, ఉచిత పుస్తకాలు, కంప్యూటర్ విద్య, ఒకేషనల్ కోర్సులు మొదలు వాటిని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య లభిస్తుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

సనత్‌నగర్: ప్రమాదవశాత్తూ బైక్‌పై నుంచి కిందపడిన వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందిన సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు..ఎంఎస్ మక్తాకు చెందిన సూర్యరాజ్ (39) ప్రైవేటు ఉద్యోగి. ఈ నెల 4వ తేదీన అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో తన ద్విచక్ర వాహనంపై సికింద్రాబాద్ వైపు నుంచి బేగంపేట వైపు వస్తూ మహర్షి కళాశాల సమీపంలో వాహనం అదుపుతప్పడంతో కింద పడిపోయాడు. తలకు బలమైన గాయాలు కావడంతో బాధితుడిని 108 అంబులెన్స్‌లో గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి సూర్యరాజ్ మృతి చెందాడు. ఈ మేరకు సూర్యరాజ్ బంధువైన సుధాకర్ బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు దాటుతున్న మామా అల్లుళ్లను ఢీకొట్టిన కారు

సనత్‌నగర్: రోడ్డు దాటుతున్న మామా అల్లుళ్లను కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. ఎర్రగడ్డ సుల్తాన్‌నగర్‌కు చెందిన షేక్ ఇనాయత్, అతనికి వరుసకు అల్లుడు అయిన షేక్ ఎలియాస్‌లు ఈ నెల 5న ఎర్రగడ్డ జెకే పాయింట్ హోటల్ నుంచి సనతనగర్ రోడ్డు వైపు వెళ్లేందుకు ఎర్రగడ్డ క్రాస్‌రోడ్డు వద్ద నడుచుకుంటూ రోడ్డు దాటుతున్నారు. ఎస్సార్‌నగర్ నుంచి భరత్‌నగర్ వైపు అతివేగంగా వచ్చిన మారుతి టూర్-హెచ్3 కారు డ్రైవర్ వారిని బలంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో వీరు గాయాలకు గురికావడంతో తీవ్ర రక్తస్రావం జరిగింది. వీరిని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. వీరిని ఢీకొన్న డ్రైవర్ అభిలాష్‌గా గుర్తించారు. అతని చర్యలు తీసుకోవాల్సిందిగా షేక్ ఇనాయత్ కుమార్తె రుక్యాబేగం శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వే ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు



కాచిగూడ రైల్వే స్టేషన్‌ను సందర్శించిన హైదరాబాద్ ఏడీఆర్‌ఎం ముత్యాల నాయుడు

కాచిగూడ: రైల్వే ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ డివిజన్ ఏడీఆర్‌ఎం ముత్యాల నాయుడు అన్నారు. శనివారం కాచిగూడ రైల్వే స్టేషన్‌ను ఏడీఆర్‌ఎం అధికారులు, సిబ్బందితో కలిసి పరిశీలించారు. ప్రయాణీకులకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. వెయిటింగ్ హాల్, బుకింగ్, అన్ని ప్లాట్ ఫారమ్‌లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, లిఫ్టులు, ఎస్కలేటర్లు, క్లాక్ రూమ్‌లు, స్టాల్స్, సర్క్యులేషన్ ఏరియాను తనిఖీ చేశారు. సీనియర్ డీజీఎం అనిరుధ్, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ చొరవ అభినందనీయం

కాచిగూడ: రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి అండగా ఉద్యోగులు ఉంటారని టీఎన్జీఓస్ సెంట్రల్ యూనియన్ అసోసియేట్ అధ్యక్షుడు, టీటీఎన్జీఓస్ గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ ఎం.సత్యనారాయణ గౌడ్ పేర్కొన్నారు. శనివారం సొసైటీ కార్యాలయంలో సత్యనారాయణ గౌడ్ ను ఉద్యోగులు, సొసైటీ ప్రతినిధులు పూలమాలలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి జి.మల్లారెడ్డి, రాజేశ్వర్ రావు, ఎ.శ్రీనివాస్, ఎస్.ప్రభాకర్ రెడ్డి, ఎం.శ్రీనివాస్ రావు, శ్రీధర్ రెడ్డి, సంధ్యారాణి, దామోదర్, నర్సింహ్మారాజు, ఏక్‌నాథ్, వెంకటేష్, శాస్త్రీ, రాజ్యలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఎద్దులను తరలిస్తున్న వ్యక్తిపై కేసు

సనత్‌నగర్: అక్రమంగా ఎద్దులను తరలిస్తున్న వ్యక్తిపై సనత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎల్బీనగర్ సూర్యోదయకాలనీ రోడ్ నెంబర్-2లో నివాసం ఉండే వినోద్‌కుమార్ (31) న్యాయవాదిగా పనిచేస్తున్నాడు. ఈ నెల 6న మధ్యాహ్నం 2 గంటలకు తన స్నేహితుడితో కలిసి వినోద్‌కుమార్ బబ్బుగూడ పశువుల మార్కెట్‌లో పశు వైద్యాధికారిని కలిసేందుకు అక్కడి కార్యాలయానికి వెళ్లాడు. ఆ సమయంలో అక్కడ పశు వైద్యాధికారి లేకపోవడంతో తిరిగి వచ్చే క్రమంలో వారు మార్కెట్ ప్రధాన ద్వారం వద్దకు రాగానే టాటా ఏస్ అశోక్ లేల్యాండ్ వాహనంలో మూడు చిన్న ఎద్దులను తీసుకువెళ్తున్నట్లు గమనించాడు. వాటిని పూర్తిగా మూసివేసి నల్లటి కవర్‌తో కప్పి ఆహారం, నీరు, గాలి లేకుండా వాటిని తరలిస్తున్నారని, బక్రీద్ పేరుతో అక్రమంగా వధిస్తున్నారని తెలుసుకున్నాడు. ఈ మేరకు వినోద్‌కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిపై జంతువులపై క్రూరత్వాన్ని నిరోధించే చట్టం-1960 కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేత్రపర్వంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

- ధ్వజారోహణంతో ముగిసిన టీటీడీ శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు
- వివిధ వాహన సేవలపై ఊరేగిన స్వామివారు
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు



చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు



బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్

హిమాయత్‌నగర్: హిమాయత్‌నగర్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం (టీటీడీ)లో శ్రీవారి 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. చివరిరోజు సందర్భంగా ఉదయం 8.30 గంటలకు మహాపూర్ణాహుతి, 10.30 చక్రస్నానం, సాయంత్రం 6 గంటలకు శ్రీపుష్పయాగం అత్యంత వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవ మూర్తికి పుష్కరిణిలో స్నానం చేయించి, మంత్రోచ్ఛరణలు, భజనలతో కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి నిర్వహించిన ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. బ్రహ్మోత్సవ సమయంలో ఏర్పడిన సకల దోషాలను తొలగించేందుకు పరిపూర్ణుడైన పరమాత్ముడిని ప్రార్థించి, నిత్య ఆశీస్సులను అందించిన అగ్నిదేవుడిని ప్రసన్నం చేసుకునే మహాపూర్ణాహుతి పర్వం ఆలయ ప్రధానార్చకుల ఆధ్వర్యంలో వైభవోపేతంగా జరిగింది. చక్రస్నానం నాటి సాయంకాలం ధ్వజారోహణం యధావిధిగా చేశారు. ఐదు రోజులపాటు వివిధ వాహన సేవలపై అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు, వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించిన బ్రహ్మోత్సవాలను రోజూ వేలాది మందికి భక్తులు హాజరై తిరుమలేశుని వాహన సేవలను తిలకించారు. బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ తదితర ప్రముఖులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఉత్సవాల దాత త్రినాథ్ బాబు సహకారంతో శ్రీవారి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించారు. సౌకర్యాలకు పెద్దపీట వేస్తూ టీటీడీ సిబ్బంది, పోలీసుల సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేశామని ఆలయ ఏఈఓ రమేష్ స్పష్టం చేశారు.



ఉత్సవ మూర్తులకు హారతినిస్తున్న అర్చకులు

వ్యర్థం అవుతుంది 'అర్థం'

- నగరంలోని దాదాపు 20 లక్షల ఇళ్ల నుంచి చెత్త సేకరణ
- రోజూ 8,700 టన్నుల చెత్త డంపింగ్ యార్డులకు తరలింపు
- చెత్త నుంచి 24 మెగావాట్ల సామర్థ్యమున్న విద్యుత్ ప్లాంట్

రీ సైక్లింగ్, రీయూజ్‌తో సర్క్యులర్ ఎకానమీ సాధ్యం



జవహర్‌నగర్ డంపింగ్ యార్డు

సాక్షి, సిటీబ్యూరో: చెత్తే కదా..! అని తీసిపారేకండి. చెత్తకు కూడా సంపదను సృష్టించే సత్తా ఉంది. రీ సైక్లింగ్, రీ యూజ్ ద్వారా వచ్చే కొత్త ఉత్పత్తులు సంపదను సృష్టిస్తాయి. అంటే.. వ్యర్థం కూడా 'అర్థం' అవుతుందన్నమాట. దీనినే సర్క్యులర్ ఎకానమీ అంటున్నారు. చెత్తను అలా వదిలిస్తే ప్రజారోగ్యానికి చేటు. దానిని సవ్యంగా నిర్వహిస్తే పర్యావరణానికి మేలు. ఈ విషయంలో హైదరాబాద్ ఇతర నగరాలకు ఆదర్శంగా నిలిచింది. నగరంలోని దాదాపు 20 లక్షల ఇళ్లు, రోడ్ల వెంబడి డంపర్ బిన్ల నుంచి స్వచ్ఛ ఆటోల ద్వారా సమీప ట్రాన్స్‌ఫర్ స్టేషన్లకు, అక్కడి నుంచి జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. డంపింగ్ యార్డులో చెత్తను శాస్త్రీయంగా నిర్వహిస్తూ, రీసైక్లింగ్ ద్వారా గ్యాస్, సేంద్రియ ఎరువు, విద్యుత్ ఉత్పత్తి చేస్తోంది రాంకీకి చెందిన 'రీ సస్టెయినబిలిటీ'సంస్థ.

చెత్త నిర్వహణ ఇలా..

దాదాపు 339 ఎకరాల్లో ఉన్న 12 మిలియన్‌మెట్రిక్ టన్నుల చెత్తగుట్టను 125 ఎకరాలకు తగ్గించి, ల్యాండ్ ఫిల్ చేసి, క్యాపింగ్ వేశారు. ప్రస్తుతం చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ (24 మెగావాట్ల సామర్థ్యం) ఒకటి పనిచేస్తుండగా, మరొకటి త్వర లో ఉత్పత్తిని ప్రారంభించనుంది. వీటితోపాటు కంపోస్ట్ ప్రాసెసింగ్ స్టేషన్లు, ప్లాస్టిక్ రీసైక్లింగ్ యూనిట్, రెఫ్యూజ్ డిరైవ్ఢ్ ఫ్యూయెల్–ఆర్‌డీఎఫ్ (ఇంధనంగా పనికొచ్చే చెత్త) తయారీ ప్లాంట్, లీచెట్(చెత్త ద్వారా వెలువడే విషపూరిత ద్రవాలు) ట్రీట్‌మెంట్ ప్లాంట్, కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్, సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్ ఉన్నాయి. గుట్టగా పేరుకుపోయిన చెత్తలోని గ్యాస్ నుంచి వాహన ఇంధనంగా ఉపకరించే బయోగ్యాస్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. ఆర్‌డీఎఫ్‌తో విద్యుత్ ఉత్పత్తి చేసి సిమెంట్ కంపెనీలకు విక్రయిస్తారు. ఇలా సర్క్యులర్ ఎకానమీని సాధిస్తోంది. ఇంటర్నేషనల్ సాలిడ్ వేస్ట్ అసోసియేషన్(ఐఎస్‌డబ్ల్యూఏ) లెక్కల మేరకు దేశవ్యాప్తంగా ఏటా 62 మిలియన్ టన్నుల వ్యర్థాలు వెలువడుతుండగా, అందులో 70 శాతం మాత్రమే సేకరణ అవుతోంది. అంతిమంగా 30 శాతం మాత్రమే ప్రాసెస్ అవుతోంది. మన దేశంలో ప్రతి మనిషి నుంచి రోజుకు సగటున 400 గ్రాముల చెత్త ఉత్పత్తవుతోంది.

అశాస్త్రీయ నిర్వహణ.. అనర్థాలు

ఈ–వేస్ట్, ప్లాస్టిక్, బ్యాటరీలు, కాలం చెల్లిన వాహనాలను అశాస్త్రీయంగా నిర్వహించడం వల్ల దేశం ఏటా రూ.80 వేల కోట్ల మేర నష్టపోతోందని సర్క్యులర్ ఎకానమీపై పనిచేస్తున్న ఓపెన్ గేట్ సంస్థ అధ్యయనంలో వెల్లడైంది. ఉదాహరణకు అల్యూమినియం రీసైక్లింగ్ వల్ల బాక్సైట్ నుంచి దాన్ని ఉత్పత్తి చేసేందుకు అవసరమయ్యే విద్యుత్‌లో 95 శాతం ఆదా అవుతుంది. స్టీల్, ప్లాస్టిక్, గ్లాస్‌లలో కూడా ఇదే పరిస్థితి.

జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు రోజూ జీహెచ్‌ఎంసీ, శివారు పురపాలికల నుంచి తరలుతున్న చెత్త(మెట్రిక్ టన్నుల్లో)

సంవత్సరం	జీహెచ్‌ఎంసీ	శివారు పురపాలికలు	మొత్తం
2020–21	5670	340	6,010
2021–22	6267	474	6,741
2022–23	7038	573	7,611
2023–24	7507	672	8,179
2024–25	7757	909	8,666

చెత్తలో.. ఏవి ఎంత శాతం

మెటీరియల్	శాతం
బయో డిగ్రేడబుల్	43.56
ఉడ్స్	6.22
పేపర్	6.32
కొబ్బరి చిప్పలు	7.15
క్లాత్	8.76
లెదర్, రబ్బర్, జూట్	6.41
ప్లాస్టిక్	21.58

ఉత్పత్తి అయిన చోటే పునర్వినియోగం జరగాలి

చెత్త ఉత్పత్తి అయిన చోటనే, వివిధ రకాలుగా వేరుపరచి రీయూజ్ చేయడం ద్వారా బహిరంగ ప్రదేశాల్లో చెత్త సమస్య తీరడంతోపాటు సదరు సంస్థలకు ఎంతో ఆదాయం లభిస్తుంది. ఉదాహరణకు పెద్ద హోటళ్ల నిర్వాహకులు ఆహార వ్యర్థాల నుంచి వెలువడే గ్యాస్‌తో తమ కిచెన్ అవసరాలకు వాడుకోవచ్చు. కంపోస్టునూ తయారు చేయవచ్చు.

– రఘుప్రసాద్, అడిషనల్ కమిషనర్ (శానిటేషన్), జీహెచ్‌ఎంసీ

సానుకూల అంశంగా..

నగరం నుంచి వెలువడుతున్న దాదాపు 9 వేల మెట్రిక్ టన్నుల చెత్తను సమర్థవంతంగా నిర్వహించాల్సిన సవాల్‌ను మేం పర్యావరణ అనుకూలంగా, సానుకూల అంశంగా మలచుకుంటున్నాం. అన్ని దశల్లోనూ సర్క్యులర్ ఎకానమీ సూత్రాలను పాటిస్తున్నాం. వ్యర్థాలను వదిలించుకోవడం కాదు వాటి నుంచి సంపదను సృష్టించడంలో, సర్క్యులర్ ఎకానమీలో హైదరాబాద్ అగ్రస్థానంలో ఉంచే దిశగా పనిచేస్తున్నాం.

– మనోజ్ సోనీ (ఘన వ్యర్థాల నిర్వహణ, వేస్ట్ టు ఎనర్జీ హెడ్), రీ సస్టెయినబిలిటీ

సినారె సాహిత్యం చిరస్మరణీయం

సినారె సాహిత్యోత్సవంలో మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు

సుల్తాన్‌బజార్: దేశంలో హిందీ భాష తర్వాత తెలుగు భాషకు ఎంతో ప్రాధాన్యం ఉందని మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్ రావు అన్నారు. శనివారం కోఠిలోని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, పద్మభూషణ్ డాక్టర్ సి.నారాయణరెడ్డి పేరిట సినారె సాహిత్యోత్సవం శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి విద్యాసాగర్‌రావు ముఖ్య అతిథిగా హాజరై స్మరణ వేళలో అనే గ్రంథాన్ని ఆవిష్కరించారు. సినారె లఘుచిత్ర ప్రదర్శన నిర్వహించారు. సాయంత్రం సెషన్‌లో విశ్వంభర పంజాబీ, మళయాలం అనువాదాలు, ప్రపంచ పదులు తమిళ అనువాద గ్రంథాలను తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి ఆవిష్కరించారు. విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ తెలుగులో లక్షల అక్షర సేద్యం చేసిన ఘనత సినారెదే అని అన్నారు. సినారె సాహిత్యం చిరస్మరణీయమైనదని అన్నారు. ఆయనకు తెలుగు నేల రుణపడి ఉంటుందన్నారు. జస్టిస్ రాధారాణి మాట్లాడుతూ సి.నారాయణరెడ్డి బీఏ వరకు ఉర్దూలో చదువుకొని కూడా అద్భుత తెలుగు సాహిత్యాన్ని సృజించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో తెలుగు సాహిత్య అకాడమి తొలి అధ్యక్షుడు డాక్టర్ నందిని సిధారెడ్డి, డాక్టర్ రెంటాల జయదేవ, ఆచార్య టి.గౌరీశంకర్, మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, సుశీల నారాయణరెడ్డి ట్రస్ట్ అధ్యక్షురాలు సి.గంగా, ప్రధాన కార్యదర్శి జె.చెన్నయ్య, నేషనల్ బుక్ ట్రస్ట్ ఇండియా దక్షిణ ప్రాంతీయ అధికారి డాక్టర్ పత్తిపాక మోహన్, చాకలి ఐలమ్మ విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య సూర్య ధనుంజయ్, కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత ఆచార్య ఎస్.గోపి, ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, డాక్టర్ వసుంధర రెడ్డి, కవులు, రచయితలు, మేధావులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల్లో తెలంగాణది ప్రథమ స్థానం

డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు యాదవ్



వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: శాంతి భద్రతల పరిరక్షణ, టెక్నికల్ విషయాల్లో దేశంలోనే తెలంగాణ ప్రథమ స్థానంలో ఉందని తెలంగాణ పోలీస్ కంప్లెట్ అథారిటీ మెంబర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు యాదవ్ అన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో యాదవ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు యాదవ్ తెలంగాణ పోలీస్ కంప్లెట్ అథారిటీ సభ్యులుగా నియమితులైనందున సన్మానసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలను కాపాడటంలో తన వంతు పాత్రను పోషిస్తానని చెప్పారు. పోలీస్ వ్యవస్థకు సమాజంలో మంచి గౌరవం ఉందని, అయితే కొంతమంది దానికి విఘాతం కలిగిస్తుండటం వల్ల పోలీస్ కంప్లెట్ అథారిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. యాదవ విద్యావంతుల వేదిక అధ్యక్షుడు చెలకాని వెంకట్ యాదవ్ మాట్లాడుతూ విద్య, ఉద్యోగ, ఆర్థిక రాజకీయ రంగాల్లో జనాభా దామాషా ప్రకారం తమ హక్కులను సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో పాలమూరు యూనివర్సిటీ వీసీ డాక్టర్ జీఎన్ శ్రీనివాస్ యాదవ్, అఖిల భారత మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రనాథ్ యాదవ్, యాదవ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్ యాదవ్, ముక్కమల వెంకట్, వట్టి జానయ్య, సురేంద్ర రాజ్, డాక్టర్ బాలు యాదవ్ పాల్గొన్నారు.

నేడు దత్తాత్రేయ ఆత్మకథ పుస్తకావిష్కరణ

మాదాపూర్: హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ తన ఆత్మకథ పుస్తకాన్ని ఆదివారం ఉదయం 10 గంటలకు ఆవిష్కరించనున్నారు. ఈ కార్యక్రమానికి పలు రాష్ట్రాల, కేంద్ర స్థాయి ప్రముఖులు హాజరుకానున్నారు. ముఖ్యఅతిథులుగా మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల గవర్నర్‌లు, ముఖ్యమంత్రులు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను దత్తాత్రేయ స్వయంగా పరిశీలించారు.

బార్లకు దరఖాస్తులు భారీగా..!

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలో కొత్త బార్‌ల కోసం దరఖాస్తులు వెల్లువెత్తాయి. 24 బార్లకు కొత్తగా అనుమతులనిచ్చేందుకు ఎక్సైజ్ శాఖ నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ నెల 6వ తేదీతో దరఖాస్తు గడువు ముగిసింది. దీంతో ఈ 24 బార్ల కోసం అనూహ్యంగా 3,520 దరఖాస్తులు అందాయి. రంగారెడ్డి, నిజామాబాద్, మహబూబ్‌నగర్‌లలో 4 బార్ల కోసం 148 దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 28 బార్లకు 3,668 దరఖాస్తులు అందాయి. వీటిపై ఫీజుల రూపంలోనే ప్రభుత్వానికి రూ.36.68 కోట్ల ఆదాయం లభించింది. రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ జల్‌పల్లి మున్సిపాలిటీలో ఒక బార్ కోసం 57 దరఖాస్తులు రాగా, మహబూబ్‌నగర్‌లో 49, నిజామాబాద్‌లో 27 దరఖాస్తులు వచ్చాయి. బోధన్‌లో 15 దరఖాస్తులు అందాయి. ఈ నెల 13వ తేదీన జిల్లా కలెక్టరేట్లలో డ్రా పద్ధతిలో బార్ల యజమానులను ఎంపిక చేయనున్నారు. హైదరాబాద్‌లో ఎక్సైజ్ కమిషనర్ నేతృత్వంలో డ్రా తీసి విజేతలను ఎంపిక చేయనున్నారు. డ్రా ఏర్పాటు చేయనున్న ప్రాంతాల వివరాలను త్వరలో వెల్లడించనున్నట్లు రంగారెడ్డి డిప్యూటీ కమిషనర్ పి.దశరథ్ తెలిపారు.

నూతన విద్యావిధానం పేరిట ఫీజు దోపిడీ

ఎస్‌ఎఫ్‌ఐ జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నూతన విద్యావిధానం పేరుతో పేద విద్యార్థులను దోపిడీకి గురిచేస్తున్నారని ఎస్‌ఎఫ్‌ఐ జాతీయ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పీవీ సాను, మయూఖ్ బిస్వాల్ విమర్శించారు. విద్యారంగంలో మతోన్మాదానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటం చేయాలని వారు పిలుపునిచ్చారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎస్‌ఎఫ్‌ఐ కేంద్ర కమిటీ సమావేశం జరిగింది . ఈ సందర్భంగా ఈ నెల 27 నుంచి 30 వ తేది వరకు కేరళలో జరగనున్న ఎస్‌ఎఫ్‌ఐ అఖిలభారత మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. మతం పేరుతో సిలబస్ మారుస్తూ రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్నారని అన్నారు. విద్యా కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణతో మతోన్మాదాన్ని ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ ఉపాధ్యక్షుడు దీక్షితదార్, నితీష్ నారాయణ, అశోక్‌రెడ్డి, ఆదర్శ్, రజినీకాంత్, టి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'గాంధీ'లో నిలిచిన నీటి సరఫరా



- ఇబ్బందులకు గురవుతున్న రోగులు
- అత్యవసర వైద్యసేవలకు విఘాతం
- విద్యుత్ సమస్యతో అంతరాయం

గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో నీటి సరఫరా నిలిచి పోవడంతో చికిత్స పొందుతున్న రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అత్యవసర విభాగాల్లో వైద్యసేవలకు విఘాతం కలిగింది. శుక్రవారం రాత్రి నుంచి సమస్య నెలకొన్నా సంబంధిత యంత్రాంగం సరైన రీతిలో స్పందించలేదని పలువురు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నీటిని సరఫరా చేసే పంప్‌హౌస్‌లో ట్రాన్స్‌ఫార్మర్ ట్రిప్ కావడంతో అంతరాయం కలిగినట్లు తెలిసింది. గాంధీఆస్పత్రి ఇన్‌పేషెంట్ విభాగంలో సుమారు 2 వేల మంది రోగులు, మరో 500 మంది రోగులు అత్యసర విభాగాల్లో వైద్యచికిత్సలు పొందుతున్నారు. శుక్రవారం రాత్రి 8.30 గంటల సమయంలో పంప్‌హౌస్‌లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ట్రిప్ కావడంతో ఆయా వార్డులు, ఎమర్జెన్సీ విభాగాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో వైద్యసేవలకు విఘాతం కలిగింది. నీళ్లు లేక వార్డులోని మరుగుదొడ్లు తీవ్ర దుర్వాసన వెదజల్లడంతో రోగుల బాధలు వర్ణనాతీతం. బయట షాపుల్లో రూ. 20 పెట్టి లీటరు వాటర్ బ్యాటిల్స్ కొనుక్కుంటున్నామని పలువురు రోగులు, రోగి సహాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనివారం బక్రీదు సెలవుదినం కావడంతో నీటి సరఫరా పునరుద్ధరణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టాం..

విద్యుత్ సమస్యతో నీటి సరఫరా నిలిచిపోవడంతో వైద్యసేవలకు ఎటువంటి విఘాతం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టామని గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ సీహెచ్‌ఎన్ రాజకుమారి తెలిపారు. తెలంగాణ వైద్య విద్యా మౌళిక సదుపాయాల కల్పన సంస్థ (టీజీఎంఎస్‌ఐడీసీ) అధికారులు, సిబ్బంది విద్యుత్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నారని, ప్రత్యామ్నాయంగా జనరేటర్లతో నీటి సరఫరాను పునరుద్ధరిస్తున్నామని వివరించారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు.

ప్రత్యేక విమానంలో ఘనా నుంచి కొండాపూర్‌కు రోగి

ప్రాణాలు కాపాడిన కిమ్స్ వైద్యులు



ఘనా దేశం వ్యాపారవేత్త ఉదయ్‌తో కొండాపూర్ కిమ్స్ వైద్య బృందం

గచ్చిబౌలి: ఆఫ్రికా నుంచి ప్రత్యేక విమానంలో వెంటిలేటర్‌పై పెట్టి తీసుకొచ్చిన ఓ వ్యాపారవేత్త ప్రాణాలను కొండాపూర్‌కిమ్స్ ఆస్పత్రి వైద్యులు కాపాడారు. ప్రత్యేక వైద్య చికిత్సలు చేసి, 23 రోజులపాటు సేవలు అందించి కోలుకునేలా చేశారు. కొండాపూర్ కిమ్స్ ఆస్పత్రి ఇంటర్నల్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ రవిశేఖర్‌రెడ్డి, క్రిటికల్ కేర్ కన్సల్టెంట్ డాక్టర్ పంకజ్, డాక్టర్ డీవీ రామకృష్ణ, మెడికల్ ఆపరేషన్స్ బృందం శనివారం అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడకు చెందిన ఉదయ్(60) 20 ఏళ్ళ క్రితం ఆఫ్రికా ఖండంలోని ఘనా దేశానికి వెళ్లి అక్కడ వ్యాపారవేత్తగా స్థిరపడ్డారు. ఈ క్రమంలో ఫాల్సిపారం మలేరియాకు గురయ్యారు. ఆ తర్వాత ఆయన సెప్సిస్ సమస్య వచ్చింది. దీంతోపాటు ఎక్యూట్ రెస్పిరేటరీ డిస్ట్రెస్ సిండ్రోమ్(ఏఆర్‌డీఎస్) కూడా రావడంతో ఆయనకు ఊపిరి కూడా అందని పరిస్థితి ఏర్పడింది. అయితే ఆయన కోలుకోకపోవడంతో అక్కడి వైద్యుల సూచనల మేరకు విమానంలో కొండాపూర్‌లోని కిమ్స్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. 16 గంటల సేపు 35 వేల అడుగుల ఎత్తున కూడా వెంటిలేటర్ మీదే ఆయన ఉన్నారు. ఈ సందర్భంగా రీజినల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సుధీర్ విన్నమాల మాట్లాడుతూ 48 గంటల ముందస్తు ప్రణాళిక, ఖచ్చితమైన క్లినికల్ సమన్వయం, తీవ్ర ఒత్తిడిలో తమ బృందం ఆయనను ఎలాగైనా కాపాడాలన్న సత్సంకల్పంతో చికిత్సలు చేసిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు జి.అవినాష్, పి.శ్యాంసుందర్‌రెడ్డి, శ్యామ్‌సుందర్‌రావు, పాటిల్ ప్రతీక్ యశ్వంత్, వెంకటేష్ పబ్బిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

భారత్-చైనా వైద్య సంబంధాల బలోపేతానికి కృషి

సుల్తాన్‌బజార్: భారత్– చైనాల మధ్య వైద్య సంబంధాలు మరింత బలోపేతమయ్యే దిశగా కృషి చేయాలనే లక్ష్యంతో 11 మందితో కూడిన భారతీయ వైద్య బృందం చైనా బయల్దేరింది. భారత్ చైనా మిత్రమండలి జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మోహన్‌రెడ్డి నాయకత్వంలోని బృందంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దువ్వూరి ద్వారకనాథరెడ్డి, డాక్టర్ పీవీ రావు, డాక్టర్ జతిన్ కుమార్, డాక్టర్ రాకేష్‌రెడ్డి, డాక్టర్ సాయి సుధాకర్ తదితరులు ఉన్నారు. ఈ నెల 9 నుంచి 15వ తేదీ వరకు చైనాలో నిర్వహించబోయే భారత్– చైనా 7వ సంయుక్త వైద్య బృంద కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2010 నుంచి ఈ మిత్ర బృందాలు ఇరు దేశాల మధ్య మైత్రి, అవగాహన పెంపొందించాలనే దృక్పథంతో పర్యాటనలు కొనసాగిస్తున్నాయన్నారు. ప్రధానంగా వైద్యరంగ అభివృద్ధిని అధ్యయనం చేయడం, చైనా వైద్య విధానాలను తెలుసుకోవడం, ఇరు దేశాల వైద్య పరిజ్ఞానాన్ని పరస్పరం పంచుకోవడం, ప్రజల మధ్య స్నేహబంధాన్ని బలోపేతం చేయడమే ధ్యేయమని పేర్కొన్నారు.

మాజీ రాష్ట్రపతికి ఈటల తేనేటి విందు



ఎంపీ ఈటల నివాసానికి వచ్చిన మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్

మేడ్చల్‌రూరల్: మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ తన నివాసంలో మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు శనివారం తేనేటి విందు ఇచ్చారు. మేడ్చల్ మున్సిపాలిటీ పూడూర్ పరిధిలోని ఈటల నివాసానికి రామ్‌నాథ్ కోవింద్‌కు సాయంత్రం వచ్చారు. ఈ సందర్భంగా ఈటల పుష్పగుచ్ఛం అందజేసి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఎంపీ కుటుంబీకులతోపాటు స్థానిక నాయకులు విక్రంరెడ్డి, మల్లికార్జున్ ముదిరాజ్, మోహన్‌రెడ్డి, శైలజ తదితరులు మాజీ రాష్ట్రపతికి స్వాగతం పలికారు. అనంతరం రామ్‌నాథ్ కోవింద్‌తో ఈటల ప్రత్యేకంగా 15 నిమిషాలపాటు సమావేశమై పలు అంశాలపై చర్చించారు. అరగంటలో మాజీ రాష్ట్రపతి తన పర్యటన ముగించుకుని వెళ్లారు.

నాణ్యమైన ఆహారం అందించాలి: తుమ్మల



లెమన్ రిడ్జ్ హోటల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

కుత్బుల్లాపూర్: రైతుల నుంచి నేరుగా సేంద్రియ కూరగాయలను కొనుగోలు చేసేవిధంగా హోటల్స్ నిర్వాహకులు ఆలోచించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. శనివారం చింతల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన లెమన్ రిడ్జ్ హోటల్ మూడో శాఖను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా రుచి, శుభ్రతను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, కూన శ్రీశైలంగౌడ్, కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇంఛార్జ్ బండి రమేష్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, ఏసీపీ హనుమంతరావు, ట్రాఫిక్ ఏసీపీ గిరి ప్రసాద్, హోటల్ నిర్వాహకులు వింజం నారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఓఈసీడీ నుంచి కేశవులును తొలగించాలి

గిరిజన జేఏసీ ఛైర్మన్ రాజేష్ నాయక్

హిమాయత్‌నగర్: బీఆర్‌ఎస్ హయాం నుంచి తెలంగాణ సీడ్ సర్టిఫికేషన్ అథారిటీ ఎండీగా 10 ఏళ్లు కొనసాగిన డాక్టర్ కేశవులు అక్రమాలు, అవకతవకలపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని గిరిజన జాయింట్ యాక్షన్ కమిటీ ఛైర్మన్ డాక్టర్ ధరావత్ రాజేష్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ నెల 9 నుంచి 13 వరకు జరిగే ఓఈసీడీ అంతర్జాతీయ సదస్సు నుంచి ఆయనను తొలగించాలని కోరారు. శనివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ వర్సిటీలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్న కేశవులు డిప్యూటేషన్‌పై పదేళ్లుగా ఓఈసీడీ(ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కోఆపరేషన్ అండ్ డెవలప్మెంట్) డైరెక్టర్‌గా, సీడ్ కంపెనీ ఎండీగా కొనసాగుతున్నారని తెలిపారు.

నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న అగస్త్యన్

పంజగుట్ట: గ్రామీణ ప్రాంత మహిళలకు యూజీసీ ఆమోదిత విశ్వవిద్యాలయం నుంచిటీచర్ ట్రైనింగ్ శిక్షణ ఇచ్చి ఉపాధి ఇవ్వడమే ధ్యేయంగా గ్రామీణ విద్యాజ్యోతి భారత్ ప్రైవేట్ లిమిటెడ్, ఆల్ ఇండియా ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ పనిచేస్తుందని ఆయా సంఘాల ప్రతినిధులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో ఇంటర్, డిగ్రీ పూర్తిచేసిన మహిళలకు టీచర్ ట్రైనింగ్ ఇచ్చి వారితోనే మండల స్థాయిలో ప్రీ ప్రైమరీ పాఠశాలలు ఏర్పాటు చేయిస్తామని, గ్రామీణ, మండల స్థాయిలో కూడా ప్రీ ప్రైమరీ విద్యను బలంగా చెయ్యాలన్నదే తమ ఉద్దేశమని పేర్కొన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆల్ ఇండియా ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ డైరెక్టర్ షీజా అగస్త్యన్, గ్రామీణ విద్యాజ్యోతి భారత్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ శ్రీనివాస్ రాంభట్ల మాట్లాడుతూ ప్రీ ప్రైమరీ విద్య బలంగా ఉంటేనే పిల్లలు ఉన్నత చదువులు సులువుగా చదవగలుగుతారని తెలిపారు. తెలంగాణలో కనీసం 50 పాఠశాలలు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. సమావేశంలో అవదేశ్ శర్మ, రామకృష్ణ, సోమశేఖర్, మెఘారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు కబ్జాపై రెండున్నర దశాబ్దాల పోరాటం

పట్టించుకోని అధికార యంత్రాంగం

సాక్షి, సిటీబ్యూరో: సైదాబాద్‌లోని హరిజన బస్తీ జీవనజ్యోతి సంఘం దగ్గర్లో నివాసం ఉంటున్న అందెపాక నరహరి పదవీవిరమణ పొందిన ప్రభుత్వోద్యోగి. ఓ వ్యక్తి కాలనీలోని రోడ్డును కబ్జా చేసి పెద్ద భవనాన్ని నిర్మించాడు. దీంతో ఆ రోడ్డు నలుగురైదుగురు మనుషులు కూడా నడవలేకుండా సందులా కుంచించుకుపోయింది. వర్షాలొస్తే వాన నీరు, మురుగునీటితో నిండిపోతుంది. సందుకిరువైపులా ఉన్న ఇళ్లలోని వారు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. కబ్జా జరిగి రెండున్నర దశాబ్దాలు గడిచింది. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పటి నుంచి పోరాడుతున్నప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. కోర్టు తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చినా, అధికారులు లంచాలకు మరిగి కబ్జాను తొలగించడంలేదని నరహరి ఆరోపించారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్ నుంచి జోనల్, సర్కిల్ కమిషనర్ల వరకు కలిసినా ఫలితం లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

పరిశ్రమను అడ్డుకుంటే ఉపాధికి విఘాతం

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య



మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య. చిత్రంలో నీల వెంకటేష్, భూపేష్ సాగర్

హిమాయత్‌నగర్: ఇథనాల్ పరిశ్రమను అడ్డుకుంటే యువతకు ఉపాధి అవకాశాలను అడ్డుకున్నట్టే అని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య అన్నారు. గద్వాల జిల్లా రాజోలు మండలం ధన్వాడ గ్రామం దగ్గర ఉన్న బయో డీజిల్ అయిన ఇథనాల్ ఫ్యాక్టరీ వల్ల పర్యావరణానికి ఎలాంటి ప్రమాదం లేదని పేర్కొన్నారు. శనివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, నాయకులు భూపేష్ సాగర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆర్.కృష్ణయ్య మాట్లాడారు. బీసీలు పారిశ్రామికవేత్తలుగా ఎదగడాన్ని ఓర్వలేక అగ్రవర్ణ కులాలు కుట్రలు చేస్తున్నాయని మండిపడ్డారు. 99 శాతం పరిశ్రమలు అగ్ర కులస్థులకే ఉన్నాయని, వారు బ్యాంక్ లోన్లు సైతం ఎగ్గొడుతున్నారని ఆరోపించారు. ఇథనాల్ పరిశ్రమ ఒక బీసీది అయినందుకే అక్కసుతో ఆ ఫ్యాక్టరీపై దాడులకు తెగబడుతున్నారని అన్నారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ అధ్యక్షుడు నీరడి భూపేష్ సాగర్, రాజేందర్, చంద్రశేఖర్, అనంతయ్య, జక్కుల వంశీ కృష్ణ, నిమ్మల వీరన్న తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల స్పందన అభినందనీయం


జవాన్ తోట రమేష్



సమావేశంలో జవాన్ తోట రమేష్, మాజీ సైనికులు

పంజగుట్ట: 'నేను ఆపరేషన్ సిందూర్‌లో ఉండగా గ్రామ పెద్దల పేరుతో కొందరు నా తల్లి, సోదరుడి భార్యను తీవ్రంగా అవమానించడం బాధాకరం 'అని జూనియర్ కమిషనర్ ఆఫీసర్ జవాన్ తోట రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆపరేషన్ పూర్తయ్యాక తాను సెలవుపై వచ్చి తెలంగాణ పోలీస్ డైరెక్టర్ జనరల్ (డీజీపీ)ని కలిసి తమ సమస్య చెప్పగానే వెంటనే స్పందించి 10 మంది నిందితులపై చర్యలు తీసుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అఖిల భారత పూర్వ సైనిక సేవా పరిషత్ అధ్యక్షుడు కల్నల్ శ్రీనివాస్ రావు, ప్రధాన కార్యదర్శి మేజర్ పి.ఎస్.ఎస్.స్వామిలతో కలిసి మాట్లాడుతూ తాను గత 28 సంవత్సరాలుగా సైన్యంలో ఉన్నానని చెప్పారు. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కోజన్ కొత్తూరులోని తమ కుటుంబీకుల దగ్గరకు ఏప్రిల్ 5వ తేదీన తమ మున్నూరు కాపు కుల సంఘం ప్రతినిధులు కొందరు వెళ్లి సభ్యత్వ రుసుము రూ.63 వేలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారని, కొంత సమయం ఇస్తే చెల్లిస్తామని చెప్పినా వినకుండా దూషించారని, రెండు రోజులు వేధించారని తెలిపారు. దేశ సరిహద్దులో ఉన్న తనకు విషయం తెలియగానే ఒక పెద్ద మనిషికి 'సరిహద్దుల్లో ఉన్న సైనికుడి తల్లిని వేధించడం తప్పు. విలువల్లేని జీవితం ఉన్నా ఒకటే, లేకున్నా ఒకటే' అని మెసేజ్ పెట్టానని తెలిపారు. తాను డీజీపీకి విషయం తెలపగానే జగిత్యాల జిల్లా ఎస్పీకి ఫోన్ చేసి నిందితులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారని తెలిపారు.

చేప ప్రసాదం పంపిణీకి సిద్ధం



చార్మినార్/దూద్ బౌలి: మృగశిర కార్తె సందర్భంగా నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్లో పంపిణీ చేయనున్న చేప ప్రసాదానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. చేప ప్రసాదం కోసం దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజల సౌకర్యార్థం ఇప్పటికే ప్రభుత్వం వసతి కల్పించింది. చేప ప్రసాదం పంపిణీలో భాగంగా బత్తిని కుటుంబ సభ్యుల నివాస గృహమైన పాతబస్తీలోని దూద్బౌలిలో శనివారం ఉదయం శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం జరిగింది. కార్యక్రమంలో హంపి పీఠాధిపతి విరూపాక్ష విద్యారణ్య భారతి స్వామి పాల్గొన్నారు. అనంతరం బత్తిన కుటుంబసభ్యులు చేప ప్రసాదాన్ని తయారు చేయడం ప్రారంభించారు. ఆదివారం ఉదయం 11 గంటలకు ఎగ్జిబిషన్ మైదానంలో ఆస్తమా రోగులకు చేప ప్రసాదాన్ని ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు బత్తిన కుటుంబ సభ్యులైన గౌరీ శంకర్ గౌడ్, అమర్నాథ్ గౌడ్ తెలిపారు. ఆనవాయితీ ప్రకారం చేప ప్రసాదాన్ని పంపిణీ చేసే ఒక రోజు ముందు తమ నివాసంలోని ప్రత్యేకమైన బావిలో నుంచి తీసిన నీరుతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి చేప ప్రసాదాన్ని తయారు చేస్తామని తెలిపారు దాదాపు 5 లక్షల మంది రావచ్చని అంచనా వేస్తున్నామని వెల్లడించారు.

ఆకట్టుకున్న కిడ్స్ ప్రీమియం ఎథ్నిక్ వేర్ ప్రదర్శన



బంజారాహిల్స్: బంజారా హిల్స్ రోడ్ నెం.1లోని జీవీకే మాల్‌లో పీఅండ్‌ఎస్ కో సంస్థ చిన్నారుల కోసం ప్రీమియం కిడ్స్ ఎథ్నిక్ వేర్ ప్రదర్శనను ఏర్పాటు చేసింది. కార్యక్రమాన్ని ప్రముఖ సామాజికవేత్త ప్రియాంక చిగురుపాటి ముఖ్య అతిథిగా విచ్చేసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇక్కడ డిజైనర్లు చిన్నారుల కోసం రూపొందించిన భిన్న రకాల దుస్తులను ఆమె తిలకించారు. ఫ్యాషన్ టెక్నాలజీలో పట్టాలు పొందిన డిజైనర్లు రూపొందించిన దుస్తులను ఇక్కడ అందుబాటులో ఉంచుతున్నట్లు నిర్వాహకులు సలాని గుప్తా, పూజ తెలిపారు.



హైటెక్స్‌లో ప్రారంభమైన గిగుల్ ఫెస్ట్ 2.0

మాదాపూర్: గిగిల్ ఫెస్ట్‌లో నగరవాసులు సరదాగా గడిపారు. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో గిగుల్ ఫెస్ట్ 2.0ను ఏర్పాటు చేశారు. రెండు రోజుల పాటు నిర్వహించ నున్న ఫెస్ట్‌లో ఫ్యాషన్, ఫన్, పెట్స్, లైవ్ పెర్ఫామెన్స్, ఫుడ్ స్టాల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. స్టాండప్ కామెడీ షోలు సందర్శకులను అలరిస్తున్నాయి. వివిధ రకాల వస్త్రాల స్టాల్స్ అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పలువురు మోడల్స్ తదితరులు పాల్గొన్నారు. గిగుల్ ఫెస్ట్ కో ఫౌండర్ వంశీకృష్ణ ఐతా, బృందం అఖిల్, శివనారాయణ, శ్రీనివాస్ గుణిశెట్టి, ఆదిత్య, మౌనిక, అనన్య, స్నేహ, శ్రేయ, శివప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



బెస్ట్ గార్మెంట్ కన్‌స్ట్రక్షన్ అవార్డ్ విజేత హర్షిత

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ(నిఫ్ట్) తాజాగా నిర్వహించిన గ్రాడ్యుయేషన్ షోలో డిజైనింగ్ విద్యార్థులు పోటాపోటీగా ప్రతిభ కనబర్చగా.. వారిలో అత్యుత్తమ ఆవిష్కర్తలను ఎంపిక చేసి పురస్కారాలు అందజేశారు. వీటిలో ప్రతిష్టాత్మక 'బెస్ట్ గార్మెంట్ కన్‌స్ట్రక్షన్' అవార్డ్‌ను నిఫ్ట్ విద్యార్థిని హర్షితా అధికారి ఉషా ఇంటర్నేషనల్ ఇండియా ద్వారా అందుకున్నారు. దీంతో పాటు యాక్సెసరీ డిజైన్, ఫ్యాషన్ కమ్యూనికేషన్, ఫ్యాషన్ మేనేజ్‌మెంట్ స్టడీస్, లెదర్ డిజైన్.. తదితర విభాగాల్లోనూ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకూ పురస్కారాలు అందజేశారు.

రాందేవ్‌రావ్ ఆస్పత్రికి హరిత పురస్కారం

కూకట్‌పల్లి: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రకృతిని రక్షించే దిశగా అంకిత భావంతో చేసిన కృషికి గుర్తింపుగా రాందేవ్‌రావ్ ఆస్పత్రికి యశోద హాస్పిటల్, హెల్ప్ ఆర్గనైజేషన్ సంయుక్తంగా హరిత పురస్కారాన్ని అందజేశాయి. ఈ సందర్భంగా వారు సంస్థ నిర్వాహకులు మాట్లాడుతూ.. కూకట్‌పల్లిలోని రాందేవ్‌రావ్ ఆస్పత్రిని లంగ్స్ ఆఫ్ కూకట్‌పల్లిగా అభివర్ణించారు. ఈ పురస్కారాన్ని ఆసుపత్రిలో పచ్చదనం పరిరక్షణతో పాటు సేఫ్ బయో మెడికల్ వాడకం, ఎస్‌టీపీ, సోలార్ వాడకం గురించి కూడా పరిగణలోకి తీసుకొని హరిత పురస్కారానికి అందజేయడం జరిగిందన్నారు. పర్యావరణ పరిరక్షణ, మొక్కలను నాటడం, ఆకుపచ్చ పరిసరాల ఏర్పాటులో మా ఆస్పత్రి నిరంతర శ్రమకు ఈ పురస్కారం ఒక ప్రేరణగా నిలుస్తుందన్నారు. పురస్కారాన్ని రాందేవ్‌రావ్ ఆస్పత్రి తరఫున సీఈఓ డా. యన్.యోబు, డాక్టర్ స్వాతి అందుకున్నారు.



నీట్ ఫిట్

ఇటీవలే తరలివచ్చిన మరో విదేశీ సూత్ర

జిమ్స్, వర్కవుట్స్ లేకుండానే ఆరోగ్యం

సొంత పనులు చక్కబెట్టుకుంటూనే వ్యాయామం

NEAT.. పేరిట అందుబాటులోకి వచ్చిన వైనం

నగరవాసుల సరికొత్త ఫిట్‌నెస్ మంత్ర

ప్రస్తుతం ఆరోగ్యం/ఫిట్‌నెస్ సాధన అంటే తప్పకుండా జిమ్‌కి వెళ్లాలి, చెమటలు కక్కేలా కసరత్తులు చేయాలి అనుకుంటున్నారు చాలామంది. అయితే ఎలాంటి ప్రత్యేకమైన వ్యాయామం లేకుండానే రోజువారీ పనుల ద్వారానే శరీరాన్ని ఫిట్‌గా ఉంచుకునే విధానం ఇప్పుడు ట్రెండ్‌లో ఉంది. దానికి దోహదం చేస్తోంది నీట్.. - సాక్షి, సిటీబ్యూరో





నాన్ ఎక్సర్‌సైజ్ యాక్టివిటీ థెర్మోజెనిసిస్ (ఎన్ఇఎటి)అంటే మన శరీరం నిద్రపోవడం, తినడం లేదా ప్లాన్ చేసిన వ్యాయామం కాకుండా చేసే ప్రతి చిన్న చలనం ద్వారా ఖర్చయ్యే ఎనర్జీ.. దీనినే నీట్‌గా పేర్కొంటున్నారు. ఉదాహరణకు నడక, నిలబడటం, ఇల్లు శుభ్రపరచడం, పిల్లలతో ఆడుకోవడం వంటివాటి వల్ల వచ్చే శక్తి నీట్. సంక్షిప్తంగా చెప్పాలంటే..: జీవనశైలిలో చిన్న చిన్న మార్పులతో ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవడమే నీట్ పెరుగుదలకు ఆరోగ్య జీవనానికి దోహదం చేస్తుంది. శరీరం నుంచి ఎక్కువ కేలరీస్ ఖర్చయ్యేలా రోజువారీ పనులను నిర్వహించుకుంటూ నీట్‌ను సొంతం చేసుకునే వ్యక్తులకు మెరుగైన బాడీ కంపోజిషన్, ఇన్సులిన్ సెన్సిటివిటీ ఉండే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.



నీట్ టూ ఫిట్.. ఇలా..

రోజులో ఖర్చు చేసే మొత్తం కేలరీల సంఖ్య బాగా పెరిగి, బరువు నియంత్రణకు నీట్ దోహదం చేస్తుంది. ఇది సంతులితమైన ఎనర్జీ బ్యాలెన్స్‌కి దారితీస్తుంది. ముఖ్యంగా డెస్క్ జాబ్స్ చేస్తున్నవారికి ఇది ఒక ఆచరణీయ మార్గం. కొన్ని అధ్యయనాల ప్రకారం నీట్ ద్వారా టైప్ 2 డయాబెటిస్ ప్రమాదాన్ని కూడా తగ్గించవచ్చు. వ్యాయామం ఒక జీవనశైలిగా మారుతుంది. జిమ్‌కి వెళ్లకపోయినా ఈ తరహా జీవనశైలి వల్ల చురుకుదనం, ఆరోగ్యం సొంతం అవుతాయి.

నీట్‌ను వెలుగులోకి తెచ్చినది ఈయనే..

ఈ కాన్సెప్ట్‌ను అమెరికాకు చెందిన ప్రముఖ ఓబెసిటీ రీసెర్చర్ డా.జేమ్స్ లెవిన్ పరిచయం చేశారు. ఆయన తన మయో క్లినిక్‌లో పరిశోధనలు చేస్తూ ఈ పద్ధతి ద్వారా సాధ్యమయ్యే ఆరోగ్య లాభాలను వివరించారు. ఆయన పరిశోధనల ప్రకారం రోజూ చేసే చిన్న చిన్న కదలికలే (అంటే నడక, మెట్లు ఎక్కడం, కదులుతూ మాట్లాడటం వంటివి) చాలా ఎక్కువ కేలరీలను ఖర్చు చేస్తాయి. ఇవే మన ఆరోగ్యాన్ని మెరుగుపరిచే ప్రధాన మార్గాలుగా మారుతున్నాయి. ఈ కాన్సెప్ట్ ప్రస్తుతం అమెరికా, యూరప్, జపాన్ వంటి దేశాల్లో ప్రముఖంగా వినియోగంలో ఉంది. మన దేశంలోనూ బెంగళూరు, ముంబై, హైదరాబాద్ వంటి నగరాల్లో పనిచేసే ఉద్యోగులు కూడా తమ రోజువారీ జీవనశైలి మార్చుకుంటూ నీట్‌ను, ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకుంటున్నారు.



నీట్ కోసం..

- పని సమయంలో ప్రతి 30 నిమిషాలకు ఒక్కసారి లేచి కనీసం 2–3 నిమిషాలు నడక.. సినిమా చూస్తున్నా, మధ్యలో లేచి నుంచోవడం, లేదా అటూ ఇటూ నడవడం.
- ఇంటి ఫ్లోర్‌ను తుడవడం, గిన్నెలు కడగడం, తోట, వంట పనులు చేయడం..
- ఇంట్లో పిల్లలు ఉంటే వారితో ఆడుకోవడానికి కొంత సమయం కేటాయించడం..
- కూర్చుని డెస్క్‌టాప్, ల్యాప్‌టాప్ మీద పనిచేసేవారు స్టాండింగ్ వర్క్‌స్టేషన్ ఉపయోగించడం ఒక గంట కూర్చుని పని చేస్తే, తర్వాత అరగంట నిలబడి పనిచేయడం..
- ఒక్క రోజులో 8 వేల నుంచి 10 వేల అడుగులు నడవడం కోసం.. వాటర్ బాటిల్ తీసుకోవాలన్నా, ఫోన్ మాట్లాడాలన్నా దానిలో నడకను భాగం చేయడం. మీటింగ్స్‌ని వాక్ – టాక్‌గా మార్చడం
- జిమ్‌లో, డ్యాన్స్ ఇన్‌స్టిట్యూట్‌లో స్టెప్ ఎరోబిక్స్ చేయనక్కర్లేదు. సింపుల్‌గా లిఫ్ట్‌కు గుడ్‌బై చెప్పి ఎలివేటర్ బదులుగా మెట్లు ఎక్కడం అన్ని ఫ్లోర్స్ కాకపోయినా రోజూ కనీసం 3 అంతస్తుల వరకూ మెట్లపై వెళ్లగలిగితే.. ఇది గుండె ఆరోగ్యానికి చాలా మంచిది.
- ఇంట్లో వార్తల కోసమో మరేదైనా కార్యక్రమం కోసమో టీవీ చూసేందుకు కుర్చీ, సోఫాలు కాకుండా సైక్లింగ్ చేస్తూనో, బాల్‌పై కూర్చునో చూడటం..
- భోజనం తర్వాత కనీసం 10–15 నిమిషాలు నడవడం ఒకవేళ వెంటనే కూర్చుని పనిచేయాల్సి వస్తే దానికి బదులుగా నుంచోవడం..
- ఆఫీసుల్లో ఉన్నప్పుడు టీ తేవడానికి లేదా ప్రింట్ అవుట్స్ తీసుకోవడానికి ప్యూన్స్‌తో కాకుండా స్వయంగా నడిచి వెళ్లి తెచ్చుకోవడం.
- ఎక్కువ సేపు నిలబడాల్సి వచ్చినప్పుడు సులభమైన స్ట్రెచింగ్స్ చేస్తూ ఉండటం.. ఖాళీగా కూర్చున్నప్పుడు కూడా కాలూ చేయీ కదుపుతూ ఉండటం.
- వాటర్ బాటిల్ తెచ్చి పక్కన పెట్టుకోకపోవడం వల్ల దాని కోసం తరచూ కాస్తంత దూరం నడవడం..



వర్కవుట్ చేసినా 'నీట్'గానే ఉండాలి

"మనం ఇంటి పనులను మనమే చేసుకుంటూ, మన వ్యక్తిగత కార్యకలాపాల్లోనూ కదలికల్ని భాగం చేస్తే ఆరోగ్యానికి చాలా మేలు కలుగుతుంది. అది జిమ్‌కు ప్రత్యామ్నాయం కాకపోవచ్చు కానీ.. ఖచ్చితంగా మన ఆరోగ్యానికి ప్రయోజనకరమే. నేనైతే ప్రతిరోజూ కనీసం 20 నిమిషాలు తగ్గకుండా జిమ్‌లో వర్కవుట్స్ చేస్తాను. అంతేగాకుండా చురుగ్గా ఉండడానికి నీట్ మీద ఆధారపడతాను. ఆస్పత్రిలో నేను ఎప్పుడూ లిఫ్ట్‌కి బదులుగా మెట్లనే వినియోగిస్తాను. విభిన్న విభాగాల మధ్య తిరగడంతో పాటు వీలున్నంతగా నడుస్తూనే ఉంటాను. రోజుకు కనీసం 3వేల నుంచి 10వేల అడుగుల వరకూ నడిచేలా చూస్తాను."


– డా.ఎ.ప్రణతిరెడ్డి, క్లినికల్ డైరెక్టర్, బర్త్ రైట్ బై రెయిన్ బో హాస్పిటల్





ఈ చిన్న చిన్న మార్పు చేర్పులతో నీట్ పెంపు అనేది ఆరోగ్యానికి దోహదపడే ఒక సహజమైన, సులభమైన మార్గం. ఇది ప్రత్యేకంగా వ్యాయామానికి సమయం కేటాయించాల్సిన అవసరం లేకుండా, ఇలా నీట్‌ను పెంచుకుంటే అది మానసిక ఉల్లాసానికి కూడా దోహదపడుతుందని అధ్యయనాలు నిరూపిస్తున్నాయి.

వినోదభరితంగా.. 7సీస్ గేమ్స్..





సాక్షి, సిటీబ్యూరో: ఆన్‌లైన్ గేమింగ్‌కు ఆదరణ అంతకంతకూ పెరుగుతుండటంతో నవతరం చిన్నారుల మేధకు పదును పెట్టే సృజనాత్మకతను పెంచే సరదా గేమ్స్ రూపకల్పనలో క్రియేటివిటీ రోజురోజుకూ కొత్త పుంతలు తొక్కుతోంది. ఈ క్రమంలోనే నగరానికి చెందిన 7 సీస్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ క్రికెట్ ప్రియుల కోసం వరల్డ్ క్రికెట్ ఛాంపియన్స్ లీగ్, గుర్రపు స్వారీ అభిమానుల కోసం హార్స్ వరల్డ్ రైడ్, పజిల్స్‌ను ఇష్టపడేవారి కోసం కేక్ మ్యాచ్ పజిల్ సార్ట్ గేమ్.. పేరుతో 3 క్యాజువల్ గేమ్స్‌ను మార్కెట్లోకి విడుదల చేసింది. ఈ విషయాన్ని సంస్థ ఎండీ ఎల్ఎమ్ శంకర్ తెలిపారు. క్రికెట్ అభిమానుల కోసం రూపొందించిన గేమ్‌లో రియలిస్టిక్ బ్యాటింగ్, బౌలింగ్ స్టైల్స్, డైనమిక్ లీగ్స్, 10 విభిన్న స్టేడియంలు వంటివి ఉంటాయని, ఇంటరాక్టివ్ రైడింగ్, కస్టమైజ్ చేయగల హార్సెస్, డ్రీమ్ రాంచ్ నిర్వహణ, రేసింగ్ ఈవెంట్స్, అడవులు, గ్రామాలు వంటివి ఉంటాయన్నారు. బేకరీ థీమ్ ఆధారంగా రూపొందించిన పజిల్ గేమ్ పిల్లలకే కాకుండా పెద్దలకూ వినోదాన్ని అందించేలా రూపుదిద్దుకుంది. కలర్‌ఫుల్ కేక్ డిజైన్లు, డ్రాగ్ అండ్ సార్ట్ మెకానిజం, స్ట్రెస్ ఫ్రీ గేమ్ ప్లే, అందరికీ అనుకూలమైన యూజర్ ఫ్రెండ్లీ ఇంటర్‌ఫేస్ ఈ గేమ్ ప్రత్యేకతలని వివరించారు. తమ వెబ్‌సైట్‌లోని గేమ్ లైబ్రరీలో 150కిపైగా ఉచిత ఆన్‌లైన్ గేమ్స్ అందుబాటులో ఉంచామన్నారు. ఇవన్నీ మేధకు సృజనకు పదను పెట్టేలా రూపొందాయన్నారు.

ఫెమి-9 బ్యూటీ ఫ్యాషన్ మీట్.. 29న

హిమాయత్‌నగర్: బ్యూటీ, ఫ్యాషన్ ఇండస్ట్రీ మహిళలతో పాటు ఈ రంగంలో ఆసక్తి ఉన్న వారిని ఒక్కచోట కలిపే కార్యక్రమాన్ని ఫెమి–9 బ్యూటీ ఫ్యాషన్ మీట్ పేరుతో నిర్వహిస్తున్నారు. ఎలాంటి ఎంట్రీ ఫీజు లేకుండా ఈ నెల 29న బేగంపేట్ ఫ్యామిలీ వరల్డ్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు నిర్వహిస్తున్నట్లు ఫెమి–9 ఉమెన్స్ క్లబ్ అధ్యక్షురాలు అనూష పేర్కొన్నారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌లను ముఖ్య అతిథి ఆలె దేవితో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో భాగంగా సెల్ఫ్ మేకప్, నెయిల్ ఆర్ట్, పాలిష్, డాన్స్, ఫైర్‌లెస్ కుకింగ్, హెయిర్ స్టైల్ కాంపిటీషన్స్, ప్లస్ సైజ్, మదర్, డాటర్, కపుల్, పెట్, కిడ్స్ ఫ్యాషన్ షోలతో పాటు సెమినార్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా సెల్‌హెల్త్ అధినేత్రి సి.ప్రవీణ, బ్రిలియంట్ స్కూల్ అధినేత్రి రూపారెడ్డి పాల్గొంటారని తెలిపారు. ఫ్యాషన్ రంగానికి చెందిన వారే కాకుండా ప్రజలు హాజరుకావొచ్చని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి విజయలక్ష్మి, ఉపాధ్యక్షురాలు హేమవర్మ, రాజేష్ పాల్గొన్నారు.



‘క్వీన్’ కోకో

- ఫ్రెంచ్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్ గెలిచిన అమెరికా స్టార్ కోకో గాఫ్
- హోరాహోరీ ఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్ సబలెంకాపై అద్భుత విజయం
- రూ. 24 కోట్ల 91 లక్షల ప్రైజ్‌మనీ సొంతం


విన్నర్స్ ట్రోఫీని ముద్దాడుతున్న కోకో గాఫ్

పారిస్: ఎర్రమట్టి కోటకు కొత్త రాణి వచ్చింది. అమెరికాకు చెందిన 21 ఏళ్ల కోకో గాఫ్ ఫ్రెంచ్ ఓపెన్ కొత్త చాంపియన్‌గా అవతరించింది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ రెండో ర్యాంకర్, రెండో సీడ్ కోకో గాఫ్ 6–7 (5/7), 6–2, 6–4తో ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ అరీనా సబలెంకా (బెలారస్)పై విజయం సాధించింది. 2 గంటల 38 నిమిషాలపాటు జరిగిన ఈ హోరాహోరీ సమరంలో కోకో గాఫ్ తొలి సెట్‌ను కోల్పోయినా అధైర్యపడకుండా అసమాన పోరాటపటిమతో కోలుకుని సబలెంకాను బోల్తా కొట్టించింది. కోకో గాఫ్ కెరీర్‌లో ఇది రెండో గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్‌కాగా, తొలిసారి ఆమె ఫ్రెంచ్ ఓపెన్‌లో విజేతగా నిలిచింది. 2023 యూఎస్ ఓపెన్ ఫైనల్లో సబలెంకాపైనే గెలిచి కోకో గాఫ్ తన కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను అందుకోవడం విశేషం. 2022 ఫ్రెంచ్ ఓపెన్‌లో తొలిసారి ఫైనల్ చేరిన కోకో గాఫ్ పోలాండ్ స్టార్ ఇగా స్వియాటెక్ చేతిలో ఓడిపోయి రన్నరప్‌గా నిలిచింది. రెండో ప్రయత్నంలో మాత్రం కోకో అత్యుత్తమ ఆటతీరుతో విన్నర్స్ ట్రోఫీని ముద్దాడింది. చాంపియన్‌గా నిలిచిన కోకో గాఫ్‌కు 25 లక్షల 50 వేల యూరోలు (రూ. 24 కోట్ల 91 లక్షలు), రన్నరప్ సబలెంకాకు 12 లక్షల 75 వేల యూరోలు (రూ. 12 కోట్ల 45 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి.


రన్నరప్ సబలెంకా

తడబడి తేరుకొని...

సబలెంకాతో జరిగిన తుది పోరులో కోకో గాఫ్ మ్యాచ్ కొనసాగినకొద్దీ రాటుదేలింది. తొలి సెట్ ఆరంభంలో 1–4తో వెనుకబడిన కోకో నెమ్మదిగా తేరుకుంది. సబలెంకా సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేసి స్కోరును 4–4తో సమం చేసింది. ఆ తర్వాత ఇద్దరూ తమ సర్వీస్‌లను నిలబెట్టుకోవడంతో స్కోరు 6–6తో సమమైంది. టైబ్రేక్‌లో సబలెంకా పైచేయి సాధించి తొలి సెట్‌ను దక్కించుకుంది. రెండో సెట్‌లో కోకో అనూహ్యంగా విజృంభించగా, సబలెంకా తడబడింది. కోకో కేవలం రెండు గేమ్‌లు చేజార్చుకొని ఈ సెట్‌ను సొంతం చేసుకొని మ్యాచ్‌లో నిలిచింది. నిర్ణాయక మూడో సెట్‌లో సబలెంకా సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేసిన కోకో తన సర్వీస్‌లను కాపాడుకొని విజయాన్ని ఖరారు చేసుకుంది. ఈ క్రమంలో స్టెఫీ గ్రాఫ్ (జర్మనీ) తర్వాత (1999లో మార్టినా హింగిస్‌పై) వరల్డ్ నంబర్‌వన్‌తో జరిగిన ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో తొలి సెట్ కోల్పోయాక కూడా విజేతగా నిలిచిన రెండో ప్లేయర్‌గా కోకో గాఫ్ గుర్తింపు పొందింది.

ఫైనల్ మ్యాచ్ గణాంకాలు

కోకో గాఫ్		సబలెంకా
3	ఏస్‌లు	2
8	డబుల్ ఫాల్ట్‌లు	6
9/21	బ్రేక్ పాయింట్లు	6/13
30	విన్నర్స్	37
30	అనవసర తప్పిదాలు	70
14/24	నెట్ పాయింట్లు	25/40
119	మొత్తం పాయింట్లు	100

అల్‌కరాజ్ X సినెర్

పురుషుల సింగిల్స్ టైటిల్ పోరు నేడు జరగనుంది. ప్రపంచ నంబర్‌వన్ యానిక్ సినెర్ (ఇటలీ)తో ప్రపంచ రెండో ర్యాంకర్, డిఫెండింగ్ చాంపియన్ కార్లోస్ అల్‌కరాజ్ (స్పెయిన్) అమీతుమీ తేల్చుకుంటాడు. ముఖాముఖి పోరులో అల్‌కరాజ్ 7–4తో సినెర్‌పై ఆధిక్యంలో ఉన్నాడు. శుక్రవారం అర్ధరాత్రి దాటాక ముగిసిన రెండో సెమీఫైనల్లో టాప్ సీడ్ సినెర్ 6–4, 7–5, 7–6 (7/3)తో సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్‌ను ఓడించి తొలిసారి ఫ్రెంచ్ ఓపెన్‌లో ఫైనల్లోకి ప్రవేశించాడు. కెరీర్‌లో 24 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ నెగ్గిన జొకోవిచ్ ఈ ఓటమి తర్వాత ఎర్రమట్టి కోర్టును ముద్దాడుతూ వెనుదిరిగాడు. వచ్చే ఏడాది తాను ఫ్రెంచ్ ఓపెన్‌లో ఆడేది లేనిది కచ్చితంగా చెప్పలేనని 38 ఏళ్ల జొకోవిచ్ వ్యాఖ్యానించాడు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

ఇంగ్లండ్ చేరుకున్న టీమిండియా

20 నుంచి తొలి టెస్టు


జడేజా


పంత్


సిరాజ్

లండన్: భారత క్రికెట్ జట్టు శనివారం ఉదయం ఇంగ్లండ్ చేరుకుంది. పూర్తిస్థాయి పర్యటనలో భాగంగా ముందుగా ఐదు టెస్టుల ద్వైపాక్షిక సిరీస్‌లో పాల్గొంటుంది. 2025–27 కొత్త ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ)లో భారత్–ఇంగ్లండ్ సిరీస్ భాగమవుతుంది. భారత స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లిలు సంప్రదాయ ఫార్మాట్‌కు రిటైర్మెంట్ పలకడంతో కొత్త కెప్టెన్ శుబ్‌మన్ గిల్ సారథ్యంలో యువ జట్టు ఇంగ్లండ్ గడ్డపై సత్తా చాటుకునేందుకు తహతహలాడుతోంది. నిజానికి ఇదివరకే పలువురు భారత క్రికెటర్లు ఇంగ్లండ్‌లో అడుగు పెట్టారు. ఇంగ్లండ్ లయన్స్‌తో అనధికారిక టెస్టులు ఆడుతున్నారు. ఐపీఎల్ ఫైనల్ ముగియడంతో మిగతా ఆటగాళ్లతో కూడిన బృందం తాజాగా వచ్చింది. ‘భారత జట్టులో భాగమైనందుకు చాలా సంతోషంగా ఉంది. ముఖ్యంగా సంప్రదాయ టెస్టు సిరీస్ ఆడేందుకు ఇంగ్లండ్‌కు రావడం మంచి అనుభూతినిస్తోంది’ అని సాయిసుదర్శన్ చేసిన వీడియోను భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) పోస్ట్ చేసింది.

భారత్ ‘ఎ’ 348 ఆలౌట్

నార్తంప్టన్: ఇంగ్లండ్ లయన్స్ జట్టుతో జరుగుతున్న రెండో అనధికారిక టెస్టులో భారత ‘ఎ’ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 89.3 ఓవర్లలో 348 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ స్కోరు 319/7తో రెండో రోజు శనివారం ఆట ప్రారంభించిన భారత్ ‘ఎ’ జట్టు 6.3 ఓవర్లే ఆడి 29 పరుగులు జోడించింది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆడేందుకు బరిలోకి దిగిన ఇంగ్లండ్ లయన్స్ ఆట నిలిచే సమయానికి 46 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 192 పరుగులు చేసింది.

జ్యోతి యర్రాజీకి స్వర్ణ పతకం



తైపీ సిటీ: తైవాన్ ఓపెన్ అంతర్జాతీయ అథ్లెటిక్స్ మీట్‌లో తొలి రోజు భారత అథ్లెట్లు ఆరు స్వర్ణ పతకాలతో అదరగొట్టారు. తైపీ సిటీలో శనివారం జరిగిన పోటీల్లో ఆంధ్ర ప్రదేశ్ అమ్మాయి జ్యోతి యర్రాజీ మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో పసిడి పతకాన్ని సొంతం చేసుకుంది. ఇటీవల కొరియాలో జరిగిన ఆసియా చాంపియన్‌షిప్‌లో బంగారు పతకాన్ని గెలిచిన ఈ వైజాగ్ అమ్మాయి అదే జోరును తైవాన్ మీట్‌లో పునరావృతం చేసింది. 100 మీటర్ల హర్డిల్స్ ఫైనల్ రేసును 25 ఏళ్ల జ్యోతి అందరికంటే వేగంగా, అందరికంటే ముందుగా 12.99 సెకన్లలో ముగించి విజేతగా నిలిచింది. పురుషుల 110 మీటర్ల హర్డిల్స్‌లో భారత రన్నర్ తేజస్ శిర్సే (13.52 సెకన్లు) స్వర్ణ పతకాన్ని హస్తగతం చేసుకున్నాడు. పురుషుల 4x100 మీటర్ల రిలేలో గురీందర్‌వీర్ సింగ్, అనిమేశ్ కుజూర్, మణికంఠ హోబ్లిధర్, అమ్లాన్ బొర్గొహైన్‌లతో కూడిన భారత బృందం (38.75 సెకన్లు) బంగారు పతకాన్ని నెగ్గింది. మహిళల 4x100 మీటర్ల రిలేలో తెలంగాణ అమ్మాయి నిత్య గంధే, సుధీక్ష, స్నేహ, అభినయ సభ్యులుగా ఉన్న భారత జట్టు (44.06 సెకన్లు) స్వర్ణ పతకం దక్కించుకుంది. పురుషుల ట్రిపుల్ జంప్‌లో అబ్దుల్లా అబూబకర్ (16.21 మీటర్లు), మహిళల 1500 మీటర్ల విభాగంలో పూజ (4ని:11.63 సెకన్లు) బంగారు పతకాలు గెలిచారు.

నెదర్లాండ్స్ చేతిలో భారత్ ఓటమి

అమ్‌స్టెల్వీన్: అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్‌ఐహెచ్) యూరోపియన్ అంచె ప్రొ హాకీ లీగ్‌ను భారత పురుషుల జట్టు ఓటమితో ప్రారంభించింది. నెదర్లాండ్స్‌తో శనివారం జరిగిన మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సింగ్ నాయకత్వంలోని భారత జట్టు 1–2 గోల్స్ తేడాతో ఓడిపోయింది. భారత్ తరఫున ఏకైక గోల్‌ను హర్మన్‌ప్రీత్ సింగ్ (19వ నిమిషంలో) సాధించాడు. నెదర్లాండ్స్ జట్టుకు వాన్ డాన్ తిస్ (25వ నిమిషంలో, 58వ నిమిషంలో) రెండు గోల్స్ అందించి గెలిపించాడు. మ్యాచ్ మొత్తం భారత జట్టుకు ఒక పెనాల్టీ కార్నర్ రాగా దానిని హర్మన్‌ప్రీత్ లక్ష్యానికి చేర్చాడు. నెదర్లాండ్స్ జట్టు తమకు లభించిన మూడు పెనాల్టీ కార్నర్‌లను వృథా చేసుకుంది. సోమవారం తమ తదుపరి మ్యాచ్‌లో నెదర్లాండ్స్ జట్టుతోనే భారత్ ఆడుతుంది.


సాక్షి సినిమా

మాఫియా డాన్?


ప్రభాస్

ప్రభాస్ మాఫియా డాన్ పాత్రలో కనిపించనున్నారా? అంటే... వార్తల్లో ఉన్న ప్రకారం ‘స్పిరిట్’ సినిమాలో ఈ పాత్రలో కనిపిస్తారట. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా ‘స్పిరిట్’ చిత్రం రూపొందనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో ప్రభాస్ పవర్‌ఫుల్ పోలీసాఫీసర్ పాత్రలో కనిపించనున్నారు. కాగా ఈ చిత్రకథలో ఫ్లాష్‌బ్యాక్ ఉందట. ఈ ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్ మాఫియా నేపథ్యంలో ఉంటుందని, ఆ సన్నివేశాల్లో ప్రభాస్ మాఫియా డాన్‌లా కనిపిస్తారని సమాచారం. ఈ విషయంపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇదిలా ఉంటే... ‘స్పిరిట్’లో ప్రభాస్ క్యారెక్టర్‌లో త్రీ షేడ్స్ ఉంటాయట. వాటిలో ఒకటి పోలీసాఫీసర్ క్యారెక్టర్ అని, మరొకటి మాఫియా డాన్ అని భోగట్టా. మరి... ఇంకో పాత్ర ఏంటనేది తెలియాల్సి ఉంది. అసలు ఈ చిత్రంలో ప్రభాస్ పాత్రలో త్రీ షేడ్స్ ఉంటాయా? అనే విషయంపై కూడా స్పష్టత రావాల్సి ఉంది. త్రిప్తి డిమ్రి ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటించనున్న విషయం తెలిసిందే. త్వరలో ఈ చిత్రం షూటింగ్ ఆరంభం కానుంది.

డబ్బింగ్ డన్


నాగార్జున

హీరో అక్కినేని నాగార్జున ‘కుబేర’ సినిమాలోని తన పాత్ర డబ్బింగ్‌ని పూర్తి చేశారు. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో అక్కినేని నాగార్జున, ధనుష్ లీడ్ రోల్స్‌లో నటించిన మల్టీస్టారర్ ఫిల్మ్ ‘కుబేర’. ఈ సినిమాలో రష్మికా మందన్న హీరోయిన్‌గా నటించగా, జిమ్ సర్భ్ కీలక పాత్ర పోషించారు. శేఖర్ కమ్ముల అమిగోస్ క్రియేషన్స్‌తో కలిసి ఎస్‌వీసీ ఎల్‌ఎల్‌పీపై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 20న తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానుంది. తాజాగా తన పాత్రకి సంబంధించిన డబ్బింగ్‌ని నాగార్జున పూర్తి చేశారు. ఈ విషయాన్ని ప్రకటించి, డబ్బింగ్ స్టూడియోలో నాగార్జున, శేఖర్ కమ్ముల, పుస్కూర్ రామ్మోహన్ రావు కలసి మాట్లాడుతున్న ఫొటోలని మేకర్స్ షేర్ చేశారు. ‘‘ఈ పాన్ ఇండియా చిత్రాన్ని శేఖర్ కమ్ముల అద్భుతంగా తీర్చిదిద్దారు. భారీ తారాగణంతో రూపొందిన ఈ మూవీ ఇండియన్ సినిమాలో గేమ్ ఛేంజర్‌గా నిలవబోతోంది. ఇప్పటికే విడుదలైన కుబేర ప్రమోషనల్ కంటెంట్‌కి మంచి స్పందన వచ్చింది. ‘పోయిరా మామ, ట్రాన్స్ ఆఫ్ కుబేర...’ వంటి పాటలు టాప్ ట్రెండింగ్‌లో ఉన్నాయి’’ అని చిత్రయూనిట్ పేర్కొంది.

దీపికా ఫిక్స్


దీపికా పదుకోన్

హీరో అల్లు అర్జున్–దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో ‘ఏఏ 22 – ఏ 6’(వర్కింగ్ టైటిల్) అనే సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. కళానిధి మారన్ సమర్పణలో సన్ పిక్చర్స్ భారీ బడ్జెట్‌తో నిర్మించనున్న ఈ పాన్ ఇండియా చిత్రంలో హీరోయిన్‌గా బాలీవుడ్ నటి దీపికా పదుకోన్ ఫిక్స్ అయ్యారు. ఈ విషయాన్ని చిత్రయూనిట్ శనివారం ప్రకటించి, ఫస్ట్ గ్లింప్స్ వీడియో విడుదల చేసింది. డైరెక్టర్ అట్లీతో దీపికా పదుకోన్ మాట్లాడే సన్నివేశాలతో ప్రారంభమైన ఈ వీడియో ఆమె శక్తిమంతమైన పాత్రలోకి మారుతున్న విధానాన్ని చూపిస్తుంది. ఈ సందర్భంగా అట్లీ మాట్లాడుతూ– ‘‘జవాన్’ సినిమాలో దీపికా మేడమ్‌తో కలిసి పని చేశాను... ఆమెతో సినిమా చేయడం అద్భుతమైన అనుభవం. ఆ సినిమాలో ఆమె పాత్ర ఎంత కీలకంగా ఉండి ముందుకు నడిపించిందో మనకు తెలుసు. ఇప్పుడు అల్లు అర్జున్‌గారితో దీపికాగారు కలిసి నటించనుండటంతో నా కల నేరవేరినట్టు అయింది. ఈ సినిమాలో ప్రేక్షకులు మరచిపోలేని ఓ గొప్ప సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ని సృష్టించబోతున్నాం’’ అన్నారు. ‘‘దీపికా పదుకోన్ జాయిన్ కావటంతో మా ప్రాజెక్ట్ మరో రేంజ్‌కి వెళ్లింది. అల్లు అర్జున్ తిరుగులేని ఎనర్జీ, అట్లీ విజన్, దీపిక బ్రిలియంట్ పెర్ఫార్మెన్స్‌లతో ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రేక్షకులకు ఐకానిక్‌గా ఈ సినిమాను రూపొందించనున్నాం’’ అని సన్ పిక్చర్స్ సంస్థ పేర్కొంది.

హరి హర వీరమల్లుని ఎవరూ ఆపరు – సునీల్ నారంగ్


శ్రీధర్, సునీల్ నారంగ్

‘‘**హ**రి హర వీరమల్లు’ సినిమా విడుదలని కావాలని ఆపుతున్నారనడం తప్పు. ఆయన (పవన్ కల్యాణ్) సినిమాని ఎవరూ ఆపరు... ఎందుకు ఆపుతారు? ఆయన సినిమా ఆపితే నెక్స్ వీక్ నా సినిమా (‘కుబేర’ని ఉద్దేశించి) కూడా రిలీజ్‌కి ఉంది కదా? ఆయన సినిమా రిలీజ్ ఆపడం అనేది అసాధ్యం?’’ అని ‘తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్’ అధ్యక్షుడు సునీల్ నారంగ్ అన్నారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన ‘తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్’ (టీఎస్‌ఎఫ్‌సీసీ) సమావేశంలో అధ్యక్షుడితో పాటు కొత్త పాలక మండలిని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నిర్మాత సునీల్ నారంగ్ వరుసగా మూడోసారి ఎంపికయ్యారు. ఉపాధ్యక్షులుగా రవీంద్ర గోపాల, ఉదయ్ కుమార్ రెడ్డి కె, సెక్రటరీగా శ్రీధర్ వీఎల్, జాయింట్ సెక్రటరీగా చంద్రశేఖర్ రావు జె, ట్రెజరర్‌గా సత్యనారాయణ గౌడ్ .బి ఎన్నికయ్యారు. అదే విధంగా 15 మంది ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులను కూడా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో సునీల్ నారంగ్ మాట్లాడుతూ– ‘‘అల్లు అరవింద్‌గారు, ‘దిల్’ రాజు, సురేష్‌బాబు, నా వద్ద థియేటర్లు ఉన్నాయనడం కరెక్ట్ కాదు. నా వద్ద 70 థియేటర్లు ఉంటే 40 బుకింగ్స్ ఉన్నాయి. 30 థియేటర్లు లీజ్ తీసుకున్నాం. అది కూడా గ్రౌండ్ లీజ్... ప్లస్ మల్టీప్లెక్స్‌లు ఉన్నాయి. అవన్నీ కలిపినా కేవలం ఐదారు శాతం మాత్రమే ఉన్నాయి. అనవసరంగా ఆ నలుగురు అంటూ మాట్లాడటం తగదు. ఇక్కడ ఎంతో మంది ఉన్నారు. అందరి సినిమాలూ రావాలి, విడుదలవ్వాలని కోరుకుంటాం. హీరోలు ఏడాదికి ఐదు సినిమాలు చేయాలి, పది చేయాలి అని మాట్లాడటానికి నేను ఎవరు? అది వాళ్ల ఇష్టం. వాళ్ల పారితోషికం నిర్ణయించడానికి మేము ఎవరు? హీరోలు అనేవాళ్లు దేవుళ్లు. 145 కోట్ల దేశ జనాభాలో ఇరవై ముప్పై మందే హీరోలున్నారు. లేదంటే నలభై మంది ఉంటారు. అలాంటి వాళ్ల గురించి నేను ఏం మాట్లాడాలో తెలియడం లేదు. సినిమా రిలీజైన 28 రోజులకే ఓటీటీలో విడుదల చేయడం అన్నది కూడా ఓ శత్రువులా మారింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఇండస్ట్రీలో నిర్మాతలు, పంపిణీదారులు, ఎగ్జిబిటర్స్... ఎవరూ బాగాలేరు. కానీ, డిజిటల్ ప్రొవైడర్స్ అయిన వీఎమ్‌ఎస్, క్యూబ్ వాళ్లు, ఓటీటీ వాళ్లు బాగున్నారు. నాతో సినిమా తీయమని నిర్మాతలను ఏ డైరెక్టరూ, హీరో పిలవరు. మాకు ఇష్టం అయితే మేం వెళుతున్నాం... మాట్లాడుతున్నాం. ఇక్కడ ఎవరి ఇష్టం వారిది’’ అని తెలిపారు. ‘టీఎస్‌ఎఫ్‌సీసీ’ సెక్రటరీ శ్రీధర్ మాట్లాడుతూ– ‘‘ఈ ఏడాదిలో ఇప్పటివరకూ ‘సంక్రాంతికి వస్తున్నాం, మ్యాడ్ 2, కోర్ట్’ సినిమాల ద్వారానే ఎగ్జిబిటర్లకు డబ్బులు వచ్చాయి. మన హీరోలు ఏడాదికి కనీసం రెండు సినిమాలైనా చేయాలని వినతి చేస్తున్నాను. సింగిల్ స్క్రీన్ థియేటర్స్‌లో టిక్కెట్ ధరలు, క్యాంటీన్ ధరలు సాధారణంగా ఉంటున్నాయి. కానీ, మల్టీప్లెక్స్‌లో ఎక్కువ ఉంటాయి. కావాలంటే రెండింటినీ పోల్చి చూడండి’’ అన్నారు. నిర్మాతలు సురేష్‌బాబు, కిరణ్, కేఎల్ దామోదర్ ప్రసాద్ తదితరులు మాట్లాడారు.

కట్టలన్‌లో...


సునీల్

ఆంటోనీ వర్గీస్ హీరోగా పాల్ జార్జ్ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ మూవీ ‘కట్టలన్’. ‘మార్కో’ వంటి సూపర్ హిట్ ఫిల్మ్ తర్వాత షరీఫ్ మహమ్మద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో కీలక పాత్రల్లో సునీల్, కబీర్ దుహాన్ సింగ్ నటిస్తున్నట్లుగా వెల్లడించి, సునీల్ ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. అడవిలో ఏనుగులు–మనుషులు మధ్య నెలకొనే సంఘర్షణల నేపథ్యంలో ఈ సినిమా సాగుతుందట. ‘‘హై ఇంటెన్స్ పాత్రలతో ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటుంది’’ అని మేకర్స్ వెల్లడించారు. ఈ సినిమాకు సంగీతం: అజనీష్ లోకనాథ్.

నా ప్రేమ


సాత్విక, కిశోర్ తేజ


కిశోర్ తేజ, సాత్విక లీడ్ రోల్స్‌లో ‘మై లవ్’ అనే ఆల్బమ్ రూపొందింది. పలు సూపర్ హిట్ చిత్రాలను నిర్మించిన మెగా సూపర్ గుడ్ ఫిలిమ్స్ సమర్పణలో రామ్ రెడ్డి దర్శకత్వంలో ఎస్‌కేటీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో వాకాడ అప్పారావు నిర్మించారు. ‘మై లవ్..’ పాటకి క్రాంతి ఆచార్య సంగీతం అందించగా, సురేష్ బనిశెట్టి సాహిత్యం ఇచ్చారు. కపిల్ కపిలన్ ఆలపించారు. ఈ పాట ఆవిష్కరణ కార్యక్రమంలో కిశోర్ తేజ మాట్లాడుతూ– ‘‘మై లవ్...’ పాటని తెలుగు, తమిళ, హిందీ భాషల్లో విడుదల చేయడం హ్యాపీ. క్రాంతి అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు’’ అన్నారు. రామ్ రెడ్డి మాట్లాడుతూ– ‘‘చాలా కష్టపడి ఈ పాట చేశాం. ఆడియన్స్ మా సాంగ్‌ని ఎంకరేజ్ చేస్తే మేం సంతోష పడతాం’’ అని పేర్కొన్నారు. ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో నటీనటులు గీత, దివి, సాత్విక, రమణ తదితరులు మాట్లాడారు.

రహస్యాలు ఎన్నో ఉన్నాయి


ఆది

‘‘**ఈ** విశ్వంలో అంతు పట్టని రహస్యాలు ఎన్నో ఉన్నాయి. సైన్స్‌కి సమాధానం దొరకనప్పుడు వాటిని మూఢనమ్మకం అంటుంది... అదే సమాధానం దొరికితే అదే తన గొప్పదనం అంటుంది’’ అంటూ సాగే వాయిస్ ఓవర్‌తో ‘శంబాల: ఎ మిస్టికల్ వరల్డ్’ సినిమా టీజర్ విడుదలైంది. ఆది సాయికుమార్ హీరోగా నటిస్తున్న సూపర్ నేచురల్ థ్రిల్లర్ ఫిల్మ్ ఇది. అర్చనా అయ్యర్, శ్వాసిక, రవి వర్మ, మధునందన్, శివ కార్తీక్ ఇతర ప్రధాన పాత్రధారులు. యుగంధర్ ముని దర్శకత్వంలో రాజశేఖర్ అన్నభీమోజు, మహీధర్ రెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా టీజర్‌ను శనివారం విడుదల చేశారు. ‘పంచభూతాలని శాసిస్తోందంటే ఇది సాధారణమైనది కాదు... దీని ప్రభావం వల్ల మనం ఎలాంటి పరిస్థితుల్ని ఎదుర్కోవాల్సి వస్తుందో ఊహించలేం’, ‘ఇప్పుడు ఈ రక్కసి క్రీడను ఆపాలంటే’ అనే డైలాగ్స్ కూడా వినిపిస్తాయి. ‘‘మా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. త్వరలో రిలీజ్ డేట్ ప్రకటిస్తాం’’ అని మేకర్స్ తెలిపారు. ఈ సినిమాకు సంగీతం: శ్రీచరణ్ పాకాల.

సోలో బాయ్ వస్తున్నాడు


శ్వేత, గౌతమ్

‘**బిగ్ బాస్**’ ఫేమ్ గౌతమ్ హీరోగా నటించిన చిత్రం ‘సోలో బాయ్’. శ్వేతా అవస్థి, రమ్య పసుపులేటి హీరోయిన్లుగా నటించారు. నవీన్ కుమార్ దర్శకత్వంలో సతీష్ కుమార్ నిర్మించారు. ఈ సినిమాను జూలై 4న రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ శనివారం వెల్లడించారు. ‘‘యూత్‌ఫుల్ కథతో, రొమాంటిక్ వైబ్‌తో ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేసే సినిమా ఇది’’ అని చిత్రయూనిట్ పేర్కొంది.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.



తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి తెప్పోత్సవాలు శనివారం కనుల పండువగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు శ్రీ రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామివారు పద్మసరోవరంలో తెప్పపై మూడు చుట్లు విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

-చంద్రగిరి



వైభవంగా కుర్తాళం పీఠం ఉత్తరాధికారి పట్టాభిషేకం

సాక్షి, హైదరాబాద్: తమిళనాడు రాష్ట్రం కుర్తాళంలోని ప్రసిద్ధి చెందిన శ్రీ సిద్ధేశ్వరి పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి ఆధ్వర్యంలో.. పీఠం ఉత్తరాధికారిగా దత్తేశ్వరానంద భారతి స్వామి పట్టాభిషేకం వైభవంగా జరిగింది. పీఠ పురోహితుడు మాచవోలు రమేశ్ శర్మ ఆధ్వర్యంలో ఐదు రోజులపాటు జరిగిన పట్టాభిషేక మహోత్సవంలో దేవతలకు విశేష అభిషేకాలు, పూజలు, అర్చనలు, హోమాలు, లలితా కామేశ్వరుల కల్యాణోత్సవం నిర్వహించినట్లు పీఠం మేనేజర్ మూర్తి రాజు విలేకరులకు తెలిపారు. శ్రీ దత్తేశ్వరానంద భారతి స్వామి మాట్లాడుతూ.. వైద్య వృత్తిని వదులుకొని భక్తి మార్గంలో సాధన చేస్తున్న సమయంలో.. మౌనస్వామి వారి అనుగ్రహంతో ఈ అవకాశం వచ్చిందన్నారు. కార్యక్రమంలో మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు కుమార్తె సురభి వాణీదేవి, ఆధ్యాత్మిక ప్రవచనకర్త అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఈత రాకున్నా నదిలోకి వెళ్లి..

- గోదావరిలో స్నానానికి వెళ్లి ఆరుగురు విద్యార్థుల గల్లంతు
- ఒకరిని కాపాడబోయి ఒకరు నీటమునిగిన సమీప బంధువులు
- జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలం అంబట్‌పల్లిలో ఘటన



గోదావరి నదిలో గాలింపు చేస్తున్న పోలీసులు



రాహుల్ రాంచరణ్ సాగర్
రక్షిత్ మధుసూదన్ శివమనోజ్

భూపాలపల్లి/కాళేశ్వరం: వారంతా విద్యార్థులు.. పైగా సమీప బంధువులు.. ఓ వివాహ వేడుకలో కలుసుకున్నారు... ఎవరికీ ఈత రాకున్నా మేడిగడ్డను చూసి సరదాగా గోదావరిలో స్నానం చేద్దామని నదిలోకి దిగారు. కానీ నీటి ప్రవాహాన్ని అంచనా వేయలేక ఒకరిని కాపాడబోయి ఒకరు మొత్తం ఆరుగురు నదిలో గల్లంతయ్యారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలం అంబట్‌పల్లిలో శనివారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గోల్కొండ మల్లయ్య కుమార్తె త్రివేణి వివాహం ఈ నెల 5న జరిగింది. వివాహం అనంతరం సమీప బంధువులైన అదే గ్రామానికి చెందిన పట్టి మధుసూదన్ (18), పట్టి శివమనోజ్ (15), తొగరి రక్షిత్ (13), కర్నాల సాగర్ (16)తోపాటు మహాముత్తారం మండలం కొర్లకుంటకు చెందిన బొల్లెద్దు రాంచరణ్ (17), స్తంభంపల్లి (పీపీ)కి చెందిన పసుల రాహుల్ (19), పట్టి శివమణి.. మేడిగడ్డ ఎగువ భాగంలో మూడో బ్లాక్ వద్ద స్నానం చేసేందుకు శనివారం సాయంత్రం 6 గంటలకు వెళ్లారు. మోకాలి లోతు నీళ్లలో స్నానం చేసే క్రమంలో ఆడుకుంటుండగా తొలుత ఒకరు నీటమునిగారు. ఆపై ఒకరిని కాపాడబోయి ఒకరు.. ఆరుగురు నీటమునిగారు. నది ఒడ్డునున్న పట్టి శివమణి వెంటనే పట్టి మధుసూదన్‌ను కాపాడేందుకు ప్రయత్నించాడు. సాధ్యంకాకపోవడంతో చివరకు ఒడ్డుకు వచ్చేశాడు. మిగిలిన ఆరుగురు నదిలో గల్లంతయ్యారు.

వద్దని వారిస్తున్నా వినకుండా...

అంబట్‌పల్లి గ్రామానికి చెందిన పట్టి వెంకటస్వామికి కుమారులు మధుసూదన్, శివమనోజ్ ఉన్నారు. వారితోపాటు మిగిలిన ఐదుగురు గోదావరిలో స్నానం చేసేందుకు వెళ్తుండగా వెంకటస్వామి అడ్డుకున్నాడు. నదిలో నీటిమట్టం ఎక్కువగా ఉందని.. వెళ్లొద్దని వారించినా వినకుండా వారు వెళ్లారు. దీంతో అతను కూడా వారితో అక్కడికి వెళ్లాడు. మోకాలి లోతు వరకు వెళ్లాక తిరిగి రావాలని పిలుస్తున్న క్రమంలోనే తన కుమారులు సహా ఆరుగురు ఒకరి వెనుక ఒకరు నీటమునగడంతో వెంకటస్వామి అచేతన స్థితిలో ఉండిపోయాడు.

ఘటనాస్థలిలో 5,100 క్యూసెక్కుల నీరు..

కొద్ది రోజులుగా గోదావరి ఎగువన వర్షాలు కురుస్తుండటంతో నీటిమట్టం పెరుగుతోంది. ప్రమాదం జరిగిన మేడిగడ్డ ఎగువ భాగం మూడో బ్లాక్‌లో ప్రస్తుతం 5,100 క్యూసెక్కుల నీరు ఉంది. పిల్లలు నీటిని అంచనా వేయలేకపోవడం వల్లే ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. కాగా, ఆరుగురు యువకుల గల్లంతు వార్త తెలుసుకున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెంటనే జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. దీంతో రంగంలోకి దిగిన సహాయక బృందాలు ఘటనాస్థలికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టాయి. అయినా గల్లంతైన వారి ఆచూకీ లభించలేదు.

ఈతకు వెళ్లి విద్యార్థి మృతి

హసన్‌పర్తి: వరంగల్ నగరంలోని కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రెడ్డిపురం చెరువులో ఈతకు వెళ్లి ఓ విద్యార్థి మునిగి మృతిచెందాడు. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం టీకులకుంట తండాకు చెందిన తేజావత్ గణేష్ నగరంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సెకండియర్ చదువుతున్నాడు. అదే హాస్టల్‌లోని నలుగురు స్నేహితులతో కలిసి రెడ్డిపురం సమీపంలోని చెరువులోకి ఈతకు వెళ్లాడు. గణేశ్ ఈత కొడుతూ ముందుకు వెళ్లి మునిగిపోయాడు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని గణేశ్ మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడి తండ్రి తేజావత్ రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు.

ఈఈ, డీఈఈలకు జీతాల్లేవ్

- నిషేధ సమయంలో నీటిపారుదల శాఖలో ఈఈలు, డీఈల బదిలీలు
- ఆర్థిక శాఖ అనుమతి లేదంటూ వేతనాలు ఆపేసిన పే అండ్ అకౌంట్ విభాగం

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖలోని పలువురు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు (ఈఈ), డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు (డీఈఈ)రెండు నుంచి ఎనిమిది నెలలుగా వేతనాల్లేక ఇబ్బందులు పడుతున్నారు. గత ఏడాది బదిలీలపై నిషేధం ఉన్న సమయంలో నీటిపారుదల శాఖ పలువురు ఈఈ, డీఈఈలను రాష్ట్రవ్యాప్తంగా బదిలీ చేసింది. అయితే ఆయా బదిలీలకు ఆర్థిక శాఖ అనుమతి లేదంటూ పే అండ్ అకౌంట్ విభాగం వారి వేతనాలను ఆపేసింది. అనుమతి ఉంటేనే వేతనాలు ఇస్తామని స్పష్టం చేసింది. దీంతో ఆయా అధికారులు వేతనాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందుల్లో పడ్డారు. దీనిపై ఈఈలు, డీఈఈలు ప్రభుత్వానికి విన్నవించారు. అయినా ఇంతవరకు వేతనాలను ఇవ్వకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. వీరందరికీ వేతనాలను చెల్లించేలా చర్యలు చేపట్టాలని నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శికి ఆ శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ ఇటీవల లేఖ రాశారు. వారి బదిలీలు, పోస్టింగ్‌లకు సంబంధించిన సమగ్ర వివరాలను అందులో పొందుపరిచి నివేదికను అందజేశారు. దీనిపై ఆర్థిక శాఖకు విన్నవించారు.

ఇబ్బందులు పడుతున్నారిలా..

నీటిపారుదల శాఖలో పనిచేస్తున్న ఈఈ ప్రభుకల్యాణ్ తన కుమార్తె విద్యా రుణం, ఇతర వ్యక్తిగత రుణాలకు ఈఎంఐ చెల్లించాల్సి ఉన్నందున, నల్లగొండలో తాను పనిచేసిన డిప్యుటేషన్ కాలాన్ని పరిగణనలోకి తీసుకొని తన జీతాన్ని క్లెయిమ్ చేసుకోవడానికి అనుమతి ఇవ్వాలని నివేదికలో వివరించారు. అదేవిధంగా ఈఈ ఎస్.వెంకటయ్య ఇంటి నిర్మాణం, వ్యక్తిగత రుణాలు, ఈఎంఐ చెల్లించాల్సి ఉన్నందున జీతాలు చెల్లించాలని నివేదికలో అభ్యర్థించారు. అయినా ఇంతవరకు పే అండ్ అకౌంట్స్ విభాగం నుంచి వేతనాలు విడుదల కాలేదు.

మూడోరోజూ ఎదురుకాల్పులు

ఇద్దరు మహిళా మావోలు సహా ఐదుగురి మృతి


చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు, పోలీసుల మధ్య గురువారం మొదలైన ఎదురుకాల్పులు మూడో రోజైన శనివారం కూడా కొనసాగాయి. ఈ కాల్పుల్లో ఇద్దరు మహిళా మావోయిస్టులు సహా మొత్తం ఐదుగురు మావోయిస్టులు మృతి చెందారు. మృతదేహాల వద్ద నుంచి రెండు ఏకే 47 తుపాకీలతో పాటు మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసు ఉన్నతాధికారులు ప్రకటించారు.

ఇద్దరు అగ్రనేతలు.. ఇప్పుడు ఐదుగురు

నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సమావేశమయ్యారనే సమాచారంతో పోలీసు బలగాలు బుధవారం సాయంత్రం కూంబింగ్ ఆపరేషన్ మొదలుపెట్టాయి. ఈ క్రమంలో గురువారం ఎదురుకాల్పులు జరగ్గా, మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు సుధాకర్ అలియాస్ గౌతమ్ మృతి చెందిన విషయం తెలిసిందే. ఇక శుక్రవారం జరిగిన ఎదురుకాల్పుల్లో తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆడెళ్ల అలియాస్ భాస్కర్ మృతి చెందారు. అలాగే, శనివారం జరిగిన ఎదురు కాల్పుల్లో తొలుత ఇద్దరు మహిళా మావోయిస్టులు, ఆ తర్వాత మళ్లీ జరిగిన కాల్పుల్లో ఇంకో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. వీరి మృతదేహాలను జిల్లా కేంద్రానికి తరలించిన బలగాలు.. మృతులను గుర్తించే పనిలో పడ్డాయి. సుమారు 80 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో ఇంకా కూంబింగ్ కొనసాగుతోందని బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ తెలిపారు.

అక్రమ నిర్మాణాలపై ఫిర్యాది బాధితుడే కానవసరం లేదు

ప్రజలెవరైనా ఆ పనిచేయవచ్చు: హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని అక్రమ నిర్మాణాలపై అధికారులకు ఫిర్యాదు చేయడానికి బాధితుడే కానవసరం లేదని, ప్రజలెవరైనా ఆ పని చేయవచ్చని హైకోర్టు తేల్చిచెప్పింది. ఆ నిర్మాణాలకు సమీప వ్యక్తులు మాత్రమే ఫిర్యాదు చేయాలన్న నిబంధన ఎక్కడా లేదని స్పష్టం చేసింది. బాధితుడు కాకుండా ఫిర్యాదు చేశారని, పరిశీలించాల్సిన అవసరం లేదని అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కోర్టును ఆశ్రయించవచ్చని పేర్కొంది. అనిత ఆండాళ్లు, ఆమె కుమారుడు బేగంపేట్ బీఎస్ మక్తాలో పక్కపక్కనే 200 గజాలు చొప్పున స్థలాలుంటే వాటిలో నిర్మాణాలకు వేర్వేరుగా జీహెచ్ఎంసీలో పర్మిషన్లు తీసుకున్నారు. తర్వాత 2 అంతస్తులను 400 గజాల్లో నాలుగు అంతస్తులుగా అనుమతులు సవరించారు. ఐదో అంతస్తు క్రమబద్ధీకరణకు అప్లికేషన్ కూడా పెట్టుకున్నారు. ఇది చట్టవిరుద్ధం అంటూ బేగంపేట్‌కు చెందిన నరేందర్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దీంతో ఆయన హైకోర్టును ఆశ్రయించి పిటిషన్ దాఖలు చేయగా, ఐదో అంతస్తును కూల్చివేయాలని ఆదేశించింది. దీన్ని సవాల్ చేస్తూ.. అనిత ఆండాళ్లు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అక్రమ నిర్మాణాలను కూల్చేయాలని గతంలో ఇచ్చిన తీర్పులో తాము ప్రతివాదిగా లేమని, బాధితుడు కాని నరేందర్‌కు పిటిషన్ వేసే హక్కు లేదన్నారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ టి.వినోద్‌కుమార్ తాజాగా విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. అక్రమ నిర్మాణాలపై బాధితుడే ఫిర్యాదు చేయాలన్న నిబంధన ఎక్కడా లేదని, ఎవరైనా ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. పిటిషనర్ చేసిన క్రమబద్ధీకరణ దరఖాస్తుపై ఎటువంటి అభిప్రాయాన్ని వ్యక్తం చేయలేమన్నారు. జీహెచ్ఎంసీ చట్టం–1955లోని సెక్షన్ 455ఏ కింద చేసిన దరఖాస్తును గతంలో హైకోర్టు ఇచ్చిన మార్గదర్శకాల మేరకు పరిష్కరించాలని జీహెచ్ఎంసీ కమిషనర్‌ను ఆదేశించారు.

జ్వరం, దగ్గు మందు తాగి చిన్నారి మృతి

- మరో ఇద్దరికి తీవ్ర అస్వస్థత
- కాలం చెల్లిన మందులు కావని పీహెచ్‌సీ వివరణ
- భార్యాభర్తల మధ్య గొడవలు కారణం కావచ్చని వైద్యుల అనుమానం



పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఇచ్చిన సిరప్

అల్లాదుర్గం(మెదక్): పిల్లలకు జ్వరం వచ్చిందని ప్రభుత్వాస్పత్రిలో పారాసిటమాల్, అమ్రోడాల్ మందులు తీసుకొచ్చింది ఓ తల్లి. ఆ మందులు వేసుకున్నాక ఒక చిన్నారి మృతి చెందగా, మరో ఇద్దరు పిల్లలు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన మెదక్ జిల్లా అల్లాదుర్గం మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై శంకర్ వివరాల ప్రకారం... అల్లాదుర్గం బుడగ జంగం కాలనీకి చెందిన కడమంచి సిద్దయ్య, సాయమ్మలు దంపతులు. వీరికి ఐదు మంది పిల్లలు. సాయమ్మ వారం రోజుల క్రితం బోరంచకు వెళ్లింది. పిల్లలకు వాంతులు కావడంతో శుక్రవారం రాత్రి ప్రియ (5)తోపాటు ఐశ్వర్య, శీనులకు ప్రభుత్వ ఆస్పత్రి నుంచి తెచ్చిన జ్వరం, దగ్గు మందు తాగించింది. దీంతో ప్రియకు వాంతులు ఎక్కువై శనివారం ఉదయం మరణించింది. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు మరో ఇద్దరు పిల్లలు ఐశ్వర్య, శీనులను జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రభుత్వ ఆస్పత్రి మందు తాగించడం వల్లే పాప చనిపోయిందని సాయమ్మ ఆరోపించింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. వాడిన మందులను ల్యాబ్‌కు పంపిస్తామని ఎస్సై తెలిపారు. కాగా ఈ విషయంపై అల్లాదుర్గం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సారికను వివరణ కోరగా పారాసిటమాల్, అమ్రోడాల్ మందులు వాడటం వల్ల పాప చనిపోలేదని, తాము ఇచ్చిన మందులు కాలం చెల్లినవి కాదని చెప్పారు. భార్యాభర్తల మధ్య గొడవ వల్ల ఏదైనా జరిగి ఉంటుందని ఆమె అనుమానం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై విచారణ చేపడతామని, అలాగే పోస్టుమార్టం రిపోర్ట్‌తో వివరాలు బయటపడతాయని చెప్పారు.

క్లుప్తంగా...

చిన్నారికి సీఎం అండ

ఉచిత కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్సకు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: వినికిడి లోపంతో బాధపడుతున్న నాలుగేళ్ల చిన్నారి నేతావత్ లిఖితశ్రీకి తక్షణమే ప్రభుత్వ ఈఎన్‌టీ ఆసుపత్రిలో పూర్తి ఉచితంగా కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్స చేయించాలని సీఎం ఎ.రేవంత్‌రెడ్డి అధికారు లను ఆదేశించారు. ఆడుతూ పాడుతూ గడపా ల్సిన పాపకు వినికిడి లోపం ఉందన్న విష యం సీఎం దృష్టికి రాగానే ఆయన స్పందించారు. వెంటనే పాపకు అవసరమైన పూర్తి వైద్యం ఉచితంగా అందించాలని ఆదేశించారు. లిఖిత కోలుకోవాలని సీఎం రేవంత్ ఆకాంక్షించారు.

నేడు నెక్స్ట్- జెన్ జియోఫిజిక్స్ 2025 సదస్సు

ప్రారంభించనున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్: జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ట్రెనింగ్ ఇన్‌స్టిట్యూట్ (జీఎస్ఐటీఐ) బండ్లగూడ–నాగోల్‌లో ఆదివారం నిర్వహించనున్న 'నెక్స్ట్–జెన్ జియోఫిజిక్స్ 2025: అన్‌లాకింగ్ ఎర్త్స్ హిడెన్ ట్రెజర్స్' సదస్సును కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి ప్రారంభించనున్నారు. కీలక ఖనిజాలు, సహజ వనరులకు పెరుగుతున్న గ్లోబల్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) ఆధ్వర్యంలో ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. అధిక–రిజల్యూషన్ సబ్‌సర్ఫేస్ ఇమేజింగ్, ఇంటిగ్రేటెడ్ అన్వేషణ నమూనాలు, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఆధారిత ఖనిజ లక్ష్యీకరణ వంటి జియోఫిజికల్ సర్వే టెక్నిక్‌లలో పురోగతిపై సదస్సులో చర్చించనున్నారు. బిగ్ డేటా అనలిటిక్స్, జియోఇన్ఫర్మాటిక్స్, జియోసైన్స్‌లో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఇంటిగ్రేషన్‌పై చర్చలు నిర్వహించనున్నారు. ప్రముఖ జియోఫిజిసిస్ట్‌లు సదస్సులో పాల్గొంటారు. రెండు రోజులపాటు కొనసాగనున్న సదస్సులో భారతదేశం, ఆస్ట్రేలియా, కెనడా, రష్యా, అమెరికా, పోలాండ్, మలేషియా, సింగపూర్‌లకు చెందిన ప్రముఖ సంస్థలు, విద్యా సంస్థలు, స్టార్టప్‌ల నుండి వక్తలు హాజరవుతారు. అధునాతన జియోఫిజిక్స్ టెక్నాలజీలు, సాధనాలు, ఏఐ–ఎంఎల్ ఆధారిత అన్వేషణ నమూనాలు తదితర అంశాలపై చర్చలు నిర్వహించనున్నారు.

నిజామాబాద్‌లో మొదటి కరోనా కేసు



నిజామాబాద్ నాగారం: నిజామాబాద్ జిల్లా లో మొదటి కరోనా పాజిటివ్ కేసు నమోదు కాగా, వైద్యులు జిల్లా జనరల్ ఆస్పత్రిలోని ఐసోలేషన్ వార్డులో బాధితుడికి చికిత్స అందిస్తున్నారు. రెండ్రోజుల నుంచి జ్వరం, దగ్గు, ఆయాసంతో బాధపడుతున్న బాధితుడు శని వారం ఆస్పత్రికి రాగా, ర్యాపిడ్ టెస్ట్ చేయడంతో కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. 2020 సంవత్సరంలో కూడా సదరు వ్యక్తికి కరోనా వచ్చినట్లు వైద్యులు తెలిపారు. ఆది వారం బాధితుని కుటుంబ సభ్యులకు కూడా ర్యాపిడ్ టెస్ట్‌లు చేయనున్నారు. ప్రజలందరు తప్పనిసరిగా మాస్క్‌లు ధరించాలని, చేతులు శానిటైజ్ చేసుకోవాలని జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ రాజశ్రీ, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ సూచించారు.

కోడే.. కలర్‌ఫుల్‌గా..

మిరుదొడ్డి (దుబ్బాక): చిత్తడి నేలల్లో ఎక్కువగా కనిపించే స్వాంఫేన్ అనే పక్షి సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి పంట పొలాలలో సందడి చేసింది. బ్లూ–పర్పుల్ రంగులో మెరు స్తూ పొడవాటి కాళ్లు, వేళ్లతో పరుగులుతీస్తూ కనువిందు చేసింది. ఇవి ఎక్కువగా మధ్యధరా ప్రాంతం, ఆఫ్రికా, ఆస్ట్రేలియా ప్రాంతాల్లో జీవిస్తుంటాయి. మన దేశంలోనూ కనిపించే ఈ పక్షిని తెలుగులో చిత్తడి కోడిగా పిలుస్తున్నారు. స్థానికులను ఆకట్టుకున్న ఈ పక్షిని 'సాక్షి' ఇలా క్లిక్‌మనిపించింది.



అప్రమత్తతే రక్ష



వివిధ రాష్ట్రాల్లో పెరుగుతున్న కరోనా కేసులు

- దేశంలో 5,755 యాక్టివ్ కేసులు.. మరో 'వేవ్' రావొచ్చుననే భయాలు
- అంతగా భయపడాల్సిన అవసరం లేదంటున్న వైద్య నిపుణులు
- మాస్ వ్యాక్సినేషన్ అవసరం లేదు: డా. జీసీ ఖిల్నానీ
- వృద్ధులు, దీర్ఘకాలిక అనారోగ్యం ఉన్న వారు జాగ్రత్తగా ఉండండి: డా.హరికిషన్

సాక్షి, హైదరాబాద్ : దేశంలో రోజురోజుకూ కోవిడ్–19 యాక్టివ్ కేసులు పెరగడం ఆందోళన రేకెత్తిస్తోంది. ఇప్పటికే ఇటీవల కాలంలో మృతుల సంఖ్య సైతం ఏడుకు చేరుకోవడంతో (ఈ ఏడాది జనవరి 1 నుంచి చూస్తే మొత్తం 55 మరణాలు) మరో 'కరోనా వేవ్'ముంచెత్తుతుందా అన్న భయాలు సైతం వివిధ వర్గాల ప్రజల్లో నెలకొన్నాయి. ప్రస్తుతం దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఐదు వేలకు పైబడి యాక్టివ్ కేసులు కొనసాగుతున్నాయి. కేరళలో అత్యధిక పాజిటివ్ కేసులు నమోదు కాగా, ఢిల్లీ, మహారాష్ట్ర, గుజరాత్, పశ్చిమబెంగాల్, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, రాజస్తాన్ తర్వాతి స్థానాల్లో నిలుస్తున్నాయి. కేరళలో శనివారం నాటికి (గత 24 గంటల్లో) 192, గుజరాత్‌లో 107, పశ్చిమబెంగాల్‌లో 58, కర్ణాటకలో 15, ఆంధ్రప్రదేశ్‌లో 12 కొత్త యాక్టివ్ కేసులు వెలుగు చూశాయి. అదేవిధంగా ఇతర రాష్ట్రాల్లోనూ యాక్టివ్ కేసులు పెరుగుతున్నాయి. శనివారం ఉదయం 8 గంటలకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ పోర్టల్‌లో పొందుపరిచిన వివరాల ప్రకారం చూస్తే.. గత 24 గంటల్లో దేశంలో 391 యాక్టివ్ కేసులు నమోదు కావటంతో మొత్తం కేసుల సంఖ్య 5,755 చేరుకుంది. కరోనా మళ్లీ ప్రారంభమైన జనవరి 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు 59 మంది మరణించారు. కాగా శుక్రవారం ఒక్కరోజే నలుగురు చనిపోయారు. రాష్ట్రాల వారీగా చూస్తే.. కేరళ 1,806, గుజరాత్ 717, పశ్చిమబెంగాల్ 622, ఢిల్లీ 665, మహారాష్ట్ర 577, కర్ణాటక 451, తమిళనాడు 379, యూపీ–208, ఆంధ్రప్రదేశ్ 72, తెలంగాణలో 5 యాక్టివ్ కేసులున్నాయి. ఇక మహారాష్ట్రలో 18, కేరళలో 12 మంది, ఢిల్లీ, కర్ణాటక రాష్ట్రాల్లో ఏడుగురు చొప్పున మొత్తం 14 మంది చనిపోయారు.

పెద్దగా భయపడాల్సిన పనిలేదు



ప్రస్తుతం కేసుల వ్యాప్తికి కారణమైన ఒమిక్రాన్ సబ్‌వేరియెంట్లు, లీనియేజ్‌లు ఎగువ శ్వాసకోశ వ్యవస్థ (అప్పర్ రెస్పిరేటరీ) పైనే ప్రభావం చూపుతున్నందున పెద్దగా భయపడాల్సిన పనిలేదు. రోగులు స్వల్ప లక్షణాలతోనే కొద్దిగా అనారోగ్యానికి గురవుతారు. దీని ట్రీట్‌మెంట్‌లో భాగంగా యాంటీ బయోటిక్స్ వాడొద్దు. రోగనిరోధకశక్తి తక్కువగా ఉన్న వృద్ధులు, దీర్ఘకాలిక రోగులు, తీవ్రమైన మధుమేహ రోగులు జాగ్రత్తగా ఉండాలి. చైనా, థాయ్‌లాండ్, సింగపూర్ తదితర దేశాల్లో బూస్టర్ డోస్‌లు ఇస్తున్నారు. కానీ ఈ వైరస్‌కు సంబంధించి ఎలాంటి వ్యాక్సిన్లు తయారు కాలేదు. ఇప్పుడున్న పరిస్థితుల్లో దేశంలో 'మాస్ వ్యాక్సినేషన్'చేయాల్సిన అవసరం లేదు. అప్రమత్తంగా ఉండటం మంచిది. ఈ దశ కూడా నెమ్మదిగా ఎలాంటి విపత్కర పరిస్థితులకు దారితీయకుండా తొలగిపోతుందనేది నా నిశ్చితాభిప్రాయం.

– డా. జీసీ ఖిల్నానీ, చైర్మన్ పీఎస్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్, పూర్వ హెడ్, పల్మనాలజీ ఎయిమ్స్ ఢిల్లీ

స్వల్ప లక్షణాలు.. తక్కువ స్థాయి జ్వరం..



ప్రస్తుత కేసుల పెరుగుదలకు ప్రధానంగా కొత్త ఒమిక్రాన్ సబ్ వేరియెంట్లు ఎల్ఎఫ్ 7, ఎన్‌బీ 1.8.1 తదితరాలు కారణం. ఈ స్ట్రెయిన్లు స్వల్ప లక్షణాలతో తక్కువ స్థాయి జ్వరం, గొంతులో గరగరలతో సాధారణ జలుబు, సీజనల్ ఫ్లూ మాదిరిగా కనిపిస్తాయి. ఈ కారణంగా టెస్టింగ్‌కు ఆలస్యమై అనుకోకుండా వ్యాప్తికి కారణమయ్యే అవకాశాలున్నాయి. వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులు, అనారోగ్యం ఉన్న వారు, బలహీనమైన రోగనిరోధకశక్తి ఉన్న వారిపై అధిక దుష్పరిణామాలు చూపే అవకాశాలున్నాయి. అందువల్ల ఎక్కువమంది గుమిగూడే చోట్లు, ప్రజారవాణా, మూసి ఉంచిన ప్రదేశాల్లో మాస్క్‌లు పెట్టుకోవాలి. చేతుల పరిశుభ్రత పాటించాలి.

– డా.హరికిషన్ గోనుగుంట్ల, చీఫ్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్, యశోద ఆసుపత్రి



సొరంగంలో నడుస్తూ.. చేపలను చూస్తూ!

నెహ్రూ జూపార్క్‌లో అతిపెద్ద టన్నెల్ అక్వేరియం నిర్మాణానికి ప్రణాళిక

- ఎకరం స్థలంలో ఏర్పాటుకు కసరత్తు
- ప్రభుత్వ–ప్రైవేటు భాగస్వామ్యంతో రూ. 50 కోట్ల వ్యయంతో నిర్మాణం
- షార్క్, స్టింగ్ రే, లయన్ ఫిష్ సహా 100కుపైగా చేపల రకాల దిగుమతి

సాక్షి, హైదరాబాద్/బహదూర్‌పురా: గాజు తొట్టెల్లో రంగురంగుల చేపలు కనిపిస్తే ఎవరైనా భలే ఉన్నాయని ముచ్చటపడతారు.. చిన్నారులైతే ఎగిరి గంతేస్తారు. అలాంటిది మనమే ఓ భారీ గాజు తొట్టె లోపల నడుస్తూ ఇరువైపులా వింత ఆకారాల్లో, వివిధ సైజుల్లో ఉండే చేపలను చూస్తే..! ఆ అనుభూతే వేరు కదూ. హైదరాబాద్‌లోని నెహ్రూ జంతు ప్రదర్శనశాలకు విచ్చేసే సందర్శకులకు త్వరలోనే ఈ అనుభూతి కలగనుంది. జూపార్క్‌లోని ఎకరం స్థలంలో రాష్ట్రంలోనే అతిపెద్ద టన్నెల్ అక్వేరియం నిర్మాణానికి అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇప్పటికే జూ బోర్డు అనుమతి పొందిన ఈ ప్రాజెక్టుకు రూ. 50 కోట్ల నిర్మాణ వ్యయంతో అభివృద్ధి చేయనున్నారు. గుజరాత్‌లోని అక్వాటిక్ గ్యాలరీ, కేరళలోని మెరైన్ వరల్డ్ మాదిరిగా ప్రభుత్వ–ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ)తో దీన్ని నిర్మించాలని నిర్ణయించారు.

2026 నాటికి సమగ్ర మాస్టర్ ప్లాన్..

ప్రస్తుతం బహదూర్‌పురాలోని జూపార్క్‌లో మంచినీటి, సముద్ర జలచరాలతో కూడిన 15 చిన్న అక్వేరియంలు అందుబాటులో ఉన్నాయి. వాటికి సమీపంలోనే ప్రతిపాదిత అక్వేరియాన్ని సుమారు 4 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మించనున్నారు. గుజరాత్‌లోని అక్వాటిక్ గ్యాలరీ తరహాలో సమగ్ర మాస్టర్ ప్లాన్ రూపొందించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. 2026 నాటికి మాస్టర్ ప్లాన్ పూర్తవుతుంది. సింగపూర్, ఆస్ట్రేలియాకు చెందిన బహుళజాతి సంస్థలతో కలిసి ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు.

వందలాది చేపల రకాలు..

సందర్శకులు నడవడానికి వీలుగా ఉండేలా సొరంగ శైలిలో అక్వేరియం నిర్మాణం ఉంటుంది. ఇందులో ఆసియా, ఆఫ్రికా, అమెరికా తదితర దేశాల నుంచి స్టింగ్ రే, స్టార్ ఫిష్, లయన్ ఫిష్, షార్క్ వంటి 100కుపైగా చేపల రకాలను దిగుమతి చేసుకొని అందుబాటులో ఉంచుతారు. ప్రస్తుతం జూపార్క్‌కు సగటున రోజుకు 30 వేల మంది సందర్శకులు వస్తుండగా అక్వేరియం అందుబాటులోకి వస్తే రోజుకు 50 వేల మంది వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు.

కేంద్ర జూ అథారిటీ అనుమతులే తరువాయి..




ప్రస్తుత జూపార్క్‌ను, పక్కనే ఉన్న మీరాలం చెరువు సుందరీకరణ పనులతో అనుసంధానం చేయాలని సీఎం ఆదేశించారు. అందులో భాగంగా పార్క్‌ను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తున్నాం. అక్వేరియం నిర్మాణానికి కేంద్ర జూ అథారిటీ అనుమతులు రాగానే టెండర్ల ప్రక్రియ మొదలుపెడతాం.

– డాక్టర్ సునీల్ ఎస్. హీరేమత్, డైరెక్టర్, రాష్ట్ర జూపార్క్‌లు

గుజరాత్‌లోని వన్‌తార వన్యప్రాణుల సంరక్షణ కేంద్రంలో మాదిరిగా.. మన జూపార్క్‌లోనూ టైగర్ గ్లాస్ ఎన్‌క్లోజర్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు. బుల్లెట్ ప్రూఫ్ గ్లాస్ ఎన్‌క్లోజర్ ప్రాజెక్ట్‌కు ఇప్పటికే జూబోర్డు రూ. 1.5 కోట్లు మంజూరు చేసింది. ఇందులో సందర్శకులు పులులను దగ్గరగా చూడటానికి వీలు కల్పించే విధంగా 50 మీటర్ల వెడల్పాటి గాజు ఎన్‌క్లోజర్ ఉంటుంది. సందర్శకులు పులులను దగ్గరగా చూస్తూ ఎంచక్కా సెల్ఫీ దిగొచ్చు. ఈ ప్రాజెక్టు విజయవంతమైతే సింహం, చిరుత బోన్‌లకు కూడా గ్లాస్ ఎన్‌క్లోజర్లను ఏర్పాటు చేసే యోచనలో అధికారులు ఉన్నారు.

పులితో సెల్ఫీ..





ఓటర్ల సంఖ్యలో 16.6% వృద్ధి

- ఐదేళ్లలో తెలంగాణలో పెరిగిన 45.36 లక్షల మంది ఓటర్లు
- గణాంకాలతో వివరణ ఇచ్చిన కేంద్ర ఎన్నికల సంఘం

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలోని ఓటర్ల సంఖ్యలో 16.6% వృద్ధి చోటుచేసుకుంది. ఇది దేశంలోని ముఖ్య రాష్ట్రాలతో పోలిస్తే అత్యధిక శాతం. 2018లో తెలంగాణలో 2,80,65,876 మంది ఓటర్లు ఉండగా, 2023 నాటికి ఈ సంఖ్య 3,26,02,799కు పెరిగింది. అంటే ఈ ఐదేళ్లలో 45,36,923 మంది ఓటర్లు కొత్తగా నమోదయ్యారు. ఓటర్ల సంఖ్యలో పెరుగుదల కేవలం తెలంగాణకు పరిమితం కాలేదు. మహారాష్ట్రలో 8.14%, ఛత్తీస్‌గఢ్‌లో 9.93%, జార్ఖండ్‌లో 13.40%, తమిళనాడులో 8.02%, పశ్చిమబెంగాల్‌లో 11.36%, కేరళలో కేవలం 5.48% వృద్ధి నమోదైంది. ఓటర్ల సంఖ్యలో ఇలాంటి వృద్ధిపై ప్రశ్నలు తెరపైకి రావడంతో, కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) అధికారికంగా శనివారం వివరణ ఇచ్చింది. మహారాష్ట్ర ఎన్నికల సందర్భంలో వచ్చిన ఆరోపణలకు సమాధానంగా ఎన్నికల సంఘం కీలక అంశాలపై స్పష్టత ఇచ్చింది. పోలింగ్ రోజున చివరి రెండు గంటల్లో 65 లక్షల ఓట్ల పోలింగ్ సాధారణమే అని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. గంటకు 58 లక్షల ఓట్లు పోలింగ్ సాధ్యమవుతుందని ఈసీఐ గణాంకాలతో వివరించింది. ప్రతి పోలింగ్ బూత్ వద్ద పార్టీల ప్రతినిధుల సమక్షంలో పోలింగ్ జరగడం వల్ల ఎలాంటి అక్రమాలు జరిగినా వెంటనే గుర్తించగలిగే అవకాశం ఉండేదని స్పష్టం చేసింది. ఓటర్ల జాబితా తయారీ చట్టబద్ధ ప్రక్రియలో జరిగిందని పేర్కొంది. మహారాష్ట్ర ఓటర్ల జాబితాపై అసంతృప్తి తక్కువగానే ఉందని... 9.77 కోట్ల ఓటర్లలో కేవలం 89 అప్పీల్స్ మాత్రమే వచ్చినట్లు కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది.

నిధుల సమీకరణకు హౌసింగ్ బోర్డు భూముల వేలం

- రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం
- ఓపెన్ ప్లాట్లు, రాజీవ్ స్వగృహ ఇళ్ల విక్రయం
- ఈ నెల 20న వేలానికి నోటిఫికేషన్
- బిల్డర్లు, హౌసింగ్ సంస్థలకు విక్రయించేందుకు నిర్ణయం
- ఈ నిధులతో సాధారణ ప్రజలకు అందుబాటు ధరల్లో ఇళ్ల నిర్మాణం



సాక్షి, హైదరాబాద్: హౌసింగ్ బోర్డుకు చెందిన ఖాళీ స్థలాలు, రాజీవ్ స్వగృహ ఫ్లాట్లను వేలం ద్వారా విక్రయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. వీటి విక్రయం ద్వారా సేకరించిన నిధులను ఓఆర్ఆర్ పరిసరాలు, జిల్లాల్లో ఇళ్లను నిర్మించి సామాన్యులకు అందుబాటు ధరలో ఉంచడానికి వినియోగించనున్నట్లు గృహ నిర్మాణ సంస్థ కమిషనర్ గౌతమ్ వెల్లడించారు. శనివారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 20వ తేదీన వీటి వేలానికి నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. మంత్రివర్గ ఉపసంఘం కూడా ఈ వేలానికి ఆమోదం తెలిపిందని ఆయన వివరించారు. రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 11 ప్రాంతాల్లో ఇప్పటికే పూర్తయిన, పాక్షికంగా పూర్తయిన అపార్ట్‌మెంట్లలో ఫ్లాట్లతోపాటు, ఓపెన్ ప్లాట్లను, ఖాళీ స్థలాలను బహిరంగ వేలంలో విక్రయించనున్నట్లు చెప్పారు. రాజీవ్ స్వగృహకు సంబంధించి గాజుల రామారం, పోచారం, ఖమ్మం పోలేపల్లిలో అసంపూర్తిగా ఉన్న టవర్లలో ఒక్కోదాంట్లో దాదాపు 100 నుంచి 150 వరకు ఫ్లాట్లను ఏక మొత్తంగా విక్రయించనున్నట్లు వివరించారు. బిల్డర్లు, ఒక గ్రూపుగా ఏర్పడి కొనుగోలు చేయాలనుకునేవారు, హౌసింగ్ కార్యక్రమాలు నిర్వహించే సంస్థలు, బహుళ అంతస్తుల భవనాలు అవసరం ఉన్న సంస్థలు వీటిని కొనుగోలు చేసే వీలు కల్పిస్తున్నట్లు చెప్పారు.

వేలం వేయనున్నవి ఇవే..

రంగారెడ్డి జిల్లా తొర్రూరులో 514, కుర్మల్‌గూడలో 20, చందానగర్‌లో 3, బహదూర్‌పల్లిలో 69 ఓపెన్ ప్లాట్లు, బండ్లగూడలో పూర్తయిన 159 ఫ్లాట్లు, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా గాజుల రామారంలోని ఐదు టవర్లలో పూర్తికాని కట్టడాలు, పోచారంలో పూర్తయిన 601 ఫ్లాట్లు, అసంపూర్తిగా ఉన్న 6 టవర్లలోని వివిధ స్థాయిలోని ఫ్లాట్లు వేలం వేయనున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని పోతుల మడుగులో 111, అమిస్తాపూర్‌లో 45 ఓపెన్ ప్లాట్లు, ఖమ్మం జిల్లాలోని పోలేపల్లిలో అసంపూర్తిగా ఉన్న 8 టవర్లతోపాటు, 3.38 ఎకరాల ఖాళీ స్థలాన్ని కూడా విక్రయించనున్నారు.

కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డులో 7.33 ఎకరాలు..

కూకట్‌పల్లిలోని హౌసింగ్‌బోర్డు 4వ ఫేజ్‌లో ఖాళీగా ఉన్న 7.33 ఎకరాలు, అదే కాలనీలో ఉన్న మరో రెండు ప్లాట్లను (4,598 చదరపు గజాలు, 2,420 చదరపు గజాలు) కూడా ఈ వేలంలో విక్రయించనున్నట్లు తెలిపారు. అలాగే నాంపల్లిలోని 1,148 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఖాళీ స్థలాన్ని, సంజీవరెడ్డినగర్‌లో అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ హాల్‌కు చెందిన 2,605 చదరపు గజాలను విక్రయిస్తామన్నారు. సంజీవరెడ్డినగర్‌లోని కమ్యూనిటీ హాల్ (సెల్లార్, స్టిల్ట్, జి+1) 22,285 చదరపు అడుగుల విస్తీర్ణం, 37,030 అడుగుల పార్కింగ్ స్థలంతో పూర్తి అయ్యే స్థితిలో ఉన్నదని, దీనిని ఫంక్షన్ హాల్ నిర్వహణ కోసమే వేలం వేస్తున్నట్లు గౌతమ్ తెలిపారు.

యాదగిరిగుట్టలో ఫిర్యాదుల పెట్టెలు

భక్తుల సలహాలు, ఫిర్యాదుల కోసం..



యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వచ్చే భక్తుల నుంచి సలహాలు, సూచనలు, ఫిర్యాదులను తెలుసుకునేందుకు ఈవో వెంకట్రావు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ పరిసరాలు, ప్రధాన కార్యాలయం, రిసెప్షన్, ప్రసాద విక్రయశాల వద్ద ఫిర్యాదుల పెట్టెలు బిగింపు పనులను శనివారం ప్రారంభించారు. భక్తులు సూచనలు, సలహాలు, ఫిర్యాదులను కాగితంపై రాసి పెట్టెలో వేస్తే పరిష్కరిస్తామని ఈవో చెప్పారు.

నాన్నా.. నేను.. టెన్త్ పాస్!

కొండపాక(గజ్వేల్): వాళ్లిద్దరూ తండ్రీకొడుకు లు.. ఒకే ఏడాది పదో తరగతి పరీక్ష రాసి.. ఒకేసారి ఇద్దరూ ఉత్తీర్ణులయ్యారు. సిద్దిపేట జిల్లా కొండపాక మండలం గిరాయిపల్లి గ్రామానికి చెందిన ముక్కెర బాల్‌నర్సు (38) వ్యవసాయంతో పాటు.. సిర్సనగండ్ల హైస్కూ ల్లో మధ్యాహ్న భోజనం కార్మికునిగా పని చేస్తు న్నాడు. ఓపెన్ యూనివర్సిటీ విద్య నభ్యసి స్తూ.. 10వ తరగతి పరీక్ష రాసి 248 మార్కు లతో ఉత్తీర్ణుడయ్యాడు. కుమారుడు ప్రదీప్ కూడా సిర్సనగండ్ల గ్రామ హైస్కూల్లో చదువు కుంటూ.. 10వ తరగతి పరీక్షల్లో 444 మార్కు లు సాధించాడు. తండ్రీ కొడుకు ఒకే సంవత్స రంలో.. 10వ తరగతి పరీక్షలు రాసి ఉత్తీర్ణులయ్యారు. ఈ సందర్భంగా తండ్రీకొడుకులిద్దరినీ స్థానికులు అభినందించారు.



అయ్యో.. అమ్మాయి!

బాలికలు.. పల్లెల్లో ఎక్కువ.. పట్టణాల్లో తక్కువ • కేరళ మినహా దక్షిణాది రాష్ట్రాల్లోని నగరాలన్నింటా ఇదే స్థితి

- తెలంగాణలో 1000 మంది బాలురకు 896 మంది బాలికలే
- రాష్ట్ర గ్రామీణ ప్రాంతాల్లో 1000కి 906 మంది బాలికలు
- ఆందోళనకరంగా మహిళల్లో తగ్గుతున్న ఫర్టిలిటీ శాతం
- శాంపిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (ఎస్ఆర్ఎస్)- 2021 గణాంకాల్లో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: విద్య మనిషిలో వివేకాన్ని, చైతన్యాన్ని పెంచుతుందంటారు. కానీ, మనదేశంలో చదువుకున్నవాళ్లు అధికంగా ఉండే పట్టణ ప్రాంతాల్లో అక్షరాస్యతతోపాటు మూఢత్వం కూడా పెరుగుతోంది. పట్టణ ప్రాంతాల్లోని జనాభాలో బాలురతో పోల్చితే బాలికల శాతం వేగంగా పడిపోవటమే అందుకు ఉదాహరణగా నిలుస్తోంది. శాంపిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (ఎస్ఆర్ఎస్)–2021 గణాంకాలు దేశంతోపాటు తెలంగాణలో బాలికల జనాభా, మొత్తం జననాల రేటు ప్రమాదకరంగా పడిపోతున్న వైనాన్ని బయటపెట్టాయి.

జననాల రేటులోనూ అధమమే..

జననాల రేటు కూడా తెలంగాణలో గణనీయంగా తగ్గిపోయింది. ఒక మహిళ తన గర్భస్థ సామర్థ్య కాలపు సాధారణ ఫర్టిలిటీ రేటు (టీఎఫ్ఆర్) తెలంగాణలో 1.5కి పడిపోయింది. గ్రామీణ ప్రాంతాల్లో మరింత తక్కువగా 1.4కి పడిపోవటం ఆందోళన కలిగిస్తోంది. ఇది జనాభా స్థిరీకరణకు కావాల్సిన కనీస స్థాయి (2.1) కంటే చాలా తక్కువ. దేశవ్యాప్తంగా 1986లో ఎఫ్‌టీఆర్ 4.2గా ఉండగా, 2021 నాటికి 2.0కి తగ్గింది. గ్రామీణ ప్రాంతాల్లో 4.5 నుంచి 2.2కి తగ్గింది.

పట్టణాల్లో తగ్గిన బాలికా జననాలు

దక్షిణ భారతదేశంలో 100 శాతం అక్షరాస్యత ఉన్న కేరళలో మినహా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడులో లింగ నిష్పత్తిలో తేడా గణనీయంగా పెరిగిందని ఎస్ఆర్ఎస్ సర్వేలో తేలింది. తెలంగాణలో జననాల రేటు ప్రమాదకరంగా 1.5 శాతానికి పడిపోయింది. అందులో బాలికల జననాలు మరింత తక్కువగా ఉన్నాయి. దేశంలో లింగనిష్పత్తి 913 (1,000 మంది పురుషులకు 913 మంది స్త్రీలు) ఉండగా, తెలంగాణలో అది 902కే పరిమితమైంది. రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాలతో పోల్చితే నగరాల్లో లింగనిష్పత్తి మరింత తగ్గింది. హైదరాబాద్, కరీంనగర్, నిజామాబాద్, వరంగల్ వంటి నగరాల్లో లింగ నిష్పత్తి 1,000కి 896 మాత్రమే ఉంది. ఇది దక్షిణాది రాష్ట్రాల్లోనే అత్యల్పం. ఈ గణాంకాలు రాష్ట్రంలో బాలికల పట్ల వివక్షకు నిదర్శనంగా నిలుస్తున్నాయని సామాజిక వేత్తలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇది ఇలాగే కొనసాగితే శ్రామిక సామర్థ్యం, లింగ సమతుల్యతపై తీవ్ర ప్రభావం పడుతుందని హెచ్చరిస్తున్నారు.

దక్షిణాది రాష్ట్రాల్లో లింగనిష్పత్తి ఇలా.. (ప్రతి వేయి మందికి)

రాష్ట్రం	మొత్తం	నగరాలు	గ్రామాలు
కేరళ	962	962	962
తమిళనాడు	920	934	904
కర్ణాటక	928	940	908
ఆంధ్రప్రదేశ్	932	941	928
తెలంగాణ	902	896	906

త్వరలో వృద్ధ భారతం

ఈ గణాంకాల ప్రకారం చూస్తే త్వరలోనే తెలంగాణతోపాటు దక్షిణాది రాష్ట్రాల్లో వృద్ధుల జనాభా శాతం భారీగా పెరిగే అవకాశం ఉంది. దీనివల్ల శ్రామిక శక్తి తగ్గిపోతుంది. ఉత్పాదకత తగ్గి ఆరోగ్య సంరక్షణ ఖర్చులు అధికం అవుతాయి. లింగ వివక్షతో పాటు తక్కువ ఫర్టిలిటీ రేటు ఉన్న రాష్ట్రాలు భవిష్యత్తులో పెళ్లిళ్ల ఆలస్యమవడం, ఉద్యోగ విభాగాల్లో యువ శక్తి తగ్గిపోవడం వంటి సమస్యలు ఎదుర్కొంటాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

దక్షిణాది రాష్ట్రాల్లో టీఎఫ్ఆర్

రాష్ట్రం	మొత్తం	నగరాలు	గ్రామాలు
కేరళ	1.5	1.5	1.6
తమిళనాడు	1.5	1.4	1.5
కర్ణాటక	1.6	1.7	1.5
ఆంధ్రప్రదేశ్	1.5	1.6	1.4
తెలంగాణ	1.5	1.4	1.5

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

భక్తిశ్రద్ధలతో బక్రీద్







బక్రీద్ వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా శనివారం ఘనంగా జరిగాయి. పండుగ సందర్భంగా పలు పట్టణాలు, నగరాల్లో ప్రధాన ఈద్గాలు, మసీదులను సుందరంగా ముస్తాబు చేశారు. అల్లాపై విశ్వాసాన్ని చాటుతూ..త్యాగాలకు మారుపేరుగా ఈ పర్వదినాన్ని ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆ దృశ్యమాలిక ఇదీ...

క్లుప్తంగా...

ఇదేం 'చెత్త'శుద్ధి



ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌లో దర్శనమిస్తున్న ఖాళీ మందు సీసాలు

బూర్జ : శ్రీకాకుళం జిల్లా బూర్జ గ్రామంలో గల ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌లో ఖాళీ మందు సీసాలు కుప్పలుగా దర్శనం ఇస్తున్నాయి. ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌లో ఇలా మందుబాబులు తాగిన సీసాలు పారబోయడంతో కుప్పలు కుప్పలుగా దర్శనమిస్తున్నాయి. షెడ్‌లలో ఇలా ఖాళీ సీసాలు నిల్వ చేస్తే వర్మీకంపోస్టు ఎలా తయారు చేసేదని రైతులు ప్రశ్నిస్తున్నారు.

'ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి'

రేపల్లె: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించటంపై ప్రభుత్వం దృష్టి సారించాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ పీడీ సోషలిజం డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం తాలూకా సెంటరులో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ సంఘాలకు ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఉపాధ్యాయ సంఘాల సమస్యల పరిష్కారానికి ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన చర్చలలో ఎస్జీటీ టీచర్‌లకు మాన్యువల్‌గా కౌన్సెలింగ్ నిర్వహిస్తామని హామీ ఇచ్చిందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న బదిలీ విభాగంలో సెకండరీ గ్రేడ్ టీచర్ల కౌన్సెలింగ్ విధానాన్ని ఎంఆర్‌సీల ద్వారా స్క్రోల్ చేస్తూ వెబ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ప్రకటించిందన్నారు. ఇది మోసపూరిత చర్య అని ఆందోళన వ్యక్తం చేశారు. వెబ్ కౌన్సెల్ విధానంలో ఉపాధ్యాయులకు అన్యాయం జరిగే అవకాశం ఉందని, మాన్యువల్ కౌన్సెలింగ్ విధానాన్ని అమలు చేయటంతో సమస్య ఉండదని చెప్పారు. ప్రభుత్వం నిర్ణయాన్ని మార్చుకోకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

రేపల్లె ఇండియన్ రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్‌కు అవార్డు

రేపల్లె: దాతల నుంచి రక్త సేకరణలో రాష్ట్రస్థాయిలో రేపల్లె ఇండియన్ రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ అవార్డుకు ఎంపికైనట్లు బ్లడ్ బ్యాంక్ చైర్మన్ డాక్టర్ వసంతం వీరరాఘవయ్య తెలిపారు. స్థానిక బ్లడ్ బ్యాంక్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ దాతల సహకారంతో 17 సంవత్సరాల కిందట రేపల్లె ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో నెలకొల్పిన బ్లడ్ బ్యాంక్ సెంటర్ బాపట్ల జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ నారాయణ భట్టు సహకారంతో రేపల్లె, బాపట్ల పట్టణ పరిసర ప్రాంతాలలో అనేక రక్తదాన శిబిరాలు నిర్వహించి రక్తసేకరణలో ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. దాతల సహకారంతో బ్లడ్ బ్యాంక్‌కు అవసరమైన యంత్ర సామాగ్రిని, అంబులెన్స్‌ను సమకూర్చటం జరిగిందన్నారు. రేపల్లె రెడ్‌క్రాస్ సేవలను గుర్తించిన ప్రభుత్వం ప్రపంచ రక్తదాతల దినోత్సవం జూన్ 14న గుంటూరులో ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ చేతుల మీదగా అవార్డు అందుకోనున్నట్లు పేర్కొన్నారు.

ఎమ్మెల్యే పల్లాకు పితృ వియోగం

సీతంపేట (విశాఖ): తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక శాసన సభ్యుడు పల్లా శ్రీనివాసరావు తండ్రి పల్లా సింహాచలం శనివారం మధ్యాహ్నం సీతంపేటలోని తన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. పల్లా సింహాచలం విశాఖ–2 ఎమ్మెల్యేగా, వుడా బోర్డు సభ్యులుగా పనిచేశారు. పల్లా సింహాచలం భౌతిక కాయానికి కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, కార్మిక శాఖా మంత్రి సుభాష్, మాజీ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, శ్రీనివాస్ దంపతులు తదితర ఎమ్మెల్యేలు, వివిధ పార్టీల నాయకులు నివాళులు అర్పించారు.

మధ్యతరగతి.. అధోగతి



అప్పులతో సతమతం / ఏడాదిగా నిలిచిన సంక్షేమ పథకాలు / నాడు కళకళలాడిన వ్యాపారాలు / నేడు కూటమి పాలనలో వెలవెల

మధ్యతరగతి ప్రజల జీవనం దుర్భరంగా మారింది. ఆర్థిక అవసరాలు రోజురోజుకూ పెరుగుతున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రయోజనం చేకూరకపోవడంతో అప్పులబాట పడుతున్నారు. ఇదే అదనుగా పల్లెల్లో మైక్రో ఫైనాన్స్ వ్యాపారం కోరలు చాచింది. రూ.5 నుంచి రూ.10 వరకు వడ్డీ వ్యాపారం ఇష్టారాజ్యంగా సాగుతోంది. కూటమి ప్రభుత్వం గద్దెనెక్కి ఏడాది గడిచినా ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా అమలు చేయకపోగా.. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతుండటంతో మధ్యతరగతి వర్గాలు సతమతమవుతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి నెలా సంక్షేమ పథకాల రూపంలో బ్యాంకు ఖాతాల్లో నగదు జమకాగా.. ప్రజలు అప్పుల వైపు వెళ్లని పరిస్థితి.

కూటమి ప్రభుత్వం కొలువుతీరిన తర్వాత సామాన్యుడి కష్టాల తారాస్థాయికి చేరాయి. ఒకవైపు మండుతున్న నిత్యావసరాల ధరలు, మరోవైపు ప్రభుత్వ చేయూత లేకపోవడంతో ప్రజలు విలవిల్లాడుతున్నారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ అంటూ హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి నాయకులు చేతులెత్తేశారు. తల్లికి వందనం అందించకుండా ఒక విద్యా సంవత్సరం, అన్నదాత సుఖీభవ సాయం ఇవ్వకుండా ఖరీఫ్, రబీ సీజన్లు గడిపేశారు.

– సాక్షి ప్రతినిధి, ఏలూరు

గత ప్రభుత్వంలో ఏటా రూ.1,850 కోట్లకు పైగా

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏటా రూ.1,850 కోట్లకు పైగా నగదు ఏలూరు జిల్లాలో లక్షలాది మంది బ్యాంకు ఖాతాల్లో జమకాగా.. నేడు ఒక్క రూపాయి కూడా జమ కాని పరిస్థితి. కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వ పథకాలకు పేర్లు, లబ్ధి నగదు మొత్తాన్ని మార్చి ప్రకటించినా అమలు చేయకపోవడం గమనార్హం. ఈ లెక్కన ఏలూరు జిల్లాలో రూ.2 వేల కోట్లకు పైగా సంక్షేమ పథకాల నగదు ప్రజల ఖాతాల్లో జమ కావాల్సి ఉంది.

తగ్గిన కొనుగోలు శక్తి

మార్కెట్‌లో నగదు లావాదేవీలతో పాటు ప్రజల్లో కొనుగోలు శక్తి తగ్గడంతో వ్యాపారాలు మందగించాయి. గత ప్రభుత్వ హయాంలో సంక్రాంతికి అమ్మఒడి పథకం కింద ఏలూరు జిల్లాలో 1,78,214 మంది తల్లుల ఖాతాల్లో రూ.267.32 కోట్లు నగదు జమైతే కేవలం పండుగ రోజుల్లోనే జిల్లాలోనే రూ.150 కోట్ల నుంచి రూ.170 కోట్ల టర్నోవర్ జరిగినట్టు అంచనా. అయితే ఈ ఏడాది సంక్రాంతి సీజన్‌లో 50 శాతం కూడా కొనుగోళ్లు లేవని వ్యాపార వర్గాలు అంటున్నాయి. గతంలో డీబీటీ పథకాలు కావడంతో మార్కెట్‌లో నగదు రోటేషన్‌లో ఉండటం, ప్రజల్లో కొనుగోలు శక్తి ఉండటంతో విక్రయాలు బాగా జరిగి వ్యాపారాలు కళకళలాడటంతో జీఎస్టీ ద్వారా ప్రభుత్వానికీ ఆదాయం సమకూరేది. ఈ ఏడాది మాత్రం జీఎస్టీ మొదలు అన్ని లావాదేవీలు తగ్గిపోయాయి. కొన్ని రోజుల్లో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానుండగా ఇప్పటికీ తల్లికి వందనంపై కూటమి ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు.

అప్పులతో ఇబ్బందులు



గతంలో మా కుటుంబానికి మూడు పథకాల కింద ఏడాదికి రూ.50 వేల వరకూ వచ్చేవి. వాటితో అప్పులు తీర్చడంతో పాటు కొంత పొదుపు చేసుకునే వాళ్లం. ఇంట్లో అవసరమైన సామగ్రిని నెలవారీ వాయిదా పద్ధతిలో తీసుకుని పథకం డబ్బులతో చెల్లించేవాళ్లం. ఇప్పుడు పొదుపు మాట అటుంచి చేసిన అప్పులు తీర్చడానికే ఇబ్బందులు పడుతున్నాం.

– గొంతిన ఝాన్సీలక్ష్మి, గృహిణి

అవస్థలు పడుతున్నాం



కుటుంబ అవసరాల కోసం గతంలో లేదనకుండా అప్పు ఇచ్చేవారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధితో అప్పులు తీర్చేవాళ్లం. ఇప్పుడు పథకాలు అమలు చేయకపోవడంతో మాకు ఆదాయం వచ్చే దారి లేదని గ్రహించి అప్పులు ఇచ్చేవాళ్లు నిరాకరిస్తున్నారు. అవసరానికి అప్పు పుట్టక అవస్థలు పడుతున్నాం.

– పోలిశెట్టి ఈశ్వరి, ప్రైవేట్ స్కూల్ ఉపాధ్యాయురాలు

నమ్మి మోసపోయాం



ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీలు నమ్మి మోసపోయాం. మాలాంటి మహిళలు ఎంతో ఆశతో ఎదురు చూస్తున్న పథకాలు ఒక్కటి కూడా అమలు చేయకపోవడం బాధాకరం. రాష్ట్రంలోని మహిళల ఆవేదనను గ్రహించి ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి అమలు చేస్తారని ఆశిస్తున్నాం.

– కె.కనకదుర్గ, చిగురుకోట, ముదినేపల్లి మండలం

పథకాలన్నీ ఇవ్వాలి



గత ప్రభుత్వంలో ఇచ్చిన పథకాలన్నీ మరలా ఇప్పుడు కూడా ఇచ్చేలా చూడాలి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అందించిన పథకాలు పేదలకు ఎంతో వెసులుబాటు కలిగించేవి. అవి నిలిపివేయడంతో చాలా మంది పేదలు ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నారు. తిరిగి పథకాలన్నీ ప్రవేశపెట్టాలి.


– నల్గొండ నాంచారమ్మ, మండవల్లి

కొమ్మా...ఉయ్యాలా!

తిరుమల శ్రీవారి దర్శనానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఈ క్రమంలో భూదేవి కాంప్లెక్స్ వద్ద ఉద్యానవనంలో భక్తులు తమ చంటి బిడ్డను ఓ చెట్టు కొమ్మకు ఉయ్యాల కట్టి ఇలా నిద్రపుచ్చుతున్న దృశ్యమిది.



శ్రీవారి దర్శనానికి 20 గంటలు



తిరుమల: తిరుమలలో శ్రీవారి సర్వ దర్శనానికి 20 గంటల సమయం పడుతోంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లన్నీ నిండిపోయింది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 72,174 మంది స్వామివారిని దర్శించుకోగా 35,192 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారి హుండీలో రూ.2.88 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 20 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

చినవెంకన్న క్షేత్రం.. భక్తజన సంద్రం



ద్వారకాతిరుమల: ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలలోని చిన వెంకన్న ఆలయం శనివారం భక్తజన సంద్రమైంది. స్వామివారికి ప్రీతికరమైనరోజు కావడంతో పాటు, వేసవి సెలవులు ముగుస్తుండటంతో సుదూర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే భక్తుల రాక మొదలైంది. దీంతో క్షేత్ర పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతం, అనివెట్టి మండపం, వైకుంఠం క్యూకాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల, ఉచిత ప్రసాద వితరణ క్యూలైన్లు, నిత్యాన్నదాన విభాగాలు భక్తులతో పోటెత్తాయి. క్యూలైన్లు నిండిపోవడంతో భక్తులు ఆలయ ఆవరణలో బారులు తీరారు. దేవస్థానం సిబ్బంది భక్తులకు క్యూ కాంప్లెక్స్‌లో నిరంతరాయంగా మజ్జిగ, క్యూలైన్లలో మంచి నీటిని అందించారు.

నకిలీ ఐఆర్‌ఎస్ అధికారి అరెస్ట్

- కారు, సెల్ ఫోన్లు, స్టాంప్ తదితరాలు సీజ్
- ఆలయ ఈఓను మోసగించే యత్నం
- నిందితుడిది కర్ణాటకలోని రాయచూర్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సింధుప్రియ

నెల్లూరు(క్రైమ్): భూ వివాదాలను పరిష్కరిస్తానంటూ ఆలయ ఈఓను మోసగించేందుకు యత్నించిన నకిలీ ఐఆర్‌ఎస్ అధికారిని నెల్లూరు సంతపేట పోలీసులు అరెస్ట్ చేశారు. నగర డీఎస్పీ పి.సింధుప్రియ, స్థానిక ఇన్‌స్పెక్టర్ జి.దశరథ రామారావుతో కలిసి నిందితుడి వివరాలను శనివారం వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రం రాయచూర్ దొంగరాంపూర్ ప్రాంతానికి చెందిన రాంపూర్ రమేష్ సులభంగా డబ్బు సంపాదించాలని ఐఆర్‌ఎస్ అధికారిగా అవతారమెత్తాడు. భూవివాదం పరిష్కరిస్తానని నెల్లూరు నగరానికి చెందిన వెంకటరమణ వద్ద రూ.2 లక్షలు తీసుకున్నాడు. ఆ నగదుతో డాక్టర్ రమేష్ రాంపూర్ పేరుతో నేమ్ ప్లేట్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా డిస్ట్రిక్ట్ రీజనల్ కమిషనర్ నేషనల్ ఎంబ్లమ్ కల్గిన బోర్డు, రీజినల్ కమిషనర్ నెల్లూరు పేరిట స్టాంపులను తయారు చేయించాడు. ఈనెల 3న ఆయన తన కారులో నెల్లూరు ఆదిత్యనగర్‌కు వచ్చాడు. వెంకటరమణకు ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉండటంతో రాత్రి అక్కడే ఓ గదిలో బసచేశారు. ఈనెల 4న నెల్లూరు తల్పగిరి రంగనాథస్వామి ఆలయానికి చేరుకుని ఆలయ ఈఓ శ్రీనివాసులరెడ్డిని కలిశారు. తాను ఐఆర్‌ఎస్ అధికారినని, నెల్లూరు రీజినల్ జాయింట్ కమిషనర్‌గా బదిలీపై వచ్చానని, రిపోర్టు చేసుకునేముందు స్వామిని దర్శించుకునేందుకు వచ్చానని చెప్పాడు. దీంతో ఈఓ ఆలయ మర్యాదలతో రమేష్‌కు స్వామి దర్శనం చేయించారు. అనంతరం వివాదంలో ఉన్న ఆలయ భూముల రిపోర్టు కాపీలను ఇవ్వగా తీసుకెళ్లారు. అదేరోజు సాయంత్రం తనను కలవాలని ఈఓకు ఫోన్ చేయగా ఆయన వీలు కాదని చెప్పారు. అయితే రమేష్ ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండటంతో ఈఓ అతని గురించి సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక ఇన్‌స్పెక్టర్ దశరథ రామారావు, ఎస్‌ఐ బాలకృష్ణ తమ సిబ్బందితో కలిసి ఈనెల 6న సాయంత్రం ఆదిత్య నగర్‌లో రమేష్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించడంతో నిజం చెప్పేశాడు. అతని వద్ద నుంచి కారు, సెల్‌ఫోన్లు, స్టాంప్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేశారు. సమావేశంలో స్థానిక ఎస్‌ఐ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దళితులకు ఆలయ ప్రవేశం కల్పించిన అధికారులు

చిత్తూరు జిల్లా, పొన్నమాకులపల్లిలో అగ్రవర్ణాల ప్రజలకు కౌన్సెలింగ్

గంగవరం: అగ్రవర్ణాలకు అధికారులు కౌన్సెలింగ్ ఇవ్వడంతో చిత్తూరు జిల్లా గంగవరం మండలంలోని పొన్నమాకులపల్లి గ్రామంలో దళితులకు శనివారం శ్రీచెన్నకేశవ స్వామివారి ఆలయ ప్రవేశ భాగ్యం లభించింది. కొన్ని రోజుల క్రితం గ్రామంలో దళిత వర్గానికి చెందిన కొందరు ఆలయంలోకి ప్రవేశించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆ విషయం తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన అగ్ర కులస్తులు, ఆలయంలోకి దళితులకు ప్రవేశం లేదని బెదిరింపులకు దిగారు. దీంతో దళిత వర్గాల ప్రజలు ఏకమై జిల్లా ఎస్పీకి ఈ విషయమై ఫిర్యాదు చేశారు. ఎస్పీ కార్యాలయం నుంచి వచ్చిన ఉత్తర్వుల మేరకు తహసిల్దార్ మాధవరాజు, అర్బన్ సీఐ ప్రసాద్ గ్రామంలో అగ్ర కులాల వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆ తరువాత అన్ని వర్గాలను ఏకం చేసి దళితులకు ఆలయ ప్రవేశ భాగ్యం కల్పించారు. ఎక్కడైనా గ్రామాల్లో ఇలాంటి వివక్ష చూపినట్లయితే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.



బడుగు వర్గాలతో కలిసి స్వామివారి దర్శనం చేసుకుంటున్న అధికారులు

పరిశోధనలకు పుష్కలమైన అవకాశాలు

ఏర్పేడు: నూతన ఆవిష్కరణలు, పరిశోధనల పట్ల జిజ్ఞాస ఉన్న విద్యార్థులకు తిరుపతి ఐఐటీలో పుష్కలమైన వనరులున్నాయని ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ కెఎన్ సత్యనారాయణ అన్నారు. తిరుపతి జిల్లా ఏర్పేడు సమీపంలోని ఐఐటీ ప్రాంగణంలో శనివారం జేఈఈ అడ్వాన్స్‌డ్- 2025లో అర్హత సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఓపెన్ హౌస్ కార్యక్రమంలో భాగంగా కోర్సుల ఎంపిక, ఐఐటీ అందిస్తున్న సౌకర్యాలను గురించి వివరించారు. కార్యక్రమంలో 180 మంది పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ . అండర్ గ్రాడ్యుయేట్ పాఠ్యాంశాలు, డ్యూయల్ డిగ్రీ, బ్రాంచ్ మార్పు విధానం గురించి సందేహాలను నివృతి చేశారు.

ఎస్‌జీటీలకు వెబ్ కౌన్సెలింగ్ రద్దుచేయాలి

సత్తెనపల్లి: ఎస్‌జీటీలకు వెబ్ కౌన్సెలింగ్ రద్దుచేసి మాన్యువల్‌గా జరపాలని సత్తెనపల్లి ప్రాంతీయ ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని మండల విద్యాశాఖఅధికారి కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఎస్‌జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ జరపాలని, వెబ్ కౌన్సిలింగ్ రద్దు చేయాలని ఈ నెల 8న గుంటూరులోని ఉమ్మడి జిల్లా డీఈఓ కార్యాలయ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు సత్తెనపల్లి ఎంఈఓ ఏ.శ్రీనివాసరావుకు వినతిపత్రాన్ని అందజేశారు.

10న జిల్లా సీనియర్స్ మెన్, ఉమెన్ ఫుట్‌బాల్ జట్ల ఎంపిక

సత్తెనపల్లి: ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెన్ అండ్ ఉమెన్ జిల్లా సెలక్షన్ ట్రయల్స్ ఈ నెల 10న ఉదయం 9 గంటలకు సత్తెనపల్లి సుగాలీకాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జరుగుతాయని పల్నాడు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.సుబ్రహ్మణ్యేశ్వరరావు శనివారం పేర్కొన్నారు. సెలక్షన్ ట్రయల్స్‌కు వచ్చు క్రీడాకారులు వారి డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు ఒరిజినల్స్, జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకొని రావాలన్నారు.

ఎస్జీటీల బదిలీలు మాన్యువల్‌గా నిర్వహించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియలో భాగంగా సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ)లకు వెబ్ కౌన్సెలింగ్‌ను రద్దు చేసి, మాన్యువల్ పద్ధతిలోనే కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఉమ్మడి గుంటూరు డీఈఓకార్యాలయాన్నిముట్టడిస్తున్నట్లు ఐక్య వేదిక గుంటూరు జిల్లా స్టీరింగ్ కమిటీ నాయకులు కె.బసవలింగారావు, ఎం.కళాధర్, డి.పెదబాబు తెలిపారు. ఎస్జీటీలకు మాన్యువల్ విధానంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని హామీ ఇచ్చిన విద్యాశాఖ కమిషనర్ తన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం కలెక్టర్ బంగ్లా రోడ్డులోని మండల విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఉమ్మడి గుంటూరుజిల్లా శాఖ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు.



● అమీర్ ఖాన్ ● చిరంజీవి ● రవితేజ ● అల్లు అర్జున్ ● కల్యాణ్ దాసరి ● తేజ సజ్జా ● రణ్‌వీర్ సింగ్

సూపర్ హీరోలు వస్తున్నారోచ్!

ఐరన్ మ్యాన్, బ్యాట్ మ్యాన్, హల్క్... ఇలా హాలీవుడ్ సూపర్ హీరో కథలను భారతీయ ప్రేక్షకులు వీక్షించారు. అబ్బురపరచే వారి సాహసాలను శభాష్ అన్నారు. అయితే ఇప్పుడు మన ఇండియన్ సినిమా సూపర్ హీరోస్ కూడా వస్తున్నారోచ్. వెండితెరపై ఆడియన్స్‌ను ఆశ్చర్యపరచే అద్భుత విన్యాసాలు, సాహసాలతో ఆడియన్స్ వావ్ అనేలా కష్టపడటానికి రెడీ అవుతున్నారు. ఇక మన సూపర్ హీరో వివరాలపై ఓ లుక్ వేయండి.

విశ్వంభర ప్రపంచంలో...

'విశ్వంభర' సినిమాలో సూపర్ హీరో మాదిరి యాక్షన్ చేయనున్నాడట దొరబాబు. చిరంజీవి హీరోగా వశిష్ఠ దర్శకత్వంలో రూపొందుతున్న మైథలాజికల్ అడ్వెంచరస్ అండ్ యాక్షన్ మూవీ 'విశ్వంభర'. కాగా ఈ చిత్రంలో ఆంజనేయస్వామి భక్తుడు దొరబాబు పాత్రలో చిరంజీవి కనిపిస్తారని, దొరబాబుగా విశ్వంభర ప్రపంచంలో సాగే కొన్ని సన్నివేశాల్లో సూపర్ హీరోలా యాక్షన్ సన్నివేశాలు చేస్తారని ఫిల్మ్‌నగర్ సమాచారం. పంచభూతాల (గాలి, నీరు, భూమి, ఆకాశం, నిప్పు) నేపథ్యం, విశ్వంభర అనే బుక్, సిస్టర్స్ సెంటిమెంట్‌తో ఈ సినిమా కథనం సాగుతుందని సమాచారం. యూవీ క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్, విక్రమ్ రెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ దాదాపు పూర్తయింది. కాకపోతే వీఎఫ్ఎక్స్ వర్క్ కారణంగా సినిమా విడుదల ఆలస్యమౌతోందని తెలుస్తోంది. ఈ వీఎఫ్ఎక్స్ వర్క్స్ ఓ కొలిక్కి వచ్చిన తర్వాత 'విశ్వంభర' సినిమా విడుదల తేదీపై ఓ క్లారిటీ రానుంది. ఈ చిత్రంలో త్రిష హీరోయిన్‌గా నటిస్తుండగా, ఇతర ప్రధాన పాత్రల్లో ఆషికా రంగనాథ్, బాలీవుడ్ యాక్టర్ కునాల్ కపూర్ కనిపిస్తారు. కీలక పాత్రల్లో సురభి, ఇషా చావ్లా, ప్రవీణ్ కనిపిస్తారని తెలిసింది.

వచ్చే ఏడాది స్టార్ట్

'ఖైదీ, విక్రమ్, లియో' వంటి మాస్ సినిమాలు తీసిన తమిళ దర్శకుడు లోకేశ్ కనగరాజ్ ఓ సూపర్ హీరో కథను రెడీ చేశారు. లోకేశ్ కనగరాజ్ కథలోని సూపర్ హీరోగా బాలీవుడ్ నటుడు ఆమిర్ ఖాన్ కనిపించనున్నారు. ఈ సూపర్ హీరో సినిమాను ఇటీవల ఆమిర్ ఖాన్ ఓ సందర్భంలో కన్ఫార్మ్ చేశారు. దర్శకుడు లోకేశ్ కనగరాజ్ తనకు ఓ సూపర్ హీరో కథ చెప్పారని, లోకేశ్‌తో తాను ఈ సూపర్ హీరో మూవీ చేయనున్నానని, వచ్చే ఏడాది షూటింగ్ ప్రారంభిస్తామని ఆమిర్ ఖాన్ చెప్పారు. ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించనుందనే టాక్ తెరపైకి వచ్చింది. ప్రస్తుతం తాను హీరోగా నటించిన 'సితారే జమీన్ పర్' సినిమా ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నారు ఆమిర్ ఖాన్. ఈ సినిమా తర్వాత దాదాసాహెబ్ ఫాల్కే బయోపిక్‌లో ఆమిర్ ఖాన్ నటిస్తారనే ప్రచారం జరుగుతోంది. ఈలోపు కార్తీతో 'ఖైదీ 2' సినిమా చేసేస్తారు లోకేశ్ కనగరాజ్. ఇలా... ఆమిర్–లోకేశ్‌ల ఇతర కమిట్‌మెంట్స్ పూర్తయిన తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లోని సినిమా సెట్స్‌కు వెళ్తుందని ఊహించవచ్చు. అలాగే లోకేశ్ దర్శకత్వంలోని తాజా చిత్రం 'కూలీ'లో ఆమిర్ ఖాన్ ఓ గెస్ట్ రోల్ చేసిన సంగతి తెలిసిందే. రజనీకాంత్ హీరోగా, నాగార్జున, శ్రుతీహాసన్, సత్యరాజ్, ఉపేంద్ర ఇతర కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమా ఆగస్టు 14న విడుదల కానుంది.

ఆన్ ద వే!

సిల్వర్ స్క్రీన్‌పై రవితేజను ఓ సూపర్ హీరోగా చూపించనున్నారు 'మ్యాడ్' డైరెక్టర్ కల్యాణ్ శంకర్. 'మ్యాడ్, మ్యాడ్ 2' చిత్రాలతో వరుస విజయాలు అందుకున్న ఈ దర్శకుడు కొన్ని రోజుల క్రితమే ఓ సూపర్ హీరో స్క్రిప్ట్‌ను రెడీ చేసుకున్నారు. ఈ కథను రవితేజకు వినిపించగా, ఈ హీరో ప్రాథమికంగా అంగీకారం తెలిపారట. దీంతో ఈ సినిమా స్క్రిప్ట్‌కు మరింత మెరుగులు దిద్దే పనిలో పడ్డారట కల్యాణ్ శంకర్. ఈ స్క్రిప్ట్, ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ ఓ కొలిక్కి వచ్చి, రవితేజకు కల్యాణ్ శంకర్ ఫైనల్ నరేషన్ ఇచ్చి, రవితేజ ఈ సినిమాకు ఓకే చెబితే, మూవీ సెట్స్‌పైకి వెళ్లినట్లే. అయితే ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్లడానికి మాత్రం కాస్త సమయం పట్టవచ్చు. ఎందుకంటే ప్రస్తుతం నూతన దర్శకుడు భాను భోగవరపుతో 'మాస్ జాతర' అనే మూవీ చేస్తున్నారు రవితేజ. ఆగస్టు 27న ఈ చిత్రం రిలీజ్ కానుంది. అలాగే కిశోర్ తిరుమల దర్శకత్వంలో 'అనార్కలి' (ప్రచారంలో ఉన్న టైటిల్) అనే మూవీ కూడా చేస్తున్నారు రవితేజ. 'మాస్ జాతర' చిత్రీకరణ దాదాపు పూర్తయింది. 'అనార్కలి' సినిమా షూటింగ్ మొదలు కావాల్సి ఉంది. పైగా ఈ సినిమాను సంక్రాంతికి రిలీజ్ చేస్తామని ఆల్రెడీ రవితేజ ప్రకటించారు. సో... ఈ సినిమా షూటింగ్ పూర్తయిన తర్వాతే కల్యాణ్ శంకర్‌తో సూపర్ హీరో తరహా సినిమా చేసే ఆలోచన చేయవచ్చు రవితేజ. ఇక ఈ కళ్యాణ్ శంకర్ దర్శకత్వంలో వచ్చిన 'మ్యాడ్, మ్యాడ్ 2' చిత్రాలు, రవితేజ 'మాస్ జాతర' సినిమాలను నిర్మించిన సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థనే కల్యాణ్ శంకర్–రవితేజల సూపర్ హీరో సినిమాను నిర్మించనుందనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. సో... సూపర్ హీరో ఆన్ ద వే అన్నమాట.

సరికొత్త ప్రపంచంలోకి...

ఆడియన్స్‌ను ఓ కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లనున్నారు హీరో అల్లు అర్జున్. అట్లీ దర్శకత్వంలో అల్లు అర్జున్ హీరోగా ఓ అంతర్జాతీయ స్థాయి సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా కోసం ఓ సరికొత్త ప్రపంచాన్నే సృష్టిస్తున్నారట దర్శకుడు అట్లీ. ఈ సినిమాలో ఊహకందని లొకేషన్స్, వినూత్నమైన జీవరాసులు ఉంటాయట. పైగా ఈ చిత్రంలో అల్లు అర్జున్ త్రిపాత్రాభినయం చేయనున్నారనే టాక్ తెరపైకి వచ్చింది. అయితే ఈ మూడు పాత్రల్లో ఒక పాత్ర సూపర్ హీరో తరహాలో ఉంటుందని ఫిల్మ్‌నగర్ సమాచారం. ఆల్రెడీ ఈ పాత్రకు సంబంధించి విదేశీ సాంకేతిక నిపుణులు, ఫైటర్స్ నేతృత్వంలో అల్లు అర్జున్ ప్రత్యేకంగా శిక్షణ తీసుకుంటున్నారని తెలిసింది. ఇక ఈ చిత్రంలో కథ రీత్యా ఐదుగురు హీరోయిన్స్ ఉంటారనే టాక్ వినిపిస్తోంది. ఓ హీరోయిన్‌గా దీపికా పదుకోన్ నటించనున్నారు. దీపిక పాత్రకు యాక్షన్ సీక్వెన్స్‌లు కూడా ఉన్నాయి. ఈ చిత్రంలో ఓ వారియర్ తరహా పాత్రలో కనిపిస్తారామె. ఇంకా ఈ చిత్రంలో జాన్వీ కపూర్, మృణాల్ ఠాగూర్ భాగమయ్యారని, ఈ విషయంపై త్వరలోనే ఓ అధికారిక ప్రకటన రానుందని సమాచారం. ఈ ఏడాదిలోనే ఈ సినిమా చిత్రీకరణను ప్రారంభించాలనుకుంటున్నారు. భారీ బడ్జెట్‌తో సన్ పిక్చర్స్ సంస్థ ఈ సినిమాను నిర్మించనుంది. వీలైనంత తొందరగా ఈ సినిమా చిత్రీకరణను పూర్తి చేసి, 2027 ప్రారంభంలో ప్రేక్షకుల ముందుకు తీసుకు రావాలన్నది చిత్రయూనిట్ ప్లాన్ అని భోగట్టా.

ఇటు అధీర... అటు మహాకాళి!

ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా కొన్ని సూపర్ హీరో తరహా సినిమాలు రూపొందుతున్న సంగతి తెలిసిందే. తేజ సజ్జా హీరోగా ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో వచ్చిన 'హను–మాన్' బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఈ సినిమాలోని కొన్ని సన్నివేశాల్లో తేజ సజ్జా సూపర్ హీరో పవర్స్ ఉన్న యువకుడు హనుమంతు పాత్రలో కనిపించి, ఆడియన్స్‌ను మెప్పించారు. ఈ సినిమాకు సీక్వెల్‌గా 'జై హనుమాన్' చిత్రం రూపొందుతోన్న సంగతి తెలిసిందే. 'కాంతార' ఫేమ్ రిషబ్ శెట్టి మెయిన్ లీడ్ రోల్ చేస్తారు. అయితే ఈ చిత్రంలోనూ హనుమంతు పాత్ర ఉంటుందట. ఇంకా ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగానే 'అధీర' అనే సినిమా అనౌన్స్‌మెంట్ వచ్చింది. ఈ సూపర్ హీరో సినిమాలో నిర్మాత డీవీవీ దానయ్య తనయుడు కల్యాణ్ దాసరి హీరోగా నటిస్తారు. ఇంకా ప్రశాంత్ వర్మ యూనివర్స్‌లో భాగంగానే 'మహాకాళి' అనే మూవీ రానుంది. విశేషం ఏంటంటే... ఇది ఫీమేల్ సూపర్ హీరో మూవీ అన్నమాట. పూజ అపర్ణ కొల్లూరు దర్శకత్వంలో ఆర్‌కేడీ స్టూడియోస్ పతాకంపై ఆర్‌కే దుగ్గల్ సమర్పణలో రివాజ్ రమేశ్ దుగ్గల్ ఈ సినిమాను నిర్మించనున్నారు. అయితే ఈ సినిమాలో ఎవరు మెయిన్ లీడ్ చేస్తారన్నది ఇంకా అధికారికంగా వెల్లడి కాలేదు. కాగా ప్రశాంత్ వర్మ షో రన్నర్‌గా ఉన్న 'మహాకాళి' సినిమాలో బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా ఓ కీలక పాత్రలో నటిస్తారు. గత ఏడాది దసరా పండగ సందర్భంగా ఈ సినిమాను అధికారికంగా ప్రకటించారు ప్రశాంత్‌వర్మ. ఈ పోస్టర్‌పై మోస్ట్ ఫెరోషియస్ సూపర్ హీరో ఇన్ ది యూనివర్స్ అని ఉండటం విశేషం.



పీపుల్స్ సూపర్ హీరో

పీపుల్స్ సూపర్ హీరోగా చెప్పుకునే శక్తిమాన్ సరికొత్త పవర్స్‌తో వెండితెరపైకి రానున్నాడు. మూడు సంవత్సరాల క్రితమే ఈ 'శక్తి మాన్' సినిమా అధికారిక ప్రకటన వచ్చింది. ఈ సినిమాలో శక్తి మాన్‌గా రణ్‌వీర్ సింగ్ నటిస్తారని, మలయాళ దర్శకుడు బాసిల్ జోసెఫ్ దర్శకత్వం వహిస్తారని, హీరోయిన్‌గా వామికా గబ్బి కనిపిస్తారనే ప్రచారం తెరపైకి వచ్చింది. అయితే 'శక్తి మాన్' సినిమాలోని నటీనటులపై ఇంకా పూర్తి స్థాయి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. కాగా ఈ సినిమాలో రణ్‌వీర్ సింగ్ నటించడం లేదని, ఈ సినిమాకు ఓ నిర్మాతగానే ఆయన ఉంటారనే ప్రచారం కూడా బాలీవుడ్‌లో వినిపించింది. మరి... శక్తి మాన్‌గా ఎవరు కనిపిస్తారనే విషయంపై క్లారిటీ రావాలంటే మరికొన్ని రోజులు వెయిట్ చేయక తప్పదు.

సూపర్ యోధ

'హను–మాన్' ఫేమ్ తేజ సజ్జా హీరోగా రూపొందుతున్న అడ్వెంచరస్ యాక్షన్ డ్రామా మూవీ 'మిరాయ్'. రితికా నాయక్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో మంచు మనోజ్ విలన్ రోల్‌లో నటిస్తున్నారు. ఈ చిత్రంలోని కొన్ని సన్నివేశాల్లో తేజ సజ్జా సూపర్ హీరో తరహాలో కనిపిస్తారు. ఇటీవల విడుదలైన, ఈ 'మిరాయ్' గ్లింప్స్ వీడియోతో ఈ విషయం స్పష్టమౌతోంది. అడ్వెంచరస్‌తో పాటు కొన్ని మైథలాజికల్ అంశాలను ఈ సినిమాలో చూపించనున్నారు ఈ చిత్రదర్శకుడు కార్తీక్ ఘట్టమనేని. ఇటీవలే ఈ సినిమా కొత్త షెడ్యూల్ ముంబైలోని చారిత్రక గుహల్లో ప్రారంభమైంది. ప్రధాన తారాగణం పాల్గొంటుండగా కీలక సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోంది. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ 'మిరాయ్' చిత్రం సెప్టెంబరు 5న విడుదల కానుంది. అలాగే ఈ సినిమా రెండు భాగాలుగా విడుదలవుతుందనే ప్రచారం కూడా జరుగుతోంది.

మల్టీవర్స్ మన్మథన్

మలయాళ నటుడు నివిన్ పౌలీ ఓ సూపర్ హీరో ఫిల్మ్ చేస్తున్నారు. 'మల్టీవర్స్ మన్మథన్' పేరుతో తెరకెక్కనున్న ఈ సినిమాకు ఆదిత్యన్ చంద్ర శేఖర్ దర్శకత్వం వహించనున్నారు. ఆనంద్, నితీరాజ్ ఈ సినిమాకు కో రైటర్స్‌గా పని చేస్తున్నారు. ఈ సినిమాను ఈ ఏడాది ఫిబ్రవరిలో అధికారికంగా ప్రకటించారు. ''ఇండియాస్ ఫస్ట్ మల్టీవర్స్ సూపర్ హీరో సినిమా ఇది'' అని ఈ సినిమా అనౌన్స్‌మెంట్ సమయంలో నివిన్ పౌలీ 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. అయితే ఈ సూపర్ హీరో ఫిల్మ్ మూడు నాలుగు భాగాలుగా రానుందని, తొలి భాగంగా 'మన్మథన్ రైజింగ్' ఉంటుందనే ప్రచారం జరుగుతోంది. ఈ చిత్రం మలయాళ, తెలుగు, తమిళ, హిందీ, కన్నడ భాషల్లో విడుదల కానుంది.





కల నిజమైంది

నటుడిగా ఉన్ని ముకుందన్ తెలుగు ప్రేక్షకులకు సుపరిచితుడే. 'భాగమతి, కిలాడి, యశోద' వంటి సినిమాల్లో ఉన్ని ముకుందన్ నటన తెలుగు ప్రేక్షకులను మెప్పించింది. ఈ మలయాళ నటుడు ఓ సూపర్ హీరో సినిమాతో దర్శకుడిగా మారనున్నారు. ఆ మధ్య ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు ఉన్ని ముకుందన్. తాను చిన్నప్పట్నుంచి సూపర్ హీరో కథలు, వీరోచిత పోరాటాలు చూస్తూ పెరిగానని, తన కలలో కొందరు సూపర్ హీరోస్ ఉన్నారని, వారిని వెండితెరపైకి తీసుకువచ్చేందుకు తొలిసారి దర్శకత్వం వహించనున్నానని ఉన్ని ముకుందన్ పేర్కొన్నారు. మిథున్ మాన్యువేల్ థామస్ కథ అందిస్తున్న ఈ సినిమాను గోకులమ్ గోపాలన్ నిర్మించనున్నారు. ఈ ఏడాదే ఈ సినిమా చిత్రీకరణను ప్రారంభించాలనుకుంటున్నారు ఉన్ని ముకుందన్.

ఈ కోవలో మరికొంతమంది సూపర్ హీరోలు వెండితెరపైకి రానున్నారు.

– మునిమి శివాంజనేయులు



● మాధవన్

మహేశ్ సినిమాలో..?

మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ఎస్ఎస్ఎమ్‌బీ 29' (వర్కింగ్ టైటిల్). ఈ చిత్రంలో హీరోయిన్ ప్రియాంకా చోప్రా, హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా ఈ టీమ్‌లోకి మాధవన్ కూడా చేరినట్లు ఫిల్మ్‌నగర్ సమాచారం. ఆయన ఓ కీలక పాత్రలో కనిపించనున్నారని టాక్. ఈ మేరకు మాధవన్‌తో చర్చలు పూర్తయ్యాయని, త్వరలోనే ఆయన సెట్స్‌లో అడుగు పెట్టబోతున్నారని భోగట్టా. మరి... ఈ చిత్రంలో మాధవన్ భాగం అవుతారా? లేదా అనే విషయాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. కాగా ఆఫ్రికా అడవుల నేపథ్యంలో సాగే ఇండియానా జోన్స్ స్టైల్ కథతో రూపొందుతున్న ఈ చిత్రం ఇప్పటికే పలు షెడ్యూల్స్ పూర్తి చేసుకుంది. కొత్త షెడ్యూల్‌ని ఈ నెలలోనే మొదలు పెట్టనున్నారట. దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై కేఎల్ నారాయణ ఈ అడ్వెంచరస్ ఫిల్మ్‌ను దాదాపు రూ.1000 కోట్ల బడ్జెట్‌తో పాన్ వరల్డ్ రేంజ్‌లో నిర్మిస్తున్నారనే టాక్ నడుస్తోంది. తెలుగులో ఇదే అత్యధిక బడ్జెట్ ఫిల్మ్ అని టాక్.



చాప్టర్ వన్... చంద్ర

● కల్యాణీ ప్రియదర్శన్

హీరోయిన్ కల్యాణీ ప్రియదర్శన్ నటించనున్న కొత్త సినిమాకు 'లోక: చాప్టర్ వన్ చంద్ర' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ చిత్రంలో 'ప్రేమలు' ఫేమ్ నస్లెన్ మరో కీలక పాత్రలో నటిస్తున్నారు. డొమినిక్ అర్జున్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా 'లోక: చాప్టర్ వన్ చంద్ర' సినిమా పోస్టర్‌ను విడుదల చేసి, ఈ సినిమాను ఈ ఏడాదే రిలీజ్ చేయాలనున్నట్లుగా మేకర్స్ ప్రకటించారు. ఈ సూపర్ హీరో ఫ్యాంటసీ సినిమాను దుల్కర్ సల్మాన్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఈ ఏడాదే విడుదల కానుంది. కాగా ఈ మూవీలో దుల్కర్ సల్మాన్, టొవినో థామస్ గెస్ట్ రోల్స్ చేస్తారనే ప్రచారం సాగుతోంది. ఈ విషయంపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

బిజినెస్ రీల్

7 రాష్ట్రాల్లో జెన్‌ఏఐ ఇన్నోవేషన్ బిల్ట్‌థాన్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: నెక్స్ట్‌వేవ్, ఓపెన్‌ఏఐ అకాడమీ కలిసి దేశీయంగా అతి పెద్ద జెన్‌ఏఐ ఇన్నోవేషన్ బిల్డ్‌థాన్‌కి శ్రీకారం చుట్టాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర తదితర మొత్తం 7 రాష్ట్రాల్లో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించాయి. 500 క్యాంపస్‌ల నుంచి 25 వేల మందికి పైగా విద్యార్థులు జెన్ ఏఐ టెక్నాలజీలో నైపుణ్యాలను పెంచుకునేందుకు ఇదొక అవకాశం కాగలదని పేర్కొన్నాయి. మూడు రౌండ్లలో జరిగే ఈ పోటీల్లో విజేతలకు మొత్తం రూ. 10 లక్షల బహుమతితో పాటు ఓపెన్‌ఏఐ వ్యవస్థలో కెరియర్‌ను తీర్చిదిద్దుకునే అవకాశాలు లభిస్తాయి. పోటీల్లో పాల్గొనేందుకు ఎంపికైన టీమ్స్.. రియల్ టైమ్ శిక్షణ, మెంటార్ సపోర్ట్, సర్టిఫికెట్లు మొదలైనవి పొందవచ్చు. ఈ కార్యక్రమం ద్వారా 2,000కు పైగా ఏఐ ప్రాజెక్టులకు రూపకల్పన జరగవచ్చని నెక్స్ట్‌వేవ్ అంచనా వేస్తోంది.

టాటా మోటార్స్ చెకప్ క్యాంప్



ముంబై: ఆటోమొబైల్ దిగ్గజం టాటా మోటార్స్ తమ కస్టమర్ల కోసం దేశవ్యాప్తంగా మాన్సూన్ చెకప్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నట్లు వెల్లడించింది. జూన్ 6న ప్రారంభమైన ఈ క్యాంపులు 20వ తారీఖు వరకు కొనసాగుతాయని వివరించింది. 500 నగరాల్లో 1,090 ఆథరైజ్డ్ వర్క్‌షాప్‌లలో ఈ సర్వీసులు అందుబాటులో ఉంటాయని కంపెనీ పేర్కొంది. ఈ క్యాంపులో భాగంగా వాహనంలోని ముప్పై కీలక పాయింట్లను పరీక్షించే సమగ్ర హెల్త్ చెకప్ సేవలు పొందవచ్చని వివరించింది. కార్ టాప్ వాష్, ఒరిజినల్ స్పేర్ పార్టులు, ఇంజిన్ ఆయిల్, యాక్సెసరీలు, లేబర్ చార్జీలపై ప్రత్యేక డిస్కౌంట్లు పొందవచ్చని టాటా మోటార్స్ తెలిపింది.

నాస్డాక్‌లో ఎస్ఎస్ ఇన్నోవేషన్స్ లిస్టింగ్



న్యూఢిల్లీ: దేశీ మెడికల్ టెక్నాలజీ కంపెనీ ఎస్ఎస్ ఇన్నోవేషన్స్ ఇంటర్నేషనల్ తాజాగా అమెరికాలోని నాస్డాక్ ఎక్స్చేంజీలో లిస్టయ్యింది. ఈ సందర్భంగా ఓపెనింగ్ బెల్ మోగించే కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు సుధీర్ శ్రీవాస్తవ తదితరులు పాల్గొన్నారు. కంపెనీ రూపొందించిన ఎస్ఎస్ఐ మంత్ర సర్జికల్ రోబోటిక్ సిస్టం ప్రస్తుతం దేశీయంగా 75 ప్రాంతాల్లోని 80 ఆస్పత్రుల్లో అందుబాటులో ఉంది. వీటితో 100 పైగా సర్జికల్ ప్రొసీజర్లకు సంబంధించి 4,000 పైగా రోబోటిక్ శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించినట్లు సంస్థ తెలిపింది. అటు అంతర్జాతీయంగా నేపాల్, కొలంబియా, ఉక్రెయిన్, ఈక్వెడార్ తదితర దేశాల్లోనూ కంపెనీ కార్యకలాపాలు విస్తరించింది. 2024 డిసెంబర్‌తో ముగిసిన సంవత్సరంలో కంపెనీ ఆదాయం 3.5 రెట్లు వృద్ధి చెంది 5.9 మిలియన్ డాలర్ల నుంచి 20.6 మిలియన్ డాలర్లకు పెరిగింది. స్థూల మార్జిన్లు 12.3 శాతం నుంచి 40.9 శాతానికి ఎగిశాయి.

గ్లాండ్ ఫార్మా ఔషధానికి ఎఫ్‌డీఏ ఆమోదం

GLAND
Gland Pharma Limited

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: యాంజియోటెన్సిన్ టూ ఎసిటేట్ ఇంజెక్షన్ జనరిక్ ఔషధానికి అమెరికా ఔషధ రంగ నియంత్రణ సంస్థ యూఎస్ఎఫ్‌డీఏ ఆమోదం లభించినట్లు గ్లాండ్ ఫార్మా వెల్లడించింది. నిర్దిష్ట సందర్భాల్లో బ్లడ్ ప్రెజర్‌ను పెంచేందుకు ఇది ఉపయోగపడుతుంది. ఇది లా జోలా ఫార్మాకి చెందిన గియాప్రెజాకు జనరిక్ వెర్షన్. 2025 మార్చితో ముగిసిన 12 నెలల వ్యవధిలో అమెరికాలో ఈ ఔషధ విక్రయాలు 58 మిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

8-6-2025

విశాఖ	535-00
చిత్తూరు	613-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	520-00
విజయవాడ	540-00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	535-00
వరంగల్	537-00
రిటైల్ ధర	5.95

గ్లోబల్ విస్తరణలో దేశీ హోటల్స్



దక్షిణాఫ్రికా మార్కెట్లోకి ఐహెచ్‌సీఎల్
కొత్తగా 290 గదుల ప్రాపర్టీలపై ఒబెరాయ్ కసరత్తు
ఆఫ్రికా, నేపాల్‌పై సరోవర్ హోటల్స్ కన్ను

న్యూఢిల్లీ: దేశీ హోటల్ చెయిన్స్ అంతర్జాతీయంగా తమ కార్యకలాపాలను విస్తరించడంపై మరింతగా దృష్టి పెడుతున్నాయి. పెద్ద సంఖ్యలో భారతీయులు విదేశాలకు ప్రయాణిస్తున్న నేపథ్యంలో బ్రిటన్, పశ్చిమాసియా దేశాలతో పాటు అటు ఆఫ్రికా ఖండంపైనా ఫోకస్ చేస్తున్నాయి. టాటా గ్రూప్‌లో భాగమైన ఇండియన్ హోటల్స్ కంపెనీ లిమిటెడ్ (ఐహెచ్‌సీఎల్) తాజాగా దక్షిణాఫ్రికాలోని క్రూగర్ నేషనల్ పార్క్‌లో మూడు లగ్జరీ లాడ్జిలను ప్రారంభించనున్నట్లు ప్రకటించింది. సఫారీతో పాటు విశిష్టమైన అనుభూతి కల్పించే పలు ఆఫర్లను తాము అందిస్తున్నట్లు ఐహెచ్‌సీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ పునీత్ ఛత్వాల్ తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రెండంకెల స్థాయిలో ఆదాయ వృద్ధిని అంచనా వేస్తున్న ఐహెచ్‌సీఎల్ ఈ ఏడాదిలో 30 హోటల్స్ ప్రారంభించాలని నిర్దేశించుకుంది. ఇందులో భాగంగా నాలుగో త్రైమాసికంలో ఫ్రాంక్‌ఫర్ట్‌లో 126 గదుల తాజ్ ప్రాపర్టీని కూడా ఏర్పాటు చేయనుంది. అంతర్జాతీయంగా పది కొత్త ప్రాపర్టీలపై కసరత్తు చేస్తోంది. వచ్చే మూడు–నాలుగేళ్లలో బహ్రెయిన్‌లో రెండు, సౌదీ అరేబియాలో రెండు ప్రాపర్టీలను ప్రారంభించడంపై కంపెనీ దృష్టి పెట్టింది. ప్రస్తుతం న్యూయార్క్, బ్రిటన్, మాల్దీవులతో పాటు కంపెనీకి 28 ప్రాపర్టీలు ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరం కంపెనీ కన్సాలిడేటెడ్ ఆదాయంలో వీటి వాటా దాదాపు 20 శాతంగా నిలిచింది. ఆక్యుపెన్సీ క్రమంగా పెరుగుతుండటంతో 2025 ప్రారంభం నుంచి శాన్ ఫ్రాన్సిస్కోలోని హోటల్ కూడా మెరుగైన పనితీరు కనపరుస్తోందని ఛత్వాల్ తెలిపారు. అటు న్యూయార్క్ ప్రాపర్టీ కూడా పుంజుకుంటోందని వివరించారు. ఏడాది మొత్తం మీద ఇదే సానుకూల ధోరణి కొనసాగవచ్చని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ఆదాయాల్లో దేశీ వ్యాపారంతో పాటు అంతర్జాతీయ విభాగం వాటా కూడా మరింతగా పెరుగుతుందని చెప్పారు.

ఒబెరాయ్ హోటల్స్ .. సరోవర్ సైతం..

ఇక లగ్జరీ దిగ్గజం ఒబెరాయ్ హోటల్స్ కూడా అంతర్జాతీయంగా కార్యకలాపాలను గణనీయంగా విస్తరిస్తోంది. 2028లో సెంట్రల్ లండన్‌లోని మేఫెయిర్ ప్రాపర్టీ ప్రారంభంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇందులో 21 గదులు ఉంటాయి. ప్రస్తుతం అంతర్జాతీయంగా 497 గదులు ఒబెరాయ్ బ్రాండ్ కింద ఉన్నాయి. 2028 నాటికి మరో 290 గదులను జోడించుకోవాలని కంపెనీ భావిస్తోంది. రెండు ఫ్లోటింగ్ బోట్ హోటల్స్‌తో పాటు (చెరి ఏడు గదులు చొప్పున), 25 గదులతో నైల్ క్రూయిజర్ కూడా వీటిలో ఉంటాయి. లండన్‌లోని హోటల్‌ను ఒబెరాయ్ మాతృ సంస్థ ఈస్ట్ ఇండియా హోటల్స్ నిర్వహించనుండగా, మిగతా వాటిని మేనేజ్‌మెంట్ కాంట్రాక్టుల ద్వారా నిర్వహించనున్నారు. దేశీయంగా 1994లో ప్రారంభమైన సరోవర్ హోటల్స్ కూడా విదేశాల్లో విస్తరణపై దృష్టి సారిస్తోంది. ఆఫ్రికా ఖండంలో ఉగాండాలో సరోవర్ పోర్టికో కంపాలాను ఏర్పాటు చేస్తున్నట్లు సంస్థ చైర్మన్ అజయ్ బకాయా తెలిపారు. ఇందులో 85 గదులు ఉంటాయి. అలాగే సోమాలియాలో 121 గదులతో సరోవర్ ప్రీమియర్ హెర్గేసియాను ప్రారంభించనున్నట్లు వివరించారు. మేనేజ్‌మెంట్ కాంట్రాక్టుల ద్వారా కంపెనీ ఈ ప్రాజెక్టులను అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. నేపాల్‌లో 304 గదులతో రాయల్ తులిప్ ఖాట్మండు ప్రాపర్టీని కంపెనీ ఈ ఏడాది ప్రారంభించనుంది. అలాగే 22,000 చ.అ.విస్తీర్ణంలో కన్వెన్షన్ సెంటర్‌ని కూడా ఏర్పాటు చేస్తోంది. అటు చిత్వన్ నేషనల్ పార్క్‌లో రాయల్ తులిప్ చిత్వన్, లుంబినిలో గోల్డెన్ తులిప్ భైరాహవా కూడా జాబితాలో ఉన్నాయి.

ఆగ్నేయాసియాలో రాయల్ ఆర్కిడ్ ..

మరో దిగ్గజ సంస్థ బెంగళూరుకు చెందిన రాయల్ ఆర్కిడ్ హోటల్స్ అంతర్జాతీయంగా ఎదిగేందుకు మాల్దీవులతో పాటు కొన్ని ఆగ్నేయాసియా దేశాలను కూడా పరిశీలిస్తోంది. శ్రీలంక, నేపాల్‌లో కార్యకలాపాలను మరింతగా విస్తరిస్తోంది. ఇప్పటికే హోటల్స్ ఉన్న ప్రాంతాలతో పాటు సమీపంలోని ఇతర మార్కెట్లలోనూ ప్రవేశించే యోచన కూడా ఉన్నట్లు రాయల్ ఆర్కిడ్ హోటల్స్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ చందర్ కే బాల్జీ తెలిపారు. మాల్దీవులు, పశ్చిమాసియా, ఆగ్నేయాసియా దేశాలను కూడా పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. అంతర్జాతీయంగా రీజెంటా బ్రాండ్ హోటల్స్, రిసార్టులను విస్తరించాలని కంపెనీ భావిస్తోంది.

72 లక్షల 'హరిత' కొలువులు

2027-28 నాటికి అంచనా
- పునరుత్పాదక విద్యుత్, ఈవీల రంగాల్లో అవకాశాలు
- ఎస్ఎల్‌బీ సర్వీసెస్ నివేదిక



ముంబై: దేశీయంగా పర్యావరణహిత (గ్రీన్) సాంకేతిక సామర్థ్యాలను పెంచుకోవడంపై భారీగా పెట్టుబడులు పెడుతున్న నేపథ్యంలో 2027–28 ఆర్థిక సంవత్సరం నాటికి ఈ రంగంలో 72.9 లక్షల కొలువులు రానున్నాయి. రెన్యూవబుల్ ఎనర్జీ, వ్యర్థాల నిర్వహణ, ఎలక్ట్రిక్ వాహనాలు, పర్యావరణహిత నిర్మాణాలు మొదలైన విభాగాల్లో అత్యధికంగా ఉద్యోగాల కల్పన జరగనుంది. గ్లోబల్ టెక్నాలజీ, డిజిటల్ టాలెంట్ సొల్యూషన్స్ సేవల సంస్థ ఎస్ఎల్‌బీ సర్వీసెస్ ఒక నివేదికలో ఈ అంశాలు తెలిపింది. పరిశ్రమలో ధోరణులు, డిమాండ్, స్థూల వ్యవస్థ మొదలైన వాటిపై విశ్లేషణ ఆధారంగా దీన్ని రూపొందించింది. దీని ప్రకారం .. దేశీ కార్పొరేట్లు పర్యావరణానికి పెద్ద పీట వేస్తున్న నేపథ్యంలో 2047 నాటికి 3.5 కోట్ల కొత్త కొలువులు వచ్చే అవకాశం ఉందని వివరించింది. 'గత 4–5 ఏళ్లలో పునరుత్పాదక విద్యుత్, ఈవీ, పర్యావరణహిత మౌలిక సదుపాయాలరంగంలో కొత్త కొలువులు వస్తున్నాయి. నైపుణ్యాల అవసరాలు మారుతున్నాయి. పర్యావరణహితమైన విధంగా విధులను నిర్వర్తించడంతో పాటు డిజిటల్ సామర్థ్యాలు కూడా కావాల్సి ఉంటోంది. ఏఐ, ఐవోటీ, బ్లాక్‌చెయిన్, జీఐఎస్, డేటా ఆధారిత టూల్స్‌లాంటివి కొత్త కెరియర్లకు బాటలు వేస్తున్నాయి' అని ఎస్ఎల్‌బీ సర్వీసెస్ సీఈవో సచిన్ అలగ్ చెప్పారు. నియామకాల విషయంలో సంప్రదాయ విద్యార్హతల కన్నా నైపుణ్యాలకు కంపెనీలు ప్రాధాన్యత నిస్తున్నాయని వివరించారు.

మరిన్ని విశేషాలు..

- గ్రీన్ ఉద్యోగార్థులకు ముంబై, బెంగళూరు, ఢిల్లీ లాంటి మెట్రో నగరాలు ఆకర్షణీయంగా ఉంటున్నాయి. విశాఖపట్నం, ఇండోర్, అహ్మదాబాద్, జైపూర్ తదితర ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో అవకాశాలు ఉంటున్నాయి.
- లాజిస్టిక్స్, వేర్‌హౌసింగ్, పర్యావరణహిత వ్యవసాయం లాంటి రంగాలు ద్వితీయ, తృతీయ శ్రేణి ప్రాంతాల్లో సానుకూల హైరింగ్‌కి తోడ్పడనున్నాయి. గ్రీన్ విభాగంలో కొత్తగా వచ్చే 72.9 లక్షల కొలువుల్లో 35–40 శాతం ఉద్యోగాలు ఈ నగరాల్లోనే ఉండొచ్చని అంచనాలు నెలకొన్నాయి.
- ప్రస్తుతం దేశీయంగా గ్రీన్ జాబ్స్‌లో మహిళల వాటా 11–12 శాతంగానే ఉంది. సాంకేతిక విద్య అంతగా అందుబాటులో లేకపోవడం, సంస్కృతిపరమైన అడ్డంకులు, వర్క్‌ప్లేస్‌లో భద్రతాపరమైన సవాళ్లు ఇందుకు కారణం. సంస్థలు సమ్మిళిత నియామక విధానాలను అమలు చేస్తున్నాయి. ప్రధానంగా మహిళల కోసం నైపుణ్యాల్లో శిక్షణ కల్పనపై ఇన్వెస్ట్ చేస్తున్నాయి. దీనితో గ్రీన్ జాబ్స్‌లో మహిళల వాటా వచ్చే 5-6 ఏళ్లలో మరింత మెరుగుపడనుంది.

మెహుల్ చోక్సీ ఖాతాల అటాచ్

బ్యాంక్ ఖాతాలు, షేర్లు, ఫండ్స్‌పై సెబీ ఆదేశాలు



న్యూఢిల్లీ: క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా మెహుల్ చోక్సీ ఆస్తులను అటాచ్ చేసేందుకు ఆదేశించింది. వీటిలో చోక్సీ బ్యాంక్ ఖాతాలు, షేర్లు, మ్యూచువల్ ఫండ్ హోల్డింగ్స్ ఉన్నాయి. జ్యువెలరీ కంపెనీ గీతాంజలి జెమ్స్ ఇన్‌సైడర్ ట్రేడింగ్ నిబంధనల ఉల్లంఘన కేసులో సెబీ రూ. 2.1 కోట్లు రికవర్ చేసుకునేందుకు తాజా ఆదేశాలు జారీ చేసింది. గత నెల 15న చోక్సీకి డిమాండ్ నోటీసు జారీ చేసిన సెబీ 15 రోజుల గడువు ముగియడంతో రికవరీ చర్యలకు తెరతీసింది. ఇన్‌సైడర్ ట్రేడింగ్ కేసు నేపథ్యంలో 2022 జనవరిలోనూ సెబీ జరిమానా విధించింది. అయితే చెల్లింపులు చేపట్టకపోవడంతో డిమాండ్ నోటీసు జారీ చేసింది. గీతాంజలి జెమ్స్ చైర్మన్, ఎండీ చోక్సీ ప్రమోటర్ గ్రూప్‌లోని వ్యక్తికావడంతోపాటు.. నీరవ్ మోడీకి మేనమామకూడా. ప్రభుత్వ రంగ పీఎన్‌బీలో రూ. 14,000 కోట్లమేర మోసానికి తెరతీసినట్లు ఇరువురిపైనా కేసు నమోదైన సంగతి తెలిసిందే. అయితే పీఎన్‌బీని మోసగించిన అంశం వెలుగుచూసిన 2018 మొదట్లో వీరిరువురూ విదేశాలకు పారిపోగా.. చోక్సీని బెల్జియంలోనూ, మోడీని స్కాట్లాండ్‌లోనూ అక్కడి ప్రభుత్వాలు అరెస్ట్ చేయడం గమనార్హం!

ప్రపంచమంతా సింగిల్ మార్కెట్ కాదు

దేశాలు, కూటములు బట్టి వ్యూహాలు ఉండాలి
- ఇన్ఫోసిస్ చైర్మన్ నందన్ నీలేకని



న్యూఢిల్లీ: ప్రస్తుత పరిస్థితుల్లో ప్రపంచమంతటినీ గ్లోబల్ కంపెనీలు ఒకే మార్కెట్‌గా పరిగణించే పరిస్థితి లేదని ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ చైర్మన్ నందన్ నీలేకని వ్యాఖ్యానించారు. రకరకాల కూటములు, దేశాల్లోని పరిస్థితులకు అనుగుణంగా ముందుకెళ్లాల్సి ఉంటోందని ఆయన చెప్పారు. భౌగోళిక, రాజకీయ అనిశ్చితి వల్ల అనేక రకాల ధోరణులు ఒకేసారి కనిపిస్తుండటంతో కంపెనీలు తమ ప్రాథమిక సూత్రాలను పునఃసమీక్షించుకుంటూ, సరికొత్త వ్యూహాలను రచించుకోవాల్సి వస్తోందని 2025 ఆర్థిక సంవత్సర వార్షిక నివేదికలో నీలేకని తెలిపారు. కోవిడ్ మహమ్మారి వల్ల సరఫరా వ్యవస్థ పరమైన రిస్కులను తగ్గించుకుని, విశ్వసనీయమైన బ్యాకప్ ఆప్షన్లను అభివృద్ధి చేసుకోవాల్సి వచ్చిందన్నారు. సకాలంలో డెలివరీ చేయడంపై మాత్రమే దృష్టి పెడితే సరిపోవడం లేదని ఊహించని విధంగా తలెత్తే అంతరాయాలను కూడా పరిగణనలోకి తీసుకుని, తగు వ్యూహాలను సిద్ధంగా ఉంచుకోవాల్సి వస్తోందని పేర్కొన్నారు. సోర్సింగ్‌పరంగా వైవిధ్యాన్ని పాటించాల్సిన అవసరాన్ని టారిఫ్‌ల వివాదం సూచిస్తోందన్నారు. ఇక కృత్రిమ మేథ వల్ల ఒనగూరే ప్రయోజనాలు, ఎదురయ్యే రిస్కులు కూడా అనిశ్చితికి దారితీస్తున్నాయని నీలేకని వివరించారు.

గ్రావ్టన్ మోటార్స్‌తో హైపర్ ఎలక్ట్రిక్ జట్టు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఈవీ టెక్నాలజీ కంపెనీ గ్రావ్టన్ మోటార్స్‌తో వ్యూహాత్మక ఒప్పందం కుదుర్చుకున్నట్లు హైపర్ ఎలక్ట్రిక్ వెల్లడించింది. 10,000 మేడిన్ ఇండియా ఎలక్ట్రిక్ విద్యుత్ వాహనాల కొనుగోలుకు ఇది తోడ్పడుతుందని తెలిపింది.

ఇన్‌గ్రిడ్ చేతికి రెండు సోలార్ ప్రాజెక్టులు

న్యూఢిల్లీ: ఇండిగ్రిడ్ సంస్థ రెండు సోలార్ ప్రాజెక్టులను కొనుగోలు చేస్తున్నట్లు ప్రకటించింది. దీని ప్రకారం, రెన్యూ సోలార్ ఆయాన్ (300 మెగావాట్ల సోలార్ ప్రాజెక్ట్), కొప్పల్ నరేంద్ర ట్రాన్స్‌మిషన్‌ను (కేఎన్‌టీఎల్) కంపెనీ దక్కించుకుంటోంది. ఈ రెండు వేర్వేరు లావాదేవీలపై రూ. 2,108 కోట్లు వెచ్చిస్తోంది. రెన్యూ సోలార్ ఆయాన్ ప్రాజెక్టు రాజస్థాన్‌లోని బార్మేర్‌లో 2024 మార్చిలో కార్యకలాపాలు ప్రారంభించింది. ఇక 2023 అక్టోబర్‌లో ప్రారంభమైన కేఎన్‌టీఎల్‌కి 276 సర్క్యూట్ కిలోమీటర్ల ట్రాన్స్‌మిషన్ లైన్లు ఉన్నాయి.

రిలయన్స్ ఇన్‌ఫ్రాకు ఉపశమనం


దివాలా చర్యలు నిలిపివేసిన ఎన్‌సీఎల్ఏటీ



న్యూఢిల్లీ: ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై దివాలా చర్యలను నిలిపివేస్తూ తాజాగా అప్పిల్లేట్ ట్రిబ్యునల్ ఎన్‌సీఎల్ఏటీ ఆదేశాలు జారీ చేసింది. తమ అప్పీల్ మేరకు ఎన్‌సీఎల్‌టీ ఆదేశాలను ఎన్‌సీఎల్ఏటీ రద్దు చేసినట్లు రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ స్టాక్ ఎక్స్చేంజీలకు తెలియజేసింది. కార్పొరేట్ దివాలా పరిష్కార ప్రక్రియకు ఆదేశిస్తూ ఇంతక్రితం ఎన్‌సీఎల్‌టీ ముంబై బెంచ్ సీపీ(ఐబీ)/624(ఎంబీ)2022 కేసులో 2025 మే 30న జారీ చేసిన ఆదేశాలను ఎన్‌సీఎల్ఏటీ రద్దు చేసినట్లు పేర్కొంది. తమకు సౌర విద్యుత్ సరఫరా చేసిన ధుర్సర్ సోలార్ పవర్‌కి చెల్లింపులు జరపలేదంటూ రిలయన్స్ ఇన్‌ఫ్రాపై ఆరోపణలు ఉన్నాయి. ధుర్సర్‌కి సెక్యూరిటీ ట్రస్టీగా వ్యవహరించిన ఐడీబీఐ ట్రస్టీషిప్ సర్వీసెస్ సంస్థ 2022 ఏప్రిల్‌లో రిలయన్స్ ఇన్‌ఫ్రాపై కార్పొరేట్ దివాలా పరిష్కార చర్యలు తీసుకోవాలంటూ ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించింది. రిలయన్స్ ఇన్‌ఫ్రా 2018 ఆగస్టు 28 నుంచి అసలు రూ. 88.68 కోట్లతో పాటు వడ్డీ కూడా బాకీ పడిందని వివరించింది. దీనితో రిలయన్స్ ఇన్‌ఫ్రాపై ఎన్‌సీఎల్‌టీ దివాలా చర్యలకు ఆదేశించింది. అయితే, ధుర్సర్ సోలార్ పవర్‌కు పూర్తిస్థాయిలో రూ. 92.68 కోట్లు చెల్లించేసినందున దివాలా చట్ట చర్యలను వ్యతిరేకిస్తున్నట్లు రిలయన్స్ ఇన్‌ఫ్రా పేర్కొంది. ఇంధన కొనుగోలు ఒప్పందంలో భాగంగా టారిఫ్‌లకింద సొమ్ము చెల్లించినట్లు తెలియజేసింది.

ఈవీ ఇన్‌ఫ్రాకు భారీ పెట్టుబడులు

- 2030 నాటికి 9 బిలియన్ డాలర్లు కావాలి
- 6,900 ఎకరాల స్థలం అవసరం
- సెవిల్స్ ఇండియా నివేదిక



న్యూఢిల్లీ: దేశీయంగా ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) మౌలిక సదుపాయాల కోసం భారీ స్థాయిలో స్థలం, పెట్టుబడుల అవసరం ఏర్పడనుంది. 2030 నాటికి ఈవీల తయారీ, లిథియం అయాన్ బ్యాటరీల ఉత్పత్తి, పబ్లిక్ చార్జింగ్ స్టేషన్ల కోసం సుమారు 6,900 ఎకరాల స్థలం, 9 బిలియన్ డాలర్ల వరకు పెట్టుబడులు కావాల్సి ఉంటాయని రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ సెవిల్స్ ఇండియా ఒక నివేదికలో వెల్లడించింది. ఇటీవలి కాలంలో భారత ఈవీ మార్కెట్ గణనీయంగా వృద్ధి చెందినట్లు పేర్కొంది. మార్కెట్ శక్తులు, ప్రభుత్వ విధానాలు, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెరుగుతుండటం, ఇంధనాల ధరలు పెరుగుతుండటం తదితర అంశాలు ఇందుకు కారణమని వివరించింది. ఈవీల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు, విద్యుత్ వాహనాల వ్యవస్థను పటిష్టం చేసేందుకు ప్రభుత్వం పలు చర్యలు తీసుకున్నట్లు నివేదిక తెలిపింది. 'స్థల సమీకరణ తదితర అవసరాల కోసం 2030 నాటికి 7.5 బిలియన్ డాలర్ల నుంచి 9 బిలియన్ డాలర్ల వరకు పెట్టుబడులు కావాల్సి ఉంటుంది. అలాగే 5,760 నుంచి 6,852 ఎకరాల వరకు స్థలం అవసరమవుతుంది' అని సెవిల్స్ ఇండియా నివేదికలో తెలిపింది.

రియల్ ఎస్టేట్‌కి దన్ను..

ఈవీల వినియోగం పెరిగే కొద్దీ, దానికి అనుగుణంగా రియల్ ఎస్టేట్ రంగం కూడా గణనీయంగా వృద్ధి చెందే అవకాశం ఉందని సెవిల్స్ ఇండియా ఎండీ (ఇండస్ట్రియల్, లాజిస్టిక్స్) ఎస్ శ్రీనివాసన్ చెప్పారు. ఈవీలు .. బ్యాటరీల తయారీ, ఈవీ అసెంబ్లీ యూనిట్లు, ఈవీల విడిభాగాలు.. బ్యాటరీలను నిల్వ చేసేందుకు, పంపిణీ చేసేందుకు పారిశ్రామిక, వేర్‌హౌసింగ్ స్థలాలకు డిమాండ్ నెలకొంటుందని పేర్కొన్నారు. సరఫరా వ్యవస్థలు విస్తరించే కొద్దీ వ్యూహాత్మక ప్రదేశాల్లో గిడ్డంగులు, లాజిస్టిక్స్ పార్కులకు కూడా డిమాండ్ ఏర్పడుతుందన్నారు. 'వాతావరణ మార్పులు, ఇంధన భద్రతపై నెలకొన్న ఆందోళనలను పరిష్కరించడంపై దృష్టి పెట్టడంతో పాటు కొత్త ఆవిష్కరణలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల కల్పనను ప్రోత్సహించడం ద్వారా పటిష్టమైన ఈవీ వ్యవస్థను ఏర్పర్చేందుకు ప్రభుత్వం విధానాలపరంగా చర్యలు తీసుకుంటోంది' అని శ్రీనివాసన్ వివరించారు. నీతి ఆయోగ్, రాకీ మౌంటెయిన్ ఇనిస్టిట్యూట్ (ఆర్ఎంఐ) నివేదికలకు తగ్గట్లు, ఏటా సగటున 42 నుంచి 53 లక్షల యూనిట్లు చొప్పున 2030 నాటికి దేశీయంగా ఈవీల అమ్మకాలు 2.53–3.18 కోట్ల యూనిట్లకు చేరవచ్చని రహదారి రవాణా, హైవేస్ శాఖ (ఎంవోఆర్‌టీహెచ్) అంచనా వేస్తోంది. దీని ప్రకారం తయారీ ప్లాంట్ల ఏర్పాటు కోసం 2,009 నుంచి 2,467 ఎకరాల వరకు స్థలం అవసరమవుతుందని సెవిల్స్ పేర్కొంది.

ఏక్వస్ ఐపీవో బాట

గోప్యతా మార్గంలో సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు

AEQUS
ecosystems of efficiency

న్యూఢిల్లీ: కన్జూమర్ డ్యురబుల్ గూడ్స్, వైమానిక విడిభాగాల కాంట్రాక్ట్ తయారీ కంపెనీ ఏక్వస్ పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి గోప్యతా మార్గంలో ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. ఇష్యూ ద్వారా 20 కోట్ల డాలర్లు(రూ. 1,700 కోట్లు) సమీకరించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. తాజా ఈక్విటీ జారీ, ప్రస్తుత ఇన్వెస్టర్ల వాటా విక్రయం ద్వారా కంపెనీ స్టాక్ ఎక్స్చేంజీలో లిస్టకానున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. కంపెనీలో ఇప్పటికే అమికస్, అమన్సా, స్టెడ్‌వ్యూ క్యాపిటల్‌సహా కాటమారన్, స్పర్త గ్రూప్ తదితరాలు ఇన్వెస్ట్ చేశాయి. కంపెనీ ఏరోస్పేస్, కన్జూమర్ రంగాలకు ప్రెసిషన్ మ్యాన్యుఫాక్చరింగ్ ఎకోసిస్టమ్‌ను సమకూర్చుతోంది.

టూ-వీలర్ల విక్రయాలు జూమ్

- ఈసారి కోవిడ్ పూర్వ స్థాయికి మించి అమ్మకాలు
- 8–9 శాతం వృద్ధి అంచనా
- కేర్‌ఎడ్జ్ రేటింగ్స్ నివేదిక



ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశీయంగా ద్విచక్ర వాహన విక్రయాలు గణనీయంగా పెరగనున్నాయి. కోవిడ్ పూర్వ స్థాయికి మించి 8–9 శాతం మేర వృద్ధి చెందనున్నాయి. నెమ్మదిస్తున్న ద్రవ్యోల్బణం, సానుకూల వర్షపాతం తదితర అంశాలు ఇందుకు దోహదపడనున్నాయి. కేర్‌ఎడ్జ్ రేటింగ్స్ ఒక నివేదికలో ఈ అంశాలు వెల్లడించింది. దేశీయ టూ-వీలర్ పరిశ్రమ 2023, 2024, 2025 ఆర్థిక సంవత్సరాల్లో వరుసగా 8 శాతం, 10 శాతం, 11 శాతం వృద్ధి చెందినట్లు వివరించింది. ఎగుమతులు 21 శాతం మేర పుంజుకోవడంతో పాటు దేశీయంగా అమ్మకాలు 9 శాతం వృద్ధి చెందడంతో 2025 ఆర్థిక సంవత్సరంలో విక్రయాల పరిమాణం గణనీయంగా పెరిగిందని కేర్‌ఎడ్జ్ రేటింగ్స్ తెలిపింది. ద్రవ్యోల్బణ భారం, అధిక వడ్డీ రేట్లు, కరెన్సీ కష్టాలు మొదలైన సమస్యలతో సతమతమైన కీలక మార్కెట్లలో పరిస్థితులు కాస్త మెరుగుపడటంతో ఎగుమతులు కోలుకున్నాయని వివరించింది. ఇక దేశీయంగా గ్రామీణ ప్రాంతాల్లో డిమాండ్ పుంజుకోవడం, పట్టణ ప్రాంతాల్లో డిమాండ్ స్థిరంగా కొనసాగడం సానుకూలాంశాలుగా నిల్చాయని పేర్కొంది. 'గత ఆర్థిక సంవత్సర పనితీరును కొనసాగిస్తూ ఈ ఆర్థిక సంవత్సరంలో కూడా ద్విచక్ర వాహనాల విక్రయాలు పటిష్టంగా వృద్ధి చెందనున్నాయి. అధిక బేస్‌తో పాటు నిర్దిష్ట నిబంధనలను పాటించే క్రమంలో 1–2 శాతం మేర ధరలు పెరిగినప్పటికీ 2026 ఆర్థిక సంవత్సరంలో కూడా పరిశ్రమ 8–9 శాతం వృద్ధిని సాధించే అవకాశం ఉంది' అని కేర్‌ఎడ్జ్ రేటింగ్స్ తెలిపింది. ఎగుమతుల పరిమాణం 12–14 శాతం, దేశీయంగా అమ్మకాలు స్థిరంగా 6–8 శాతం వృద్ధి చెందడం ఇందుకు దోహదపడగలదని సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ మధుసూదన్ గోస్వామి తెలిపారు.

ఇతరత్రా ముఖ్యాంశాలు..

- ఎగుమతులకు పటిష్టమైన డిమాండ్ నెలకొనడం, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరుగుతుండటం, ద్రవ్యోల్బణం తగ్గుముఖం పడుతుండటం, రుతుపవనాలు..ఆదాయాలపై గ్రామీణ ప్రాంతాల్లో సెంటిమెంటు మెరుగుపడుతుండటం మొదలైనవి ద్విచక్ర వాహనాల విక్రయాలకు సానుకూలాంశాలుగా నిలవనున్నాయి.
- ఈ మధ్యకాలంలో రిజర్వ్ బ్యాంక్ 100 బేసిస్ పాయింట్ల మేర కీలక వడ్డీ రేటును తగ్గించడం వల్ల అఫోర్డబిలిటీ పెరుగుతుంది. డిమాండ్‌కి ఊతం లభిస్తుంది.
- అధిక బేస్ వల్ల దేశీయంగా టూ-వీలర్ల అమ్మకాల వృద్ధి ఒక మోస్తరు స్థాయికి పరిమితం కావచ్చు. కానీ ఎగుమతులు పటిష్టంగా ఉండటం, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరుగుతుండటమనేది మొత్తం పరిశ్రమ స్థాయిలో అమ్మకాల పరిమాణం నిలకడగా పెరిగేందుకు దోహదపడుతుంది.
- ఎగ్జిక్యూటివ్, ప్రీమియం మోటార్‌సైకిళ్ల సెగ్మెంటు .. ద్విచక్ర వాహనాల విక్రయ వృద్ధికి దోహదపడతాయి. గత మూడు ఆర్థిక సంవత్సరాలుగా ఎలక్ట్రిక్ టూ-వీలర్లకు డిమాండ్ పెరుగుతుండటం వల్ల ద్విచక్ర వాహనాల విక్రయాల పరిమాణం మొత్తం మీద పెరిగింది.
- 2023 ఆర్థిక సంవత్సరంలో ఈ-టూవీలర్ల అమ్మకాలు 7.8 లక్షల యూనిట్లుగా నమోదయ్యాయి. 2022 ఆర్థిక సంవత్సరంలో మొత్తం టూ-వీలర్ల విక్రయాల్లో 1.78 శాతం వాటా ఉన్న ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల వాటా 4.38 శాతానికి పెరిగింది. తక్కువ బేస్ ఎఫెక్ట్ వల్ల వార్షికంగా 180 శాతం వృద్ధి చెందింది. ఆ తర్వాత సంవత్సరాల్లోనూ మెరుగైన వృద్ధి నమోదైంది. 2024 ఆర్థిక సంవత్సరంలో 29 శాతం పెరగ్గా, 2025లో 19 శాతం వృద్ధితో 12 లక్షల యూనిట్లకు అమ్మకాలు చేరాయి.

కార్ల ఉత్పత్తిపై 'మ్యాగ్నెట్ల' కొరత ప్రభావమేమీ లేదు

మారుతీ సుజుకీ ఇండియా చైర్మన్ ఆర్‌సీ భార్గవ



న్యూఢిల్లీ: ప్రస్తుతనికి తమ వాహనాల ఉత్పత్తిపై రేర్ ఎర్త్ మ్యాగ్నెట్స్ కొరత ప్రభావమేమీ లేదని మారుతీ సుజుకీ ఇండియా చైర్మన్ ఆర్‌సీ భార్గవ తెలిపారు. ఉత్పత్తి కార్యకలాపాలన్నీ ప్రణాళికలకు అనుగుణంగా యథాప్రకారమే కొనసాగుతున్నాయని ఆయన చెప్పారు. రేర్ ఎర్త్ మ్యాగ్నెట్లను దిగుమతి చేసుకునేందుకు చైనా ప్రభుత్వం లైసెన్సులు ఇస్తే రాబోయే నెలల్లో కూడా తయారీకి ఎలాంటి సమస్య ఉండబోదని వివరించారు. పరిశ్రమ వర్గాల ప్రకారం పలు దేశీ సరఫరా సంస్థలు రేర్ ఎర్త్ మ్యాగ్నెట్ల దిగుమతికి చైనా ప్రభుత్వ అనుమతి కోసం ప్రయత్నిస్తున్నాయి. అయితే, ఇప్పటివరకు రాకపోవడంతో ఈ విషయంలో సాయం అందించాలంటూ ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. వాహనాలు, గృహోపకరణాలు మొదలైన వాటిల్లో ఉపయోగించే రేర్ ఎర్త్ మ్యాగ్నెట్స్ ప్రాసెసింగ్‌లో అంతర్జాతీయంగా చైనాకు 90 శాతం వాటా ఉంది. వీటిని ఎగుమతి చేయడంపై ఏప్రిల్ 4 నుంచి చైనా ప్రభుత్వం ఆంక్షలు విధించింది. ఏడు రేర్ ఎర్త్ ఎలిమెంట్స్‌తో పాటు వాటికి సంబంధించిన మ్యాగ్నెట్ల ఎగుమతి కోసం ప్రత్యేక లైసెన్సు తీసుకోవాలని నిర్దేశించింది.

జపాన్‌ను అధిగమిస్తున్నందుకు సంతృప్తి చెందొద్దు

తలసరి ఆదాయం భారత్‌లో ఎంతో తక్కువ

- దబ్ల్యూఈఎఫ్ మాజీ ఎండీ క్లైడే స్మడ్జా



న్యూఢిల్లీ: భారత్ జపాన్‌ను అధిగమించి ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తున్నందుకు సంతృప్తి చెందొద్దని.. తలసరి ఆదాయం పరంగా జపాన్‌తో పోల్చి చూస్తే భారత్ ఎంతో అభివృద్ధి చెందాల్సి ఉన్నట్లు ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) మాజీ ఎండీ క్లాడే స్మడ్జా వ్యాఖ్యానించారు. ఐఎంఎఫ్ 2025 ఏప్రిల్ డేటా ప్రకారం భారత్‌లో తలసరి ఆదాయం 2,878 డాలర్లు. జపాన్ తలసరి ఆదాయం 33,956 డాలర్లలో పోల్చి చూస్తే కేవలం 8.5 శాతమే కావడం గమనార్హం. భారత్ తలసరి ఆదాయం కంటే జపాన్‌లో తలసరి ఆదాయం 11.8 రెట్లు అధికంగా ఉన్నట్టు తెలుస్తోంది. ''భారత్ అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో నాలుగో స్థానానికి చేరుకోవడం సాధించిన ప్రగతికి సంబంధించి మంచి సంకేతమే. కానీ, ఈ విషయంలో సంతృప్తి చెందడానికి ఎలాంటి కారణం కనిపించడం లేదు''అని పేర్కొన్నారు. ఆర్థికంగా భారత్ కొత్త స్థానానికి చేరుకోవడం అన్నది.. సంస్కరణలను వేగవంతం చేయడానికి.. అభివృద్ధి ఫలాలు కేవలం పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోని మధ్యతరగతి వర్గాలకే పరిమితం కాకుండా పౌరులు అందరికీ మెరుగైన జీవన ప్రమాణాలు అందించేందుకు ప్రేరణ కావాలన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. అంతర్జాతీయంగా సాంకేతిక పోటీలో భారత్ కీలకమైన కూడలిలో ఉన్నట్టు తెలియజేస్తూ.. బిగ్ డేటా పరంగా ఆధిక్యత ప్రదర్శిస్తున్నట్టు స్మడ్జా తెలిపారు. ఈ స్థానాన్ని తప్పకుండా కాపాడుకోవడంతోపాటు.. అంతర్జాతీయంగా టెక్నాలజీ, ఆవిష్కరణల్లో అగ్రస్థానానికి చేరుకోవడానికి దీన్ని ఉపయోగించుకోవాలని సూచించారు.

సుజ్లాన్‌లో దిగ్గజాల పెట్టుబడులు

తాజాగా 1.45 శాతం వాటా కొనుగోలు

- జాబితాలో గోల్డ్‌మన్ శాక్స్, మోర్గాన్ స్టాన్లీ



న్యూఢిల్లీ: పునరుత్పాదక ఇంధన దిగ్గజం సుజ్లాన్ ఎనర్జీ కంపెనీలో పెట్టుబడులపై గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ దిగ్గజాలు కన్నేశాయి. ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా తాజాగా గోల్డ్‌మన్ శాక్స్, మోర్గాన్ స్టాన్లీ, సొసైటీ జనరాలితోపాటు మోతీలాల్ ఓస్వాల్ మ్యూచువల్ ఫండ్(ఎంఎఫ్) ఉమ్మడిగా 1.45 శాతం వాటా కొనుగోలు చేశాయి. స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం ఎన్ఎస్ఈ గణాంకాల ప్రకారం 1.45 శాతం వాటాకు సమానమైన 19.81 కోట్ల షేర్లను సొంతం చేసుకున్నాయి. ఇందుకు షేరుకి రూ. 66.05 సగటు ధరలో రూ. 1,309 కోట్లు వెచ్చించాయి. అయితే దేశీ ఎంఎఫ్‌లు.. ఆదిత్య బిర్లా సన్‌లైఫ్, ఎడిల్‌వీజ్, బంధన్, సుందరం, ఇన్వెస్కోసహా ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్, బజాజ్ అలయెంజ్ లైఫ్ ఇన్సూరెన్స్ తదితరాలు ఈ షేర్లను కొనుగోలు చేశాయి. సుజ్లాన్ ఎనర్జీ ప్రమోటర్ సంస్థలు తంతి హోల్డింగ్స్, వినోద్ ఆర్ తంతి(చైర్‌పర్సన్, ఎండీ), తంతి ఆర్ రామ్‌జీభాయ్, ఆర్‌యూ తంతి షేర్లను విక్రయించారు. కాగా.. తాజా లావాదేవీల తదుపరి సుజ్లాన్ ఎనర్జీలో ప్రమోటర్ల ఉమ్మడి వాటా 13.25 శాతం నుంచి 11.8 శాతానికి క్షీణించింది.

ఈ నేపథ్యంలో సుజ్లాన్ ఎనర్జీ షేరు ఎన్ఎస్ఈలో 0.8 శాతం పుంజుకుని రూ. 67 వద్ద ముగిసింది.

శంకర బిల్డింగ్‌లో వాటా విక్రయం

7.8 శాతం వాటా అమ్మిన ప్రమోటర్


న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ కంపెనీ శంకర బిల్డింగ్ ప్రొడక్ట్స్‌లో ప్రమోటర్, ఎండీ సుకుమార్ శ్రీనివాస్ తాజాగా 7.8 శాతం వాటా విక్రయించారు. ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా శ్రీనివాస్ షేరుకి రూ. 926.1 సగటు ధరలో 19 లక్షల షేర్లు అమ్మివేశారు. బీఎస్ఈ గణాంకాల ప్రకారం వీటి విలువ రూ. 176 కోట్లు. ఈ లావాదేవీ తదుపరి శంకర బిల్డింగ్ ప్రొడక్ట్స్‌లో ప్రమోటర్ల వాటా 49.25 శాతం నుంచి 41.41 శాతానికి దిగివచ్చింది. కాగా.. చార్టర్డ్ ఫైనాన్స్ అండ్ లీజింగ్, సింగులారిటీ ఈక్విటీ ఫండ్ 1, ఏస్ ఇన్‌ఫ్రాసిటీ డెవలపర్స్, సేజ్‌వన్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్, రితీ ఫౌండేషన్ ఈ షేర్లను సొంతం చేసుకున్నాయి.

చేతులు మారిన విప్రో ప్రమోటర్ వాటా

1.93 శాతం వాటా ప్రేమ్‌జీ ఇన్వెస్ట్ చేతికి

న్యూఢిల్లీ: ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా ఐటీ దిగ్గజం విప్రో ప్రమోటర్ల వాటాలో 1.93 శాతం చేతులు మారింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ సమాచారం ప్రకారం 1.93 శాతం వాటాకు సమానమైన 20.23 కోట్ల ఈక్విటీ షేర్లను అజీమ్ ప్రేమ్‌జీ ట్రస్ట్ విక్రయించింది. వీటిని షేరుకి రూ. 250 సగటు ధరలో ప్రేమ్‌జీ ఇన్వెస్ట్‌కు చెందిన ప్రజీమ్ ట్రేడింగ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ, హర్షమ్ ట్రేడర్స్ అండ్ ప్రజీమ్ ట్రేడర్స్ కొనుగోలు చేశాయి. డీల్ విలువ రూ. 5,057 కోట్లుకాగా.. ప్రజీమ్, జాష్, హర్షమ్ ట్రేడర్స్ విప్రో ప్రమోటర్ గ్రూప్ సంస్థలే కావడం గమనార్హం! కాగా.. గతేడాది నవంబర్‌లో ప్రజీమ్ ట్రేడింగ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ ద్వారా ప్రేమ్‌జీ ఇన్వెస్ట్ 1.6 శాతం వాటాకు సమానమైన 8.49 కోట్ల విప్రో షేర్లను కొనుగోలు చేసింది. ఇందుకు రూ. 4,757 కోట్లు వెచ్చించింది. అయితే ప్రజీమ్, జాష్ ట్రేడర్స్ వీటిని విక్రయించిన విషయం విదితమే.

క్వాంటమ్ ఎనర్జీ విస్తరణ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ వాహనాల అంకుర సంస్థ క్వాంటమ్ ఎనర్జీ తమ తయారీ కార్యకలాపాలను విస్తరిస్తోంది. ఇందులో భాగంగా తెలంగాణలోని మహేశ్వరంలో ఏటా 2 లక్షల యూనిట్ల ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంటు ఏర్పాటు చేస్తోంది. ప్రాంతీయంగా ఉపాధి కల్పనకు కూడా ఇది దోహదపడుతుందని సంస్థ ఎండీ చక్రవర్తి చుక్కపల్లి తెలిపారు. ప్రస్తుతం ఏటా 1 లక్ష వాహనాల ఉత్పత్తి సామర్థ్యం ఉన్నట్లు చెప్పారు. ప్లాస్మా, మిలన్, బిజినెస్ పేరిట క్వాంటమ్ వాహనాలు విక్రయిస్తోంది.

ఆడి కొత్త సిగ్నేచర్ ఎడిషన్ ఏ4 విడుదల



ముంబై, జూన్ 9: జర్మనీ లగ్జరీ కార్ల తయారీ కంపెనీ ఆడి పాపులర్ సెడాన్ కారు ఏ4 సిగ్నేచర్ ప్రత్యేక ఎడిషన్‌ని భారత మార్కెట్‌లోకి విడుదల చేసింది. ఈ ప్రత్యేక ఎడిషన్ కారు ధర రూ. 57,11,000 (ఎక్స్ షోరూమ్)గా ప్రకటించింది. నాలుగు రంగుల్లో కస్టమర్లకు అందుబాటులో ఉండే ఈ సిగ్నేచర్ ఎడిషన్‌లో ప్రీమియం స్టైలింగ్, ఎలిగెంట్ డిజైన్ ప్రధాన ఆకర్షణలు. ఈ సందర్భంగా ఆడి ఇండియా హెడ్ బల్బీర్ సింగ్ ధిల్లోన్ మాట్లాడుతూ –'ఆడి ఏ4 సేల్స్‌లో మంచి గుర్తింపు పొందిన ఈ సెడాన్ కారు తాజా సిగ్నేచర్ ఎడిషన్ ద్వారా కస్టమర్లకు మరింత ప్రీమియం అనుభూతిని కలిగిస్తాం' అని చెప్పారు.

సంక్లిష్ట చక్రంలో సూక్ష్మ రుణ రంగం

అధిక వడ్డీ రేట్లు, కఠిన వసూళ్ల ప్రక్రియలు • ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ రాజేశ్వరరావు



ముంబై: అధిక రుణ భారం, గరిష్ఠ వడ్డీ రేట్లు, కఠిన వసూళ్ల ప్రక్రియలతో కూడిన సంక్లిష్ట సైకిల్‌తో సూక్ష్మ రుణ రంగం సతమతమవుతోందని ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ ఎం రాజేశ్వర్‌రావు అన్నారు. 'అందరికీ ఆర్థిక సేవలు' అన్న అంశంపై హెచ్ఎస్‌బీసీ నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడారు. సూక్ష్మ రుణాలపై అధిక వడ్డీ రేట్లను ప్రధానంగా ప్రస్తావించారు. జనాభాలో మినహాయింపు వర్గాలకు సంఘటిత ఆర్థిక సేవలను అందించడంలో సూక్ష్మ రుణ రంగం విశ్వసనీయ వేదికగా ఉన్నట్టు పేర్కొన్నారు. అందరికీ ఆర్థిక సేవలను చేరువ చేసే విషయంలో సూక్ష్మ రుణ సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయంటూ.. ఈ విషయంలో కొన్ని సమస్యలపై దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. ఇటవలి త్రైమాసికాల్లో సూక్ష్మ రుణాలపై వడ్డీ రేట్లు కొంత మోస్తరు స్థాయికి రావడాన్ని గమనించినట్టు చెప్పారు. అయినప్పటికీ వడ్డీ రేట్లు, మార్జిన్లు గరిష్ఠ స్థాయిలోనే కొనసాగుతున్నట్టు తెలిపారు. కొన్ని సంస్థలకు తక్కువ వ్యయాలకే నిధులు లభిస్తున్నప్పటికీ మిగిలిన పరిశ్రమతో పోల్చితే అధిక వడ్డీ రేట్లను వసూలు చేస్తున్నట్టు పేర్కొన్నారు. అధిక రాబడులను ఇచ్చే సంప్రదాయ వ్యాపారానికి వెలుపలి అవకాశాలపై రుణదాతలు దృష్టి సారించాలని సూచించారు.

ప్రక్రియలను మెరుగుపరుచుకోవాలి..

''సూక్ష్మ రుణ రంగంలో తరచుగా సమస్యలు ఏర్పడడం ఇటీవలి కాలంలో పెరిగింది. ఒక్కో రుణ గ్రహీత బకాయిల భారం పెరిగింది. దీంతో కొన్ని సందర్భాల్లో కఠిన వసూళ్ల ప్రక్రియలు విషాద పరిణామాలకు దారితీస్తున్నాయి''అని రాజేశ్వరరావు చెప్పారు. ఇలాంటి వాటిని పరిష్కరించుకోవడం భాగస్వాములు అందరి ఉమ్మడి ప్రయోజనాల దృష్ట్యా అవసరమని పేర్కొన్నారు. రుణ గ్రహీతలు అధికంగా రుణం తీసుకోవడాన్ని నిరోధించేందుకు వీలుగా నియంత్రిత సంస్థలు తమ క్రెడిట్ ఆమోద ప్రక్రియలను మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు. అలాగే, కఠిన రుణ వసూళ్ల ప్రక్రియలను విడిచి పెట్టాలన్నారు. స్థిరమైన, బాధ్యతాయుత విధానంలో సేవలు అందించాలని సూచించారు. ఆర్థిక ఉత్పత్తులను తప్పుదోవ పట్టించి విక్రయించడాన్ని కూడా రాజేశ్వరరావు ప్రస్తావించారు. ఈ విషయంలో నిబంధనలు తీసుకురావాలా? లేదా అన్నదాన్ని ఆర్‌బీఐ పరిశీలిస్తున్నట్టు చెప్పారు.

ఆతిథ్య రంగంలో 6-8 శాతం వృద్ధి

ఈ రంగానికి స్థిరమైన అవుట్‌లుక్

- మధ్యకాలానికి సానుకూల డిమాండ్
- గదుల టారిఫ్‌లు పెరుగుతాయి
- రేటింగ్ సంస్థ ఇక్రా నివేదిక



న్యూఢిల్లీ: దేశ ఆతిథ్య రంగం (హాస్పిటాలిటీ) ఈ ఆర్థిక సంవత్సరంలో 6–8 శాతం మధ్య వృద్ధి చెందొచ్చని రేటింగ్ సంస్థ ఇక్రా అంచనా వేసింది. ఈ రంగానికి అవుట్‌లుక్‌ను సానుకూలం నుంచి స్థిరత్వానికి తగ్గించింది. జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో వచ్చే కొన్ని నెలల పాటు భారత్‌కు విదేశీ పర్యాటకుల రాక స్తబ్దుగా ఉంటుందని, ఆ తర్వాత నుంచి క్రమంగా పుంజుకోవచ్చని తెలిపింది. ఆతిథ్య రంగానికి దేశీ పర్యాటకం ఇప్పటి వరకు కీలక చోదకంగా ఉండగా, సమీప కాలంలోనూ ఇదే ధోరణి కొనసాగుతుందని అంచనా వేసింది. మౌలిక సదుపాయాలు, విమాన సేవల అనుసంధానత మెరుగుపడడం, జనాభా పరంగా సానుకూలత, ఎంఐసీఈ కార్యక్రమాలు పెరగడం, గత కొన్నేళ్లలో కొత్త కన్వెన్షన్ సెంటర్లు అందుబాటులోకి రావడం మధ్యకాలంలో ఆతిథ్య రంగంలో వృద్ధికి సానుకూలిస్తాయని ఇక్రా తెలిపింది. 2025-26లో ఆతిథ్య రంగం ఆదాయాలు, రుణ పరిస్థితులు స్థిరంగా ఉంటాయని పేర్కొంది. సానుకూల అవుట్‌లుక్ అన్నది సమీప కాలం నుంచి మధ్య కాలంలో అప్‌గ్రేడ్‌ను సూచిస్తే.. స్థిరమైన అవుట్‌లుక్ అన్నది సమీప కాలం నుంచి మధ్యకాలంలో మార్పులేమిని సూచిస్తుంది.

72–74 శాతం ఆక్యుపెన్సీ

దేశవ్యాప్తంగా ప్రీమియం హోటళ్లలో ఆక్యుపెన్సీ (గదుల బుకింగ్) 2025–26 సంవత్సరంలో 72–74 శాతం మధ్య ఉండొచ్చన్నది ఇక్రా అంచనా. 2023-24లో నమోదైన 70–72 శాతంతో పోల్చితే కాస్త పెరగనుంది. ప్రీమియం హోటళ్లలో సగటు రూమ్ ధరలు రూ.8,200–8,500 మధ్య ఉండొచ్చని ఇక్రా తెలిపింది. 2024-25లో ఈ ధరలు రూ.8,000–8,200 మధ్య ఉన్నట్టు వెల్లడించింది. కొన్ని హోటళ్ల నవీకరణ చేపట్టడం, సరఫరా పెరగకపోవడంతో ధరలు పెరగనున్నట్టు పేర్కొంది. ''మూడేళ్లపాటు వరుసగా బలమైన డిమాండ్‌ను ఆతిథ్య పరిశ్రమ చూసింది. దేశీ విహార పర్యటనలు, సమావేశాలు, సదస్సులకు (ఎంఐసీఈ) డిమాండ్, వివాహాలు, వ్యాపార పర్యటనలు ఇందుకు అనుకూలించాయి. కానీ, 2025-26లో 6-8 శాతం మేర మోస్తరు వృద్ధికి పరిమితం కావొచ్చు'' అని ఇక్రా లిమిటెడ్ కార్పొరేట్ రేటింగ్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జితిన్ మక్కర్ తెలిపారు. 2025 ఏప్రిల్‌లో పహల్గామ్ ఉగ్రదాడి, మే నెలలో ఉత్తర, పశ్చిమ భారత్‌లో అనిశ్చితులు పెరగడంతో ప్రయాణ, ఎంఐసీఈ కార్యక్రమాల రద్దులు పెరిగినట్టు చెప్పారు. ఇటీవలి వారాల్లో డిమాండ్ కోలుకుంటున్నట్టు తెలిపారు. ఆదాయంలో వృద్ధి తక్కువగానే ఉన్నప్పటికీ.. 13 బడా హోటల్ కంపెనీలు 34–36 శాతం మధ్య మార్జిన్లు నమోదు చేయొచ్చని ఇక్రా అంచనా వేసింది. వ్యయ నియంత్రణలు, అస్సెట్ లైట్ (అద్దెకు తీసుకోవడం) నమూనా మార్జిన్లకు మద్దతునిస్తాయని తెలిపింది.

బిజినెస్ రీల్

జీఆర్‌టీ గోల్డెన్ ఎలెవెన్ ఫ్లెక్సీ పథకం



హైదరాబాద్: ఆభరణాల సంస్థ జీఆర్‌టీ జ్యుయలర్స్ తాజాగా గోల్డెన్ ఎలెవెన్ ఫ్లెక్సీ పేరిట ఆభరణాల కొనుగోలు కోసం ప్రత్యేక పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ నెలవారీ ప్లాన్‌లో భాగంగా కస్టమర్లు ప్రతి నెలా నిర్దిష్ట మొత్తాన్ని పొదుపు చేసి, 11 నెలల వ్యవధిలో తమకు నచ్చిన ఆభరణాన్ని కొనుగోలు చేయొచ్చు. అలాగే 18 శాతం వరకు వేస్టేజీ ఉండదు. పసిడి, వెండి, వజ్రం, ప్లాటినం వంటి ఆభరణాలన్నింటికీ ఇది వర్తిస్తుంది. గడువు ముగిసిన తర్వాత విలువపరంగా లేదా బరువుపరంగా తమకు ఏది ప్రయోజనకరమైతే, ఆ విధానంలో పథకాన్ని రిడీమ్ చేసుకోవచ్చు. కనిష్ఠంగా నెలవారీ అడ్వాన్స్ పేమెంట్ రూ. 1,000 నుంచి ప్రారంభమవుతుందని జీఆర్‌టీ జ్యుయలర్స్ మేనేజింగ్ డైరెక్టర్లు జీఆర్ 'ఆనంద్' అనంతపద్మనాభన్, జీఆర్ రాధాకృష్ణన్ తెలిపారు. తమకు ప్రియమైన వారి జన్మదినం తదితర సందర్భాల కోసం వారికి ఇష్టమైన ఆభరణాలను బహుమతిగా అందించేందుకు, ముందు నుంచే ప్రణాళిక వేసుకునేందుకు ఇది ఉపయోగపడుతుందని వివరించారు. 1964లో ప్రారంభమైన జీఆర్‌టీ జ్యుయలర్స్‌కి 63 శాఖలు ఉన్నాయి.

జియో బ్లాక్‌రాక్ మ్యూచువల్ ఫండ్ వెబ్‌సైట్

న్యూఢిల్లీ: జియో బ్లాక్‌రాక్ అసెట్ మేనేజ్‌మెంట్ పూర్తి స్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించే ప్రక్రియను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా మ్యూచువల్ ఫండ్ వెబ్‌సైట్ ప్రారంభించింది. సంస్థ అందించే డిజిటల్ ఫస్ట్ పథకాలపై ఆసక్తిగా ఉన్న వారు ముందస్తుగా ఇందులో రిజిస్టర్ చేసుకుని పెట్టుబడులకు సంబంధించిన కంటెంట్‌కి యాక్సెస్ పొందవచ్చు. జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ (జేఎఫ్ఎస్ఎల్), అమెరికాకు చెందిన బ్లాక్‌రాక్ కలిసి ఈ సంస్థను జాయింట్ వెంచర్‌గా ఏర్పాటు చేశాయి. మ్యూచువల్ ఫండ్ వ్యాపారాన్ని ప్రారంభించేందుకు ఈ ఏడాది మే 26న మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ అనుమతులు మంజూరు చేసింది. జియో బ్లాక్‌రాక్ ఎండీ, సీఈవోగా సిద్ స్వామినాథన్, చీఫ్ రిస్క్ ఆఫీసర్‌గా అమిత్ భోసాలే, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్‌గా అమోల్ పాయ్ తదితరులు నియమితులయ్యారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

10-6-2025	
విశాఖ	550-00
చిత్తూరు	613-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	535-00
విజయవాడ	550-00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	540-00
వరంగల్	542-00
రిటైల్ ధర	6.00

నిఫ్టీ 50 — టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
JIO FIN	305.45	3.89
KOTAK BANK	2,140.80	3.25
BAJ FINANCE	9,624.00	2.69
TRENT	5,922.00	2.51
AXIS BANK	1,220.50	2.17

నిఫ్టీ 50 — టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ETERNAL	256.99	1.86
ICICI BANK	1,434.50	1.73
TITAN	3,533.90	0.73
M & M	3,085.00	0.69
ADANI PORTS	1,467.00	0.32

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	8,178
ఎన్ఎస్ఈ	1,17,745
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,40,108
ఎఫ్ఐఐ	+ 1,993
డీఐఐ	+ 3,504

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.30కు		క్రితం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	64.85	$	64.58
బ్రెంట్	66.73	$	66.47




బక్రీద్ సందర్భంగా శనివారం గాజా సిటీలోని అబూ అమీన్ ప్రాంతంలో తాత్కాలిక మందిరం వద్ద తెల్లవారుజామున ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న చిన్నారులు



బెంగళూరులో ఈద్గా మైదాన్‌లో నమాజ్ చేస్తున్న చిన్నారులు



భోపాల్‌లో ప్రత్యేక ప్రార్థనల తర్వాత పిల్లల కేరింతలు

ఢిల్లీ సీఎం రేఖా గుప్తాను చంపేస్తానంటూ బెదిరింపులు

నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తాను హత్య చేస్తానంటూ బెదిరింపులకు పాల్పడిన శ్లోక్ త్రిపాఠి అలియాస్ శ్లోక్ తివారీ(30) అనే వ్యక్తిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. అతడు మద్యం మత్తులో బెదిరింపులకు దిగినట్లు గుర్తించారు. ఢిల్లీ, ఉత్తరప్రదేశ్ పోలీసులు సంయుక్తంగా గాలింపు చేపట్టి, ఘజియాబాద్‌లో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. శ్లోక్ త్రిపాఠి ఎల్ఎల్‌బీ చదివాడు. యూపీలోని ఘజియాబాద్ కోర్టులో డాక్యుమెంట్ రైటర్‌గా పని చేస్తున్నాడు. 2020లో పెళ్లి చేసుకున్నాడు. గత ఏడాది భార్య అతడిని వదిలేసి, ఢిల్లీకి వెళ్లిపోయింది. భర్త తాగుడు వ్యసనం భరించలేక దూరంగా ఉంటోంది. మళ్లీ ఎలాగైనా భార్యతో కలిసి జీవించాలని శ్లోక్ త్రిపాఠి నిర్ణయించుకున్నాడు. ఆమె వినకపోవడంతో పోలీసుల సాయం తీసుకోవాలని భావించాడు. గురువారం, శుక్రవారం రాత్రిపూట చిత్తుగా మద్యం సేవించి, 112 ఎమర్జెన్సీ హెల్ప్‌లైన్ నెంబర్‌కు పదేపదే ఫోన్ చేశాడు. తన భార్యను తనతో కలపాలని పోలీసులను కోరాడు. వారు పట్టించుకోకపోవడంతో ఢిల్లీ ముఖ్యమంత్రిని రేఖా గుప్తాను చంపేస్తానంటూ హెచ్చరించాడు. దాంతో ఘజియాబాద్ పోలీసులు అప్రమత్తమయ్యారు. ఢిల్లీ పోలీసులకు సమాచారం చేరవేశారు. ఇరు రాష్ట్రాల పోలీసులు అతడి కోసం ఉమ్మడిగా గాలింపు చర్యలు ప్రారంభించారు. ఘజియాబాద్‌లో అరెస్టు చేశారు. మరోవైపు సీఎం రేఖా గుప్తా భద్రతను మరింత పెంచారు.

పైలట్ పంతంతో నిలిచిన ప్రాణం

- జల్గావ్ ఎయిర్‌పోర్టుకు ముందుగానే వచ్చిన ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే
- విమానం టేకాఫ్ చేసేందుకు పైలట్ నిరాకరణ
- విమానం మిస్సయిన మహిళా రోగిని తన విమానంలో ముంబైకి చేర్చిన షిండే

థానే: మహారాష్ట్రలోని జల్గావ్ జిల్లాలో ఆసక్తికరమైన పరిణామాలు చోటుచేసుకున్నాయి. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే షెడ్యూల్ కంటే ముందే జల్గావ్ ఎయిర్‌పోర్టుకు చేరుకోవడం, విమానం టేకాఫ్ చేసేందుకు పైలట్ నిరాకరించడం.. చివరకు ఓ మహిళ ప్రాణాలు కాపాడేందుకు కారణమయ్యాయి. జల్గావ్ జిల్లాలోని ముక్తాయ్‌నగర్‌లో సంత్ ముక్తి పల్లకి యాత్రలో పాల్గొనేందుకు ఏక్‌నాథ్ షిండే శుక్రవారం తన చార్టెర్డ్ విమానంలో ముంబై నుంచి జల్గావ్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్నం 3.45 గంటలకు రావాల్సి ఉండగా, దాదాపు మూడు గంటలు ఆలస్యంగా 6.15 గంటలకు విమానం ఎయిర్‌పోర్టులో ల్యాండైంది. ఏక్‌నాథ్ షిండే ఎయిర్‌పోర్టు నుంచి ముక్తాయ్‌నగర్ వెళ్లి పల్లకి యాత్రలో పాల్గొని ఎయిర్‌పోర్టుకు రాత్రి 9.15 గంటలకు తిరిగివచ్చారు. అయితే, గంట ముందే రావడంతో విమానం టేకాఫ్ చేసేందుకు పైలట్ నిరాకరించాడు. షెడ్యూల్ ప్రకారమే వెళ్లాలని తేల్చిచెప్పాడు. మహారాష్ట్ర మంత్రులు గిరీష్ మహాజన్, గులాబ్‌రావు పాటిల్‌తోపాటు జిల్లా అధికారులు దాదాపు 45 నిమిషాలపాటు ఎయిర్‌పోర్టులో చర్చలు జరిపారు. పైలట్‌ను ఒప్పించేందుకు శతవిధాలా ప్రయత్నించారు. చివరకు అతడు అంగీకరించాడు. ఇక్కడే కథ అసలు మలుపు తిరిగింది.

ఏం జరిగింది?

జల్గావ్‌కు చెందిన శీతల్ పాటిల్‌కు ముంబైలో అత్యవసరంగా మూత్రపిండాల మార్పిడి శస్త్రచికిత్స జరగాల్సి ఉంది. జల్గావ్ నుంచి విమానంలో వెళ్లాల్సి ఉండగా, ఎయిర్‌పోర్టుకు చేరుకొనేసరికే విమానం వెళ్లిపోయింది. అదే సమయంలో ఏక్‌నాథ్ షిండే అదే ఎయిర్‌పోర్టులో తన విమానం కోసం వేచి చూస్తున్నారు. పైలట్‌తో చర్చలు జరుగుతున్నాయి. ఇంతలో శీతల్ పాటిల్ గురించి స్థానిక నాయకులు ఏక్‌నాథ్ షిండే దృష్టికి తీసుకెళ్లారు. పైలట్ టేకాఫ్‌కు అంగీకరించడం, విమానం సిద్ధం కావడం జరిగిపోయాయి. దాంతో ఆయన శీతల్ పాటిల్‌ను, ఆమె భర్తను తనతోపాటు చార్టెర్డ్ విమానంలో ముంబైకి తీసుకెళ్లారు. ముందే సమాచారం ఇచ్చి ముంబై ఎయిర్‌పోర్టులో ప్రత్యేక అంబులెన్స్‌ను సిద్ధంగా ఉంచారు. ఎయిర్‌పోర్టుకు చేరుకున్న వెంటనే శీతల్ బోర్డేను ప్రత్యేక అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. మొత్తానికి అనుకున్న సమయానికే శీతల్ బోర్డే ఆసుపత్రికి చేరుకున్నారు. ఏక్‌నాథ్ షిండే విమానాన్ని టేకాఫ్ చేయడానికి పైలట్ మొండికేయడం ఆమె ప్రాణాలను కాపాడిందని స్థానికులు పేర్కొన్నారు. సామాన్య ప్రజల బాగు కోసం ఏక్‌నాథ్ షిండే తపన పడుతుంటారని, వారి సేవ కోసం ఆయన ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారని మంత్రి గిరీష్ మహాజన్ చెప్పారు.

రూ.20 లక్షల నగల సంచి ఎత్తుకెళ్లిన కోతి

మథుర: శ్రీకృష్ణుడి జన్మస్థలంగా భావించే ఉత్తరప్రదేశ్‌లోని మథుర-బృందావన్‌లో వానరాల బెడద పెరిగిపోతోంది. భక్తుల వస్తువులు, తినుబండారాలను ఎత్తుకెళ్తుండడం పెద్ద తలనొప్పిగా మారింది. ప్రభుత్వ అధికారులు వాటి ఆగడాలను అదుపు చేయలేకపోతున్నారు. తాజాగా ఓ వ్యాపారి నుంచి రూ.20 లక్షలకుపైగా విలువైన వజ్రాల నగలున్న సంచిని కోతి ఎత్తుకెళ్లింది. అలీగఢ్‌కు చెందిన అభిషేక్ అగర్వాల్ బంగారు ఆభరణాల వ్యాపారి. కుటుంబంతో కలిసి శుక్రవారం బృందావన్ దర్శనానికి వచ్చాడు. తమ వద్దనున్న నగలను ఓ సంచిలో భద్రపర్చాడు. దర్శనం పూర్తయిన తర్వాత ఇంటికి చేరుకోవడానికి కారు వద్దకు వెళ్తుండగా ఓ కోతి హఠాత్తుగా ఎక్కడి నుంచో వచ్చి, ఆ సంచిని లాక్కెళ్లింది. ఆందోళనకు గురైన అభిషేక్ అగర్వాల్ వెంటనే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు దొంగ మర్కటం కోసం వేట ప్రారంభించారు. 8 గంటల తర్వాత దాని ఆచూకీ కనిపెట్టారు. అదృష్ట ఏమిటంటే నగల సంచి దాని దగ్గరే ఉంది. కోతిని అక్కడి నుంచి వెళ్లగొట్టి, నగల సంచిని జాగ్రత్తగా తీసుకొచ్చి, బాధితుడికి అప్పగించారు.

భార్య తలతో పోలీసు స్టేషన్‌లో లొంగుబాటు

బెంగళూరులో యువకుడి ఘాతుకం

బెంగళూరు: కర్ణాటక రాజధాని బెంగళూరులో ఒళ్లు గగుర్పొడిచే దారుణం జరిగింది. ఓ యువకుడు తన భార్యతో గొడవపడి తల నరికేశాడు. ఆ తల తీసుకొని నేరుగా పోలీసు స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. బెంగళూరు శివారులోని చందాపురా సమీపంలో హీళలిగే గ్రామంలో ఈ సంఘటన జరిగింది. 26 ఏళ్ల శంకర్, మానసకు ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. ఇద్దరూ వేర్వేరు ప్రైవేట్‌సంస్థల్లో పని చేస్తున్నారు. వారికి నాలుగేళ్ల కుమార్తె ఉంది. తన భార్య మరొకరితో వివాహేతర సంబంధం కొనసాగిస్తోందని శంకర్ అనుమానం పెంచుకున్నాడు. అలాంటిదేమీ లేదని చెబుతున్నా వినకుండా భార్యతో తరచుగా గొడవకు దిగుతుండేవాడు. శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో గొడవ ముదిరింది. ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఆవేశానికి లోనైన శంకర్ ఇంట్లో ఉన్న కొడవలితో భార్య తల నరకడంతో ఆమె అక్కడికక్కడే కుప్పకూలింది. కొద్దిసేపటి తర్వాత భార్య తల తీసుకొని స్కూటర్‌పై పోలీసు స్టేషన్‌కు చేరుకున్నాడు. జరిగిన విషయం చెప్పాడు. తనను అరెస్టు చేసుకోవాలని కోరాడు. శంకర్‌ను అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేసినట్లు పోలీసులు శనివారం వెల్లడించారు.

దాడి.. అరెస్ట్.. ఆందోళన.. లాఠీచార్జ్

ఉద్రిక్తంగా మారిన అక్రమ వలసదారుల అరెస్ట్

లాస్ ఏంజెలెస్‌లో లాఠీచార్జి • అమెరికాలో కలకలం

లాస్ ఏంజెలెస్: చట్టవ్యతిరేకంగా అమెరికాలో ఉంటున్న అక్రమ వలసదారులను గుర్తించి, అరెస్ట్‌చేసేందుకు రంగంలోకి దిగిన పోలీసులకు స్థానికుల నుంచి తీవ్రస్థాయిలో ప్రతిఘటన ఎదురవుతోంది. లాస్ ఏంజెలెస్ నగర పరిసరాలు ఇందుకు వేదికయ్యాయి. శుక్రవారం లాస్ ఏంజెలెస్ ప్రాంతాల్లో కొందరు అక్రమ వలసదారులను అరెస్ట్‌చేయడం ఒక్కసారిగా ఉద్రిక్తతలకు దారితీసింది. ఫెడరల్ ఏజెన్సీ, పోలీసులు, ఎఫ్‌బీఐ సంయుక్తంగా జరిపిన ఆకస్మిక దాడుల్లో పలువురు అక్రమవలసదారులను అరెస్ట్‌చేయడంతో అక్కడే ఉన్న స్థానికులు తీవ్రస్థాయిలో వ్యతిరేకించారు. వీరికి వందలాది మంది విపక్ష డెమొక్రటిక్ పార్టీ మద్దతుదారులు, విదేశీయులు తోడవడంతో ఒక్కసారిగా ఆందోళన తీవ్రరూపం దాల్చింది. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేస్తూ పోలీసు చర్యను తీవ్రంగా తప్పుబట్టారు. ఆగ్రహంతో ఊగిపోయిన నిరసనకారులు ప్యాకింగ్ కార్టులు, కాంక్రీట్ ముక్కలుసహా దొరికిన వస్తువులతో పోలీసులపైకి దాడికి యత్నించారు. దీంతో పోలీసులు లాఠీలకు పనిచెప్పారు. వందల మంది నిరసనకారులను చెదరగొట్టేందుకు బాష్పవాయు గోళాలను ప్రయోగించారు. కంటితో చూడలేనంత కాంతిని వెదజల్లే, కళ్లు బైర్లు కమ్మేలా మెరుపులు వెదజల్లే ఫ్లాష్ బ్యాంగ్ గ్రనేడ్‌లను విసిరేశారు. దీంతో ఆ ప్రాంతమంతా రణరంగాన్ని తలపించింది. నగర వ్యాప్తంగా దావానంలా వ్యాపించిన ఈ అక్రమవలసదారుల ఆందోళనలను అణచివేసేందుకు మరింతగా పోలీసు బలగాలు రంగంలోకి దిగాయి. పలు చోట్ల బ్యారికేడ్లను ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలను నిలిపేశారు.

మధ్యాహ్నంతో మొదలు

తొలుత శుక్రవారం మధ్యాహ్నం 1.30 గంటలకు సిటీలోని ఫ్యాషన్ డిస్ట్రిక్ట్‌లో ఒక వస్త్రాల టోకు వ్యాపారిని ఫెడరల్ ఏజెంట్లు అరెస్ట్‌చేశారు. ఈ అరెస్ట్‌ను అడ్డుకున్న అక్కడి ఉద్యోగులనూ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇదంతా చూస్తున్న ప్రజల్లో పట్టరాని ఆవేశం పెరిగి ఆందోళనకు దిగారు. పందుల్లారా, పిడివాదం చేసే పోలీసుల్లారా అంటూ కొందరు తిట్ల పురాణం మొదలెట్టారు. ''కుటుంబాలను వేరు చేస్తూ రాత్రిళ్లు మీరు హాయిగా నిద్రపోగలరా?. మీ కుటుంబసభ్యులను కూడా ఇలా అరెస్ట్‌చేస్తే మీకెలా ఉంటుంది?''అని అక్కడి ఓ మహిళ పోలీసులతో వాగ్వాదానికి దిగింది. అరెస్ట్‌లను అడ్డుకున్న కార్మిక నేత, సర్వీస్ ఎంప్లాయిస్ ఇంటర్నేషనల్ యూనియన్ కాలిఫోర్నియా అధ్యక్షుడు డేవిడ్ హుయెర్టానూ పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో కార్మికులు, స్థానికులు మధ్యాహ్నం నాలుగు గంటలకు పెద్ద ఎత్తున గుమిగూడి ఆందోళనకు దిగారు. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేస్తూ లాస్ ఏంజెలెస్ ఫెడరల్ డిటెన్షన్ సెంటర్ భవనానికి చేరుకున్నారు. అరెస్ట్‌చేసి లోపల బంధించిన వారిని వెంటనే విడిచిపెట్టాలని నినాదాలుచేశారు. ఫెడరల్ కోర్ట్‌హౌస్ భవనంపై ఆందోళనకారులు స్ప్రే పెయింట్‌తో రాతలు రాశారు. అనుమతిలేకుండా జనం రోడ్లపై గుమిగూడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని పోలీసులు హెచ్చరించినా జనం అక్కడి నుంచి వెళ్లిపోలేదు. దీంతో వీళ్లను చెదరగొట్టేందుకు పోలీసులు పెప్పర్ స్ప్రేలు, ఫ్లాష్ బ్యాంగ్ గ్రనేడ్లను ప్రయోగించారు. ''అక్రమ వలసదారులను అరెస్ట్‌చేయడానికి మేం రాలేదు. శాంతిభద్రతల పరిరక్షణకు వచ్చాం. ఇక్కడి నుంచి వెళ్లకపోతే అరెస్ట్ తప్పదు''అని పోలీసుల అధికార ప్రతినిధి డ్రాక్ మేడిసన్ హెచ్చరించారు. సెంట్రల్ లాస్ ఏంజెలెస్‌లో మూడు చోట్ల తనిఖీలు, సోదాలను పూర్తిచేశామని అమెరికా ఇమిగ్రేషన్, కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లోని హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీస్ ఇన్వెస్టిగేషన్స్ విభాగ మహిళా అధికార ప్రతినిధి యాస్మీన్ పిట్స్ ఒకీఫ్ చెప్పారు. అయితే అధికారులు నగరంలో చాలా చోట్ల ఆకస్మిక దాడులు చేశారని వలసదారుల హక్కుల ఐక్యవేదిక(చిర్లా) పేర్కొంది. ఏడు ప్రాంతాలు, రెండు హోమ్ డిపోర్స్, ఒక వేర్‌హౌస్, ఒక డోనట్ షాప్‌లో ఈ దాడులు జరిగాయని చిర్లా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఏంజిలికా సలాస్ ఆరోపించారు.



ఆందోళనకారులపైకి భాష్పవాయుగోళాన్ని ప్రయోగిస్తున్న పోలీసు



అక్రమవలసదారుడిని అరెస్ట్‌చేస్తున్న పోలీసులు



నిరసనకారులపై పోలీసులు లాఠీచార్జీ దృశ్యం

44 మంది అరెస్ట్

సెర్చ్ వారెంట్ ప్రకారం 44 మందిని ఫెడరల్ ఏజెంట్లు అరెస్ట్‌చేశారు. అరెస్ట్‌లను అడ్డుకున్నందుకు ఒకరిని అరెస్ట్ చేశారు. రోజుకు కనీసం 3,000 మంది అక్రమ వలసదారులను అరెస్ట్‌చేయాలని అధ్యక్షభవనం అధికార ప్రతినిధి స్టీఫెన్ మిల్లర్ ఇమిగ్రేషన్, కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాన్ని ఆదేశించడంతో ఫెడరల్ ఏజెంట్లు ఇలా రంగంలోకి దిగాల్సి వచ్చిందని యాస్మీన్ పేర్కొన్నారు. ప్రస్తుతం రోజుకు సగటున 1,600 మందిని అరెస్ట్‌చేస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది తీవ్రమైన నేరాలుచేసిన వాళ్లేనని మిల్లర్ చెప్పారు. ఒక వ్యాపారి తన దగ్గర పని చేస్తున్న ఉద్యోగులకు సంబంధించి తప్పుడు పత్రాలను సృష్టించాడని యూఎస్ అటార్నీ ఆఫీస్ అధికారి సియారన్ మెక్ఎవీ చెప్పారు. ఇవన్నీ తీవ్రమైన చర్యలని లాస్ ఏంజెలెస్ మేయర్ కరెన్ బాస్ వ్యాఖ్యానించారు.

అంతరిక్ష కేంద్రం నుంచి డ్రోన్ల ప్రయోగం !

- పేటెంట్ సంపాదించిన రష్యా
- డ్రోన్ ప్లాట్‌ఫామ్ నిర్వహణ కోసం రోబోల వినియోగం

మాస్కో: ప్రస్తుతం సేవలందిస్తున్న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్) జీవితకాలం ముగుస్తుండటంతో త్వరలో సొంతంగా నిర్మాణం చేపట్టబోయే రష్యా ఆర్బిటల్ స్పేస్ స్టేషన్(ఆర్ఓఎస్) కోసం రష్యా అధునాతన సాంకేతికతను అభివృద్ధిచేస్తోంది. దీనికి సంబంధించిన పేటెంట్‌ను సైతం ఇప్పటికే సాధించామని రష్యా తాజాగా ప్రకటించింది. సొంత ఆర్ఓఎస్ నుంచి డ్రోన్లను ప్రయోగించేందుకు ఈ టెక్నాలజీని ఉపయోగిస్తామని రష్యా తొలి ఉప ప్రధానమంత్రి డెనిస్ మంతురోవ్ చెప్పారు. శుక్రవారం మాస్కోలో దేశాధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ జరిపిన ఒక సమీక్షా సమావేశంలో ఈ కొత్త టెక్నాలజీ పేటెంట్ అంశాన్ని డెనిస్ ప్రస్తావించారు. ''2030 ఏడాది నుంచి ఒక్కో మాడ్యూల్‌ను అంతరిక్షంలోకి చేర్చి ఒకదానితో మరోదాన్ని జతచేసి సొంత స్పేస్‌స్టేషన్‌ను 2033 ఏడాదిలోపు నిర్మిస్తాం. ఈ స్టేషన్‌లో ప్రపంచంలోనే డ్రోన్ల ప్లాట్‌ఫామ్‌ను ఏర్పాటుచేస్తున్నాం. ఈ ప్లాట్‌ఫామ్ నిర్వహణ బాధ్యతలను ప్రపంచంలోనే తొలిసారిగా రోబోట్‌లకు అప్పగిస్తున్నాం''అని డెనిస్ చెప్పారు. కొత్త టెక్నాలజీ అనేది ఆర్ఓఎస్‌లో విజయవంతమైతే భవిష్యత్ చంద్రమండల ప్రాజెక్టుల్లో దీనిని ఉపయోగించనున్నారు.

పీడీ చట్టాన్ని జాగ్రత్తగా వాడాలి: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: ముందస్తు నిర్బంధం(పీడీ) చట్టం అనేది ప్రభుత్వాల చేతిలో ఉన్న అసాధారణ అధికారమని అని జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ మన్మోహన్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొంది. ఈ చట్టాన్ని చాలా జాగ్రత్తగా ఉపయోగించాలని సూచించింది. ఓ కేసులో రుణదాతను ఈ చట్టం కింద నిర్బంధిస్తూ జిల్లా మేజిస్ట్రేట్ ఇచ్చిన ఆదేశాలను ధర్మాసనం తోసిపుచ్చింది. కేరళకు చెందిన రాజేశ్ అనే వ్యక్తి రితిక ఫైనాన్స్ కంపెనీ నిర్వహిస్తున్నాడు. అతడిపై కేసులున్నాయి. నాలుగు కేసుల్లో బెయిల్ వచ్చింది. ఆ తర్వాత అతడు చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదు అందడంతో జిల్లా మేజిస్ట్రేట్ పీడీ చట్టాన్ని ప్రయోగించాడు. దాంతో అతడు సుప్రీంకోర్టును ఆశ్రయించాడు.

మేధకు టెక్నాలజీ ప్రత్యామ్నాయం కాదు

సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: ఆధునిక టెక్నాలజీని అభినందించాల్సిందేనని, అదే సమయంలో న్యాయ వ్యవస్థలో మానవ మేధస్సుకు టెక్నాలజీని ప్రత్యామ్నాయంగా భావించడం తగదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ పేర్కొన్నారు. యూనివర్సిటీ ఆఫ్ లండన్‌లో 'భారతీయ న్యాయ వ్యవస్థలో టెక్నాలజీ పాత్ర'అనే అంశంపై ఆయన మాట్లాడారు. న్యాయపరమైన నిర్ణయాలు తీసుకొనే విషయంలో టెక్నాలజీని ఉపయోగించకూడదని అన్నారు. విచక్షణ, సహానుభూతికి ప్రత్యామ్నాయాలు లేవని తేల్చిచెప్పారు. ఆటోమేటెడ్ కాజ్ లిస్టులు, డిజిటల్ కియోస్క్‌లు, వర్చువల్ అసిస్టెంట్ వంటి నవీన ఆవిష్కరణను న్యాయ వ్యవస్థ స్వాగతిస్తోందని జస్టిస్ గవాయ్ తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అవసరమైనంత మేరకు వాడుకోవడంలో తప్పులేదన్నారు. కానీ, అదే పూర్తి ప్రత్యామ్నాయంగా భావించడం సరైంది కాదని అభిప్రాయపడ్డారు.

ఢిల్లీ ఎయిర్‌పోర్టులో ఒక రన్‌వే మూసివేత

సాక్షి, న్యూఢిల్లీ: స్వల్ప మరమత్తులుసహా ఆధునీకరణ పనుల్లో భాగంగా దేశ రాజధానిలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో 28/10 నంబర్ రన్‌వేను మూసివేయనున్నారు. దీంతో రోజూ కనీసం 200 విమానసర్వీసులు రద్దుకానున్నాయి. ఇందులోభాగంగా 114 విమానసర్వీస్‌లను క్యాన్సల్‌చేసి మరో 86 విమానాలను రీషెడ్యూల్ చేయనున్నారు. జూన్ 15వ తేదీ నుంచి మూడు నెలలపాటు అంటే సెప్టెంబర్ 15వ తేదీదాకా రన్‌వేపై ల్యాండింగ్, టేకాఫ్‌లను నిలిపివేయనున్నట్లు ఎయిర్‌పోర్ట్ నిర్వహణ సంస్థ అయిన ఢిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్(డీఐఏఎల్) శుక్రవారం ప్రకటించింది. కేటగిరీ(క్యాట్)3బీ ప్రమాణాలకు అనుగుణంగా రన్‌వేపై ఆధునిక మౌలిక వసతులను ఏర్పాటుచేయనున్నారు. గాల్లోంచి కిందకు దిగుతూ 15 మీటర్ల ఎత్తుకు చేరుకున్నాక కూడా విమాన పైలెట్‌కు మంచు, వర్షం వంటి పరిస్థితుల్లో రన్‌వే స్పష్టంగా కనబడకపోతే ల్యాండింగ్ చేయడం కష్టం. ఇలాంటి పరిస్థితుల్లోనూ ల్యాండింగ్ సాధ్యమయ్యేలా రన్‌వే వెంట అప్రోచ్, టచ్‌డౌన్ లైట్లు, అధునాతన సిగ్నల్, వాయిస్ ప్రాప్టల వ్యవస్థలను ఏర్పాటుచేస్తారు. నెలల తరబడి ఏకధాటిగా ఒకే ప్రాంతంలో వందల విమానాల ల్యాండింగ్ కారణంగా దెబ్బతిన్న రన్‌వే ప్రాంతాన్ని పునరుద్ధరించనున్నారు.

బిహార్‌లో చెరో సగం!

243 స్థానాలకుగాను చెరో వంద స్థానాల్లో పోటీ చేయనున్న జేడీయూ, బీజేపీ

మిగతా 43 స్థానాలు ఎల్‌జేపీ, ఆర్ఎల్ఎం, హెచ్ఏఎంలకు

ఎన్డీఏ కూటమి పార్టీల మధ్య కుదిరిన ఏకాభిప్రాయం!

సాక్షి, న్యూఢిల్లీ: ఈ ఏడాది జరగనున్న బిహార్ ఎన్నికల్లో పోటీ చేసే స్థానాల సంఖ్యపై ఎన్డీఏ కూటమి పార్టీలు సీట్ల పంపకంపై ఒక ఏకాభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది. కూటమిలోని ప్రధాన పార్టీలైన బీజేపీ, జేడీయూలో సమాన స్థాయిలో సీట్లు తీసుకోవాలని ఒక ప్రాథమిక నిర్ణయానికి వచ్చాయని ఢిల్లీ వర్గాలు చెబుతున్నాయి. మొత్తం 243 స్థానాలకు గానూ బీజేపీ, జేడీయూలు చెరో వంద స్థానాలు పోటీ చేసేలా అవగాహన కుదిరినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం బిహార్‌లోని ఎన్డీఏ కూటమిలో బీజేపీ, జేడీయూలతో పాటు చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) , జీతన్ రామ్ మాంఝీకి చెందిన హిందుస్తానీ అవామీ మోర్చా (హెచ్ఏ ఎం), ఉపేంద్ర కుష్వాహా రాష్ట్రీయ లోక్‌మంచ్ (ఆర్ఎల్ఎం) ఉన్నాయి. గడిచిన లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 17, జేడీయూ 16, ఎల్‌జేపీ 5, హెచ్ఏఎం, ఆర్ఎల్ఎం ఒక్కొక్క స్థానంలో పోటీ చేశాయి. పార్లమెంటరీ ఎన్నికల్లో బీజేపీ ఒక స్థానంలో అధికంగా పోటీ చేసినప్పటికీ ఈసారి సమానంగా సీట్ల పంపకాలు ఉంటాయని తెలుస్తోంది. 243 అసెంబ్లీ సీట్లలో జేడీయూ 102-103 సీట్లలో, బీజేపీ 101-102 సీట్లలో పోటీ చేయవచ్చని సమాచారం. మిగిలిన 40 సీట్లు కూటమిలోని మిగతా పార్టీలకు వదిలేస్తారని భావిస్తున్నారు. పార్లమెంట్‌లో ఐదుగురు సభ్యుల ప్రాతినిధ్యం దృష్ట్యా ఎల్‌జేపీ దాదాపు 28 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసే అవకాశాలున్నాయి. హెచ్ఏఎంకు 7 సీట్లు, ఆర్ఎల్ఎంకు 4-5 సీట్లు కేటాయించవచ్చని అంటున్నారు. కొద్ది నెలల కిందట అసెంబ్లీ నియోజక వర్గాలన్నింటిలో నిర్వహించిన అంతర్గత బీజేపీ సర్వేల ఆధారంగా సీట్ల పంపిణీపై ఒక అవగాహన వచ్చినట్లు తెలుస్తోంది. సీట్ల కేటాయింపుతోపాటు అభ్యర్థుల ఎంపిక కోసం ఈ సర్వే చేశారు. ఎన్నికల తేదీలను ప్రకటించకముందే అభ్యర్థులను ప్రకటించేలా రెండు పార్టీల ఆలోచనలు చేస్తున్నట్లు సమాచారం.

థాయ్‌లాండ్ బందీ మృతదేహం లభ్యం

ఇజ్రాయెల్ దాడుల్లో మరో 95 మంది మృతి

టెల్ అవీవ్: గాజాలో థాయ్‌లాండ్ బందీ నాతాపాంగ్ పింటా మృతదేహాన్ని ఇజ్రాయెల్ స్వాధీనం చేసుకున్నట్లు ఇజ్రాయెల్ ప్రధానమంత్రి కార్యాలయం శనివారం ప్రకటించింది. 2023 అక్టోబర్ 7న హమాస్ మిలిటెంట్లు ఇజ్రాయెల్‌పై హఠాత్తుగా దాడికి దిగి 1,200 మందిని హత్య చేయడంతోపాటు 251 మందిని బందీలుగా గాజాకు తీసుకెళ్లిన సంగతి తెలిసిందే. బందీల్లో ఇజ్రాయెల్ పౌరులతోపాటు విదేశీయులు కూడా ఉన్నారు. థాయ్‌లాండ్ పౌరుడు నాతాపాంగ్ పింటా కూడా అప్పట్లో హమాస్ చెరలో చిక్కుకున్నాడు. అతడిని విడిపించేందుకు చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు. కాల్పుల విరమణ ఒప్పందంతో కొందరు బందీలు విడుదలైనప్పటికీ పింటాకు విముక్తి లభించలేదు. తాజాగా అతడి మృతదేహం లభించడం విషాదాన్ని నింపింది. వ్యవసాయ పనుల కోసం థాయ్‌లాండ్ నుంచి ఇజ్రాయెల్‌కు వచ్చిన పింటా చివరకు దురదృష్టకరమైన రీతిలో మరణించాడు. హమాస్ మిలిటెంట్లే అతడిని హత్య చేసి ఉండొచ్చని భావిస్తున్నారు. మరోవైపు ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో గత 24 గంటల్లో కనీసం 95 మంది మరణించారని గాజా ఆరోగ్య శాఖ వెల్లడించింది. ఇజ్రాయెల్ దాడుల్లో గాజాలో ఇప్పటిదాకా 54,000 మందికిపైగా మృతిచెందడం గమనార్హం

మెక్సికోలో కుప్పకూలిన విమానం

ఇద్దరు పైలట్లు, ఒక ఇంజనీర్ మృతి

మెక్సికో సిటీ: పశువుల్లో వ్యాధులకు కారణమయ్యే స్క్రూవార్మ్ ఈగల వ్యాప్తిని అరికట్టడానికి స్టెరిలైజ్ చేసిన ఈగలను విమానం ద్వారా వదులుతుండగా విమానప్రమాదం చోటుచేసుకుంది. విమానం కుప్పకూలడంతో ఇద్దరు పైలట్లు, ఒక అగ్రోనామిస్ట్ ఇంజనీర్ మృతి చెందారు. శుక్రవారం మెక్సికోలో గ్వాటెమాలా సరిహద్దులో ఈ ఘటన జరిగింది. స్క్రూవార్మ్ వ్యాప్తిని అరికట్టడానికి మెక్సికో ప్రభుత్వం గత నెలలో చర్యలు ప్రారంభించింది. ఇందులో భాగంగా రేడియేషన్ ద్వారా స్టెరిలైజేషన్ చేసిన మగ స్క్రూవార్మ్ ఈగలను ప్రభావిత ప్రాంతాల్లో వదులుతోంది. శుక్రవారం ఇదే తరహాలో మగ ఈగలను వదులుతుండగా విమానం కూలడంతో ఇద్దరు గ్వాటెమాలా పైలట్లతోపాటు మెక్సికోకు చెందిన అగ్రోనామిస్ట్ ఇంజనీర్ ప్రాణాలు కోల్పోయారు.


ఆర్థిక సంఘం తాత్కాలిక సభ్యుడిగా శంకర్

సాక్షి, న్యూఢిల్లీ: భారతీయ రిజర్వ్‌బ్యాంక్ డెప్యూటీ గవర్నర్‌గా సేవలందిస్తున్న టి.రబీ శంకర్‌ను పదహారో ఆర్థిక సంఘంలో తాత్కాలిక సభ్యుడిగా నియమించారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను శనివారం ఆర్థిక శాఖ విడుదల చేసింది. 16వ ఆర్థిక సంఘం తన నివేదికను సమర్పించే వరకు లేదా ఈఏడాది అక్టోబర్ 31వ తేదీ వరకు శంకర్ తన పదవిలో కొనసాగనున్నారు. పూర్తికాల సభ్యుడు అజయ్ ఝూ వ్యక్తిగత కారణాలతో ఇటీవల రాజీనామాచేశారు. 2023 డిసెంబర్ 31వ తేదీన 16వ ఫైనాన్స్ కమిషన్‌ను కేంద్రం కొలువుతీర్చింది.

సింధు, వైదిక నాగరికతలు

సింధు, వైదిక నాగరికతల మౌలిక లక్షణాలను తులనాత్మకంగా పరిశీలించండి?

క్రీ.పూ.2500 నుంచి 1750 మధ్య వాయవ్య భారతదేశంలో సింధు, దాని ఉపనదుల పరివాహక ప్రాంతాల్లో విలసిల్లిన నాగరికతనే సింధు నాగరికత అంటారు. క్రీ.పూ.1500 నుంచి 600 సంవత్సరాల మధ్య సప్త సింధు, గంగా-యమునా మైదాన ప్రాంతాల్లో వెలసిన నాగరికత వైదిక నాగరికత. ఈ నాగరికతలు ఒక దాని తర్వాత ఒకటి వెలసినప్పటికీ వీటి మధ్య పలు అంశాల్లో అనేక వ్యత్యాసాలు, పోలికలు ఉన్నాయి.



వ్యత్యాసాలు

దాదాపు 250 దాకా అత్యంత ప్రణాళికాబద్ధంగా నిర్మించిన పట్టణాలు, కోటలు, కాల్చిన ఇటుకలతో రూపొందించిన నిర్మాణాలు, భూగర్భ మురుగు నీటి కాలువల వ్యవస్థ వంటి పలు అంశాలతో కూడిన సింధు నాగరికత ప్రధానంగా పట్టణ నాగరికత. కానీ వైదిక నాగరికత చివరి దశలో మాత్రమే ప్రాథమిక స్థాయిలో పట్టణాలు ప్రారంభమయ్యాయి.

- సింధు నాగరికత రాజకీయ వ్యవస్థకు సంబంధించిన నిర్దిష్ట సమాచారం ఏదీ లభించడం లేదు. కానీ వేద కాలంలో తెగ ఆధారిత రాజకీయ వ్యవస్థలు ఉండి, చివరి దశలో ప్రాదేశిక రాజ్యాలు కూడా ఏర్పడినట్లు తెలుస్తుంది.
- సింధు సమాజంలో కుల వ్యవస్థ కనిపించదు. వర్గ బేధాలు మాత్రమే ఉన్నాయి. సమాజంలో స్త్రీలకు ఉన్నత స్థానం ఉన్నట్లుగా అసంఖ్యాకంగా లభించిన మాతృ మూర్తి విగ్రహాల వల్ల తెలుస్తుంది. వీరిది మాతృస్వామిక వ్యవస్థ అని కొందరి అభిప్రాయం. కానీ వైదిక సమాజంలో పటిష్టమైన చాతుర్వర్ణ వ్యవస్థ ఉంది. శూద్రులతోపాటు స్త్రీలకు సామాజిక గౌరవం లేదు. మలి వేద కాలంలో అనేక దురాచారాలు వచ్చి చేరాయి. ఆర్యులది పితృస్వామిక వ్యవస్థ.
- సింధు ప్రజలది స్థిర జీవనం. ప్రధాన వృత్తి వ్యవసాయం. గోధుమ, బార్లీ ప్రధాన పంటలు. కాగా వరికి అంత ప్రాధాన్యత కనిపించదు. వీరు పలు రకాల చేతి వృత్తుల పరిశ్రమలను స్థాపించుకున్నారు. ప్రామాణికమైన తూనికలు, కొలతలను వినియోగించేవారు. దేశీయ వ్యాపారంతోపాటు విదేశీ వ్యాపారాన్ని కొనసాగించారు. వైదిక ప్రజలు సంచార జీవితాన్ని గడిపేవారు. వీరి ప్రధాన వృత్తి పశుపోషణ. కేవలం మలి వేద కాలంలోనే వీరు వ్యవసాయాన్ని ముఖ్య వృత్తిగా స్వీకరించారు. ప్రధాన పంట వరి. సింధు ప్రజలకు లేని ఇనుము లోహ పరిజ్ఞానం వీరికి ఉంది. వీరు విదేశీ వ్యాపారాన్ని నిర్వహించలేదు. వీరి ఆర్థిక వ్యవస్థలో గోవులతోపాటు గుర్రాలకు ముఖ్యస్థానం ఉంది. సింధు ప్రజల విషయంలో గుర్రానికి సంబంధించిన వివరాలు సంతృప్తికరంగా నిర్ధారణ కాలేదు. ఒకవేళ వీరికి గుర్రం తెలిసినా.. దాని వినియోగం పరిమితమే.
- సింధు ప్రజల మతానికి సంబంధించిన సరైన సమాచారం లేకున్నా.. పురావస్తు ఆధారాల ద్వారా వీరు అమ్మతల్లిని ప్రధాన దేవతగా పూజించినట్లు తెలుస్తుంది. ఈ కాలంలో ఒకే ఒక పురుష దేవుడు పశుపతి మహాదేవ. ఆర్యుల దేవతల్లో స్త్రీల కంటే పురుష దేవుళ్ల ఆధిక్యం ఎక్కువ. ఇంద్ర, వరుణ, అగ్ని, త్రిమూర్తులు మొదలైన 33 మంది దేవుళ్లను వీరు పూజించేవారు.
- సింధు ప్రజల పూజా విధానానికి భిన్నంగా.. యజ్ఞ యాగాలు, క్రతువులకు ఆర్యులు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. లిపి విషయంలోనూ రెండు నాగరికతల మధ్య భేదాలు కనిపిస్తాయి. సింధు ప్రజలు చిత్ర లిపిని అభివృద్ధి చేసుకున్నారు. వైదిక ఆర్యులకు లిపి లేదు. కానీ వీరికి మౌఖిక సాహిత్యం ఉంది.

పోలికలు

- సింధు ప్రజల మాతృదేవతను వైదిక మతంలోని దుర్గగా గుర్తించారు. సింధు కాలంలోని పశుపతి మహాదేవుడినే ఆర్యులు రుద్రుడిగా పూజించారు.
- జంతువులను, వృక్షాలను ఆరాధించే సంప్రదాయం రెండు నాగరికతల్లో కనిపిస్తుంది.
- భూత ప్రేత పిశాచాలు, దుష్ట శక్తులు, మంత్ర తంత్రాల పట్ల నమ్మకం రెండింటిలోనూ ఉంది.
- ప్రాతిపదికలు వేరైనా రెండు సమాజాల్లోనూ సామాజిక వివక్షతలు కనిపిస్తాయి.
- వైద్య విధానాల్లోనూ రెండు నాగరికతల్లో సారూప్యం ఉంది.
- కుమ్మరి చక్రాన్ని రెండు నాగరికతల్లోని ప్రజలు వినియోగించారు.
- స్త్రీల అలంకార ప్రియత్వం, రవాణా సాధనాలు మొదలైన అంశాల్లోనూ రెండింటికి సారూప్యం ఉంది.
- పైన పేర్కొనట్లు సింధు, వేద నాగరికతల మధ్య పలు అంశాల్లో వ్యత్యాసాలు, పోలికలు ఉన్నాయి. అయినప్పటికీ ఈ రెండు నాగరికతల్లోని పలు అంశాలు నేటి సంస్కృతిలో భాగంగా ఇప్పటికీ అవిచ్ఛిన్నంగా కొనసాగుతుండటంతో ఈ నాగరికతలను భారతీయ సంస్కృతికి మూల నాగరికతలుగా భావించవచ్చు.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

జైన, బౌద్ధ మతాలు

జైన, బౌద్ధ మతాల ఆవిర్భావానికి, వ్యాప్తికి దోహదపడిన అంశాలను పరిశీలించండి?

మలి వేదకాలం చివర్లో నెలకొన్న పరిస్థితులే క్రీ.పూ.6వ శతాబ్దంలో భారతదేశంలో అనేక మత ఉద్యమాలు ప్రారంభం కావడానికి కారణమయ్యాయి. ఈ ఉద్యమాల్లో ముఖ్యమైనవి జైన, బౌద్ధ మతాలు.



కారణాలు

ఈ కాలంలో సమాజంలో వర్ణ వ్యవస్థ బలపడింది. ఈ వ్యవస్థలో మిగిలిన మూడు వర్ణాలపై బ్రాహ్మణులు ఆధిక్యత కలిగి ఉన్నారు. కానీ విశాలమైన భూ భాగాల్లో రాజ్యాలను స్థాపించి రాజ్యాధికారంతోపాటు రాజకీయంగా ఉన్నత దశలో ఉన్న క్షత్రియులు సామాజికంగా ఉన్నత దశను కోరుకున్నారు. జైన, బౌద్ధ మత స్థాపకులు ఇద్దరూ క్షత్రియులే. ఈ కాలంలో వైశ్యుల ఆర్థిక స్థితి మెరుగుపడింది. కానీ సామాజికంగా వారి స్థాయిలో మార్పు లేనందువల్ల వారిలో కూడా సామాజిక అశాంతి కలిగింది. శూద్రులు, స్త్రీలు తమకు మోక్షం ఇవ్వని వైదిక మతం పట్ల అసంతృప్తికి లోనయ్యారు. ఇదే సమయంలో అందరికీ సామాజిక సమానత్వం, మోక్షాన్ని ప్రసాదించే జైన, బౌద్ధ మతాల పట్ల వీరంతా ఆదరణ చూపారు. పైగా వీటి మోక్ష మార్గం వ్యయ రహితం, సులువైనదీ.

క్రీ.పూ.6వ శతాబ్దంలో ఇనుప లోహ పరిజ్ఞానం వల్ల గంగానదీ మైదాన ప్రాంతం సాగులోకి వచ్చింది. దీంతో వ్యవసాయాభివృద్ధికి గొప్ప అవకాశం ఏర్పడింది. వ్యవసాయాన్ని విస్తరించడంలో పశువుల పాత్ర ఎంతో కీలకమైంది. అయితే వైదిక యజ్ఞయాగాది క్రతువుల పేరిట విలువైన పశు సంపదకు తీవ్ర నష్టం కలగడంతో వ్యవసాయ వర్గాల నుంచి వైదిక క్రతువుల పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. భారతదేశంలో క్రీ.పూ.6వ శతాబ్ద కాలాన్ని రెండో నగరీకరణగా భావిస్తారు. వ్యవసాయాభివృద్ధితో మిగులు ఏర్పడటం , తొలిసారిగా నాణేలు వాడకంలోకి రావడం మొదలైన కారణాల వల్ల వ్యాపార వాణిజ్యాలకు గొప్ప ప్రోత్సాహం లభించింది. వైదిక గ్రంథాలు వడ్డీ వ్యాపారాన్ని, సముద్రయానాన్ని నిషేధించడంతో వ్యాపారాభివృద్ధికి ఆటంకం కలిగింది. ఇదే సమయంలో జైన, బౌద్ధాలు ఇటువంటి నిషేధాలు విధించకపోగా తమ అహింసా సిద్ధాంతం ద్వారా వ్యాపార వాణిజ్యాలు అభివృద్ధి చెందడానికి తగిన శాంతియుత వాతావరణం కల్పించాయి. దీంతో వ్యాపార వర్గాల నుంచి వైదిక మతం కంటే ఈ కొత్త మతాల పట్ల అధిక మద్దతు లభించింది. జైన, బౌద్ధ మతాలు రెండూ గణతంత్ర రాజ్యాల్లో ప్రారంభించినవే. రాజరికాల్లోని బ్రాహ్మణాధిక్యత, ఇతర వివక్షతలకు ఇక్కడ స్థానం లేకపోవడమే కాకుండా ప్రజాస్వామిక విలువలకు ఇవి ప్రతీకలుగా నిలిచాయి. దీంతో ఈ కొత్త మతాల ప్రాభవానికి తగిన వేదిక లభించింది. ఈ మతాలను అధికంగా ఆదరించింది కూడా ఈ రాజ్యాల్లోని ప్రజలే. జైన, బౌద్ధ మతాలు వైదిక మతంలా బ్రాహ్మణులు, ఇతర ఉన్నత వర్గాల వారికి పరిమితమైన సంస్కృత భాషకు బదులు ప్రాకృతం, పాళి వంటి సామాన్య ప్రజానీకానికి దగ్గరగా ఉన్న సులువైన భాషల ద్వారా తమ ప్రచారాన్ని నిర్వహించాయి. దీంతో అవి వైదికం కంటే సులువుగా ప్రజలను చేరి వారి ఆదరణను పొందాయి.

మొఘలుల పాలన

భారతీయ కళలు, వాస్తు శిల్పానికి మొఘలుల సేవలను ఉదాహరణల సహితంగా వివరించండి?

సుస్థిరతతో కూడిన మొఘల్ పాలన సుదీర్ఘ కాలం కొనసాగడంతోపాటు, మొఘల్ రాజులకు కళల పట్ల ఉన్న శ్రద్ధ, ఆసక్తి, ఆదరణలు వంటి కారణాలతో.. వీరి కాలంలో వాస్తు శిల్ప కళ, చిత్ర కళ, భాష, సంగీత సాహిత్యాలన్నింటిలో విశేష ప్రగతి కనిపిస్తుంది.



వాస్తు శిల్పకళ

సుల్తానత్ కాలంలో మొదలైన ఇండో పర్షియన్ శైలి ఈ కాలంలో అత్యున్నత దశకు చేరడంతో పాటు జాతీయ లక్షణాలను సంతరించుకుంది. వీరి నిర్మాణాల్లో మసీదులు, రాజ ప్రాసాదాలు, కోటలు ముఖ్యమైనవి. తెల్లని రాజస్థాన్ పాలరాయిని ఉపయోగించడం, డబుల్ డోమ్, పీత్రాదురా అలంకరణలు, పారే నీటితో ఉండే ఉద్యానవనాలు వీరి వాస్తు కళల్లోని కొన్ని ముఖ్య లక్షణాలు..

- బాబర్ కాలంలో పానిపట్, సంబల్‌పూర్, అయోధ్య, కాబూల్‌లలో మసీదులు నిర్మించారు.
- అక్బర్... ఫతేపూర్ సిక్రీ అనే నూతన రాజధాని నిర్మించి అందులో అనేక కట్టడాలు నిర్మించాడు. ఈ నగరంలోని జామా మసీద్ ప్రవేశ ద్వారమే బులంద్ దర్వాజా. ఆగ్రాలోని కోటతోపాటు ఫతేపూర్ సిక్రీలోని పంచ మహల్, బీర్‌బల్ మహల్, సలీం చిష్టీ సమాధి అక్బర్ కట్టడాల్లో ముఖ్యమైనవి. జహంగీర్ కాలంలో పూర్తి పాలరాయి నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. నూర్జహాన్ నిర్మించిన ఇత్‌మద్ ఉద్దౌలా సమాధే దీనికి నాంది అని చెప్పొచ్చు. పీత్రాదురా అలంకరణ ఈ నిర్మాణంతోనే ప్రారంభమై తాజ్‌మహల్‌తో తారస్థాయికి చేరింది. ఇతని కాలంలోని మరో ముఖ్య నిర్మాణం సికింద్రా(ఉత్తరప్రదేశ్)లోని అక్బర్ సమాధి.
- షాజహాన్ కాలాన్ని వాస్తు కళకు స్వర్ణయుగంగా చెప్పొచ్చు. ఢిల్లీలోని ఎర్రకోట, అందులోని దివానీ ఆమ్, దివానీ ఖాస్ భవనాలు, ఆగ్రాలోని మోతీ మసీద్, ఢిల్లీలోని జామా మసీద్ షాజహాన్ కాలంలోని ముఖ్య నిర్మాణాలు. ఇతని కాలంలోని నిర్మాణాలన్నింటిలోకి మకుటాయమానంగా ఆగ్రాలోని తాజ్‌మహల్ నిలిచింది. తన భార్య ముంతాజ్ జ్ఞాపకార్థం నిర్మించిన సమాధి ఇది.
- ఔరంగజేబ్ కాలంలోని ముఖ్యమైన నిర్మాణం ఔరంగాబాద్ వద్ద నిర్మించిన ఆయన భార్య రాబియాద్దౌరాన్ సమాధి. దీన్ని పేదవాడి తాజ్ మహల్ అంటారు.

చిత్రకళ

- ఇస్లాం మతం చిత్ర కళను అంగీకరించకపోయినా లౌకిక పాలకులైన మొఘలులు దీన్ని గొప్పగా ఆదరించారు. ముఖ్యంగా అక్బర్, జహంగీర్‌ల కాలంలో ఇది తారస్థాయికి చేరింది. వీరి చిత్రకళల్లో ఆధ్యాత్మికత కంటే భౌతికతకు ప్రాధాన్యం ఎక్కువగా ఉండేది.
- హుమయూన్ కాలం నుంచీ మొఘల్ చిత్రకళ ప్రారంభమైంది. ఇతని ఆస్థానంలో ప్రముఖ పర్షియన్ చిత్రకారుడు మీర్ సయ్యద్ అలీ, అబ్దుస్ సమద్‌లు ఉండేవారు.
- అక్బర్ ఆస్థానంలోని చిత్రకారులతో ఒక కార్ఖానా ఏర్పడింది. వీరి ఆధ్వర్యంలోనే హుజనామా అనే చిత్ర కళా గ్రంథం రూపొందింది. ఇతని ఆస్థాన చిత్రకారుల్లో ముఖ్యులు ఫరూఖ్ బేగ్, సయ్యద్ అలీ తబ్రేజీ, దశావంత్, బసవన్, ముకుంద్.
- జహంగీర్ కాలాన్ని మొఘల్ చిత్రకళకు పరాకాష్ఠగా పేర్కొనొచ్చు. పర్షియన్, భారతీయ శైలుల విలీనం ఇక్కడ కనిపిస్తుంది. ఒకే చిత్రాన్ని పలువురు చిత్రించే సంప్రదాయం ఈ కాలంలోనే ప్రారంభమైంది. ఇతని కాలంలోని ముఖ్యమైన చిత్రకారులు ఉస్తాద్ మన్సూర్, బిషన్‌దాస్.
- షాజహాన్... చిత్రకళ కంటే వాస్తు కళపై అధిక శ్రద్ధ చూపాడు. అయినప్పటికీ ఈ సంప్రదాయాన్ని కొనసాగించాడు. చిత్రకళలో ఖరీదైన రంగుల వినియోగం మొదలుపెట్టాడు. ఇతని ఆస్థానంలో మహ్మద్ హుస్సేన్, అనుపచిత్రలు ప్రముఖ చిత్రకారులు.
- ఔరంగజేబ్ మతాభిమానం కారణంగా ఇస్లాంకు వ్యతిరేకమైన చిత్రకళను ప్రోత్సహించలేదు.

భాషా సాహిత్యాలు

మొఘలుల రాజ భాష పర్షియన్. అనేక సంస్కృత గ్రంథాలు ఈ భాషలోకి అనువాదమయ్యాయి. ఉదా: అక్బర్ కాలంలో మహాభారతాన్ని 'రజ్‌నామా'గా అనువదించారు. ప్రిన్స్ దారాషుకోవ్ కూడా ఉపనిషత్తులను 'మజ్‌మ-ఉల్-బహ్రెయిన్'గా అనువదించాడు. అనువాదాలతోపాటు స్వీయ చరిత్రలు, చారిత్రక రచనలు కూడా చోటుచేసుకున్నాయి. తుజ్‌కీ బాబరీ, తుజ్‌కీ జహంగీరీ ముఖ్యమైన స్వీయ రచనలు. చారిత్రక గ్రంథాల్లో అబుల్ ఫజల్ అక్బర్‌నామా, అబుల్ ఫైజీ ఐనీ అక్బరీ, అబ్దుల్ హమీద్ లాహోరీ పాదుషానామా, ఖాఫీ ఖాన్ ముంతక్వాబ్-ఉల్ లుబాబ్ ముఖ్యమైనవి. ఈ కాలంలో హిందీతో పాటు ఇతర ప్రాంతీయ భాషా సాహిత్యాలు కూడా వర్ధిల్లాయి.

సంగీతం

మొఘల్ చక్రవర్తులు సంగీతాన్ని కూడా ఆదరించారు. అక్బర్ స్వయంగా నక్కారాను వాయించడంలో నిష్ణాతుడు. ఇతని ఆస్థానంలో ఉన్న తాన్‌సేన్‌ను 'గత వేయి సంవత్సరాల్లో ఇటువంటి సంగీతకారుడు లేడు' అని అబుల్ ఫజల్ కీర్తించాడు. తాన్‌సేన్ మియాంకీ థాడీ, దర్బారీ కనడ వంటి పలు కొత్త రాగాలను సృష్టించాడు. జహంగీర్ స్వయంగా అనేక గీతాలు రాసి తన సంగీతాభిమానాన్ని చాటుకొన్నాడు. షాజహాన్‌కు ధ్రుపద్ రాగాలాపనలో స్వయంగా ప్రవేశముంది. ఔరంగజేబ్ కూడా వీణా వాద్యంలో దిట్ట. ఇతడు సంగీతాన్ని నిషేధించినా అత్యధిక సంగీత గ్రంథాలు ఇతని కాలంలో రచనలకు నోచుకోవడం విశేషం. ఈ విధంగా మొఘల్ చక్రవర్తుల స్వీయ ప్రవేశం, ఆదరణతోపాటు ప్రాంతీయ రాజుల ఆదరణతో హిందుస్థానీ సంగీతం ఎంతో అభివృద్ధి చెందింది.

విద్య, ఉద్యోగ సమాచారం

యూపీఎస్సీ-సీడీఎస్ పరీక్ష2 -2025

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) త్రివిధ దళాలు ఇండియన్ మిలిటరీ అకాడమి, ఇండియన్ నావల్ అకాడమీ, ఎయిర్ ఫోర్స్ అకాడమీ, ఆఫీసర్స్ ట్రెనింగ్ అకాడమీ వంటి రక్షణ శిక్షణా సంస్థలలో ప్రవేశాల కోసం కంబైన్డ్ డిఫెన్స్ సర్వీస్ ఎగ్జామినేషన్ 2-2025 నిర్వహిస్తుంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 453.
» **అర్హత:** ఆయా పోస్టును అనుసరించి గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి డిగ్రీ లేదా తత్సమాన అర్హత లేదా బీటెక్ లేదా 10+2 స్థాయిలో ఫిజిక్స్, మ్యాథమేటిక్స్‌లో గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి డిగ్రీ లేదా ఇంజనీరింగ్ బ్యాచిలర్(బీఈ/బీటెక్) పూర్తిచేయాలి.
» **వయసు:** 19 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** రెండు దశల్లో ఉంటుంది. మొదటి దశలో రాతపరీక్ష తర్వాత ఇంటర్వ్యూ ఫర్ ఇంటెలిజెన్స్ అండ్ పర్సనాలిటీ టెస్ట్, ఇంటర్వ్యూ, వైద్య పరీక్షల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పరీక్ష విధానం:** మొత్తం 300 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఒక్కో పేపర్‌కు 100 మార్కులు. ఇంగ్లిష్, జీకే, ఎలిమెంటరీ మ్యాథమేటిక్స్‌ల నుంచి ప్రశ్నలు వస్తాయి. ఆఫీసర్స్ ట్రెనింగ్ అకాడమి(ఓటీఏ) పోస్టులకు దరఖాస్తు చేసుకున్నవారు మ్యాథ్స్ పేపర్ రాయనవసరం లేదు.
» **ఇంటర్వ్యూ:** ఇంటర్వ్యూకు 300 మార్కులు కేటాయించారు. కేవలం ఓటీఏ పోస్టులకు దరఖాస్తు చేసుకున్నవారికి 200 మార్కులకు ఉంటుంది. ఇంటర్వ్యూలో రెండు దశలు ఉంటాయి. ఇందులో ఎంపికైతే వైద్య పరీక్షలు నిర్వహించి పరీక్ష, ఇంటర్వ్యూ, మార్కుల మెరిట్ ప్రాతిపదికన శిక్షణలోకి తీసుకుంటారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**17.06.2025
» **పరీక్ష తేది:** 14.09.2025.
» **వెబ్‌సైట్:** https://upsconline.nic.in

ప్రపంచంలో తొలిసారి కనుగొన్న వ్యాక్సిన్?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

జనరల్ సైన్స్-బయాలజీ

1. మైక్రోబయాలజీ (సూక్ష్మజీవ శాస్త్రం) అంటే?
   - కంటికి కనిపించని సూక్ష్మజీవులైన బ్యాక్టీరియా, వైరస్, శైవలాలు, శిలీంధ్రాలు, ప్రోటోజోవన్ల గురించి అధ్యయనం చేసే శాస్త్రం.
2. మైక్రోబయాలజీ పితామహుడు ఎవరు?
   - లూయీ పాశ్చర్
3. లూయీ పాశ్చర్ ఆవిష్కరణలు ఏవి?
   - పాశ్చరైజేషన్ విధానాన్ని కనుగొన్నాడు.
   - వ్యాధులు, సూక్ష్మజీవ జనితాలు (జెర్మ్ థియరీ ఆఫ్ డిసీజ్) సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. (జెర్మ్ థియరీని రాబర్ట్ కోచ్ ప్రయోగ పూర్వకంగా నిరూపించాడు)
   - రేబిస్ వ్యాక్సిన్‌ను(కుక్క కాటుకు)కనుగొన్నాడు.
   - ఆంత్రాక్స్, కలరా వ్యాధులకు వ్యాక్సిన్‌ను కనుగొన్నాడు.
4. పాశ్చరైజేషన్ అంటే?
   - సేకరించిన పాలను 70°C వరకు వేడిచేసి, 15-30 సెకన్ల పాటు ఉంచి, వెంటనే చల్లార్చి (10°C) ప్యాకెట్లలో నిల్వచేసే పద్ధతిని పాశ్చరైజేషన్ అంటారు.
5. సూక్ష్మజీవ శాస్త్ర ప్రాముఖ్యత ఏమిటి?
   - చనిపోయిన మొక్కలు, జంతువుల దేహాలను సూక్ష్మజీవులు కుళ్లింపజేసి, పోషక పదార్థాలను ఏర్పరచి నేలను సారవంతం చేస్తాయి. ఆ పోషక పదార్థాలను మొక్కలు వినియోగించుకుంటాయి.
   - ఆక్సిజన్, కార్బన్, నత్రజని, సల్ఫర్ వంటి మూలకాలు పునఃచక్రీయం చెందడంలో సూక్ష్మజీవులు ప్రముఖ పాత్ర పోషిస్తాయి.
   - సూక్ష్మజీవులు మొక్కల్లో, మానవుల్లో అనేక వ్యాధులను కలగజేస్తాయి. మరోవైపు సూక్ష్మజీవ నాశక ఔషధాలు (యాంటీబయాటిక్స్), టీకా (వ్యాక్సిన్)ల ఉత్పత్తిలోనూ తోడ్పడుతున్నాయి.
6. ఎక్సో మైక్రోబయాలజీ (వ్యోమ సూక్ష్మ జీవ శాస్త్రం) అంటే?
   - ఇటీవల కాలంలో సూక్ష్మజీవులను ఉపయోగించి రోదసీలో జీవాన్వేషణ జరుపుతున్నారు. దీన్నే వ్యోమ సూక్ష్మజీవ శాస్త్రం అంటారు.
7. సూక్ష్మజీవ నాశిని పెన్సిలిన్‌ను ఆవిష్కరించినవారు ఎవరు?
   - అలెగ్జాండర్ ఫ్లెమింగ్ (బ్రిటన్) పెన్సీలియం నోటెటమ్ అనే శిలీంధ్రం నుంచి పెన్సిలిన్ అనే సూక్ష్మజీవ నాశక ఔషధాన్ని 1929లో కనుగొన్నాడు.
   - 1945లో అలెగ్జాండర్ ఫ్లెమింగ్, హోవర్డ్ ఫ్లోరీ, ఎర్నెస్ట్ బోరిస్ చైన్ (పెన్సిలిన్ ఔషధ గుణాన్ని వివరించారు)లు సంయుక్తంగా నోబెల్ బహుమతి పొందారు.
8. యాంటీబయాటిక్స్ (సూక్ష్మజీవ నాశకాలు) అంటే ఏమిటి?
   - రోగకారక సూక్ష్మజీవులను (బ్యాక్టీరియా, వైరస్, శిలీంధ్రాలు) నిర్మూలించే మందులను యాంటీబయాటిక్స్ అంటారు.
9. మొట్టమొదటి యాంటీబయాటిక్ పేరు?
   - పెన్సిలిన్. దీన్ని వండర్ డ్రగ్, సర్వరోగ నివారిణి అని కూడా అంటారు.
10. యాంటీబయాటిక్ పితామహుడు అని ఎవరిని పిలుస్తారు?
    - అలెగ్జాండర్ ఫ్లెమింగ్
11. ఆరియో మైసిన్ సృష్టికర్త ఎవరు?
    - డా.ఎల్లాప్రగడ సుబ్బారావు (పశ్చిమ గోదావరి జిల్లా)
    - ఆరియోమైసిన్‌ను టెట్రాసైక్లిన్ అని కూడా పిలుస్తారు.
    - టైఫాయిడ్, ప్లేగు, క్షయ వంటి అనేక బ్యాక్టీరియా వ్యాధులను టెట్రాసైక్లిన్ నయం చేస్తుంది.
    - యల్లాప్రగడను విజర్డ్ ఆఫ్ వండర్ డ్రగ్స్ అని పిలుస్తారు.
12. టీకాలు (వ్యాక్సిన్లు) అంటే ఏమిటి?
    - చంపివేసిన (లేదా) బలహీనపర్చిన సూక్ష్మజీవులుగల మందులనే టీకాలు/వ్యాక్సిన్లు అంటారు.
    - చంపివేసిన (లేదా) నిర్వీర్యం చేసిన సూక్ష్మజీవులను శరీరంలోకి ప్రవేశపెట్టినప్పుడు శరీరం ప్రతిరక్షకాలను తయారుచేసి, నిల్వ ఉంచుకొని రక్షణ కల్పిస్తుంది.
13. ప్రపంచంలో తొలిసారి కనుగొన్న వ్యాక్సిన్?
    - స్మాల్‌పాక్స్ (మశూచి వ్యాధికి- 1796)
    - ఎడ్వర్డ్ జెన్నర్ దీన్ని కనుగొన్నాడు.
    - ఇతణ్ని వ్యాక్సిన్ పితామహుడు, అసంక్రామ్యతా (ఇమ్యూనిటీ) పితామహుడు అని పిలుస్తారు.
14. వ్యాక్సినేషన్ అంటే ఏమిటి?
    - చంపిన (లేదా) బలహీనపర్చిన వ్యాధి కారక సూక్ష్మజీవులను మానవ శరీరంలోకి ప్రవేశపెట్టడాన్ని వ్యాక్సినేషన్ అంటారు.
15. వ్యాక్సిన్ పదానికి మూలం?
    - వ్యాక్సిన్ పదం 'వాకా' అనే లాటిన్ పదం నుంచి వచ్చింది. వాకా అంటే ఆవు అని అర్థం.
16. పోలియో (శిశు పక్షవాతం) వ్యాధికి అందుబాటులో ఉన్న టీకాలు?
    - **పోలియో టీకా:** జోనాస్‌సాక్ (1952)
    - పోలియో చుక్కల మందు (Oral Polio Vaccine - OPV) ఆల్బర్ట్ సాబిన్ (1957)
17. ప్రపంచ వ్యాప్తంగా నిర్మూలించిన వైరస్ కారక వ్యాధి?
    - మశూచి (స్మాల్‌పాక్స్)

గతంలో అడిగిన ప్రశ్నలు


1. పోలియో వ్యాక్సిన్‌ను కనుగొన్నది ఎవరు?
   1) బాంటింగ్ 2) కేథరిన్ ఫ్రాంక్
   3) జోనాస్ సాక్ 4) ఫ్లెమింగ్
2. సూక్ష్మజీవ నాశిని పెన్సిలిన్‌ను కింది వాటిలో దేన్నుంచి ఉత్పత్తి చేస్తారు?
   1) బ్యాక్టీరియా
   2) ఫంగస్/బూజు
   3) వైరస్ 4) శైవలం
3. ప్రపంచంలో మొదటి యాంటీబయాటిక్?
   1) స్ట్రెప్టోమైసిన్ 2) క్రోసిన్
   3) పెన్సిలిన్ 4) క్వినైన్
4. భారతదేశంలో తొలిసారిగా, జన్యుపరంగా తయారు చేసిన వ్యాక్సిన్?
   1) B.C.G 2) O.P.V
   3) H.B.V 4) F.M.D
5. ఇమ్యునైజేషన్ ప్రక్రియలో సజీవ (లేదా) నిర్జీవ సూక్ష్మజీవులను ఉపయోగించి వ్యాధులు రాకుండా నివారించే పద్ధతులను ఏమంటారు?
   1) యాంటీటాక్సిన్ 2) వ్యాక్సిన్
   3) టాక్సాయిడ్ 4) ఎనీమియా
6. శాస్త్రీయ పద్ధతిలో పాలల్లోని సూక్ష్మజీవులను నశింపజేసే పద్ధతి?
   1) స్టెరిలైజేషన్ 2) పాశ్చరైజేషన్
   3) కిణ్వనం 4) ప్యూరిఫికేషన్

సమాధానాలు

1) 3; 2) 2; 3) 3; 4) 3;
5) 2; 6) 2

మద్యపానం.. హానికరం

నిత్య జీవితంలో పంచదార, బెల్లంను ఏదో రూపంలో వినియోగిస్తూనే ఉంటాం. చక్కెర పరిశ్రమకు అనుబంధంగా 'ఆల్కహాల్' పరిశ్రమ ఉంది. ఆల్కహాల్‌ను ప్రధానంగా పరిశ్రమల్లో, వాహనాల్లో ఉపయోగిస్తారు. మత్తు పానీయాలైన సారాయి, గుడుంబా, బీర్, విస్కీ, బ్రాందీ, వైన్ తదితరాల తయారీ లోనూ ఆల్కహాల్‌ను విరివిగా వినియోగిస్తున్నారు. కల్తీ కల్లు తయారీలో వివిధ రసాయనాలు వాడుతున్నారు. ధనార్జనే లక్ష్యంగా ఇందులో మోతాదుకు మించి హానికర రసాయనాలను వాడటం వల్ల అనేక కుటుంబాలు ఛిద్రమవుతున్నాయి.



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

రసాయన శాస్త్రం

పంచదార

మనం రోజూ ఉపయోగించే చక్కెర, బెల్లంను 'చెరకు రసం' నుంచి తయారు చేస్తారు. గడ్డి జాతికి చెందిన చెరకు (గెడల)లో భారాత్మకంగా 11-15 శాతం చక్కెర ఉంటుంది. ఇది రసాయనికంగా 'కార్బోహైడ్రేట్' కుటుంబానికి చెందిన డైశాకరైడ్ 'సుక్రోజ్'. ఈ సుక్రోజ్ అనేది 'గ్లూకోజ్', 'ఫ్రక్టోజ్'ల మిశ్రమం. దీన్నే 'టేబుల్ షుగర్'గా వ్యవహరిస్తారు. డయాబెటిస్ వ్యాధిగ్రస్థులు తీపి కోసం రసాయనికంగా 'సుక్రోజ్' అనే చక్కెరకు బదులు కృత్రిమ తీపికారిణి 'శాకరిన్' లాంటి పదార్థాలను ఉపయోగిస్తారు. వీటికి సంబంధించిన అంశాల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం.

- పంటచేను నుంచి చెరకు గెడలను కోసిన తర్వాత 24 గంటల లోపు చక్కెర ఫ్యాక్టరీలకు తరలిస్తారు. ఆలస్యం అయ్యేకొద్దీ చక్కెర శాతం తగ్గుతుంది. అందుకే సాధారణంగా చక్కెర పరిశ్రమలను చెరకు అధికంగా పండించే ప్రాంతాలకు సమీపంలో నెలకొల్పుతారు.
- చెరకు గెడలను చిన్న చిన్న ముక్కలుగా చేసి, క్రషర్‌లో వేసి చెరకు రసాన్ని తీస్తారు. రసం తీసిన తర్వాత మిగిలిన పిప్పిని 'బగాసే' అంటారు.
- బగాసేను గట్టి కాగితం తయారీకి, 'కాప్టివ్ పవర్' ఉత్పత్తిలో ఇంధనంగా వాడతారు. బెల్లం తయారీలో చెరకు రసాన్ని గాఢత చెందించడానికి కూడా 'బగాసే'ను ఉపయోగిస్తారు.
- ఆమ్లత్వం ఉన్న చెరకు రసానికి 'కాల్షియం హైడ్రాక్సైడ్' (తడి సున్నం)ను కలిపి తటస్థీకరిస్తారు. ఈ ప్రక్రియనే 'డెఫకేషన్' అంటారు.
- ఎక్కువైన సున్నాన్ని తొలగించడానికి 'కార్బన్ డై ఆక్సైడ్' (CO_2)ను కలిపి 'కార్బొనేషన్' చేస్తారు. దీంతో సున్నం 'కాల్షియం కార్బొనేట్ ($CaCO_3$)'గా అవక్షేపం చెందుతుంది.
- తర్వాత 'సల్ఫర్ డై ఆక్సైడ్' వాయువును పంపి మిగిలి ఉన్న సున్నాన్ని తొలగిస్తారు. ఈ ప్రక్రియను 'సల్ఫిటేషన్' అంటారు.
- పై మూడు ప్రక్రియల వల్ల ఏర్పడ్డ అవక్షేపాలను ప్రెస్‌మడ్ రూపంలో ఎరువుగా ఉపయోగిస్తారు.
- సల్ఫర్ డై ఆక్సైడ్ విరంజనకారిగా కూడా పని చేస్తుంది. ఇది చెరకు రసం రంగును తొలగిస్తుంది.
- రసాన్ని గాఢత పరిచి చక్కెర స్ఫటికాలను ద్రవం నుంచి వేరు చేస్తారు.
- చక్కెర తయారు చేసిన తర్వాత మిగిలే చిక్కని ద్రవాన్ని 'మొలాసిస్' అంటారు. ఇది చక్కెర పరిశ్రమలో ముఖ్యమైన ఉప ఉత్పన్నం (బై ప్రొడక్ట్).
- మొలాసిస్ నుంచి కిణ్వ ప్రక్రియ ద్వారా ఆల్కహాల్‌ను రూపొందిస్తారు. మొలాసిస్‌ను వేరు చేయకుండా చెరకు రసాన్ని కిణ్వ ప్రక్రియలో గాఢత పరిచి 'బెల్లం' తయారు చేస్తారు.

కిణ్వ ప్రక్రియ:

ఈస్ట్, బ్యాక్టీరియా మొదలైన సూక్ష్మజీవులతో ఉత్పత్తైన ఎంజైమ్‌లు పెద్ద అణువులను చిన్న అణువులుగా విడగొడతాయి. దీన్నే 'కిణ్వ ప్రక్రియ' అంటారు. స్టార్చ్ లేదా మొలాసిస్ లేదా ద్రాక్ష రసం నుంచి ఆల్కహాల్ తయారు చేయడంలో; బ్రెడ్, ఇడ్లీ, సోయా సాస్, కాడ్ లివర్ ఆయిల్, వెనిగర్ లాంటి అనేక రకాల పదార్థాల తయారీలో కిణ్వ ప్రక్రియ ఇమిడి ఉంటుంది. ఇందులో 'కార్బన్ డై ఆక్సైడ్' విడుదలవుతుంది. బ్రెడ్, ఇడ్లీ పిండి ఈ ప్రక్రియ వల్లే పొంగుతాయి.

ఇథైల్ ఆల్కహాల్ తయారీ

సాధారణంగా ఆల్కహాల్‌గా వ్యవహరించే సమ్మేళనమే 'ఇథైల్ ఆల్కహాల్ (ఇథనోల్)'. చక్కెర పరిశ్రమలో ఉప ఉత్పన్నమైన మొలాసిస్‌పై ఈస్ట్ కిణ్వ ప్రక్రియ ద్వారా ఇథనోల్‌ను తయారు చేస్తారు.

- ఈస్ట్‌లోని 'జైమేజ్' అనే ఎంజైమ్ మొదట చక్కెర (సుక్రోజ్)ను గ్లూకోజ్, ఫ్రక్టోజ్‌లుగా విడగొడుతుంది.
- గ్లూకోజ్, ఫ్రక్టోజ్‌లను ఈస్ట్‌లో ఉండే మరో ఎంజైమ్ అయిన 'జైమేజ్' కిణ్వ ప్రక్రియ ద్వారా 'ఇథనోల్'గా మారుస్తుంది. ఇందులో ఉప ఉత్పన్నం 'కార్బన్ డై ఆక్సైడ్'.
- ఈస్ట్ కణాలకు అమ్మోనియం సల్ఫేట్, అమ్మోనియం ఫాస్ఫేట్ లవణాలను ఆహారంగా అందిస్తారు.
- ఈ ప్రక్రియలో ఆల్కహాల్ 15-20 శాతానికి చేరగానే ఈస్ట్ కణాలు చనిపోయి కిణ్వ ప్రక్రియ ఆగిపోతుంది. ఈ ద్రావణాన్ని 'వాష్' అంటారు.
- కిణ్వ ప్రక్రియలోకి గాలి చేరితే అందులోని ఆక్సిజన్ ఇథనోల్‌ను 'ఇథనోయిక్ ఆమ్లం'గా ఆక్సీకరణం చెందించి ఆల్కహాలిక్ ద్రావణాల రుచిని పాడు చేస్తుంది.
- వాష్‌ను 'అంశిక స్వేదనం' చేయడం ద్వారా 96 శాతం ఆల్కహాల్‌ను పొందవచ్చు. దీన్ని 'రెక్టిఫైడ్ స్పిరిట్' అంటారు. ఇందులో 'ఎజియోట్రోపిక్ మిశ్రమం' ఏర్పడటం వల్ల వంద శాతం ఆల్కహాల్‌ను పొందలేం.
- మిగిలిన 4 శాతం నీటిని తొలగించడానికి సున్నం ఉపయోగిస్తారు.
- వంద శాతం ఆల్కహాల్‌ను అబ్సల్యూట్ ఆల్కహాల్ అంటారు.
- పారిశ్రామిక ఆల్కహాల్‌ను దుర్వినియోగం (మద్యంగా సేవించడం) చేయకుండా ఇథైల్ ఆల్కహాల్‌కు 'పిరిడీన్', 'మిథనోల్'ను కలిపి సరఫరా చేస్తారు. దీన్ని 'అసహజ స్పిరిట్' (డీనేచర్డ్ స్పిరిట్) అంటారు. దీన్ని తాగితే అంధత్వంతోపాటు మరణం కూడా సంభవించవచ్చు.
- ఇథైల్ ఆల్కహాల్‌ను ఔషధాల తయారీలోనూ ఉపయోగిస్తారు.
- బీర్, వైన్, బ్రాందీ, విస్కీ, రమ్, జిన్ మొదలైన మత్తు పానీయాల్లో ఆల్కహాల్ విభిన్న శాతాల్లో ఉంటుంది.
- సంక్లిష్ట కార్బోహైడ్రేట్లున్న బార్లీ, రైస్, గోధుమ లాంటి ధాన్యం గింజలు లేదా ద్రాక్ష లాంటి ఫలాల నుంచి ఈ మత్తు పానీయాలను తయారు చేస్తారు.

వివిధ మత్తు పానీయాల్లో ఇథైల్ ఆల్కహాల్ శాతం

పానీయం	ఆల్కహాల్ శాతం
బీర్	4 - 5
వైన్	10 -16
రమ్	15 - 40
బ్రాందీ, విస్కీ	40 - 50
బ్రీజర్	4 - 7
కల్లు	5 - 8
వోడ్కా	40

- మొలాసిస్‌లో 50 శాతం చక్కెర ఉంటుంది.
- ఇథైల్ ఆల్కహాల్‌ను 'స్పిరిట్ ఆఫ్ వైన్' అని కూడా అంటారు.
- మిథైల్ ఆల్కహాల్ విషపూరితమైంది. దీన్ని 'ఉడ్ స్పిరిట్' అంటారు. దీన్ని 'కలప' నుంచి విధ్వంసక స్వేదనం ద్వారా తయారు చేస్తారు.
- సాధారణంగా నల్ల బెల్లం నుంచి గుడుంబా; బార్లీ నుంచి బీర్; ద్రాక్ష నుంచి వైన్, బ్రాందీ; మొలాసిస్ నుంచి రమ్; మొక్కజొన్న నుంచి జిన్; పొటాటో నుంచి వోడ్కా; మాల్ట్ నుంచి విస్కీ రూపొందిస్తారు.
- ఎక్కువ మొతాదులో ఆల్కహాల్ తీసుకోవడం వల్ల రక్త ప్రసరణ, నాడీ వ్యవస్థలతో పాటు కాలేయం దెబ్బతింటుంది. చిన్న పేగుల్లో ఆమ్లత్వం పెరిగి చిన్న కురుపులు ఏర్పడి జీర్ణ వ్యవస్థ దెబ్బతింటుంది. గుండె సంబంధ వ్యాధులు కూడా వస్తాయి.

కల్తీ కల్లు

తాటి, ఈత చెట్ల నుంచి సహజసిద్ధమైన కల్లు లభిస్తుంది. ఇందులో సుమారు 4 నుంచి 8 శాతం వరకు ఆల్కహాల్ ఉంటుంది. ఇది పులుస్తున్న కొద్దీ ఆల్కహాల్ పరిమాణం పెరుగుతుంది. సాధారణంగా ఈ కల్లు గ్రామీణ ప్రాంతాల్లో స్థానిక వినియోగదారులకే సరిపోతుంది. అందువల్ల పట్టణ ప్రాంతాల్లో కల్తీ కల్లు తయారు చేస్తున్నారు. కేవలం లీటరు సహజ కల్లును ఉపయోగించి నీళ్లు, ఇతర రసాయనాలను కలిపి 100 నుంచి 150 లీటర్ల కల్తీ కల్లు ఉత్పత్తి చేస్తున్నారు. ఒక పెద్ద ట్యాంకును నీటితో నింపి అందులో కొంత సహజ కల్లు కలుపుతారు. దానికి చక్కెర కంటే 600 రెట్లు తీపిదనం ఉండే కృత్రిమ తీపికారిణి శాకరిన్, మత్తు కోసం యూరియా, క్లోరాల్ హైడ్రేట్, డైజీఫాం, ఆల్ప్రజోలాం లాంటి మత్తు పదార్థాలను కలుపుతారు. సిట్రికామ్లం, సోడియం బైకార్బొనేట్, మెగ్నీషియం సల్ఫేట్ లాంటి స్థిరీకరణులను కూడా ఉపయోగిస్తారు.

- మత్తు పదార్థాలు నేరుగా కేంద్ర నాడీ మండలంపై పనిచేస్తాయి. వీటికి బానిసైన వారికి ఇవి అందకపోతే.. కాళ్లు, చేతులు వణకడం; రక్తపోటు, హృదయ స్పందన రేటు పెరగడం; నిద్ర రాకపోవడం; పిచ్చిగా ప్రవర్తించడం లాంటి రుగ్మతలకు లోనవుతారు.
- కల్తీ కల్లు బాధితులకు మానసిక రుగ్మతలు నయం చేయడానికి 'లారజిపామ్' ఔషధాన్ని ఉపయోగిస్తున్నారు.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. రసాయనికంగా టేబుల్ షుగర్ అనేది?
   1) గ్లూకోజ్ 2) ఫ్రక్టోజ్
   3) సుక్రోజ్ 4) లాక్టోజ్
2. కిణ్వ ప్రక్రియ ద్వారా ఇథైల్ ఆల్కహాల్ నుంచి లభించేది?
   1) ఫార్మలిన్ 2) వెనిగర్
   3) పెర్ హైడ్రాల్ 4) ఉడ్ స్పిరిట్
3. వెనిగర్ రసాయన నామం?
   1) ఇథైల్ ఆల్కహాల్
   2) ఎసిటికామ్లం (ఇథనోయికామ్లం)
   3) సిట్రికామ్లం 4) మిథనోల్
4. కిందివాటిలో అతి తక్కువ ఆల్కహాల్ ఉండే పానీయం ఏది?
   1) విస్కీ 2) రమ్
   3) సారాయి 4) బీర్

సమాధానాలు

1) 3; 2) 2; 3) 2; 4) 4.

మాదిరి ప్రశ్నలు

1. మొలాసిస్ కిణ్వ ప్రక్రియలో గ్లూకోజ్‌ను ఇథైల్ ఆల్కహాల్‌గా మార్చే ఎంజైమ్?
   1) డయాస్టేజ్ 2) ఇన్వర్టేజ్
   3) జైమేజ్ 4) మాల్టేజ్
2. ఏ రకమైన ఆల్కహాల్ సేవించడం వల్ల అంధత్వం వస్తుంది?
   1) ఇథైల్ ఆల్కహాల్
   2) మిథైల్ ఆల్కహాల్
   3) బెంజైల్ ఆల్కహాల్
   4) ఎమైల్ ఆల్కహాల్
3. చక్కెర తయారు చేసిన తర్వాత మిగిలే మాతృ ద్రావణాన్ని ఏమంటారు?
   1) వాష్ 2) మొలాసిస్
   3) ఉడ్ స్పిరిట్ 4) ఫార్మలిన్
4. కల్తీ కల్లులో వాడే మత్తు పదార్థం ఏది?
   1) క్లోరాల్ హైడ్రేట్ 2) డైజీపాం
   3) ఆల్ప్రజోలాం 4) పైవన్నీ
5. చక్కెరను కిణ్వ ప్రక్రియ చేస్తే నిరంతరం ఏర్పడే సమ్మేళనం ఏది?
   1) మిథైల్ ఆల్కహాల్
   2) ఇథైల్ ఆల్కహాల్
   3) ఎసిటికామ్లం
   4) ఎసిటలీన్

సమాధానాలు

1) 3; 2) 2;
3) 2; 4) 4;
5) 2.

There is a lot to be said about...



BANK EXAMS
GENERAL ENGLISH

Directions (Q. No. 1-10):

Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence, mark the number of that part with error as your answer. Mark (5) as your answer, if there is "No error".

1. He has a scheme (1)/ which he thinks is preferable (2)/ than that proposed (3)/ by the planning commission. (4)/ No error (5)
2. The details (1)/ are the matters (2)/ for future (3)/ considerations. (4)/ No error (5)
3. The rise and fall (1)/ of the British Empire (2)/ were (3)/ Historical processes. (4)/ No error (5)
4. Information technology (1)/ as well as (2)/ management are (3)/ taught here. (4)/ No error (5)
5. This is the only one (1)/ of his ideas (2)/ that have not found (3)/ favour with biologists. (4)/ No error (5)
6. He has promised (1)/ to buy shares (2)/ in whatever company (3)/ you are interested. (4)/ No error (5)
7. One has to reckon with paying (1)/ for supporting services (2)/ although it may not be apparent (3)/ from the glib sales talk of the bank personnel. (4)/ No error (5)
8. There is a general perception in our society (1)/ that public administrations and business executives (2)/ sit in their air-conditioned chambers and quietly administer (3)/ the affairs of the states or business. (4)/ No error (5)
9. The greatest need (1)/ of the hour is (2)/ we must learn (3)/ to work together as a team. (4)/ No error (5)
10. A virtuous man, (1)/ under all misfortune of life, (2)/ still finds an inward comfort (3)/ and satisfaction. (4)/ No error (5)

Directions (Q. No. 11-15):

Which of the phrases (1), (2), (3) and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error, mark (5) No correction required as your answer.

11. I should have liked to have visited.
    1) liking to visit
    2) like to visit
    3) like to have visited
    4) likes to visit
    5) No correction required
12. It was being a very hot day, I remained indoor.
    1) Being a very hot day
    2) Been a very hot day
    3) It is a hot day
    4) It been a hot day
    5) No correction required
13. Please excuse me being late.
    1) mine 2) my
    3) with 4) from
    5) No correction required
14. He fled lest he would be killed.
    1) will being 2) may
    3) should 4) might have
    5) No correction required
15. The river has over flown its banks.
    1) have over flown
    2) have been over flown
    3) has overflowed
    4) has over flowing
    5) No correction required

Directions (Q. No. 16-20):

Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A. Records going back to the fourth century A.D. refer to tea.
B. No one knows when tea was first discovered or how it came to be such a popular drink.
C. By the eighteenth century A.D. most Chinese were drinking tea both because they liked it as a beverage and for its medicinal value.
D. It was called Cha Ching, which translated means Tea Scripture.
E. The beverage is generally accepted to have originated in China hundreds of years ago.
F. Tea was so popular that one of the most distinguished poets of Tang dynasty a man called Lu Yu, even wrote a holy scripture about it.

16. What is the FOURTH sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) D 5) E
17. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) F 5) E
18. What is the SECOND sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) E 5) F
19. What is the FIRST sentence after rearrangement?
    1) B 2) A 3) C 4) D 5) E
20. What is the LAST sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) D 5) F

Directions (Q. No. 21-25):

Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

21. There is a lot to be said about the ___ changes that technology has brought __ in the financial sector.
    1) alternate; along
    2) alternative; within
    3) attitudinal; about
    4) alternatively; forth
    5) attitude; with
22. Although seat belts have been shown to ___ lives, people give a number of __ for not using them.
    1) prosper; treason
    2) prefer; resign
    3) pamper; alternates
    4) save; reasons
    5) protect; cause
23. To create a scientific temper, there has to be a widely shared ___ to and belief in the value of science, particularly among the political ___.
    1) commitment; elite
    2) promise; choice
    3) assurance; best
    4) dedication; leaders
    5) pledge; privilege
24. The same sciences which had led us away from nature are now ___ the miracle of creation.
    1) discovering 2) unfolding
    3) inventing 4) revealed
    5) projected
25. Man's basic ___ is a fact and is the emotional factor for all the bloody violence that has marked human history since the beginning.
    1) fierceness
    2) violence
    3) aggressiveness
    4) assertiveness
    5) ferociousness

Directions (Q. No. 26-30):

Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in **bold** to help you locate them while answering some of the questions.

By coach, by train, by ship and by plane, millions of tourists annually depart from home like migrating summer birds. They provide the best possible evidence to prove that the world is not really as big as it used to be. For the modern tourist is no Marco Polo. He ventures forth into the unknown and returns home in a matter of weeks, and years. Furthermore, he is armed with pamphlets, maps and weighty guide books which tell him where to go and how to get there; and where to stay, what to see and what to eat when he arrives. There are travel agencies everywhere to cater for his needs and make all the necessary preparations for him. They make out ambitious programmes and promise to **whisk** him through as many as six countries in fourteen days or, if he is in a hurry, they will cover much the same ground in eight or less.

It is a small wonder that the tourist is a busy man. He no sooner sets foot on foreign soil than he is rushed to his hotel and thence is immediately taken on a conducted tour of the city by night. In the morning he goes through another **arduous** course of sight-seeing. He has barely had the chance to recover, or indeed, to find out exactly where his hotel is located, before he is off again to yet another part of the country. It is not even a bird's eye view he gets. Rather, it is a snap-shot view.

26. Today, the world ___
    1) is not as big as it was in the past.
    2) is full of tourists
    3) can be toured in a matter of days
    4) has a lot of travel agents
    5) has different modes of transport
27. According to the passage:
    1) The hectic schedule of the tourist is described
    2) It deals with how the tourist enjoys his tour
    3) highlights the tourist's problems during the tour
    4) Defines the tourist as a nomad
    5) Defines the tourist as a confused person
28. Which of the following statements is false?
    1) Travel agencies provide the tourist with all the necessary information
    2) The tourist is a wanderlust
    3) The tourist wants to derive maximum benefit from his hard earned money
    4) The tourist does gets sufficient rest during his tour
    5) Each country welcomes the tourist for the foreign exchange he brings with him
29. The synonym of **whisk** is:
    1) Catapult 2) Leisure
    3) Walk 4) Decelerate
    5) Jaunt
30. The antonym of **arduous** is:
    1) Fatigue 2) Formidable
    3) Facile 4) Former
    5) Flaunt

Answers

1) 3	2) 2	3) 3	4) 3	5) 3
6) 3	7) 5	8) 4	9) 3	10) 2
11) 2	12) 5	13) 2	14) 3	15) 3
16) 3	17) 1	18) 4	19) 1	20) 4
21) 3	22) 4	23) 1	24) 2	25) 3
26) 1	27) 5	28) 4	29) 1	30) 3